అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
www.navatelangana.com
గురువారం 1-2-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 31 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

నాలుగు స్తంభాలపైనే దేశాభివృద్ధి

యువత, మహిళ, రైతులు, పేదలే ప్రధానం

- పేదరికాన్ని నిర్మూలించాం : ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగం
- ప్రారంభమైన పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు
- నేడు మధ్యంతర బడ్జెట్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

యువత, మహిళ, రైతులు, పేదలు అనే నాలుగు స్తంభాలపైనే దేశాభివృద్ధి ఆధారపడి ఉందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలను ప్రారంభిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉభయ సభలనుద్దేశించి బుధవారం ప్రసంగించారు. దేశ సంస్కృతి, సభ్యత ఎంతో చైతన్యవంతమైనవని తెలిపారు. 21వ శతాబ్దంలో దేశం కొత్త సంప్రదాయాలకు తెరతీస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 'శాంతి నికేతన్ ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందింది. భగవాన్ బిర్సా ముండా జన్మదినాన్ని జన్ జాతీయ దివస్‌గా జరుపుకొంటున్నాం. తెలంగాణలో సమ్మక్క సారక్క గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకానుంది. ఆదివాసీ యోధులను ఇలా స్మరించుకోవడం గర్వకారణం' అన్నారు.

గతేడాది దేశం ఎన్నో విజయాలను సాధించిందన్నారు. "ఆసియా క్రీడల్లో తొలిసారి 107, పారా క్రీడల్లో 111 పతకాలను సాధించాం. చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించేలా 'నారీశక్తి వందన్ అధీనియమ్' బిల్లును ఆమోదించుకున్నాం" అన్నారు. అటల్ టన్నెల్‌ను కూడా పూర్తి చేశామన్నారు. చంద్రుడి దక్షిణ ధ్రువంపై దిగిన తొలి దేశంగా భారత్ చరిత్ర ...13లో

వాస్తవికతతో సంబంధంలేని ప్రసంగం

- దేశం ఎదుర్కొంటున్న సవాళ్లు, ప్రధాన సమస్యల ప్రస్తావనే లేదు
- చాలా నిరాశపరిచింది : సీపీఐ(ఎం) పార్లమెంటరీ పార్టీ నేత ఎలమారం కరీం



వివరాలు 13లో

దాడులు పెంచిన ఈడీ



- ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రతిపక్ష నేతలపై చర్యలు వేగవంతం
- నిన్న లాలూ, తేజస్వి...నేడు సోరేన్
- కేజ్రీ అరెస్ట్ తప్పదనే వదంతులు
- బీజేపీ నేతలపై అవినీతి ఆరోపణలున్నా పట్టించుకోరు

వివరాలు 3లో

రాహుల్ కారుపై రాళ్ల దాడి



- ఇది తృణమూల్ పనే : మండిపడిన కాంగ్రెస్
- ఇలాంటి దాడులకు భయపడం: పీసీసీ అధ్యక్షుడు అధిర్ రంజన్ చౌదరి
- దాడి జరిగింది బీహార్‌లోనే : మమత
- రాహుల్ రోడ్‌షోలకు భారీగా జనం

వివరాలు 13లో

ఏడాదిలోగా 2 లక్షల ఉద్యోగాల భర్తీ

హామీని నిలబెట్టుకుంటాం



- తెలంగాణ ఉద్యమానికి నిరుద్యోగ సమస్యే కారణం
- పదేండ్ల పాటు ఈ అంశాన్ని పట్టించుకోని బీఆర్ఎస్ సర్కార్
- నర్సుల నియామకాలపై హరీశ్‌వి అర్థం లేని మాటలు
- కేసీఆర్ సాబ్..ముందు మీ అల్లుడికి బుద్ధి చెప్పండి
- స్టాఫ్ నర్సులకు నియామకపత్రాల అందజేత కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి
- నిరుద్యోగుల కలల సాకారంలో ఇది తొలి అడుగు : డిప్యూటీ సీఎం భట్టి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఏడాదిలోగా రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేసి ఎన్నికల్లో ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. బుధవారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొత్తగా ఎంపికైన 6,956 మంది నర్సింగ్ ఆఫీసర్ల (స్టాఫ్ నర్సులు)కు నియామక పత్రాలను సీఎం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ ద్వారా ఉద్యోగ నియామకాలను చేపడతామని తెలిపారు. త్వరలో 15 వేల పోలీసు ఖాళీలను భర్తీ చేయడంతో పాటు వైద్యారోగ్యశాఖలో ఖాళీగా ఉన్న ఐదు వేల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఇప్పటికే టీయస్‌పీఎస్సీ ప్రక్షాళన దిశగా కొత్త చైర్మెన్, సభ్యులను నియమించినట్టు తెలిపారు. నర్సింగ్ ఆఫీసర్ల నియామకాలు ఏడాది కాలంగా ఆలస్యమవుతున్న విషయం తన దృష్టికి రాగానే సమీక్ష నిర్వహించి నియామక పత్రాల అందజేతకు ఆదేశించినట్టు వివరించారు.

నిరుద్యోగ సమస్యే తెలంగాణ ఉద్యమానికి కారణమనీ, అయితే ఆ సమస్యను గత పదేండ్ల పాటు బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని రేవంత్ ఈ సందర్భంగా విమర్శించారు. నిరుద్యోగుల త్యాగాలతో తెలంగాణ ఏర్పడితే పదేండ్లు వారి ఆకాంక్షలను నెరవేర్చకుండా కేసీఆర్ తన కుటుంబంలోరి వారి ఉద్యోగాల కల్పనపైన్నే ధ్యాస ...13లో

హైదరాబాద్ ట్రాఫిక్ పై ప్రత్యేక దృష్టి

- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రణాళిక
- సిటీ పోలీస్ స్టేషన్ల స్థాయి పెంపునకు చర్యలు
- సిబ్బంది కొరత లేకుండా హోంగార్డుల నియామకాలు
- మల్టీ లెవల్ పార్కింగ్ సెంటర్లను ప్రొత్సహించేందుకు కొత్త విధానం : సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

వివరాలు 3లో

నంది స్థానంలో గద్దర్ అవార్డులు

- కళాకారులు, సాహిత్యకారులకు వచ్చే ఏడాది నుంచి పురస్కారాలు
- లిక్కర్ పార్టీని ఇంటికి పంపారు..
- నిక్కర్ పార్టీని కూడా ఓడించి గద్దర్ ఆశయాన్ని నిలపాలి : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

14లో..

జార్ఖండ్ సీఎం హౌస్ అరెస్ట్

విచారణానంతరం ఈడీ కస్టడీలోకి హేమంత్

- ముఖ్యమంత్రి పదవికి రాజీనామా
- రాజ్‌భవన్‌లో గవర్నర్‌కు రాజీనామా లేఖ అందజేత.. ఆమోదం
- నూతన సీఎంగా సీనియర్ మంత్రి చంపాయ్ సొరెన్
- శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్న ఎమ్మెల్యేలు
- ప్రమాణస్వీకారం కోసం గవర్నర్‌కు అభ్యర్థన





రాంచీ : భూకుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో జార్ఖండ్ సీఎం హేమంత్ సొరెన్ అరెస్టయ్యారు. ముందుగా ఊహించినట్టుగానే ఆరు గంటల విచారణానంతరం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఆయనను అదుపులోకి తీసుకున్నది. హేమంత్ సొరెన్ తమ కస్టడీలో ఉన్నట్టు ఈడీ వెల్లడించింది. అయితే, హేమంత్ సొరెన్‌ను తన పాత ఇంటిలోనే హౌజ్ అరెస్ట్‌లో ఉంచనున్నట్టు ఈడీ వర్గాల ద్వారా తెలుస్తున్నది. ఈడీ కస్టడీలోకి తీసుకోవటంతో సీఎం పదవికి హేమంత్ రాజీనామా చేశారు. రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ సి.పి రాధాకృష్ణన్‌ను కలిసి రాజీనామా లేఖను అందించారు. గవర్నర్ ఆయన రాజీనామాను ఆమోదించారు. హేమంత్ అరెస్ట్, రాజీనామాతో జార్ఖండ్‌లో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం), కాంగ్రెస్ పార్టీల సంకీర్ణ ప్రభుత్వంలో తదుపరి సీఎం ఎవరన్నదానిపై తీవ్ర చర్చ నడిచింది. నూతన సీఎంగా పార్టీ సీనియర్ నాయకుడు, క్యాబినెట్ మినిస్టర్ చంపాయ్ సొరెన్ ఉంటారని జేఎంఎం వర్గాలు తెలిపాయి. కాగా, ప్రభుత్వ ఏర్పాటు కోసం 43 మంది ఎమ్మెల్యేలతో కలిసి చంపాయ్ సొరెన్ రాష్ట్ర గవర్నర్‌ను కలిశారు. ప్రస్తుతం ఆయన హేమంత్ సొరెన్ ప్రభుత్వంలో రవాణా, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ మంత్రిగా ఉన్నారు. హేమంత్ సొరెన్‌కు విధేయుడిగా ఈయనకు పేరున్నది. మొత్తం 81 మంది ఎమ్మెల్యేలున్న జార్ఖండ్ అసెంబ్లీలో.. ప్రభుత్వ ఏర్పాటుకు 41 మంది ఎమ్మెల్యేల అవసరం ఉన్నది. " మేము చంపాయ్ సొరెన్‌ను శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నాం. ప్రమాణస్వీకార వేడుకకు గవర్నర్‌ను అభ్యర్థించటానికి మేము రాజ్‌భవన్‌కు వచ్చాం" అని జార్ఖండ్ మంత్రి బన్నా గుప్తా తెలిపారు. చంపాయ్ సొరెన్ ...3లో

పార్టీ కోసమే నా జీవితం..

అలా లేకుంటే ఎన్నేండ్లు బ్రతికి ఏం లాభం

- డాక్టర్లు విశ్రాంతి అవసరమన్నారు
- ఇకపై పార్టీ పని, ఆరోగ్యం రెండింటినీ సమన్వయం చేసుకోవాలి
- పార్టీ కోసం ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి : సీపీఐ(ఎం) నాయకులు, కార్యకర్తలతో తమ్మినేని



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'ఎన్నేండ్లు బతికినా ఎందుకోసం బతకాలి. అలా అని ఏదీ తక్కువ చేసి చూడొద్దు. చస్తే చస్తాం జెండా కప్పుతారని అనుకోవడం పిచ్చితనం. పుస్తకాలు చదువుతూ ఆరోగ్యంగా ఎక్కువ కాలం బతకడం వల్ల ఉపయోగమేంటి?. పార్టీ కోసం ఉపయోగం లేకుండా ఎన్నేండ్లు బతికితే ఏం లాభం. అందుకే ఆరోగ్యాన్ని, పార్టీ పనిని రెండింటినీ సమన్వయం చేసుకుని ముందుకెళ్లాలి. పార్టీ కోసం ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. ఆరోగ్యం కోసం పార్టీ పనిని వదిలేది లేదు'అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. కిడ్నీ, గుండె, ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్న ఆయన గతనెల 16న హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఏఐజీ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందిన విషయం తెలిసిందే. గతనెల 29న ఆయన డిశ్చార్జి అయ్యారు. రెండురోజులపాటు ఇంట్లోనే విశ్రాంతి తీసుకున్నారు. డిశ్చార్జి అయ్యాక తొలిసారి సీపీఐ(ఎం) రాష్ట్ర ...3లో



జ్ఞానవాపి మసీదులో పూజలు చేసుకోవచ్చు

- వారణాసి కోర్టు తీర్పు
- హైకోర్టులో సవాలు చేస్తామన్న మసీదు కమిటీ
- దేవాలయాలు పిక్నిక్ స్పాట్‌లు కావు : హిందూయేతరుల ప్రవేశాలపై మద్రాసు హైకోర్టు

వారణాసి, చెన్నై : జ్ఞానవాపి మసీదు ప్రాంగణంలో పూజలు నిర్వహించుకునేందుకు వారణాసి కోర్టు బుధవారం హిందువులకు అనుమతి మంజూరు చేసింది. మసీదు ప్రాంగణంలో సీలు చేసి ఉన్న బేస్‌మెంట్ (వ్యాస్ థెకానా) ప్రాంతంలో పూజలు నిర్వహించుకోవచ్చునని తెలిపింది. వారం రోజుల్లో ఇందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది. కాగా రెండు మూడు రోజుల్లో పూజలు ప్రారంభమవుతాయని, ఒకసారి మొదలైతే రోజూ జరుగుతూనే ఉంటాయని కాశీ విశ్వనాథ దేవాలయ చైర్‌పర్సన్ నాగేంద్ర పాండే చెప్పారు. 'జ్ఞానవాపి ప్రాంగణం అంతటా పూజలు చేయాలని కోరుకుంటున్నాం. పూజలు జరిగే ప్రదేశాన్ని పరిరక్షించేందుకు ఓ ద్వారాన్ని ఏర్పాటు చేస్తాం' అని తెలిపారు. ఇది ...13లో

నేడు అసెంబ్లీకి కేసీఆర్..

మధ్యాహ్నం 12 గంటలకు ఎమ్మెల్యేగా ప్రమాణం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం అసెంబ్లీకి రానున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆయన ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆయన చేత ప్రమాణం చేయించనున్నారు. శాసనసభ ఎన్నికల అనంతరం కేసీఆర్ తొలిసారిగా అసెంబ్లీకి రానుండటం గమనార్హం. ఆ ఎలక్షన్ల అనంతరం ఆయన తుంటి విరగటంతో హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో శస్త్ర చికిత్స నిర్వహించిన సంగతి విదితమే. వైద్యుల సూచన మేరకు అప్పటి నుంచి ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారు. అయితే ఓటాన్ ...13లో

కార్పొరేట్లకు కార్మికుల ప్రయోజనాలు తాకట్టు

మా పోరాటం కార్పొరేట్, మతోన్మాదుల మీదే : సీఐటీయూ ఆలిండియా ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్

- బీజేపీని ఓడించకపోతే హక్కులుండవు : బీవీ రాఘవులు
- హన్మకొండలో కార్మికుల మహా ర్యాలీ, బహిరంగసభ
- నేటి నుంచి 3 వరకు జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశాలు

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

కార్పొరేట్లకు కార్మిక, కర్షకుల ప్రయోజనాలను తాకట్టుపెడుతున్న బీజేపీని రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సీఐటీయూ) ఆలిండియా ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ పిలుపునిచ్చారు. హన్మకొండ జిల్లా కేంద్రంలోని ఫాతిమానగర్ బాలవికాసలో ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు జరగనున్న సీఐటీయూ జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశాల సందర్భంగా బుధవారం కార్మికుల మహార్యాలీ, బహిరంగసభ నిర్వహించారు. హన్మకొండలోని వేయిస్తంబాల గుడి వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ హన్మకొండ చౌరస్తా మీదుగా అశోక్ థియేటర్ నుంచి పబ్లిక్ గార్డెన్‌కు చేరింది. ఈ ర్యాలీని సీఐటీయూ ఆలిండియా కోశాధికారి ఎం. సాయిబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ప్రారంభించారు. డప్పు చప్పుళ్ల నడుమ పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ కార్మికులు ర్యాలీలో పాల్గొన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళమెత్తారు. ఈ మహా ప్రదర్శన అనంతరం డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ ఆడిటోరియంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు టి.ఉప్పలయ్య అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది.

తొమ్మిదిన్నరేండ్లుగా మోడీ విద్వేష, మత రాజకీయాలు : తపన్‌సేన్

కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ తొమ్మిదిన్నరేండ్లుగా విద్వేష, మత రాజకీయాలు చేస్తున్నారని తపన్‌సేన్ అన్నారు. దేశ ప్రజల జీవితాలు సంక్షోభంలో కూరుకుపోయాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్, బడా వ్యాపారులకు మేలు చేసే విధానాలను అమలు చేస్తూ వారికి మాత్రమే లాభాలు వచ్చేలా ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. కార్మిక కోడ్‌లను తీసుకువచ్చి యాజమాన్యాలకు కేంద్రం వత్తాసు పలికి కార్మిక హక్కులను అణిచివేసిందన్నారు. మన పోరాటం కార్పొరేట్, మతోన్మాద శక్తుల మీదనేనన్నారు. అన్ని రంగాలను ప్రయివేటీకరిస్తున్న మోడీ నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు ...14లో



ఆర్టీసీ సిబ్బందిపై దాడులు చేస్తే కఠిన చర్యలు

టీఎస్ఆర్టీసీ ఎమ్‌డీ వీసీ సజ్జనార్ హెచ్చరిక

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

నిబద్ధత, క్రమశిక్షణతో సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్న ఆర్టీసీ సిబ్బందిపై కొందరు దాడులకు దిగడాన్ని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) యాజమాన్యం తీవ్రంగా ఖండించింది. రోజూ సగటున 55 లక్షల మంది ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేస్తోన్న సిబ్బందిపై బస్సుల్లో దుర్భాషలాడుతూ దాడులు చేయడం ఏమాత్రం సమంజసం కాదని పేర్కొంది. ఈ మేరకు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ బుధవారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. టీఎస్ఆర్టీసీ సిబ్బంది విధులకు ఆటకం కలిగిస్తూ, దాడులకు పాల్పడే వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామనీ, పోలీసు శాఖ సహకారంతో నేరస్థులపై హిస్టరీ షీట్స్ తెరిచేలా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిబ్బందిలో ఆత్మస్థైర్యం దెబ్బతీసే ఇలాంటి ఘటనలకు పాల్పడితే ఏమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఆర్టీసీ కండక్టర్లపై ఇటీవల మూడు చోట్ల మహిళలు దాడులకు పాల్పడ్డారనీ, హయత్‌నగర్ డిపో-1కు చెందిన ఇద్దరు కండక్టర్లపై నానా దుర్భాషలాడుతూ వేర్వేరుగా దాడికి దిగారని తెలిపారు. చిల్లర విషయంలో ఒక మహిళ, గుర్తింపు కార్డును చూపించి జీరో టికెట్‌ను తీసుకోవాలని కండక్టర్ చెప్పినందుకు, ఆయన సెల్ ఫోన్ లాక్కుని అసభ్యపదజాలంతో మరొక మహిళ దూషించారని గుర్తుచేశారు. పికెట్ డిపో మహిళా కండక్టర్‌పై యాదగిరిగుట్టలో కొందరు మహిళలు సాముహికంగా దాడి చేశారని వివరించారు. ఈ మూడు ఘటనలపై రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సంబంధిత పోలీస్‌స్టేషన్లలో ఆర్టీసీ అధికారులు వేర్వేరుగా ఫిర్యాదులు చేశారని తెలిపారు.

ప్రస్తుతం ఆ కేసుల దర్యాప్తు కొనసాగుతున్నదనీ, చట్టప్రకారం వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. టీఎస్ఆర్టీసీ నియమావళి ప్రకారమే సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారనీ, నిబంధనల మేరకే టికెట్ల జారీ ప్రక్రియను కండక్టర్లు కొనసాగిస్తున్నారని తెలిపారు. ప్రయాణీకులు టికెట్ తీసుకోకుంటే, దాన్ని చెకింగ్‌లో గుర్తిస్తే సదరు సిబ్బంది ఉద్యోగాలు ప్రమాదంలో పడతాయనీ, వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అందువల్ల అందరూ ప్రయాణ సమయంలో విధిగా టికెట్ తీసుకుని సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. 'మహాలక్ష్మి' స్కీం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ఆర్టీసీ సిబ్బంది సమర్థవంతంగా అమలు చేస్తున్నారనీ, ఓపిక, సహనంతో విధులు నిర్వర్తిస్తూ ప్రతి రోజూ సగటున 27 లక్షల మంది మహిళా ప్రయాణీకులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తున్నారని తెలిపారు. ఒరిజనల్ గుర్తింపు కార్డు తప్పని సరి అని సిబ్బంది చెబుతున్నా, ఇప్పటికీ కొందరు ఇప్పటికీ ఫొటో కాపీలు, స్మార్ట్‌ఫోన్లలో గుర్తింపు కార్డులను చూపిస్తున్నారన్నారు. ఆర్టీసీ ఉద్యోగులపై దాడి ఘటనలు వారిలో ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడంతో పాటు మనోవేదనకు గురిచేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రయాణీకులు తమ ఫిర్యాదులు, సమస్యలను సంస్థ దృష్టికి తీసుకువచ్చేందుకు బస్‌భవన్‌లో పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేశామనీ, టీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ నెంబర్లు 040-69440000, 040-23450033 24 గంటలు అందుబాటులో ఉంటాయని వివరించారు. సోషల్ మీడియా ద్వారా కూడా సమస్యల్ని సంస్థ దృష్టికి రావొచ్చనీ, లేకుంటే నేరుగా సమీపంలోని డిపో కార్యాలయాలకు వెళ్లి చెప్పవచ్చని తెలిపారు. సిబ్బందిపై ఫిర్యాదులు వస్తే విచారించి చర్యలు తీసుకుంటారన్నారు. ప్రయాణీకులు సహనం కోల్పోయి సిబ్బందిపై దాడులకు పాల్పడటాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు.

ఎంపీ టికెట్ల కోసం దరఖాస్తులు షురూ...

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

లోక్‌సభకు పోటీ చేసే అభ్యర్థుల నుంచి టీపీసీసీ దరఖాస్తుల ఆహ్వానాన్ని షురూ చేసింది. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో వాటి స్వీకరణ ప్రారంభమైంది. మార్చి 3వరకు దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉన్నది. ఎస్సీ, ఎస్టీ, వికలాంగ అభ్యర్థులు రూ.25 వేలు, ఇతరులకు రూ.50 వేల చొప్పున డీడీ రూపంలో పార్టీకి చెల్లించాలని పార్టీ నిర్ణయించింది. అందు కోసం గాంధీభవన్‌లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసింది. మంగళవారం ఆరుగురు అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. అందులో ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లు రవి నాగర్‌కర్నూల్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి దరఖాస్తు చేసుకున్నారు.

'మహాలక్ష్మి'పై హైకోర్టులో విచారణ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణానికి సంబంధించిన జీవో నెంబర్ 47 రద్దు చేయాలని కోరుతూ నాగోలుకు చెందిన హరీందర్ హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. ప్రజా ప్రయోజన వ్యాజ్యంగా ఆయన ఈ కేసును దాఖలు చేశారు. అయితే దీనిలో ప్రజాప్రయోజనం ఏమీ లేదనీ, ఆ పిటీషన్‌ను రిట్‌గా పరిగణిం చాలని న్యాయస్థానం హైకోర్టు రిజిస్ట్రా ర్‌కు సూచించింది.

ఉచిత ప్రయాణం వల్ల బస్సుల్లో రద్దీ పెరిగిందనీ, కుటుం బంతో కలిసి వెళ్లినప్పుడు బస్సులో నిల బడే పరిస్థితి కూడా లేదని పిటీషనర్ పేర్కొన్నారు. పిటీషనర్ ఇబ్బంది ఎదుర్కొని పిల్ దాఖలు చేశారనీ, దాన్ని తాము అర్థం చేసుకోగలమని హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ కేసుపై తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేశారు.

దాడులు పెంచిన ఈడీ

ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రతిపక్ష నేతలపై చర్యలు వేగవంతం

నిన్న లాలూ, తేజస్వి... నేడు సోరేన్

- కేజ్రీ అరెస్ట్ తప్పదని వదంతులు
- బీజేపీ నేతలపై అవినీతి ఆరోపణలున్నా పట్టించుకోరు

లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతిపక్ష నాయకులపై కేంద్ర దర్యాప్తు సంస్థల దాడులు ముమ్మరం కాబోతున్నాయి. ప్రతిపక్ష నేతలపై ఆరోపణలు చేయడానికి ఈ దాడులను బీజేపీ ఆయుధాలుగా మలచుకుంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఇండియా కూటమి నుంచి వైదొలిగి ఎన్డీఏలో చేరిన రెండు రోజులకే కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడు పెంచింది. సరిగ్గా సార్వత్రిక ఎన్నికల ముందు ప్రతిపక్షనేతలే లక్ష్యంగా ఈ దాడులు వేగవంతమవుతున్నాయి. దీంతో దేశంలో రాజకీయ అలజడి చెలరేగుతోంది.



న్యూఢిల్లీ : తాజాగా ఈడీ అధికారులు బుధవారం జార్ఖండ్ ముఖ్యమంత్రి, జేఎంఎం అధినేత హేమంత్ సోరేన్ నివాసానికి చేరుకొని ఆయన్ని ఓ భూ కుంభకోణం కేసులో ప్రశ్నించారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు మరోసారి సమన్లు జారీ చేశారు. సోరేన్ ఇదంతా తనపై రాజకీయ కక్షసాధింపు చర్యగా అభివర్ణిస్తున్నారు. ఈడీ వేటాడుతున్న ప్రతిపక్ష ముఖ్యమంత్రుల్లో సోరేన్ నాలుగో వారు. గతంలో ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన భూపేష్ బఘేల్, ఆయన సన్నిహితులపై ఈడీ పంజా విసిరింది. రాష్ట్ర శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో వారిపై అక్రమ ఆన్‌లైన్ బెట్టింగ్ కేసు నమోదు చేసింది. దీనిని బీజేపీ ఎన్నికల ప్రచార అస్త్రంగా ఉపయోగించుకుంది. ముఖ్యమంత్రి అవినీతిపరుడంటూ ఆరోపణలు గుప్పించింది. ఇక బీహార్‌లో ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన కుమారుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్‌లను కూడా 'ఉద్యోగాలకు భూమి' కేసులో ఇరికించింది.

సోరేన్ కనబడడం లేదట

జార్ఖండ్ ముఖ్యమంత్రి సోరేన్‌కు వ్యతిరేకంగా బీజేపీ దుష్ప్రచారం ప్రారంభించింది. న్యూఢిల్లీలో విచారణకు హాజరు కాకపోవడంతో సోరేన్ కనబడడం లేదంటూ ఆయన ఫొటోలతో పోస్టర్లు ముద్రించింది. సోరేన్ ఆచూకీ చెబితే రూ.11,000 బహుమతి ఇస్తామని కూడా ప్రకటించింది. అయితే ఆ మధ్యాహ్నమే సోరేన్ తమ పార్టీ ఎమ్మెల్యేల సమావేశానికి హాజరయ్యారు. ముందుగా నిర్ణయించుకున్న కార్యక్రమాలకు వెళ్లానని, అంతేకాక రాష్ట్ర బడ్జెట్ రూపకల్పనలో బిజీగా ఉన్నానని ఆయన చెప్పారు. బుధవారం జరిగిన విచారణకు సైతం ఆయన హాజరవడంతో బీజేపీ నేతల నోళ్లు మూతపడ్డాయి.

లాలూ, తేజస్విపై ప్రశ్నల వర్షం

తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌ను కూడా ఈడీ సోమవారం ప్రశ్నించింది. 2004-2009 మధ్యకాలంలో లాలూ ప్రసాద్ కేంద్ర రైల్వే మంత్రిగా ఉన్నప్పుడు గ్రూప్ డీ ఉద్యోగాలు ఇచ్చినందుకు నిరుద్యోగుల నుండి భూమిని లంచంగా తీసుకున్నారన్నది సీబీఐ ఆరోపణ. ఈ కేసులో లాలూతో పాటు ఆయన భార్య, బీహార్ మాజీ ముఖ్యమంత్రి రబ్రీదేవి, కుమారుడు తేజస్వి యాదవ్, కుమార్తెలు మిసా భారతి, హేమా యాదవ్‌తో పాటు 12 మందిపై సీబీఐ కేసులు నమోదు చేసింది. తండ్రితో పాటు ఈడీ విచారణకు వచ్చిన ఎంపీ మిసా భారతి విలేకరులతో మాట్లాడుతూ దర్యాప్తునకు సహకరించేందుకు ఆయన సంసిద్ధత వ్యక్తం చేసినప్పటికీ అనవసరంగా వేధిస్తున్నారని ఆరోపించారు. లాలూను విచారించిన మరునాడే తేజస్విని కూడా ఎనిమిది గంటల పాటు ఈడీ అధికారులు ప్రశ్నించారు.

విచారణ అనంతరం బయటికి వచ్చిన తేజస్వికి పార్టీ కార్యకర్తలు స్వాగతం పలికి భారీ ర్యాలీ నిర్వహించారు. 'ఇది ఈడీ కార్యాలయం కాదు. బీజేపీ కార్యాలయం. ఎన్నికలు వచ్చినప్పుడల్లా ప్రతిపక్ష నేతలను ఇక్కడికి పిలిచి ప్రశ్నించడం పరిపాటి అయింది' అని మండిపడ్డారు.

కేజ్రీని అరెస్ట్ చేస్తారా?

ఇక ఢిల్లీ ముఖ్యమంత్రి, అమ్‌ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌కు కూడా మద్యం పాలసీ కేసులో పలుమార్లు సమన్లు జారీ చేసింది. ఈ కేసులో ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా, అమ్‌ఆద్మీ ఎంపీ సంజయ్ సింగ్ ఇప్పటికే జైలులో ఉన్నారు. ఢిల్లీకి చెందిన మరో ఆప్ మంత్రి సత్యేంద్ర జైన్ గత రెండేళ్లుగా కటకటాలను లెక్కిస్తూ కాలం గడుపుతున్నారు. ఈడీ విచారణకు గైర్హాజరు అవుతున్న కేజ్రీవాల్‌ను కూడా త్వరలోనే అరెస్ట్ చేస్తారని వదంతులు వ్యాపిస్తున్నాయి. రాజకీయ దురుద్దేశంతోనే తనను ప్రశ్నించాలని ఈడీ భావిస్తోందని, రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారం చేయకుండా ప్రతిపక్షాలను అడ్డుకునేందుకు కుట్ర పన్నుతోందని ఆయన ఆరోపించారు.

తృణమూల్ నేతలను సైతం...

ప్రజా పంపిణీ పథకంలో కుంభకోణం జరిగిందన్న ఆరోపణపై తృణమూల్ కాంగ్రెస్ నేత షేక్ షాజహాన్ నివాసంపై దాడులు చేశారు. ఇదే కేసులో తృణమూల్ మంత్రి జ్యోతి ప్రియ మల్లిక్‌ను గత సంవత్సరం అక్టోబర్ 23న ఈడీ అరెస్ట్ చేసింది. ఈ విధంగా పలువురు ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకొని కేంద్ర దర్యాప్తు సంస్థలు చర్యలు చేపడుతున్నాయి. రాజస్థాన్ మాజీ మంత్రి మహేష్ జోషీ పైన, హర్యానా, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల కాంగ్రెస్ నేతల పైన ఈడీ కేసులు బనాయించి వేధిస్తోంది.

బీజేపీ నేతలపై చర్యలేవి?

విచారణల పేరిట ప్రతిపక్ష నేతలపై దూకుడు పెంచుతున్న ఈడీ, బీజేపీ నేతలపై ఎన్ని అవినీతి ఆరోపణలు వచ్చినప్పటికీ ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారంటూ అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మపై పలు కేసులు ఉన్నాయి. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్‌పై అవినీతి ఆరోపణలు ఉన్నాయి. బీజేపీలో చేరకముందు పవార్‌పై కేసుల దర్యాప్తు విషయంలో అధికారులు ఎంతో ఉత్సాహం ప్రదర్శించారు. అయితే ఆయన కాషాయదళంలో చేరగానే కడిగిన ముత్యమై పోయారు. మధ్యప్రదేశ్‌లో శివరాజ్ సింగ్ చౌహాన్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో నమోదైన వ్యాపమ్ వంటి అనేక పాత కేసులు ఇప్పుడు అటకెక్కాయి. కర్నాటకలో యడ్యూరప్ప, బీఎస్ బొమ్మై ముఖ్యమంత్రులుగా ఉన్నప్పుడు నమోదైన అనేక చిన్న, పెద్ద అవినీతి కేసుల గతీ అంతే. ఆర్థిక అవకతవకలకు సంబంధించిన ఈ కేసుల్లో పలువురు మంత్రులు నిందితులుగా ఉన్నారు.

కేసులు సరే...శిక్షలేవి?

ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే ప్రతిపక్ష నేతలపై పుంఖానుపుంఖాలుగా కేసులు పెడుతున్న ఈడీ, ఆ ఆరోపణలను నిరూపించలేక చతికిలపడుతోంది. ఉదాహరణకు గత సంవత్సరం మార్చి వరకూ ఈడీ 5,906 కేసులు నమోదు చేసింది. అయితే 1,142 కేసుల్లో మాత్రమే విచారణ పూర్తి చేసి, ఛార్జిషీట్లు దాఖలు చేసింది. వీటిలో కూడా 25 కేసుల్లో మాత్రమే తీర్పు వచ్చింది. తీర్పు వచ్చిన వాటిలో 24 కేసుల్లో నిందితులకు శిక్షలు పడ్డాయి. కానీ 2014 నుండి ఈడీ దాఖలు చేసిన కేసుల సంఖ్య నాలుగు రెట్లు పెరిగింది. ఈడీ, సీబీఐ పెట్టిన కేసుల్లో 95శాతం కేసులు ప్రతిపక్ష నాయకులపై పెట్టినవే. అందుకే దర్యాప్తు సంస్థలను బీజేపీ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నాయి. ప్రతిపక్షాల అనుమానాలను నివృత్తి చేయడానికి బదులు ఈడీ, సీబీఐ నమోదు చేయబోయే కేసుల వివరాలను బీజేపీ నాయకులు ముందుగానే బహిర్గతపరుస్తూ అనుమానాలను మరింత పెంచుతున్నారు.



ఎమ్మెల్సీలుగా మహేష్‌కుమార్‌గౌడ్, వెంకట్ ప్రమాణస్వీకారం

- ప్రమాణం చేయించిన మండలి చైర్మెన్ గుత్తా

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎమ్మెల్యే కోటాలో ఏకగ్రీవంగా ఎన్నికైన ఎమ్మెల్సీలు మహేష్ కుమార్‌గౌడ్, బల్మూరి వెంకట్ ప్రమాణ స్వీకారం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని శాసనమండలి ప్రాంగణంలోని మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తన చాంబర్‌లో వారితో ప్రమాణం చేయించారు. మహేష్ కుమార్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ కార్య నిర్వాహక అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా వెంకట్ పని చేస్తున్నారు. ప్రమాణస్వీకారోత్సవంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు టీపీసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, మాజీ ఎంపీ వి. హనుమంతరావు, ప్రొఫెసర్ కోదండరాం, సియాసత్ న్యూస్‌ఎడిటర్ అమీర్ అలీఖాన్, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షులు రోహిన్ రెడ్డితోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఎమ్మెల్సీలను అభినందించారు.

పార్టీ కోసమే నా జీవితం..

(మొదటి పేజీ తరువాయి)

కార్యాలయం ఎంబీ భవన్‌కు ఆయన బుధవారం వచ్చారు. ఆ పార్టీ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు ఆయన్ను పరామర్శించారు. ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తమ్మినేని మాట్లాడుతూ ప్రస్తుతం తాను ఆరోగ్యంగా ఉన్నానని చెప్పారు. వారం, పది రోజులపాటు విశ్రాంతి అవసరమనీ, ఖమ్మం వెళ్లొద్దనీ, ప్రయాణం చేయొద్దని డాక్టర్లు సూచించారని అన్నారు. భౌతికంగా ఎక్కువ ఒత్తిడికి గురికావొద్దన్నారు. ఐదు నిమిషాలు నడవాలన్నారని చెప్పారు. శ్వాస సమస్య ఎక్కువైతే నడక ఆపాలన్నారని వివరించారు. అయితే తనకు గుండె వద్ద పేస్‌మేకర్‌ను అమర్చారని అన్నారు. టీవీలకు స్టెబిలైజర్‌లాగా అది పనిచేస్తుందన్నారు. గుండె ఎక్కువ సార్లు కొట్టుకుంటే తగ్గిస్తుందనీ, తక్కువసార్లు కొట్టుకుంటే పెంచుతుందని చెప్పారు. ఒకవేళ గుండెపోటు వస్తే సీపీఆర్ అదే చేస్తుందని అన్నారు. ఆ పరికరంలో ఇన్ని



సౌకర్యాలున్నాయని వివరించారు. తాను ఆస్పత్రిలో ఉన్నప్పుడు ఎవరినీ కలిసే అవకాశం లేదన్నారు. తన ఆరోగ్యం రీత్యా అక్కడి సిబ్బంది, డాక్టర్లు కఠినంగా వ్యవహరించారని చెప్పారు. అయితే తాను

తమ్మినేని ఆరోగ్యం అంతే ముఖ్యం : నంద్యాల నర్సింహారెడ్డి

తమ్మినేని పార్టీకి సేవ చేయడం ఎంత ముఖ్యమో, పార్టీకి ఆయన ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమని సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు నంద్యాల నర్సింహారెడ్డి అన్నారు. డాక్టర్ల సూచనలను పాటించాలనీ, ఒత్తిడికి గురయ్యే పనులు చేయొద్దని సూచించారు.

2004లో ఎమ్మెల్యేగా గెలిచినపుడు గుండె సమస్య వచ్చిందన్నారు. అప్పుడే స్టంట్ వేశారని గుర్తు చేశారు. 20 ఏండ్ల వరకు ఎలాంటి సమస్య రాలేదని అన్నారు. ఇప్పుడూ గుండె వల్ల సమస్య లేదనీ, ఊపిరితిత్తుల్లో నీరు నిల్వ ఉండడమే సమస్యకు కారణమని చెప్పారు. శ్వాస సంబంధ సమస్య వచ్చిందన్నారు. అందుకే అసెంబ్లీ ఎన్నికల్లో చాలా కార్యక్రమాలను రద్దు చేసుకోవాల్సి వచ్చిందని గుర్తు చేశారు. నీరు నిల్వ ఉండడం వల్ల గుండె ఎక్కువసార్లు కొట్టుకున్నదని అన్నారు. సాధారణంగా 70 లేదా 80 సార్లు గుండె కొట్టుకోవాలి కానీ తనకు 160 సార్లు కొట్టుకున్నదని వివరించారు. వేగంగా నడిచినపుడు గుండె ఎక్కువ సార్లు కొట్టుకోవడం సహజమని చెప్పారు. అయితే తాను నడవకుండా ప్రశాంతంగా ఉన్నపుడు కూడా 160 సార్లు కొట్టుకుందని అన్నారు. సంక్రాంతి పండగ రోజు కొంత ఇబ్బందిగా అనిపించిందనీ, వెంటనే తమ పాప డాక్టర్ కావడం వల్ల ప్రథమ చికిత్స చేసిందనీ, అది కొంత ఉపయోగపడిందని చెప్పారు. వెంటనే ఖమ్మంకు తరలించారనీ, అక్కడి నుంచి అదేరోజు రాత్రి హైదరాబాద్‌కు తీసుకొచ్చారని వివరించారు. శ్వాస సంబంధిత సమస్య ఉండడం వల్ల వెంటనే వెంటిలేటర్ అమర్చారని అన్నారు. గతనెల 26న పేస్‌మేకర్‌ను అమర్చారనీ, గుండెను సాధారణ స్థితికి తీసుకొచ్చారని చెప్పారు. ప్రమాదకర స్థితిలోకి వెళ్లి ఇంత త్వరగా కోలుకోవడం అరుదుగా చూస్తామంటూ డాక్టర్లు అభిప్రాయపడ్డారని వివరించారు. ఆయనది ఉక్కు శరీరమంటూ ముఖ్యమంత్రితో అన్నారని గుర్తు చేశారు.

ఇప్పుడే పరామర్శించడానికి వెళ్లొద్దు : టి జ్యోతి

తమ్మినేని అనారోగ్యం గురించి తెలిసిన వెంటనే ఎంతో ఆందోళనకు గురయ్యామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి జ్యోతి చెప్పారు. ఆయన హెల్త్ బులెటిన్ విడుదలయ్యాక, ఆరోగ్యం నిలకడగా ఉందంటూ చెప్పిన తర్వాత కొంత ఉపశమనం కలిగిందని అన్నారు. ఇంత త్వరగా కోలుకుని పార్టీ రాష్ట్ర కార్యా లయానికి రావడం ఎంతో సంతోషకరమని చెప్పారు. అయితే జిల్లాల నుంచి చాలా మంది ఫోన్లు చేస్తు న్నారనీ, డిశ్చార్జి అయ్యారు కాబట్టి వెళ్లి పరామర్శించొచ్చా?అని అడుగుతున్నారని అన్నారు. పది రోజుల వరకు ఆయనకు విశ్రాంతి అవసరమని చెప్పారు. ఇప్పుడే ఎవరూ ఇంటికెళ్లి పరామర్శిం చొద్దని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నరసింహారావు, టి సాగర్, ఎండీ అబ్బాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్ శ్రీరాంనాయక్, బండారు రవికుమార్, టి స్కైలాబ్‌బాబు, జె బాబురావు, మచ్చా వెంకటేశ్వర్లు, అన్నవరపు కనకయ్య, ఎజె రమేష్, జి జగదీశ్, బి ప్రసాద్ పాల్గొన్నారు.



హైదరాబాద్ ట్రాఫిక్ పై ప్రత్యేక దృష్టి

భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రణాళిక

- సిటీ పోలీస్ స్టేషన్ల స్థాయి పెంపునకు చర్యలు
- సిబ్బంది కొరత లేకుండా హోంగార్డుల నియామకాలు
- మల్టీ లెవల్ పార్కింగ్ సెంటర్లను ప్రోత్సహించేందుకు కొత్త విధానం
- సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ మహానగరంలో పెరుగుతున్న ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు సమగ్ర ప్రణాళికను రూపొందించాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నగరంలో ట్రాఫిక్ నిర్వహణ, నియంత్రణపై బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో జీహెచ్‌ఎంసీ, పోలీసు విభాగాలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం వారికి పలు సూచనలు చేశారు. హైదరాబాద్ అంతర్జాతీయ నగరంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ముందు చూపుతో చర్యలు చేపట్టాలన్నారు. ఇందు కోసం నైపుణ్యం కలిగిన కన్సల్టెన్సీలకు బాధ్యతలు అప్పగించి ప్రత్యేకంగా అధ్యయనం చేయాలన్నారు. పెరిగిన వాహనాల సంఖ్యకు అనుగుణంగా సిబ్బంది అందుబాటులో లేరంటూ అధికారులు ముఖ్యమంత్రికి వివరించగా, స్పందించిన ఆయన వెంటనే తగినంత మంది హోంగార్డుల నియామకాలు చేపట్టి మూడు నెలల్లోగా వారికి తగిన శిక్షణ అందించాలని ఆదేశించారు. వివిధ విభాగాల్లో పని చేస్తున్న హోంగార్డులను ట్రాఫిక్ విభాగానికి రప్పించడంతో పాటు, రద్దీ ఎక్కువగా ఉండే సమయాల్లో లా అండ్ ఆర్డర్ పోలీసుల సేవలను సైతం వినియోగించుకోవాలని సూచించారు. నగరంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల స్థాయిని అప్ గ్రేడ్ చేసి, వాటికి సరిపడే సంఖ్యలో సిబ్బంది నియామకాలు చేపడుతామని రేవంత్ చెప్పారు. ఆటోమేటిక్ సిగ్నల్ వ్యవస్థ మీద పూర్తిగా ఆధారపడకుండా, ప్రధాన జంక్షన్ల వద్ద సిబ్బంది ఉండేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎల్బీనగర్ జంక్షన్ తరహాలో సబ్‌వే, అండర్‌పాస్, సర్వీస్‌వేల ఏర్పాటు, వాటి సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని చెప్పారు.మూడు కమిషనరేట్ల పోలీస్ అధికారులు, మున్సిపల్ జోనల్ కమిషనర్లు ప్రతినెలా సమావేశమై ట్రాఫిక్‌పై సమీక్షించి, తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పార్కింగ్ సమస్యను అధిగమిస్తే ట్రాఫిక్ ఇబ్బందులు తొలిగిపోతాయని అధికారులు ఈ సందర్భంగా రేవంత్‌కు వివరించారు. నగరంలో పలు చోట్ల మల్టీలెవల్ కార్ పార్కింగ్ సెంటర్ల నిర్మాణం చేపట్టడంతో పాటు ప్రయివేటు రంగంలో పార్కింగ్ సెంటర్ల ఏర్పాటుకు ముందుకొచ్చే వారికి ప్రభుత్వ పరంగా రాయితీలు ఇవ్వనున్నట్టు సీఎం తెలిపారు. లే అవుట్లకు హెచ్‌ఎండిఏ అనుమతులు ఇచ్చేటప్పుడు రోడ్లు, పార్కులు, మౌలిక వసతులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని అన్నారు. ట్రాఫిక్ నిర్వహణ, వసతులపై దేశంలోని ఇతర నగరాలు, విదేశాల్లో ఎలాంటి పద్ధతులను అనుసరిస్తున్నారనే విషయంపప అధ్యయనం చేయాలన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ రవి గుప్తా, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవెలప్మెంట్ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

జార్ఖండ్ సీఎం హౌస్ అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

తదుపరి సీఎంగా ఉంటారనీ, తమకు అందుకు కావల్సిన సంఖ్య(ఎమ్మెల్యేలు) ఉన్నదని జేఎంఎం ఎంపీ మహువా మజీ అన్నారు. ఇటు హేమంత్ అరెస్టుతో పరిణామాలను రాజ్‌భవన్ నిశితంగా పరిశీలిస్తున్నది. ప్రస్తుత పరిస్థితిపై న్యాయపరమైన అభిప్రాయాన్ని తీసుకుంటున్నది.

అంతకముందు ఈడీ హేమంత్‌ను విచారిస్తున్న తరుణంలో ఆయన అరెస్టు అవుతారనే వార్తలు గుప్పుమన్నాయి. దీంతో జార్ఖండ్‌లోని సంకీర్ణ ప్రభుత్వంలోని ఎమ్మెల్యేలు ఒక్కొరొక్కరుగా గవర్నర్ నివాసానికి చేరుకున్నారు. ఎమ్మెల్యేలు చంపాయ్ సొరెన్‌ను తదుపరి సీఎంగా ప్రతిపాదించారు. మంగళవారం తన అధికారిక నివాసంలో నిర్వహించిన మంత్రులు, ఎమ్మెల్యేల సమావేశంలో హేమంత్ సొరెన్ భార్య కల్పనా సొరెన్‌ను తదుపరి సీఎంగా నియమించవచ్చనే వార్తలు వెలువడినప్పటికీ.. అనూహ్యంగా చంపాయ్ సొరెన్ పేరు తెర పైకి వచ్చింది.

హేమంత్‌ను విచారించటం కోసం బుధవారం మధ్యాహ్నం రాంచీలోని హేమంత్ సొరెన్ అధికారిక నివాసానికి ఏడుగురు సభ్యుల ఈడీ బృందం చేరుకున్నది. అనంతరం ఈడీ అధికారులు ఆయనను విచారించటం ప్రారంభించారు. ఆరు గంటల సుదీర్ఘ విచారణానంతరం ఈడీ ఆయనను అదుపులోకి తీసుకున్నది.

ఈడీపై హేమంత్ కేసు : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

జార్ఖండ్ సీఎం హేమంత్ సొరెన్‌ను రాంచీలోని ఆయన ఇంటిలో కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ విచారిస్తున్న నేపథ్యంలో అనూహ్య పరిణామం చోటు చేసుకున్నది. ఈడీ అధికారులపై హేమంత్ కేసు వేశారు. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద చర్యలు తీసుకోవాలంటూ ధుర్వా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది.

'ఈడీ చర్య బహిరంగంగా తనను అవమానపర్చటమే'

తన ఫిర్యాదులో ఈడీ అధికారుల పేర్లను హేమంత్ లేవనెత్తారు. ఎలాంటి నోటీలు లేకుండానే, తాను లేని సమయంలో ఈడీ అధికారులు గత నెల 29న న్యూఢిల్లీలోని తన నివాసంలో ఉద్దేశపూర్వక సోదాలు నిర్వహించారని ఆరోపించారు. నాకు చెందిన నీలి రంగు కలర్ బీఎండబ్ల్యూ కార్‌ను సీజ్ చేశామనీ, పెద్ద మొత్తంలో అక్రమ నగదును స్వాధీనపర్చుకున్నామని అధికారులు తప్పుడు సమాచారాన్ని లీక్ చేశారని హేమంత్ వివరించారు. అయితే, వాటితో తనకు ఎలాంటి సంబంధమూ లేదని పేర్కొన్నారు. ఈడీ చర్య తనను బహిరంగ అవమానపర్చటమేనని ఆయన ఆరోపించారు. ఈడీ అధికారుల చర్యల కారణంగా తాను, తన కుటుంబం బాధపడ్డామనీ, తీవ్రమైన మనో వేధనను ఎదుర్కొన్నామనీ, వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను మేమంత్ పిర్యాదులో కోరారు

హేమంత్‌ను ఇంటికి ఈడీ

ముందుగా జారీ చేసిన సమన్ల ప్రకారం బుధవారం మధ్యాహ్నం హేమంత్ ఇంటికి ఈడీ అధికారులు చేరుకున్నారు. అనంతరం ఆయనను విచారించారు. కట్టుదిట్టమైన భద్రత నడుమ ఆయన విచారణ కొనసాగింది. ఈ భూకుంభకోణానికి సంబంధించి విచారించటం కోసం హేమంత్‌కు ఈడీ గతంలో అనేక సార్లు సమన్లు పంపింది. దాదాపు తొమ్మిది సార్లు హేమంత్ ఈడీ సమన్లను విస్మరించారు. ఈ క్రమంలో గతనెల (జనవరి 20న) జార్ఖండ్ సీఎంను ఈడీ విచారించింది. మళ్లీ పది రోజుల వ్యవధిలోనే బుధవారం (జనవరి 31న) నాడు కేంద్ర దర్యాప్తు సంస్థ ఆయనను ప్రశ్నించటం గమనార్హం.

భద్రత కట్టుదిట్టం..రాంచీలో ఆంక్షలు

హేమంత్ సొరెన్‌ను ఈడీ విచారిస్తున్న సమయంలో ఆయన ఇంటి వద్ద పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. 144 సెక్షన్‌ను విధించారు. రాష్ట్ర రాజధాని రాంచీలోని పలు కీలక ప్రాంతాల్లో అధికారులు నిషేధాజ్ఞలు విధించారు. శాంతి భద్రతలను పర్యవేక్షించటానికి ముగ్గురు సభ్యుల బృందాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. విచారణ కొనసాగుతున్న సమయంలో రాంచీలోని కంకె రోడ్డు వద్ద సీఎం నివాసం వద్ద హేమంత్ సొరెన్‌కు చెందిన జేఎంఎం



పార్టీ ఎమ్మెల్యేలు గుమిగూడి బల ప్రదర్శనను నిర్వహించారు. కేంద్రం ఆదేశాల మేరకు మా సీఎంను ఈడీ ఉద్దేశపూర్వకంగా వేధిస్తున్నదని హేమంత్ మద్దతుదారులు ఆరోపించారు.

జేఎంఎం నిరసనలు

అలాగే, సంకీర్ణ కూటమి ప్రభుత్వంలోని ఎమ్మెల్యేలు సైతం సీఎంకు సంఘీభావం తెలిపారు. హేమంత్‌ను ఈడీ విచారిస్తున్న సందర్భంలో జేఎంఎం కార్యకర్తలు, మద్దతుదారులు రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో నిరసనలు, ఆందోళలకు దిగారు. ఈడీకి, బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఈడీ విచారణ సందర్భంగా హేమంత్‌ను అధికారులు ఏ క్షణాన్నైనా అరెస్టు చేయొచ్చనే వార్తల నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం వరకు జార్ఖండ్‌లో హైడ్రామా చోటు చేసుకున్నది. దాదాపు 30 గంటల నిరీక్షణకు తెరదించుతూ హేమంత్ రాంచీలోని తన అధికారిక నివాసంలో సమావేశమయ్యారు. సంకీర్ణ ప్రభుత్వంలోని క్యాబినెట్ మంత్రులు, ఎమ్మెల్యేలతో సమావేశమైన విషయం విదితమే. ఈ తరుణంలోనే హేమంత్ తన భార్యకు సీఎం పగ్గాలు అప్పగించనున్నారన్న వార్తలు గుప్పుమన్నాయి.

అన్‌రిజర్వుడు టిక్కెట్లకోసం ఏటీవీఎమ్‌లు వినియోగించండి

- మొబైల్ యాప్ ద్వారా కూడా టిక్కెట్లు తీసుకోవచ్చు
- రైల్వేస్టేషన్లలో రద్దీ నివారించండి
- ప్రయాణికులకు ద.మ.రైల్వే విజ్ఞప్తి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రైల్వే స్టేషన్లలో క్యూలైన్ల రద్దీని నివారించేందుకు సాంకేతికతను వినియోగించుకోవాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ విజ్ఞప్తి చేశారు. అన్ రిజర్వుడు టిక్కెట్ల కోసం రైల్వే స్టేషన్లలో ఏర్పాటు చేసిన ఆటోమేటిక్ టిక్కెట్ వెండింగ్ మెషిన్(ఏటీవీఎమ్)లు వినియోగించుకోవాలని బుధవారంనాడొక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే అన్ రిజర్వ్ టికెటింగ్ సిస్టమ్ (యూటీఎస్) మొబైల్ యాప్ ద్వారా కూడా టిక్కెట్లు పొందవచ్చనీ, ఆర్ వ్యాలెట్ ద్వారా కూడా టిక్కెట్లు తీసుకోవచ్చని తెలిపారు. ఈ పద్ధతుల ద్వారా టిక్కెట్లు తీసుకుంటే ప్రయాణీకులకు మూడు శాతం బోనస్ వర్తిస్తుందన్నారు.

టిక్కెట్ కౌంటర్ల వద్ద క్యూలైన్లలో నిలబడకుండా సమయాన్ని ఆదా చేసుకోవచ్చని వివరించారు. యూటీఎస్ మొబైల్ యాప్‌ను ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు.

విజయాన్ని ఎలా సాధించగలమో ఓటమి బోధిస్తుంది
- జార్జి డిమిట్రోవ్

సంపాదకీయం

బరితెగింపు

రాజకీయ ప్రత్యర్థులను వేధించడమే లక్ష్యంగా మోడీ సర్కారు కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడానికి బరితెగిస్తోంది. ఈ విషయమై ఎన్ని విమర్శలు చేసినా కేంద్ర ప్రభుత్వ వైఖరిలో నామ మాత్రపు మార్పు కూడా కనిపించడంలేదు. ప్రతిపక్షాలన్నీ కలిసి మూకుమ్మడిగా అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి వచ్చిందంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. అయినా.. ఈడి, సిబిఐ వంటి సంస్థలను తమ జేబు సంస్థలుగానే మోడీ ప్రభుత్వం భావిస్తోంది. ప్రతిపక్షనేతలను నయానో, భయానో లొంగదీసుకోవడానికి, అలా లొంగని వారిని కేసులతో వేధించడానికి ఆ సంస్థలను దుర్వినియోగపరుస్తున్న తీరు జుగుప్స కలిగిస్తోంది. జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను ఇడి అధికారులు ఏడు గంటలకు పైగా ప్రశ్నించి, అరెస్ట్ చేయడం బీహార్ మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వీయాదవ్‌ను లక్ష్యంగా చేసుకోవడం దర్యాప్తు సంస్థల దుర్వినియోగానికి తాజా నిదర్శనం. బీజేపీ నిరంకుశ పోకడలకు వ్యతిరేకంగా గట్టిగా పోరాడుతున్నందునే ఈడి వీరిని లక్ష్యంగా చేసుకుంది. బీహార్‌లో మహాకూటమి ప్రభుత్వం నుండి నితీష్ కుమార్ వైదొలిగి బీజేపీ పంచన చేరిన మరుసటి రోజే ఈడి విచారణ ప్రక్రియ ప్రారంభం కావడం గమనార్హం. సిబిఐ నమోదు చేసిన కేసు ఆధారంగా తేజస్వీ తండ్రి, బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్‌కు కూడా ఇటీవలే ఈడి నోటీసులు జారీ చేసింది. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లకు వ్యతిరేకంగా దశాబ్దాల తరబడి లాలూ సాగిస్తున్న పోరాటం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. దేశ రాజధాని ఢిల్లీలోనూ ఇదే స్థితి. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆప్ అధ్యక్షుడు కేజ్రీవాల్‌తో పాటు ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులు ఈడి బాధితులుగా మారడానికి కారకులెవరో అందరికీ తెలిసిందే. ఇలా చెప్పు కుంటూపోతే బీజేపీ దుర్నీతికి, దుర్వినియోగానికి ఉదాహరణాలెన్నో!

> **2014వ సంవత్సరంలో నరేంద్రమోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుండి గతేడాది జనవరి వరకు దేశ వ్యాప్తంగా 121 మంది రాజకీయ నేతలపై ఈడి కేసులు పెట్టి విచారణ చేపట్టింది. వీరిలో 115 మంది అంటే 95 శాతం మంది ప్రత్యర్థి రాజకీయ పార్టీలకు చెందినవారు, బీజేపీని గట్టిగా వ్యతిరేకించేవారే కావడం గమనార్హం. ఇలా కేసులు నమోదైన వారు బీజేపీలో చేరితే వెంటనే వారిపై నమోదైన కేసులను ఎత్తివేయడం, వారిలో కొందరికి ప్రభుత్వ పదవులను సైతం కట్టబెట్టడం మోడీ సర్కారు బరితెగింపునకు మరో నిదర్శనం.**



2014వ సంవత్సరంలో నరేంద్రమోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుండి గతేడాది జనవరి వరకు దేశవ్యాప్తంగా 121 మంది రాజకీయ నేతలపై ఈడి కేసులు పెట్టి విచారణ చేపట్టింది. వీరిలో 115 మంది అంటే 95 శాతం మంది ప్రత్యర్థి రాజకీయ పార్టీలకు చెందినవారు, బీజేపీని గట్టిగా వ్యతిరేకించేవారే కావడం గమనార్హం. ఇలా కేసులు నమోదైన వారు బీజేపీలో చేరితే వెంటనే వారిపై నమోదైన కేసులను ఎత్తివేయడం, వారిలో కొందరికి ప్రభుత్వ పదవులను సైతం కట్టబెట్టడం మోడీ సర్కారు బరితెగింపునకు మరో నిదర్శనం. మరోవైపు ఈడి కేసుల్లో నేరం రుజువై శిక్షపడినవి చాలా తక్కువ. అధికారిక లెక్కల ప్రకారం 2011 నుండి ఈడి 1600 కేసులు నమోదు చేసి, 1800 దాడులను ఈడి నిర్వహించింది. అయితే, నేరం రుజువై శిక్ష పడింది మాత్రం కేవలం పది మందికి మాత్రమే! గడిచిన 18 ఏండ్లలో ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పిఎంఎల్‌ఏ) కింద 5,422 మందిపై ఈడి కేసులు పెట్టి దర్యాప్తు చేయగా, 23మందికి మాత్రమే శిక్ష పడింది. ఇది కేవలం 0.5శాతం మాత్రమే! అయినా, భయపడుతున్నారంటే ఇతర దర్యాప్తు సంస్థలకు లేని ప్రత్యేక అధికారాలు ఈడికి ఉండటమే కారణం. ముఖ్యంగా న్యాయస్థానాల అనుమతి లేకుండానే ఆస్తులు జప్తు చేసే అధికారం ఒకసారి కేసు నమోదైతే నేరం చేయలేదని రుజువు చేసుకునే బాధ్యత నిందితునిపైనే మోపడం వంటి అధికారాలను ఈడికి అప్పగించారు.

ప్రస్తుత పార్లమెంటులోని ప్రతిపక్ష సభ్యుల్లో దాదాపు 90 శాతం మంది ఏదో ఒక కేంద్ర దర్యాప్తు సంస్థ నిఘానీడలో ఉన్నట్లు ఇటీవల విడుదలైన ఒక నివేదిక పేర్కొంది. ఈ నేపథ్యంలోనే తమిళనాడు, పశ్చిమబెంగాల్ ప్రభుత్వాలు ఈడి దాడులను అడ్డుకోవడంతో పాటు, ఆ సంస్థ సిబ్బందిపై కేసులు నమోదుచేశాయి. తాజాగా జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్ కూడా ఈడి అధికారులు తన ప్రతిష్టను దెబ్బతీస్తున్నారంటూ కేసు దాఖలు చేశారు. తీవ్రస్థాయిలో జరుగుతున్న ఈ అధికార దుర్వినియోగాన్ని అరికట్టి, దర్యాప్తు సంస్థల నిష్పాక్షికతపై ప్రజానీకంలో తిరిగి నమ్మకం కలిగించాలంటే అధికారం నుండి బీజేపీని సాగనంపడం ఒక్కటే మార్గం. ఈ లక్ష్యసాధనకు ఐక్యంగా కృషి చేయాల్సిన బాధ్యత ప్రతిపక్షాలపై ఉంది.

'ప్రపంచాన్ని మార్చే శక్తివంతమైన ఆయుధం విద్య మాత్రమే' అని నెల్సన్ మండేలా చెప్పిన మాటలు నేటికీ మనం గుర్తు చేసుకోవాలి. ఎందుకంటే నేడు కేంద్రంలో బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్న సందర్భంగా విద్యారంగం తీరుతెన్నుల్ని పరిశీలించాల్సిన అవసరం పాలకులపై ఉన్నది. ప్రజల జీవన ప్రమాణాలు, వారి సామాజిక ఆర్థిక స్థితిగతులు వారికందించే విద్యపై మాత్రమే ఆధారపడి ఉంటాయనేది వాస్తవం. అసర్ (ASER) రిపోర్ట్ - 2023 ప్రకారం దేశంలోని 26 రాష్ట్రాల్లో 28 జిల్లాల్లో 34,745 మంది 14-18 వయసు గల వారిని సర్వే చేస్తే వారిలో 42.7 శాతం ఇంగ్లీష్‌లో కనీసం రెండు వాక్యాలు కూడా చదువలేకపోతున్నారు. రెండో తరగతి పాఠ్యపుస్తకాలు వారి ప్రాంతీయ భాషల్లో చదవడం లేదు. కేవలం 43 శాతం మాత్రమే చతుర్విధ ప్రక్రియలు చేయగలుగుతున్నారు. ఈ రిపోర్టు ఆధారంగా విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలు లోపించాయని మనకు స్పష్టంగా తెలుస్తోంది. 86.8శాతం విద్యార్థులు మాత్రమే ఏదో ఒక కాలేజీలో కానీ స్కూల్లో గాని చదువుతున్నారు. మిగతావారు చదువుకోవడం లేదు. ప్రఖ్యాత అమెరికా సంస్థ (BAV) గ్రూప్, వార్టన్ స్కూల్ ఆఫ్ యూనివర్సిటీ తయారుచేసిన వార్షిక నివేదిక ప్రకారం నాణ్యమైన విద్యనందించడంలో అమెరికా, ఇంగ్లాండ్ మొదటి రెండు స్థానాల్లో ఉండగా భారతదేశం 32వ స్థానంలో ఉంది. ఈ సర్వేను 78 దేశాల్లో వేల మంది ప్రజలతో ఈ సంస్థ నిర్వహించడం విశేషం.

'విద్యారంగానికి నిధులు పెంచాలి'

26.5 కోట్ల మంది విద్యార్థులు, 14.9 లక్షల పాఠశాలలు, 95 లక్షలమంది ఉపాధ్యాయులతో భారతీయ విద్యావ్యవస్థ ప్రపంచంలోనే అతిపెద్ద విద్యావ్యవస్థగా గుర్తింపు పొందింది. అతిపెద్ద ప్రజాస్వామిక దేశం అతిపెద్ద విద్యావ్యవస్థలో ఉన్న మనం విద్యారంగంలో అనేక విద్యాసంస్కరణలు తీసుకొచ్చినప్పటికీ ప్రజలకు పూర్తిస్థాయిలో నాణ్యమైన విద్యనందించడంలో సఫలీకృతం కాలేకపోయాం. నేషనల్ శాంపిల్‌సర్వే ఆర్గనైజేషన్ (NSSO) ప్రకారం భారతదేశంలో నాణ్యమైన విద్య అందించకపోవడానికి ప్రధాన కారణాలుగా విద్యారంగానికి సరైన బడ్జెట్ కేటాయింపులు లేకపోవడం, దేశంలో 33శాతం టీచర్లు అర్హత కలిగినవారు అందుబాటులో లేకపోవడం, ఆధునిక సాంకేతిక నైపుణ్యాలు టీచర్లు అందిపుచ్చుకోకపోవడం, మారుతున్న సమాజ అవసరాలకనుగుణంగా ఆధునిక ప్రపంచంలో విద్యార్థులు రాణించేలా వారిలో సృజనాత్మకతను పెంచేలా కరికులం లేకపోవడం, దేశంలోని మెజారిటీ బడుల్లో మౌలిక సౌకర్యాలు కల్పించకపోవడం ప్రధానంగా మంచినీరు, పారిశుధ్య నిర్వహణ, విద్యుదీకరణ తరగతి గదులు చాలినంత అందుబాటులో లేకపోవడం. పై సమస్యలన్నింటికీ మూల కారణం బడ్జెట్లో విద్యారంగానికి నిధులు అధికంగా కేటాయించకపోవడం. 1964లో కొఠారి కమిషన్ ప్రతిపాదన ప్రకారం దేశ జీడీపీలో విద్యారంగానికి కనీసం ఆరుశాతం బడ్జెట్ కేటాయింపులు చేయాలని సూచించారు.1986 జాతీయ విద్యా విధానం కూడా ఈ ప్రతిపాదనను అంగీకరించింది. అరవయ్యేండ్లు గడిచినా, ప్రభుత్వాలెన్నో మారినా అమలుకు మాత్రం నోచుకోలేదు.

21వ శతాబ్దంలో భారతీయ యువత ప్రపంచంతో పోటీ పడాలని వారికి నాణ్యమైన విద్యనందించాలని, వారిలో సృజనాత్మకతను పెంచాలని భారత ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం (NEP)2020ను తీసుకొచ్చింది. దీని ప్రకారం భారత దేశ జీడిపిలో విద్యారంగానికి కనీసం ఆరు శాతం నిధులను కేటాయించాలి. గత ఆర్థిక సంవత్సరంలో భారత ప్రభుత్వ బడ్జెట్‌లో కేవలం 2.9శాతం నిధులు (రూ.1,12,899 కోట్లు) మాత్రమే కేటాయించింది. ప్రపంచంలో నాణ్యమైన విద్యను అందించే దేశాలు వాటి బడ్జెట్లో ఆరు శాతం కన్నా ఎక్కువ నిధులనే కేటాయిస్తున్నాయి. ఉదాహరణకి నార్వే, చిలీ దేశాల్లో 6.6శాతం, ఇజ్రాయిల్, న్యూజిలాండ్‌లు 6.2శాతం, ఇంగ్లాండ్ 6.1శాతం, అమెరికా 6 శాతం నిధులు కేటాయించి నాణ్యమైన విద్యను అందిస్తున్నాయి. విద్య అనేది సమాజాన్ని చీకట్లోంచి వెలుగులోకి తీసుకువెళ్లే ఉద్యమం. ఈ క్రాంతి ఉద్యమం నిరంతరం చైతన్యశీలంగా సమాజంలో నిర్వహించాలంటే విద్యారంగానికి బడ్జెట్‌లో నిధులు పెంచాల్సిన అవసరం ఉన్నది.

- పాకాల శంకర్ గౌడ్, 9848377734

రామ రాజ్యమా... లౌకిక రాజ్యమా?



జూలకంటి రంగారెడ్డి
9490098349

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల భావోద్వేగాలతో అధికారాన్ని ఏలుతోంది. ప్రతి ఎన్నికల సందర్భంలో ఓట్ల కోసం ప్రజల మనోభావాలతో ఆటలాడటం అలవాటుగా మారింది. అందుకు మతమే అధికార పరమావధిగా పెట్టుకున్నది. ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాన్ని చాపకింద నీరులా దేశం మొత్తం వ్యాప్తిచేసే కార్యక్రమాన్ని యథేచ్ఛగా అమలు చేస్తున్నది. అందుకు నిదర్శనం అయోధ్యలో రామమందిర ప్రారంభంలో ప్రధాని చేసిన ఉపన్యాసమే తార్కాణం. ప్రారంభోత్సవంలో మాత్రం పాల్గొన్నది దేశంలోని సాధువులు, సన్యాసులు, బడా వ్యాపారవేత్తలు, కోట్లాధిపతులు. రామరాజ్యం రావాలని కోరుకున్న ప్రధాని పెట్టుబడిదారుల ఆలయంగా, ఆలవాలంగా ఈ దేశాన్ని మార్చడం కొట్టి పారేయలేని వాస్తవం. ఎన్నికల ముందు రామ మందిరాన్ని ప్రారంభించి ప్రజల భావోద్వేగాలను తన వైపు మరల్చుకోవడం బీజేపీ- ఆర్‌ఎస్‌ఎస్‌ల ప్రధాన భూమిక. ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్, ప్రధాని మోడీ కలిసి రామమందిరాన్ని ప్రారంభించారు. దీన్ని బట్టి మనమేం అర్థం చేసుకోవాలి? ఈ ప్రారంభోత్సవంతో మతం ముసుగులు పూర్తిగా తొలిగి

> **ఈ పదేండ్ల మోడీ పాలనలో మాటలు కోటలు దాటుతున్నా పేదోడి పొయ్యిపై నాలుగు మెతుకులు ఉడకడం లేదు. ఇది దేశంలో ప్రస్తుతం కొనసాగుతున్న మోడీ(రామ) రాజ్యం.ఈ రాజ్యంలో ప్రజా సంక్షేమం లేకపోగా పైగా పేదల బాధలు రెట్టింపయ్యాయి. నిరుద్యోగం, ధరల పెరుగుదల తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. కార్మికుల హక్కులు కాలరాయబడ్డాయి. చదువు, వైద్యం కార్పొరేట్ల పరమైంది. మోడీ ప్రభుత్వం వైఫల్యాలను ఎప్పటికప్పుడు సీపీఐ(ఎం) లాంటి వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు ప్రతిఘటిస్తున్నా, ప్రజల దృష్టిని మరల్చేందుకు బీజేపీ-ఆరెస్సెస్ వేస్తున్న పాచికే రామరాజ్యం.**

పోయాయి. ఇక అంతా బహిరంగమే! ఎన్నికలయ్యేదాకా ఎక్కడ ఏం జరుగుతుందో, ఎలాంటి మత ఉద్రికత్తలు, ఘర్షణలు జరుగుతాయో తెలియని పరిస్థితి.

మోడీ మతాన్ని, రాజకీయాలను వేరు చేసి చూడటం లేదు? మతానికి రాజకీయాలను అనుసంధానం చేసి అధికారం కోసం తన ఎత్తుగడలను అనుసరిస్తున్నాడు. గత 75 ఏండ్లలో ఏ ప్రభుత్వాలు చేయలేని పనిని కేంద్రం అమలు చేస్తున్నది. 1990లో ఎల్‌కే అద్వానీ రామజన్మభూమి పేరుతో రథయాత్ర ప్రారంభించి 1984లో రెండు సీట్ల నుంచి 150 సీట్లకు తీసుకొచ్చారు. అప్పటి నుంచే కాషాయపు జెండా తన ఎజెండాను పూర్తిగా మార్చుకున్నది. బీజేపీగా అవతరించింది. పేరు మా రింది, ప్రజలను ఏమార్చింది, తన విధానాలను ఆ తర్వాత అదే కార్యక్రమాన్ని రామజన్మభూమితో కొనసాగించి అధికారంలోకి వచ్చింది. ప్రస్తుతం అయోధ్యలో రాముని ప్రాణ ప్రతిష్ట అంకం పూర్తయింది. ఇక మధురలో కృష్ణ దేవాలయం. ఇతర దేవాలయాలపై దృష్టి సారించింది. నిరంతరం ప్రజలను మత ఉద్వేగాల వైపు మరలించి ఓట్లు దండుకునే కార్యక్రమాన్నే బీజేపీ పెట్టుకున్నది. మత విశ్వాసాలు మనిషి వ్యక్తిగతానికి సంబంధించినవి. అందులో ఎవరి విశ్వాసాలు వారివి. ఎవరి మతం వారిది. పరమత సహనం పాటిస్తూ అందరినీ కలపుకు పోయేదే రాజనీతి. రాజకీయాలు లౌకికత్వానికి సంబంధించినవి. వర్తమానంలో రాజకీయాలలో మతం ప్రధానపాత్ర వహించే విధంగా బీజేపీ తన ఎత్తుగడలను కొనసాగిస్తున్నది.

ఇప్పుడు రామ జన్మభూమి, రామాలయం వంటి అంశాలను తీసుకువచ్చి ప్రజలను మభ్యపెడుతున్నది. రామాలయాలు దేశమంతటా ఉన్నాయి. రాముడు ప్రజా సంక్షేమాన్ని కాంక్షించాడని చెప్తారు. అధికారాన్ని వదిలి అన్న మాట కోసం అడవులకు పోయాడట. రామనామం జపించే పాలకులు చేసిన వాగ్దానాలను వుట్టి మీదకు ఎక్కించారు. నిత్యావసర ధరలను ఆకాశమార్గం పట్టించారు. సగటు పేద ప్రజలు కొనలేని ధరలతో కొట్టుమిట్టాడుతున్నారు. ఇది లౌకిక రాజ్యంలో ప్రజల్ని తిరోగమనం వైపు నడిపిం చడమే తప్ప వేరే కాదు.

పదేండ్ల కిందట అధికారంలోకి రాకముందు మోడీ మాయమాటల్ని ప్రజలు విశ్వసించారు. రైల్వేస్టేషన్‌లో ఛాయ్ అమ్మినవాడు, వెనుకబడిన వర్గాల నుంచి వచ్చిన నాయకుడు, అందరి కష్టసుఖాలు తెలిసిన వ్యక్తిగా పరిచయం చేసుకుని ప్రచారార్భటం ప్రారంభిస్తే అందరూ గుడ్డిగా నమ్మారు. బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చారు. నాడు మోడీ చేసిన వాగ్దానాలేమిటి? నేడు చేస్తున్నదేమిటి? పేద ప్రజల, కార్మికవర్గ సంక్షేమం, బడుగు బలహీనవర్గాల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాడు. రైతాంగం పట్ల దోపిడీ విధానాన్ని అనుసరించే చట్టాలను సంస్కరణల పేరుతో తీసుకొచ్చాడు. కార్మిక వర్గాలను పరిశ్రమల అధిపతులకు, పెట్టుబడిదారులకు బానిసలుగా మార్చే చేదు మందులాంటి సంస్కరణలకు చక్కెరపూత పూశాడు. యాజమాన్యాలకు కార్మికవర్గం బానిసలుగా పనిచేయాలని తిరోగమన సంస్కరణలను ముందుకు తెచ్చాడు. పెట్టుబడిదారుల లాభాలకు, వారి సంతోషం కోసం ఏదైనా చేయటానికి సిద్ధంగా ఉన్నామని మోడీ ఎప్పటికప్పుడు తన విధానాల ద్వారా తెలియజేస్తూనే ఉన్నాడు. కోట్లాది టన్నుల ధాన్యం గోడౌన్లలో మూలుగుతున్నా పేద ప్రజలకు పంచడానికి చేతులు రావడం లేదు కానీ అదానీ, అంబానీ లాంటి వాళ్లకు లక్షల కోట్ల రూపాయలను రాయితీలిచ్చి ప్రోత్సహిస్తున్నాడు. ఈ దేశంలో నిరుద్యోగాన్ని వేగంగా పెంచి పోషిస్తున్నది ఎవరు, మోడీ కాదా? ఏటా రెండు కోట్ల ఉద్యోగాల కల్పన ఊసెక్కడ? ఉన్న ఉద్యోగాలను ఊడ పీకడమే కాకుండా పకోడీలు అమ్ముకోవడం కూడా ఉద్యోగమే అని సెలవిచ్చిన మోడీ ఈ దేశానికి 'మహానాయకుడు', 'విశ్వగురు'!

ప్రభుత్వరంగ పరిశ్రమలను టోకుగా అమ్మడం, బడా పెట్టుబడిదారులకు కట్టబెట్టడం లాంటి చర్యలను నిస్సిగ్గుగా కొనసాగిస్తున్నారు బీజేపీ పాలకులు. ఎన్ని ప్రభుత్వరంగ సంస్థలను అమ్మింది, బడా పెట్టుబడిదారులకు కట్టబెట్టితే ఎంత సంపద వచ్చిందో గర్వంగా చెపుకుంటున్నారు. కానీ దేశాన్ని దోచుకుని సరిహద్దులు దాటించిన బడా పారిశ్రామిక వేత్తలను గురించి ఒక్కరోజు కూడా మాట్లాడరు! ప్రజల సొమ్మును పట్టపగలే నిర్భయంగా కోట్లది రూపాయలను బ్యాంకు రుణాల ద్వారా దోచుకున్న విజయ్ మాల్యా, నీరవ్ మోడీ లాంటి వాళ్ళ గురించి అసలు తెలియనట్లు వ్యవహరిస్తున్నారు. నేడు ప్రపంచంలో మూడవ కుబేరుడిగా గౌతమ్ అదానీ ఎదిగాడు! ఇది ఎవరి చలువ అందరికీ తెలిసిందే? కేవలం మోడీ ఈ పదేండ్ల పాలనలో ఆదానీలు, అంబానీలు, టాటా బిర్లాలు కోట్లాది ఆస్తులను సంపాదిస్తూ వేగంగా ప్రపంచ కుబేరులను దాటిపోతున్నారు. దగాపడ్డ ప్రజల ఆదాయం, ప్రజల జీవనస్థితులు మాత్రం మారడం లేదు? కారణం, ప్రజల్ని మతం చుట్టూ భ్రమింపజేయడం ద్వారా అంతర్గత వ్యూహాల్ని అమలు చేస్తున్నాడు. నూటికి ఎనభై శాతం వ్యవసాయ దేశంలో రైతుల బతుకులు చితికిపోతున్నా వారి గురించి పట్టించుకోరు. ప్రజల సంపద బడా కోట్లాధిపతుల చేతుల్లోకి వెళ్లిపోతున్నా మాట్లాడే పరిస్థితిలో ఎవరూలేరు. ప్రభుత్వ సంస్థలు నిర్వీర్యమైతున్నాయి, క్షీణిస్తున్నాయి, సంబంధమే లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. బీజేపీ పాలనలో ఒక్క ప్రభుత్వ రంగ సంస్థను కూడా ఏర్పాటు చేయలేదు. గత ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన ప్రజలకు ఉపయోగమైన దేశానికి ప్రయోజన కరమైన బడా ప్రభుత్వరంగ సంస్థలను ఒక్కొక్కటిగా నిర్వీర్యం చేసి అమ్మి వేయడం లేదా అంగడి దుకాణాలు ఇచ్చి నట్లు కిరాయిలకు ఇవ్వడం చేస్తున్నది. అదేమంటే 'నష్టాలు వస్తున్నాయి, దేశం భరించలేదు. పేదరికాన్ని తీర్చడం కోసమే తాకట్టు పెడుతున్నట్టు' చెబుతున్నది. పేదలను ఏమార్చుతున్నది. ఇది దేశానికి నష్టదాయకమే కాదు, భవిష్యత్తుకు శాపం!

ప్రభుత్వ పరిశ్రమలను కొనుగోలు చేసిన పెట్టుబడిదారులు మాత్రం ఒకటికి పదింతలు కోట్లాది రూపాయలను ఆర్జిస్తున్నారు, డొల్ల కంపెనీలు సృష్టించి దోచుకుంటున్నారు. మన పాలకులు ఆనందపడుతున్నారు. ఇదే అసలైన అభివృద్ధిగా చెబుతున్నారు. మరి హిండెన్‌బర్గ్ అదానీ అసలు స్వరూపాన్ని బయటపెడితే దీనిపై స్పందించరేం? హిండెన్‌బర్గ్ అదానీ డొల్ల కంపెనీల బండారం బయట పెట్టడంతో 17.8 ట్రిలియన్ డాలర్లు అంటే 218 బిలియన్ డాలర్ల అక్రమాలు బయటపడ్డాయి. అదే సమయంలో 150 బిలియన్ డాలర్లు అదాని కంపెనీలలో మదుపు పెట్టిన సంస్థలు నష్టాలను చూశాయి. షేర్లు పడిపోయాయి. ఎల్‌ఐసి, బ్యాంకులు అదాని సంస్థల్లో రూ. 81,347 కోట్లు పెట్టుబడులు పెట్టాయి. హిండెన్‌బర్గ్ అదాని సంస్థల అసలు స్వరూపం బయటపడటంతో స్టాక్ మార్కెట్లపై విపరీత ప్రభావం



> **మోడీ అధికారంలోకి వచ్చినప్పటికీ రూ.65 లక్షల కోట్ల అప్పు ఉన్న మన దేశం నేడు రూ.కోటి 55 లక్షల కోట్లకు ఎగబాకింది. ఇది మోడీ పాలనలో జరిగిన అప్పుల అభివృద్ధి. ఒకవైపు దేశం ప్రగతి వైపు దూసుకుపోతుందని చెప్తున్న ప్రభుత్వం అప్పులలో రాకెట్ కంటే వేగంగా ముందుకు తీసుకుపోతున్నది. అప్పులు తీర్చడానికే కేంద్ర బడ్జెట్‌లో అధిక శాతం వడ్డీలకు కట్టాల్సి వస్తుంది. దేశ ప్రజలపై ఎక్కడలేని భారాలను మోపుతున్నది. దేశ ఆదాయ వనరుగా ఈ దేశంలోని కోట్లాది పేద ప్రజలను సరుకుగా మార్చుకుంటున్నది.**

చూపింది. ఈ దేశంలో కోట్లాది మంది ప్రజల సొమ్మును కొంత మంది పెట్టుబడిదారులు దోచుకోవడం, దాచుకోవడం పరి పాటిగా పెట్టుకున్నారు. అందుకు మోడీ అండదండలే అన్నది దేశ పౌరులకు తెలియంది కాదు? ఓ వైపు పన్ను ఎగవేతలు, మరో వైపు భారీ కుంభకోణాలు విజృంభిస్తుంటే వాటి నియంత్రణలో


> **కోట్లాది టన్నుల ధాన్యం గోడౌన్లలో మూలుగుతున్నా పేద ప్రజలకు పంచడానికి చేతులు రావడం లేదు కానీ అదానీ, అంబానీ లాంటి వాళ్లకు లక్షల కోట్ల రూపాయలను రాయితీలిచ్చి ప్రోత్సహిస్తున్నాడు. ఈ దేశంలో నిరుద్యోగాన్ని వేగంగా పెంచి పోషిస్తున్నది ఎవరు, మోడీ కాదా? ఏటా రెండు కోట్ల ఉద్యోగాల కల్పన ఊసెక్కడ? ఉన్న ఉద్యోగాలను ఊడ పీకడమే కాకుండా పకోడీలు అమ్ముకోవడం కూడా ఉద్యోగమే అని సెలవిచ్చిన మోడీ ఈ దేశానికి 'మహానాయకుడు', 'విశ్వగురు'!**

కేంద్ర పాలకులు విఫలమయ్యారు?

మోడీ అధికారంలోకి వచ్చినప్పటికీ రూ.65 లక్షల కోట్ల అప్పు ఉన్న మన దేశం నేడు రూ.కోటి 55 లక్షల కోట్లకు ఎగబాకింది. ఇది మోడీ పాలనలో జరిగిన అప్పుల అభివృద్ధి. ఒకవైపు దేశం ప్రగతి వైపు దూసుకుపోతుందని చెప్తున్న ప్రభుత్వం అప్పులలో రాకెట్ కంటే వేగంగా ముందుకు తీసుకుపోతున్నది. అప్పులు తీర్చడానికే కేంద్ర బడ్జెట్‌లో అధిక శాతం వడ్డీలకు కట్టాల్సి వస్తుంది. దేశ ప్రజలపై ఎక్కడలేని భారాలను మోపుతున్నది. దేశ ఆదాయవనరుగా ఈ దేశంలోని కోట్లాది పేద ప్రజలను సరుకుగా మార్చుకుంటున్నది. దుడ్డుకర్ర లాంటి వివిధ పథకాలు తెచ్చి మధ్య తరగతి, పేద వర్గాల నడ్డి విరగ్గొడుతున్నది. అధికారం చేతిలో ఉందని తనకు తోచిన విధంగా వెనక ముందు చూడకుండా తిరోగమన విధానాలు అమలు చేస్తున్నది. చేసిన సంస్కరణలు మేలు చేయకపోగా వికటించినా వారిపై భారాలు వేసే సాహసకృత్యాలను మాత్రం వీడటం లేదంటే ఇంతకన్నా ఆశ్చర్యం ఉంటుందా? పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ వంటి చర్యలు దేశాన్ని కుదేలు చేసింది అందరికీ తెలిసిందే. ఆ తర్వాత వచ్చిన కరోనా మహమ్మారిని అరికట్టకపోవడంతో కోట్లాదిమంది అసంఘటిత కార్మికుల ఉసురు తీసింది. రెక్కాడితే గాని డొక్కాడని కార్మికుల, పేద ప్రజలను దిక్కులేని వాళ్ళని చేసింది. పెద్ద నోట్ల రద్దు ద్వారా ఈ దేశంలో ఉన్న నల్లధనం బయటికి తీసుకొస్తామని జబ్బలు చరిచింది. విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని తీసుకొచ్చి ఈ దేశంలోని ప్రజల జన్‌ధన్ ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తామని చెప్పింది. ఇదిగో అదిగో అంటూ ఉపన్యాసాలిస్తుంటే ఆశ తీరని ప్రజలు బ్యాంకు ఖాతాలను మళ్లీమళ్లీ తెరచి చూసుకోవాల్సి వచ్చింది. తీరా చూస్తే అది పులి కాదు గోముఖ వ్యాఘ్రమని తెలిసింది. ఒక్క రూపాయి నల్లధనం కూడా బయట పెట్టలేకపోయింది? దీనికి తోడు ధరల్ని అదుపు చేయడంలో, నిరుద్యోగం రూపు మాపటంలో, వాగ్దానాలను నిలబెట్టుకోవడంలో మోడీ పూర్తిగా విఫలమయ్యాడు.

ఈ పదేండ్ల మోడీ పాలనలో మాటలు కోటలు దాటుతున్నా పేదోడి పొయ్యిపై నాలుగు మెతుకులు ఉడకడం లేదు. ఇది దేశంలో ప్రస్తుతం కొనసాగుతున్న మోడీ(రామ) రాజ్యం. ఈ రాజ్యంలో ప్రజాసంక్షేమం లేకపోగా పైగా పేదల బాధలు రెట్టింపయ్యాయి. నిరుద్యోగం, ధరల పెరుగుదల తీవ్రస్థాయికి చేరుకున్నాయి. కార్మికుల హక్కులు కాలరాయబడ్డాయి. చదువు, వైద్యం కార్పొరేట్ల పరమైంది. మోడీ ప్రభుత్వం వైఫల్యాలను ఎప్పటికప్పుడు సీపీఐ(ఎం) లాంటి వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు ప్రతిఘటిస్తున్నా, ప్రజల దృష్టిని మరల్చేందుకు బీజేపీ-ఆరెస్సెస్ వేస్తున్న పాచికే రామరాజ్యం. ఇదే పదేండ్లలో మోడీ దేశానికి చేసిన నిస్వార్థ నిర్వాకం. రానున్న లోక్‌సభ ఎన్ని కలకు సమయం ఆసన్నమైన సందర్భంగా మోడీ వేస్తున్న అడుగులను ఈ దేశంలోని యువకులు, ప్రజలు, విద్యా వంతులు, మేధావులు గమనించాలి. భిన్నత్వంలో ఏకత్వానికి చిహ్నమైన భారత లౌకికత్వాన్ని ఓటు ద్వారా బలపరచాలి. అంధ విశ్వాసాల నుండి దేశాన్ని కాపాడుకోవాలి.

అగ్రరాజ్యాల అత్యాశే.. యుద్ధాల కన్నతల్లి!



పాతూరి వెంకటేశ్వరరావు
9849081889

వర్థమాన దేశాల వనరులు కొల్లగొట్టేందుకు పోటీ పడుతుంటాయ్ సామ్రాజ్యవాద దేశాలు! తొండ ముదిరి ఊసరవెల్లి అయినట్టు, పెట్టుబడిదారీ దేశాలు ముదిరి సామ్రాజ్యవాద దేశాలుగా విస్తరిస్తయ్. అవి ఆయాదేశాల్లో తమకనుకూల ప్రభుత్వాలను బలపరుస్తూ అడ్డం తిరిగిన వాటిని కూల్చేస్తుంటయ్. ఈ విద్యలో ప్రపంచ అగ్ర రాజ్యంగా అమెరికా ఆరి తేరింది! "ప్రజాస్వామ్యం- స్వేచ్ఛ- పౌరహక్కులను, పవిత్రాశయాలు"గా తమ రాజ్యాంగంలో పొందు పరుచుకున్న అమెరికా, కారు చౌకగా చమురును కొల్లగొట్టేందుకు అరబ్బు దేశాల్లో మాత్రం తమ చెప్పుచేతల్లో వుండే నియంతలను ప్రోత్సహిస్తూ, అక్కడి ప్రజాస్వామ్య ఉద్యమాల అణచివేతకు తోడ్పడుతోంది. తాను పెంచిపోషించిన నియంతలు, ఉగ్రవాదులైనా సరే, తమకడ్డం తిరిగినప్పుడు తన మీడియా ద్వారా వాళ్ళను భయంకర నియంతలుగా, లోకకంటకులుగా డప్పు వేయించి మరీ హతమారుస్తుంది.

ఉదాహరణకు గతంలో అఫ్ఘానిస్తాన్ నుండి సోవియట్ సైన్యాన్ని వెళ్ళగొట్టేందుకు బిన్‌లాడెన్ నేతృత్వంలోని ఆల్‌ఖైదాను పెంచి పోషించిన అమెరికా, అది బూమరాంగై తన - 'ట్విన్ టవర్స్'ను కూల్చాక, వేటాడి మరీ బిన్ లాడెన్‌ను హతమార్చింది! అలాగే ఆయా దేశాల్లో తమ వ్యతిరేక ప్రభుత్వాలను కూల్చటానికైనా-సదరు నేతలను హతమార్చటానికైనా వెనకాడదు అమెరికా! అందుకు తననడ్డుకునే ఐ.రా.స తీర్మానాలనైనా, మెజారిటీ దేశాల అభ్యంతరాలను సైతం, అంతర్జాతీయ న్యాయస్థానాల తీర్పులనైనా, తన 'వీటో' పవర్‌తో జాసేదేవ్ అంటుంది అమెరికా!

"ఒక దేశంపై బలప్రయోగానికి, మరో దేశం సొంత నిర్ణయంతోనే కాదు, ఆదేశపు ప్రతిపక్ష పార్టీ సహాయాన్ని అర్థించినా సరే ఆదేశంపై సైనిక జోక్యానికి పూనుకోరాదు" అని నికరాగువా కేసులో తీర్పునిచ్చింది అంతర్జాతీయ న్యాయస్థానం!. 'మానవ జోక్యపు హక్కు' అను అమెరికా కూటమి వాదన ఐ.రా.స. చట్టాలకు విరుద్ధమంటూ జీ77 దేశాల విదేశాంగ మంత్రుల సమావేశం ఇరాక్‌లో, లిబియాలో ఆ దేశ జోక్యాన్ని తిరస్కరించింది. తన చమురు దోపిడీని అడ్డుకుంటున్న ఇరాక్ నేత సద్దాం హుస్సేన్‌ను ఉరి తీయించింది. లిబియా నేత గడాఫీని కిరాతకంగా హతమార్చింది అమెరికా! క్యూబా నేత కాస్ట్రో లాంటి నేతలపై పలు హత్యాయత్నాలు చేయించింది. అమెరికా అరాచకాలలో ఇవి మచ్చుకు మాత్రమే.

ప్రపంచ చమురు నిక్షేపాలలో 66 శాతం మధ్యధరా ప్రాంతంలోనే ఉన్నాయి. పాలస్తీనాతో సహా అక్కడున్నవన్నీ అరబ్ దేశాలే! రెండో ప్రపంచయుద్ధంలో హిట్లర్ మారణకాండ ఐరోపా దేశాల దాడులతో తల్లడిల్లిన యూదులు, తమ పూర్వుల నివాసమంటూ పాలస్తీనాకు చేరి అరబ్బుల ఆశ్రయం పొందారు. బ్రిటన్ సహకారంతో పాలస్తీ నాలోనే ఒక పక్క యూదు రాజ్యాన్ని (ఇజ్రాయిల్) నెలకొల్పుకున్నారు. దేశ దేశాలలో సంపాదించిన ధనరాశులతో అరబ్బుల వేలాది సాగుభూములను కారు చౌకగా కొన్నారు. క్రమంగా ఐరాస నిర్దేశించిన సరిహద్దులను గూడ అతిక్రమించి, ఐరాస పరిధిలోని జెరూసలేంతో సహ 78శాతం పాలస్తీనాను దురాక్రమించింది ఇజ్రాయిల్. తమకు ఆశ్రయమిచ్చిన లక్షలాది అరబ్బులను పారదోలి, చంపి, మిగిలిన వాళ్ళను గాజా, వెస్ట్‌బ్యాంక్ పట్టణాలలో కుక్కి, వాళ్ల బయటకు రాకుండా 'ఐరన్‌డోమ్' అను స్మార్ట్ కంచెను నిర్మించింది ఇజ్రాయిల్.

హమాస్ ఉగ్రవాదులను హతమార్చటమే తమ లక్ష్యమంటూ గాజాపై నిర్విరామంగా బాంబుల వర్షం కురి పిస్తున్నది ఇజ్రాయిల్. నాడు హిట్లర్ మారణకాండకు బలైన యూదుల వారసులు నేడు అంతకన్నా కిరాతకంగా అర బ్బులను హతమార్చటం శోచనీయం! ఇప్పటికి 25 వేలమంది చనిపోగా 65వేల మంది క్షతగాత్రులయ్యారు. ఐరాసలో ఇజ్రాయిల్ అమానవీయ మారణకాండను, అమెరికా దాని మిత్రులు- 40 దేశాలు సమర్థించినా 153 దేశాలు తీవ్రంగా ఖండించాయి. 'గాజాపై ఇజ్రాయిల్ దారుణ మారణకాండను, మధ్యంతర ఉత్తరువుల ద్వారా నైనా ఆపించవలసింది"గా దక్షిణాఫ్రికా అంతర్జాతీయ న్యాయస్థానాన్ని ఆశ్రయించటం అభినందనీయం! అయినాసరే ఉగ్రవాదుల నిర్మూలన కోసమే-ఇజ్రాయిల్‌ను సమర్థిస్తున్నామంటూ సమర్థించుకుంటున్నది అమెరికా! అదే నిజమైతే 1990లోనే ఐక్యరాజ్యసమితి 'టెర్రరిస్టు స్టేట్'గా ప్రకటించిన ఇజ్రాయిల్‌కు ఆర్థిక, ఆయుధ సహాయం ఎందుకు చేస్తున్నది అమెరికా? పైకి ఏం చెప్పినా అరబ్ దేశాల మధ్యలో తమ మిత్రదేశం ఇజ్రాయిల్ బలపడితే, అది తమ చమురు దోపిడీకి రహదారిగా తోడ్పడుతుదన్నదే అమెరికా ఆంతర్యం!



హమాస్ ఉగ్రవాదులను హతమార్చటానికే తమ దాడులంటున్నా గాజా, వెస్ట్ బ్యాంకులలోని అరబ్బులను హతమార్చి, పారదోలి, పాలస్తీనాను సంపూర్ణ యూదు రాజ్యంగా రూపొందించుకోవాలన్నదే ఇజ్రాయిల్ ఆంతర్యం! అమెరికా, ఇజ్రాయిల్ అరాచకాలే ఈ వాస్తవాన్ని వెల్లడిస్తున్నాయి. యాసర్ అరాఫత్ వగైరాల శాంతియుత పోరాటాలను కూడా అణిచేసింది ఇజ్రాయిల్. ఐరాస, అంతర్జాతీయ న్యాయస్థానాలు సైతం అసహాయులుగా మారిన నేపథ్యంలోనే, తలుపులన్నీ మూసికొట్టబోతే పిల్లే, పులిలా తిరగబడిన విధంగా పాలస్తీనా విముక్తి కోసం తిరగబడ్డ గెరిల్లా యోధుల బృందమే హమాస్. వారినే ఐదు వేలమందిని బంధించి చిత్రహింసలకు గురి చేస్తున్నది ఇజ్రాయిల్. వాళ్లను విడిపించుకునే లక్ష్యంతోనే, గత అక్టోబర్‌లో ఇజ్రాయిల్‌పై మెరుపుదాడికి దిగింది హమాస్! 252మంది ఇజ్రాయిల్ ఉన్నతాధికారులను బందీలుగా గాజాకు తీసుకెళ్లి 'మా మిలిటెంట్లను వదలండి, మీ అధికారులను వదులుతాం' అని హెచ్చరికలు జారీచేసింది! అందుకు నిరాకరించిన ఇజ్రాయిల్ అమెరికా అండతో గాజాపై బాంబుల వర్షం కురిపిస్తూనే వుంది!

ఇప్పటిదాకా 'ఇది పాలస్తీనా సమస్య గదా, మనకెందుకు అనుకుంటున్న తక్కిన అరబ్ దేశాలకూ జ్ఞానోదయమౌతున్న సంకేతాలు వెలువడుతున్నాయి. ఇజ్రాయిల్ మారణకాండకు తాళలేక, గాజా, వెస్ట్ బ్యాంకుల అరబ్బులు తమదేశాలను ఆశ్రయిస్తే, అది తమకు మరింత భారమైతుందనీ, పాలస్తీనీయులను పారదోలుతున్నారని మిన్నకుంటే, రేపు తమదేశాలపైనా ఇజ్రాయిల్ దాడికి ఊతమిచ్చినట్లు కాగలదనీ, అరబ్ దేశాల మధ్యగల షియా, సున్నీ జాతి వైరాలను కూడా అమెరికా సొమ్ము జేసుకుంటుందనీ, ఇజ్రాయిల్ దూకుడుని ఇలాగే కొనసాగనిస్తే అది అరబ్ దేశాలన్నింటికీ ప్రమాదమనీ, టెర్రరిస్ట్ ఇజ్రాయిల్‌ను టెర్రరిజంతోనైనా అడ్డుకట్ట వేయాలన్న ఆలోచనలు అరబ్బులలో తలెత్తాయి. అందుకే ఎర్ర సముద్రం గుండా వెళ్ళే అమెరికా, దాని మిత్రదేశాల రవాణా నౌకలపై 'ఎమెన్'కు చెందిన హౌతీలు- నేరుగా ఇజ్రాయిల్‌పై, లెబనాన్‌కు చెందిన హిజ్బుల్లాలు క్షిపణి దాడులకు పూనుకున్నారు. సౌదీ, ఇరాన్‌లు తదితరాల జాతి వైరాలను విస్మరించి సత్సంబంధాలను- నెలకొల్పుకున్నాయి. ఇరాన్ కూడా ఇజ్రాయిల్ నిఘా కేం ద్రాల మీద తదనుకూల ఉగ్రవాద శిబిరాల మీద సర్జికల్ దాడులు చేసింది! ప్రతిగా అమెరికా, బ్రిటన్‌లు హౌతీల మీద విమాన దాడులు చేశాయి. ఈ పరిస్థితులు మూడో యుద్ధానికి దారితీస్తాయా అన్న భయాన్ని కలిగిస్తున్నాయి.

"ప్రపంచంలో అత్యధికులు, ఆకలి- అవిద్య- అనారోగ్యాలతో అలమటిస్తున్నారు. అందుకు మూలమైన ఆర్థిక అసమానతలు, వాటిని కొనసాగించటానికి అణిచివేతలూ, కొనసాగినంత కాలం, యుద్ధాల మారణకాండ, ఉగ్రవాదుల విధ్వంసకాండ కొనసాగుతూనే ఉంటాయ్" అన్నారు కారల్ మార్క్స్! అగ్ర రాజ్యాధి నేతలతో సహా ప్రపంచ దేశాధినేతలంతా ఆలోచించాల్సింది యుద్ధాల గురించి కాదు, తక్షణం పాలస్తీనాకు విముక్తిని కలిగించే దిశగా ఆలోచించాలి. ఆర్థిక అసమానతలను- తగ్గించి, ప్రజలందరి కూడు, గూడు, బట్ట, విద్య వైద్యాలకు భరోసా కలిగించేం దుకు సహకరించాలి. తద్వారానే ప్రపంచ శాంతి ప్రజ్వరిల్లుతుంది! ప్రపంచాధినేతలారా ఇదే.. ఇదే.. ఇదే... సార్వత్రిక సత్యం.

> **"ప్రపంచంలో అత్యధికులు, ఆకలి- అవిద్య- అనారోగ్యాలతో అలమటిస్తున్నారు. అందుకు మూలమైన ఆర్థిక అసమానతలు, వాటిని కొనసాగించటానికి అణిచివేతలూ, కొనసాగినంత కాలం, యుద్ధాల మారణకాండ, ఉగ్ర వాదుల విధ్వంసకాండ కొనసాగుతూనే ఉంటాయ్" అన్నారు కారల్ మార్క్స్! అగ్రరాజ్యాధినేతలతో సహా ప్రపంచ దేశాధినేతలంతా ఆలోచించాల్సింది యుద్ధాల గురించి కాదు, తక్షణం పాలస్తీనాకు విముక్తిని కలిగించే దిశగా ఆలోచిం చాలి. ఆర్థిక అసమానతలను - తగ్గించి, ప్రజలందరి కూడు, గూడు, బట్ట, విద్య, వైద్యాలకు భరోసా కలిగించేందుకు సహకరించాలి. తద్వారానే ప్రపంచ శాంతి ప్రజ్వరిల్లుతుంది!**

రైతుల సమస్యలు పరిష్కరించండి

సీఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణ రైతు సంఘం వినతి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా తెలంగాణ రైతు సంఘం సీఎం రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపింది. రైతుల సమస్యలపై కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పొందుపరిచిన అంశాలకు ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించాలని ఆ సంఘం నేతలు ఆయనకు వినతిపత్రం సమర్పించారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వెంకట్రాములతో కూడిన బృందం సీఎంకు వినతిపత్రం సమర్పించింది.

వినతిపత్రంలోని ముఖ్యాంశాలివే....

- భూమాతగా ప్రకటించిన ధరణిలో 20 లోపాలున్నట్టు గత బీఆర్ఎస్ క్యాబినెట్ కమిటీ అంగీకరించింది. వాటిని సరిచేయడానికి మీసేవ ద్వారా ప్రతి రైతు రూ.1650 చెల్లించారు. మొత్తం రాష్ట్రంలో 4.5 లక్షల మంది డబ్బులు చెల్లించి ధరఖాస్తులు పెట్టుకున్నారు. భూసమస్యల్లో నెలకొన్న లోపాలను సవరించి అందరికి పాస్‌పుస్తకాలు ఇవ్వాలి. సమగ్ర భూసర్వే నిర్వహించాలి.
- రెవెన్యూ రికార్డులలో కౌలు రైతుల పేర్లు, వాస్తవ సాగుదారుల పేర్లు నమోదు చేయుటకు రెవెన్యూ రిజిస్టర్‌లో 'కాలం'ను ఏర్పాటు చేయాలి. వారి పేర్లు నమోదు చేయాలి. 2011 కౌలు చట్టాన్ని అమలు చేయాలి.
- గత రాష్ట్ర ప్రభుత్వం 'కేంద్ర పీఎం ఫసల్ బీమా' నుంచి వైదొలిగింది. అప్పటినుంచి రాష్ట్ర రైతులకు ఎలాంటి పరిహారం రావడం లేదు. రాష్ట్రంలో ఏటా రూ.5వేల కోట్ల విలువగల పంటలు దెబ్బతింటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని రూపొందించాలి. ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి నష్టపోయిన పంటలకు పరిహారం అందేలా చూడాలి.
- ప్రాధాన్యతాక్రమంలో సాగునీటి పథకాలను పూర్తి చేయాలి. ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్, మెదక్ ఉమ్మడి జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టులను రానున్న ఏడాదిలో పూర్తి చేసేందుకు బడ్జెట్ కేటాయింపులు చేయాలి. కాళేశ్వరం సహా భారీ ప్రాజెక్టుల్లో జరిగిన అవినీతిని 'హైకోర్టు జడ్జి' ద్వారా విచారణ జరిపించాలి. సబ్సిడీపై మైక్రోఇరిగేషన్ (డ్రిప్, స్పింక్లర్) పథకాలు అమలు చేయాలి. ఐడీసీ నిర్వహణలోని లిఫ్ట్ పథకాలను రిపేర్లు చేయాలి.
- గతంలో విడుదల చేసిన 69 జీవో ప్రకారం నారాయణపేట, కోడంగల్ ఎత్తిపోతల పథకాన్ని విస్తరించి పూర్తి చేయాలి.
- రాష్ట్రంలో వ్యవస్థీకృతంగా కల్తీ విత్తనాల వ్యాపారం సాగుతున్నది. ఏటా 4, 5 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతింటున్నాయి. కల్తీ విత్తనాలను పట్టుకోవడమే తప్ప నేరస్తులపై ఎలాంటి శిక్షలు లేవు. నష్టపోయిన రైతులకు పరిహారాలు లేవు. 'రాష్ట్ర విత్తన చట్టా'న్ని రూపొందించాలి. కల్తీ విత్తన సంస్థల కంపెనీలను రద్దు చేయాలి.
- గత రెండేండ్లుగా వ్యవసాయ శాఖ 'యాక్షన్ ప్లాన్' ప్రకటన లేదు. వెంటనే వార్షిక ప్రణాళికలు ప్రకటించాలి. ఆయా ప్రాంతాల భూసారాన్ని బట్టి, రాష్ట్ర అవసరాలను బట్టి పంటల విధానాన్ని రూపొందించాలి.
- మ్యానిఫెస్టోలో ప్రకటించిన రైతు బరోసా పథకం ప్రకారం ఎకరాకు రూ.15,000 చొప్పున రైతుల ఖాతాలో వేయాలి. వానాకాలం పంటలకు సంబంధించి ఎకరాకు రూ.7,500 చొప్పున వాస్తవ సాగుదారులందరికి వారి ఖాతాలలో జమ చేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన పంటల మద్దతు ధరలు, బోనస్ అమలు చేయాలి. లీటర్ పాలకు రూ.5 బోనస్ అమలుకు నిధులు విడుదల చేయాలి. రూ.2 లక్షల లోపు రుణాలను ఏకకాలంలో మాఫీ చేయాలి. ఆర్‌బీఐ ప్రకారం 18 శాతం 'స్కేల్ ఆఫ్ ఫైనాన్స్' ప్రకారం రుణాలు ఇవ్వాలి. అటవీ హక్కుల చట్టం2006 ప్రకారం అర్హులకు హక్కు పత్రాలు ఇవ్వాలి. మూసివేసిన చెరుకు ఫ్యాక్టరీలను తెరిపించుటకు చర్యలు ప్రారంభించాలి.

'పెండింగ్ పాల బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోండి'

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

విజయ డెయిరీ రైతులకు ఇవ్వాల్సిన పెండింగ్ బిల్లులను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్, నాయకులు రామకృష్ణారెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఈమేరకు మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో వారు సీఎంకు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో 25.82 లక్షల కుటుంబాలు పశుపోషణపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నాయని పేర్కొన్నారు. విజయ డెయిరీ రైతులకు మూడు దఫాల పాల బిల్లులు చెల్లించాల్సి ఉందని తెలిపారు. రాష్ట్రంలో పాల ఉత్పత్తిని పెంచేందుకు పాడి రైతులను ప్రోత్సహించేందుకు లీటరుకు రూ.5 రూపాయలు ఇన్సెంటివ్ (ప్రోత్సాహం) ఇస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ హామీనిచ్చిందని గుర్తు చేశారు. గత

బిగ్ సిలో గెలాక్సీ ఎస్24 సిరీస్ స్మార్ట్‌ఫోన్లు

నవతెలంగాణ - హైదరాబాద్



సామ్‌సంగ్ బ్రాండ్ ఇటీవల ఆవిష్కరించిన గెలాక్సీ ఎస్ 24 సీరిస్ స్మార్ట్‌ఫోన్లను అందుబాటులోకి తెచ్చినట్లు ప్రముఖ మొబైల్ రిటైల్ చెయిన్ బిగ్ 'సి' వెల్లడించింది. బుధవారం మాదాపూర్‌లో ని బిగ్ సి స్టోర్‌లో ఈ స్మార్ట్‌ఫోన్‌లను సంస్థ ఆ సిఎండి యం బాలు చౌదరీ, డైరెక్టర్లు, సినీతారా మృణాల్ ఠాకూర్, సామ్‌సంగ్ ప్రతినిధులు విడుదల చేశారు.

ఈ సందర్భం గా బాలు చౌదరీ మాట్లాడుతూ.. గెలాక్సీ ఎస్24 అల్ట్రా, ఎస్24 ప్లస్‌లు అత్యంత అధునాతనమైన ఫీచర్లను కలిగి ఉన్నాయన్నారు. తెలుగు రాష్ట్రా ల్లో నెంబర్ వన్‌గా పేరొందిన బిగ్‌సి లో కొనుగోళ్లకు అందుబాటులో ఉన్నా యన్నారు.

ఈ కొత్త ఫోన్లను ఆవిష్కరించడం తనకు ఎంతో సంతోషంగా ఉందని నటీ మృణాల్ ఠాకూర్ పేర్కొన్నారు.

స్టాఫ్ నర్సు ఉద్యోగ నియామకాల్లో వికలాంగులకు మొండి చెయ్యి

- నాలుగు శాతం రిజర్వేషన్ అమలు ఎక్కడ?
- 2016 ఆర్‌పీడీ చట్టానికి భిన్నంగా ఉద్యోగ నియామకాలు
- సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిన వికలాంగ అభ్యర్థులకు
- వెంటనే నియామక పత్రాలివ్వాలి :ఎన్‌పీఆర్‌డీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసిన స్టాఫ్ నర్సుల ఉద్యోగ నియామకల్లో వికలాంగులకు మొండి చెయ్యి చూపిందనీ, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తయినప్పటికీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇవ్వకుండా వికలాంగులను మోసం చేసిందని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర కమిటీ విమర్శించింది. ఈ మేరకు బుధవారం ఆ వేదిక రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకట్, రాష్ట్ర కార్యదర్శి యం అడివయ్య, రాష్ట్ర కోశాధికారి ఆర్ వెంకటేష్ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ అస్పత్రులు, గురుకుల విద్యాలయాలు, వివిధ ప్రభుత్వ సంస్థల్లో 7,094 స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన పరీక్షలో అనేక మంది వికలాంగులు ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం ప్రభుత్వం భర్తీ చేస్తున్న ఉద్యోగ నియామకాల్లో వికలాంగులకు నాలుగు శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సి ఉన్నప్పటికీ వారితో వాటిని భర్తీ చేయలేదని తెలిపారు. ప్రభుత్వం భర్తీ చేస్తున్న 7,094 పోస్టుల్లో నాలుగు శాతం అంటే 283 పోస్టులను వికలాంగులతో భర్తీ చేయాలి. కానీ 138 పోస్టులను శారీరక వికలాంగులు లేరనే కారణంతో భర్తీ చేయకుండా మోసం చేసిందని విమర్శించారు. అనేక మంది సర్టిఫికెట్లు పరిశీలించిన తర్వాత విడుదల చేసిన ఫైనల్ లిస్టులో పేర్లు వచ్చినప్పటికీ నియామక పత్రాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే వికలాంగులకు నాలుగు శాతం రిజర్వేషన్‌ను స్టాఫ్ నర్సు ఉద్యోగ నియామకాల్లో అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. వికలాంగురాలికి ఉద్యోగమిస్తూ మొదటి సంతకం చేశామని గొప్పగా ప్రకటించిన సీఎం స్టాఫ్ నర్సు ఉద్యోగ నియామకాల్లో వికలాంగులకు నాలుగు శాతం రిజర్వేషన్‌ను ఎందుకు అమలు చేయలేదో చెప్పాలని కోరారు. అర్హత సాధించిన ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి పీపుల్స్ ప్లాజాలో గ్రాండ్ నర్సరీ మేళా



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ ఈవెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గురువారం నుంచి హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజాలో గ్రాండ్ నర్సరీ మేళాను నిర్వహిస్తున్నారు. బుధవారం సంస్థ నిర్వాహకులు ఖాలిద్ మేళా ప్రాంగణలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఫిబ్రవరి 5 వరకు జరగనున్న ఎగ్జిబిషన్‌ను వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ప్రారంభిస్తారని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సాగనున్న పూల మొక్కల ప్రదర్శనలో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 160 స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. రూ.3 నుంచి రూ.16 లక్షల వరకు విలువ గల అరుదైన మొక్కలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

తెల్లరేషన్ కార్డు లేకున్నా ఆరోగ్యశ్రీని అమలు చేయండి

- ప్రభుత్వ నిర్ణయాన్ని ఆహ్వానిస్తున్నా
- సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ నర్సిరెడ్డి లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెల్లరేషన్ కార్డుతో సంబంధం లేకుండా రాజీవ్ ఆరోగ్యశ్రీని అమలు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని ఆహ్వానిస్తున్నానని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి తెలిపారు. ఈ విధానాన్ని వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డికి బుధవారం ఆయన లేఖ రాశారు. ఆరోగ్యశ్రీ పథకానికి, తెల్లరేషన్‌కార్డుకు ఉన్న సంబంధాన్ని తొలగించడాన్ని స్వాగతిస్తున్నానని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 77 శాతానికిపైగా తెల్లరేషన్ కార్డుదారులున్నారని వివరించారు. అభయహస్తం దరఖాస్తులో ఎనిమిది లక్షలకుపైగా కొత్త రేషన్‌కార్డులు కావాలంటూ దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఆ కార్డులున్న కొంత మంది రూపాయికి కిలోబియ్యం తీసుకుని వాటిని కిలో పది రూపాయలకు మధ్య దళారీలకు అమ్ముకుంటున్నారని పేర్కొన్నారు. కొన్ని కుటుంబాలు దారిద్ర్యరేఖకు పైన ఉన్నప్పటికీ తెల్లరేషన్ కార్డును కలిగి ఉన్నారని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీని తెల్లరేషన్ కార్డుతో సంబంధం లేకుండా అమలు చేయడం వల్ల ఆ కార్డు కావాలనే కుటుంబాల సంఖ్య తగ్గే అవకాశముందని వివరించారు.

టీఎస్ఆర్‌జేసీ సెట్‌కు దరఖాస్తులు షురూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణలోని గురుకుల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశ పరీక్ష - 2024కు దరఖాస్తుల ప్రక్రియ మొదలైంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 35 గురుకుల జూనియర్ కళాశాలలు (15 బాలురు, 20 బాలికల కాలేజీలు) ఉండగా.. వీటిలో ఇంటర్ మొదటి సంవత్సరంలో సీట్ల భర్తీకి ఏప్రిల్ 21న పరీక్ష నిర్వహించనున్నారు. ప్రస్తుతం పదోతరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షకు జనవరి 31 నుంచి మార్చి 16 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు రుసుం రూ.200. ఈ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ, రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు. ఈ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ కోర్సుల్లో సీట్లను భర్తీ చేస్తారు. 2024 పరీక్ష ఏప్రిల్ 21న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరగనుంది. ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సీట్ల కేటాయింపునకు తొలి కౌన్సెలింగ్ మే నెలలో నిర్వహించే అవకాశం ఉంది.

కేంద్ర బడ్జెట్‌పై గంపెడాశలు

- జాతీయ హోదా కోసం విజ్ఞప్తులు
- మోడీతో లబ్ధి చేకూరేనా ?

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులకు భారీ నిధులు అవసరమని ఇటీవల సర్కారు చేస్తున్న సమీక్షలు స్పష్టం చేస్తున్నాయి. ఇటు ముఖ్యమంత్రి, అటు సాగునీటి శాఖ మంత్రితోపాటు బడ్జెట్ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి సైతం ఆయా శాఖలపై అవగాహనకు అధ్యయనం చేస్తున్నారు. ఉన్నతాధికారులతో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను దృష్టిలో పెట్టుకుని కొంచెం లోతుగానే సమీక్షలు చేపడుతున్నారు. ప్రధానంగా సాగునీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖకు సంబంధించి అన్ని ప్రాజెక్టులపై కాస్త గట్టిగానే దృష్టిసారించారు. అలాగే కాళేశ్వరం ప్రాజెక్టు ప్రాంతాన్ని స్వయంగా దాదాపు మంత్రులంతా సందర్శించారు. అనంతరం ప్రధాని మోడీ, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు అర్జీలు పెట్టారు. స్వయంగా కలిశారు. తెలంగాణలోని ఆయా ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇవ్వాలని కోరారు. ఇటు కాలేశ్వరం సాగునీటి ప్రాజెక్టుకు నిటిఅయోగ్ చెప్పినా గతంలో మోడీ సర్కారు నిధులు ఇవ్వలేదు. ఆ ప్రతిపాదనను చెత్తబుట్టలో పడేసింది. తాజాగా రేవంత్ సర్కారు సైతం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు జాతీయో హోదా కోసం వినతిపత్రం అందజేసింది. అయితే కేంద్రమంత్రి షెకావత్ దేశంలో ఏ రాష్ట్రంలోని ప్రాజెక్టుకూ జాతీయ హోదా ఇవ్వలేదనీ, అన్ని కేంద్ర ప్రభుత్వ పథకాల కిందే ఇస్తున్నామని దాటేశారు. గత సంవత్సరం డిసెంబరులో పక్కనున్న బీజేపీ ఏలుబడిలోని కర్నాటక ప్రభుత్వానికి నిధులు భారీగా మంజూరు చేశారు. ఆ రాష్ట్రంలోని అప్పర్‌భద్ర ప్రాజెక్టుకు కేంద్రం రూ.5300 కోట్లు కేటాయించింది. అదే తెలంగాణకు ఒట్టిచేయి చూపింది. ఇదిలావుండగా రాష్ట్రంలోని చిన్న, చితకా ప్రాజెక్టులు పూర్తి కావడానికి దాదాపు రూ. లక్ష కోట్లు అవసరమని సాగునీటి శాఖ ఉన్నతాధికారులు తేల్చారు. ఈ మేరకు ప్రభుత్వానికి గతంలో నివేదిక ఇచ్చారు. గత రెండేండ్లుగా కేంద్రం నుంచి ఒక్కపైసా సాగునీటి ప్రాజెక్టుల కోసం రాలేదు.

నోటీసులు నాకు కాదు.. కోమటిరెడ్డికి పంపండి

మాణిక్ ఠాకుర్‌కు ఎక్స్ వేదికగా కేటీఆర్ కౌంటర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ కాంగ్రెస్ మాజీ ఇన్‌చార్జి మాణికం ఠాకూర్‌కు కేటీఆర్ ఎక్స్ వేదికగా కౌంటర్ ఇచ్చారు. సిరిసిల్ల సభలో చేసిన వ్యాఖ్యలపై పరువు నష్టం దావా వేస్తానని ఆయన పంపిన నోటీసులపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటుగా స్పందించారు. "మాణికంఠాకూర్ అయోమయంలో ఉన్నారు. మీకు రూ. 50 కోట్లు ఇచ్చి రేవంత్ రెడ్డి పీసీసీ పదవి కొనుక్కున్నారని కాంగ్రెస్ నాయకులు, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి బహిరంగంగా చెప్పిన మాట పెద్ద ఎత్తున మీడియాలో వచ్చింది. అదే విషయం తాను ప్రస్తావించాను. తాను చేసిన రూ. 50 కోట్ల లంచం వ్యాఖ్యలపై వివరణ కూడా ఇవ్వలేదు. మీరు పంపే పరువు నష్టం నోటీసులు కోమటిరెడ్డి వెంకటరెడ్డికి పంపిస్తే బాగుంటుంది. నా చిరునామాకు కాకుండా మీ ప్రభుత్వంలో మంత్రిగా సచివాలయంలో కూర్చున్న ఆయన కార్యాలయానికి పంపించండి" అని కేటీఆర్ సూచించారు. కాగా ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి.

ఏఈవో డైరీ ఆవిష్కరించిన మంత్రి తుమ్మల



నవలెంగాణబ్యూరో-హైదరాబాద్

వ్యవసాయ విస్తరణాధికారుల (ఏఈవో) సంఘం రూపొందించిన 'డైరీ 2004' వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఈవోలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో డైరీ ఆవిష్కరించిన తర్వాత వారి సమస్యలపై చర్చించారు. ఏఈవో సమస్యలను ప్రభుత్వంతో చర్చించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీఎన్‌జీవో జనరల్ సెక్రటరీ జగదీశ్వర్, ఏఈవో రాష్ట్ర అధ్యక్షులు డి. శ్రీనివాసగౌడ్, కార్యదర్శి కె. సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రాల్లో ఇంటర్నేషనల్ స్కూల్స్

ప్రయివేటు విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ

- విద్యాశాఖపై సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో 2024-25 వార్షిక బడ్జెట్‌కు సంబంధించి విద్యాశాఖ రూపొందించిన ప్రతిపాదనలపై మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి అధికారులతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా విద్యాశాఖలో అమలవుతున్న పథకాలు, నిర్వహణ గురించి అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమల్లో భాగంగా ప్రతి మండలంలో ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నామన్నారు. దీనికి కావల్సిన భూములను గుర్తించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామనీ, విద్యా బోధన, వసతుల కల్పన గురించి విద్య శాఖ ఉన్నతాధికారులు అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని కోరారు. ప్రయివేటుకు దీటుగా ప్రభుత్వ యూనివర్శిటీల్లో ఉపాధి కోర్సులను తీసుకురావాలని సూచించారు. యూనివర్శిటీల్లో చదువు పూర్తిచేసుకొని వచ్చినవారు ఉద్యోగాలు పొందే విధంగా కోర్సులు ఉండాలన్నారు. ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో యూనివర్సిటీల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అనుమతులు లేకుండా కొన్ని ప్రయివేటు యూనివర్సిటీలు అడ్మిషన్లు ఇచ్చి విద్యార్థుల భవితవ్యాన్ని ప్రశ్నార్థకం చేసిన వారిపై ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. ఇంటర్మీడియేట్ బోర్డు మార్గ దర్శకాలు, నిబంధనల ప్రకారం విద్య సంస్థల నిర్వహణ ఉండే విధంగా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. నిబంధనలు పాటించని కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలనీ, రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ విద్యా సంస్థలను తనిఖీలు చేసి నివేదిక ఇవ్వాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు వీలుగా ఆ భవనాలను విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి అప్పగించాలని ఆదేశించారు. బాసర ట్రిబుల్ ఐటి నిర్వహణను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు అసంతృప్తికి గల కారణాలపై ఆరా తీసారు. రాష్ట్రంలో 84 శాతం జనాభా ఉన్న నిరుపేదలను దృష్టిలో పెట్టుకొని పాలసీలు రూపొందించాలని అన్నారు. కనీస వసతులు లేని ప్రయివేటు విద్యా సంస్థల్లో భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారనీ, వాటిని నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాల నుంచి యూనివర్సిటీల వరకు ఫీజుల నియంత్రణకు ముసాయిదా సిద్ధం చేస్తే, బలమైన చట్టం తెచ్చేందుకు ప్రభుత్వం పరిశీలిస్తుందని చెప్పారు. ఆరు నెలల క్రితం ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ క్లాస్ గదుల ఏర్పాటుకు టెండర్లు పిలిచినా, ఇప్పటికీ ఎందుకు పూర్తికాలేదని ప్రశ్నించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, విద్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, కమిషనర్ దేవసేన, ఆర్థికశాఖ జాయింట్ సెక్రటరీ హరిత, డిప్యూటి సీఎం సెక్రటరీ కృష్ణభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు యోగా తరగతులు!

- వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలు
- ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో సీఎస్ఆర్ నిధుల వినియోగం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులకు యోగా తరగతులు బోధించాలని సర్కారు యోచిస్తున్నది. ఇందుకోసం యోగా టీచర్లను నియమించాలని భావిస్తున్నది. విద్యార్థులు చదువుతో పాటు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండేలా తీర్చిదిద్దనుంది. ముఖ్యంగా పరీక్షల సమయంలో ఒత్తిడిని తట్టుకోలేక కొందరు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. చదువంటే పరీక్షలు, మార్కులే కాదనీ, జీవితం ఎంతో విలువైనదని విద్యార్థులకు అర్థమయ్యేలా యోగా టీచర్లు బోధిస్తారు. ఇంకోవైపు ఒత్తిడిని దూరం చేసి ప్రశాంతంగా, ఆనందంగా ఎలా ఉండాలనేది చెప్తారు. మానసిక ఒత్తిడిని జయించేలా యోగా తరగతులను నిర్వహించాలని ఇంటర్ బోర్డు అధికారులు భావిస్తున్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులను వినియోగించాలని సమాలోచన చేస్తున్నారు. అందులో భాగంగానే వచ్చే విద్యాసంవత్సరం నుంచి యోగా టీచర్లను నియమించే అవకాశమున్నది. ఇంకోవైపు ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అటెండర్లు, స్కావెంజర్లు, వాచ్‌మెన్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించాలని భావిస్తున్నది.

విద్యాంజలి పథకంలో ప్రజలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు భాగస్వాములవుతారు. అందులో భాగంగానే పలు కార్పొరేట్ సంస్థలు ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మౌలిక వసతుల కల్పనతోపాటు నాలు గో తరగతి ఉద్యోగులను నియమిం చేందుకు ముందుకొచ్చినట్టు సమాచారం.

సీఎం రేవంత్‌రెడ్డి సభకు పకడ్బందీ ఏర్పాట్లు

మంత్రి సీతక్క



నవతెలంగాణ- ఇంద్రవెల్లి

ఈ నెల 2న ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌కు రానున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని గ్రామీణాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖా మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, కలెక్టర్ రాహుల్ రాజ్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ ఖుష్బూ గుప్తాతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగా నాగోబా ఆలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా మెస్రం వంశీయులు ఆమెకు నాగోబా మోమెంటోను బహూకరించి శాలువాతో సన్మానించారు. ముఖ్య మంత్రి పర్యటన సందర్భంగా హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. దర్బార్ ఆవరణలో జరుగుతున్న గ్రౌండ్ చదును పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. దర్బార్ హాలులో ముఖ్యమంత్రితో పొదుపు సంఘం మహిళలతో ముఖాముఖి కార్యక్రమం ఉన్నందున ఆ దిశగా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇంద్రవెల్లిలోని అమరవీరుల స్థూపం వద్ద స్మృతి వనంతోపాటు వివిధ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి ఇక్కడి నుంచే శ్రీకారం చుట్టనున్నారని మంత్రి తెలిపారు. ఆనాడు జల్, జంగల్, జమీన్ కోసం అమరులైన ఇంద్రవెల్లి అమరవీరుల కుటుంబాలను ఆదుకోవడానికి ఉపాధి అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. మంత్రి వెంట ఎస్పీ గౌస్ ఆలం, శిక్షణ అసిస్టెంట్ కలెక్టర్ వికాస్ మెహతో, ఈఈలు భీంరావ్, నర్సయ్య డిడి దిలీప్‌కుమార్, సర్పంచ్ రేణుకానాగ్‌నాథ్, చైర్మెన్ మెస్రం తుకారాం, పటేల్ వెంకట్‌రావ్, నాయకులు నరేష్ జాదవ్ ఉన్నారు.

సీఎం సభ వద్ద టిమ్స్ నర్సుల ఆందోళన

- అరెస్టు చేసిన పోలీసులు

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలంటూ టిమ్స్ ఆస్పత్రి కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు సీఎం సభ జరుగుతున్న స్టేడియం బయట నిరసన చేపట్టారు. దాంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు. కొత్తగా ఎంపికైన స్టాఫ్ నర్సులకు ఉద్యోగ నియామక పత్రాలు అందించేందుకు హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ఎల్బీ స్టేడియంలో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి సభ జరిగింది. ఈ క్రమంలో గచ్చిబౌలిలోని టిమ్స్ ఆస్పత్రికి చెందిన కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు స్టేడియం ఎదుట రోడ్డుపై బైటాయించి, ప్లకార్డులు పట్టుకుని ఆందోళన చేపట్టారు. దాంతో కాసేపు ఉద్రిక్తత పరిస్థితి నెలకొనగా.. పోలీసులు నర్సులను అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా పలువురు నర్సులు మాట్లాడుతూ.. ఎంతో కాలం నుంచి కాంట్రాక్టు విధానంలో పని చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు 20 శాతం వెయిటేజ్ మార్కులు కలిపి ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

మాజీ సీఎస్ సోమేష్‌కు రైతు బంధు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మాజీ సీఎస్ సోమేష్ కుమార్ సాగు చేయని భూములకు రైతుబంధు తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి సోషల్ మీడియాలో అనేక కథనాలు వినిపిస్తున్నాయి. భూముల కొనుగోలులో క్విడ్ ప్రోకో జరిగినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 2018లో ఫార్మాసిటీ ప్రాంతమైన కొత్తపల్లిలో 25 ఎకరాల భూమిని నలుగురి దగ్గరి నుంచి తన భార్య పేరిట ఆయన కొనుగోలు చేశారు. అందుకుగానూ ఎకరానికి రూ.2 లక్షలు చెల్లించారు. తక్కువ ధరకు కొనుగోలు చేసిన ఈ భూముల ద్వారా సోమేశ్ కుమార్ లక్షల్లో రైతుబంధు తీసుకున్నట్లు తెలుస్తోంది. కొత్తపల్లి విలేజ్‌లో కొనుగోలు చేసిన భూమిపై ఇప్పటివరకు రూ.14 లక్షలకు పైగా రైతుబంధు తీసుకున్నట్టు సమాచారం. ఇదిలా ఉంటే రెరా కార్యదర్శిగా పని చేసిన శివబాలకృష్ణ అక్రమాస్తుల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది.

మున్సిపల్ అవిశ్వాసాలపై అప్పీళ్లు డిస్మిస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జనగాం, ఆలేరు, దమ్మాయిగూడ, సదాశివపేట, అందోల్ జోగిపేట, జవహర్‌నగర్ మున్సిపల్ చైర్మెన్‌లపై అవిశ్వాస తీర్మానాలను సవాల్ చేసిన పిటిషన్లను హైకోర్టు డిస్మిస్ చేసింది. గతంలో సింగిల్ జడ్జి ఆదేశాల జారీకి నిరాకరించడంతో ఆ చైర్మెన్లు అప్పీల్ పిటిషన్లు వేశారు. వీటిని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరథే, జస్టిస్ అనిల్ కుమార్‌లతో కూడిన డివిజన్ బెంచ్ కొట్టేసింది. ఆ మున్సిపాల్టీల చైర్‌పర్సన్లుగా చేసిన పి.జయమ్మ, జమున, జి. మల్లయ్య, ఎం.కావ్య, వి శంకరయ్య, వి ప్రణీత వేసిన అప్పీళ్లపై ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టం చేసింది. అవిశ్వాస అంశం మున్సిపల్ చట్టం-2019లో లేదనీ, ఆ చట్టంలోని సెక్షన్ 37లో అవిశ్వాస తీర్మాన ఆమోదానికి ఆస్కారం లేదని పిటిషనర్ల లాయర్లు వాదించారు. పాత మున్సిపల్ యాక్ట్‌లోని సెక్షన్ 48లో అందుకు సంబంధించిన వివరాలు ఉన్నాయన్నారు. ఇప్పుడున్న చట్ట ప్రకారం అవిశ్వాస అంశం లేదని హైకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పటికే అవిశ్వాస ప్రక్రియ పూర్తయ్యిందని ప్రభుత్వం చెప్పింది. వాదనల తర్వాత అప్పీళ్లను హైకోర్టు డిస్మిస్ చేసింది.

ప్రాజెక్టులపై విధానం లేని కేంద్రం

అక్కరకు రాని చుట్టం 'అపెక్స్' కౌన్సిల్

- ఎన్నికల సమయంలో జలశక్తిశాఖ హడావుడి !
- అప్పగింతపై నేడు కీలక భేటీ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలుగు రాష్ట్రాల ప్రాజెక్టులపై ప్రత్యేక విధానమంటూ లేని కేంద్రంలోని బీజేపీ సర్కారు స్థానికుల భావోద్వేగాలతో ఆడుకుంటున్నది. ప్రధానం గా ఎన్నికల సమయంలో ఈ తరహా చర్యలకు పాల్పడుతున్నది. తన వంది మాగదులకు మేలుచేయడానికి, తద్వారా తాను ప్రయోజనం పొందడానికి పావులు కదుపుతున్నది. తెలంగాణ ఎన్నికల ముందు కృష్ణా జలాలపై గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చి అప్పట్లో ఉన్న పార్టీకి మేలుచేసిందనే ఆరోపణలు, విమర్శలు వెల్లువెత్తాయి. అలాగే త్వరలో ఆంధ్రప్రదేశ్‌లోనూ అసెంబ్లీ ఎన్నికలతోపాటు తెలుగు రాష్ట్రాల్లో సాధారణ ఎన్నికలు జరగనుండటంతో ప్రాజెక్టుల అప్పగింత అంశాన్ని మళ్లీ వేగంగా ముందుకు తెస్తున్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. స్థానికంగా తలెత్తుతున్న పరిస్థితులను వాడుకుంటూ పార్లమెంటు ఎన్నికల్లో ఇటు తెలంగాణ, అటు ఏపీ నుంచి రాజకీయ ప్రయోజనం పొందాలనే తాపత్రయమే ఈ తంతుకు కారణమని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. నెల రోజుల్లో అటు శ్రీశైలం డ్యామ్, ఇటు నాగార్జున్‌సాగర్ డ్యామ్‌ను కృష్ణా నదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) పరిధిలోకి తెచ్చి రెండు రాష్ట్రాలకు నీటి విడుదల అధికారాలను తన చేతుల్లోకి తీసుకోవాలనే తలంపులో కేంద్రం ఉంది. ఈ విషయాలు తెలిసినా తెలంగాణలోని గత బీఆర్ఎస్ సర్కారు, ఏపీలోని ప్రస్తుత జగన్ ప్రభుత్వం ఆశించిన మేర స్పందించలేదనే విమర్శలు ఇప్పటికే ఉన్నాయి. తెలంగాణ తాజా సర్కారు ఇటీవల రాష్ట్రంలోని భారీ ప్రాజెక్టు కాళేశ్వరంతోపాటు అన్ని సాగునీటి పథకాలపై సమీక్షలు చేస్తున్నది. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు అందించే ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించింది. అలాగే కాళేశ్వరం నిర్మాణ పనుల్లో అవినీతి జరిగినట్టుగా రాజీవ్‌రతన్ నేతృత్వంలోని విజిలెన్స్ బృందం తేల్చినట్టు సమాచారం. దీనిపై రానున్న బడ్జెట్ సమావేశాల్లో సమగ్ర చర్చ జరిగే అవకాశాలు లేకపోలేదు. అలాగే గురువారం ప్రాజెక్టుల అప్పగింతపై కేఆర్ఎంబీ, తెలుగు రాష్ట్రాల ఇంజినీర్ ఇన్ చీఫ్(ఈఎన్సీ)ల మధ్య కీలక సమావేశం జరగనుంది. ఈసందర్భంగా కచ్చితంగా ప్రాజెక్టులు అప్పగించేలా నిర్ణయాలు తీసుకోవాలనీ, దీనికి గడువు సైతం పెట్టుకోవాలని ప్రధాని మోడీ నేతృత్వంలోని కేంద్ర జలశక్తి శాఖ ఆదేశించింది. కాగా రాష్ట్రాల్లో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. వచ్చే రెండు నెలల్లో సాధారణ ఎన్నికలు జరిగే అవకాశముండగా, తెలంగాణలో బీఆర్ఎస్ అధికారాన్ని కోల్పోయింది. ఇప్పుడు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణం, నిధుల ఖర్చు, ఆయకట్టు, ప్రయోజనం తదితర సమస్యలపై వరుస సమీక్షలు చేస్తున్నది. అవినీతి, అక్రమాలు జరిగితే అధికారులు, ప్రజాప్రతినిధులపై చర్యలకు వెనుకాడబోమని స్పష్టం చేసింది. అలాగే రేవంత్ సర్కారు మరో కీలక నిర్ణయం సైతం తీసుకుంది. సాగునీటి ప్రాజెక్టులపై అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామని ప్రకటించింది. అందులో వచ్చిన అభిప్రాయాలను సైతం స్వీకరించి, బడ్జెట్ సమావేశాల్లో చర్చకు అవకాశమిచ్చే వైపు సమాలోచనలు చేస్తున్నది. కృష్ణా జలాలపై గత ప్రభుత్వ విధానం, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు, ట్రిబ్యునళ్లు తదితర అంశాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. అయితే ప్రస్తుతం నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టు అప్పగింతపై జరగనున్న సమావేశంలో ఎలాంటి నిర్ణయం తీసుకునే అవకాశం లేకపోవచ్చని తెలిసింది. ఎన్నికల నేపథ్యంలో ఇందుకు ఇరు రాష్ట్రాలు అంగీకరించకపోవచ్చని సమాచారం. గత ఏడాది కాలంగా తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి, ఇతర ఉన్నతాధికారులతో కూడిన అపెక్స్ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించలేదు. అలాగే ఏడాది చివరాఖరులో కేఆర్ఎంబీ సమావేశాలు రెండు రోజుల పాటు జరిగాయి. తొలిరోజు ప్రాజెక్టులను అప్పగిస్తామని తెలంగాణ అధికారులు చెప్పినట్టు మీడియాలో రావడంతో రాజకీయవర్గాల్లో నిరసన వ్యక్తమైంది. దీంతో రెండో రోజు సమావేశానికి తెలంగాణ అధికారులు హాజరుకాలేదు. దాంతో అప్పగింత వ్యవహారం పెండింగ్‌లో పడింది. ఇదిలావుండగా సీఎం రేవంత్ సమక్షంలో ప్రాజెక్టుల అప్పగింతపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని అధికారులు చెప్పడం గమనార్హం. ఈ పరిస్థితుల్లో గురువారం జరిగే సమావేశం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే అంశంపై ఉత్కంఠ నెలకొంది.

ఆరు రోజులపాటు ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాలు..?

- ఫిబ్రవరి రెండో వారంలో నిర్వహణకు ఏర్పాట్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం గురువారం ప్రవేశపెట్టబోయే ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ఆధారంగా... రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇక్కడ అదే రీతిలో పద్దును ప్రవేశపెట్టనుంది. ఈనెల రెండో వారంలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాల నిర్వహణకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసినట్టు తెలిసింది. మొత్తం ఆరు రోజులపాటు వీటిని నిర్వహించనున్నారని సమాచారం. కేంద్ర ప్రభుత్వ ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయించే నిధులు, గ్రాంట్లు, ఆర్థిక సాయాలు, వెనుకబడిన జిల్లాలకు ఇచ్చే ప్యాకేజీలు తదితరాంశాలను పరిశీలించిన తర్వాత... రాష్ట్ర ప్రభుత్వం తన ఓటాన్ అకౌంట్‌కు తుది మెరుగులు దిద్దనుంది. ఇందుకోసం ఇప్పటికే అన్ని శాఖల నుంచి ప్రతిపాదనలను స్వీకరించిన ఆర్థిక శాఖ...పద్దుకు రూపకల్పన చేసే పనిలో నిమగ్నమైంది. బీఆర్ఎస్ సర్కారు హయాంలో తొలుత అప్పటి సీఎం కేసీఆర్, ఆ తర్వాత ఆర్థిక మంత్రుల హోదాల్లో ఈటల రాజేందర్, హరీశ్‌రావు పద్దులను ప్రవేశపెట్టిన సంగతి విదితమే. రేవంత్ సర్కారులో ఆర్థిక మంత్రిగా ఉన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఈసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. డిసెంబరులో నిర్వహించిన అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోని అప్పులు, విద్యుత్ రంగ స్థితిగతులపై శ్వేతపత్రాలను విడుదల చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం... వచ్చే సమావేశాల్లో సాగునీటి పారుదల శాఖపై మరో శ్వేతపత్రాన్ని సభలో ప్రవేశపెట్టనుంది. ఈ మేరకు ఇప్పటికే కసరత్తులు పూర్తి చేసినట్టు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

ప్రత్యేకపాలనపై స్టేకు హైకోర్టు నిరాకరణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రత్యేకపాలనపై స్టే విధించేందుకు హైకోర్టు నిరాకరించింది. ఎన్నికలు జరిగే వరకు తమనే పదవిలో ఉండేలా చూడాలన్న అభ్యర్థనను తోసిపుచ్చింది. అదే సమయంలో ఎన్నికలు నిర్వహించే అంశంపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. విచారణను వాయిదా వేస్తూ జస్టిస్ శరత్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

జనవరి 31తో తమ పదవీ కాలం ముగియనుందనీ, పంచాయతీలకు వెంటనే ఎన్నికలు నిర్వహించేలా ప్రభుత్వాన్ని, ఎస్ఈసీని ఆదేశించాలని కోరుతూ జనగాం జిల్లా కాంచనపల్లి, చెంగెర్ల, నిర్మల్ జిల్లా తల్వాడ, కరీంనగర్ జిల్లా నిజాయతీగూడెం సర్పంచులు విజయ, వేణుగోపాల్, అనిల్‌కుమార్, మురళీధర్ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఎన్నికలు జరిగే వరకు పాలనను తమకే పాలన అప్పగించాలనీ, ప్రత్యేక అధికారుల నియామకంపై స్టే ఇవ్వాలని సర్పంచ్‌ల న్యాయవాదులు బెంచ్‌ను కోరారు.

ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులు ఉండాలనీ, వాళ్లతోనే పాలన కొనసాగించాలని వాదించారు. ప్రత్యేకాధికారుల నియామకాలు చేపట్టకుండా ఆపాలని విన్నవించారు.

రాజ్యాంగంలోని 243ఇ, 243కె అధికరణాలకు విరుద్ధంగా ఎన్నికల సంఘ చర్యలు ఉన్నాయయనీ, పంచాయతీరాజ్ చట్టం-2018 రూల్స్‌ను అమలు చేయడంలేదని వాదించారు. సుప్రీంకోర్టు తీర్పును కూడా అమలు చేయలేదని హైకోర్టు దృష్టికి తీసుకొచ్చారు.

ఎన్నికల ప్రక్రియకు చర్యలు తీసుకోలేదనీ, ఓటర్ల జాబితాను కూడా సిద్ధం చేయలేదని తెలిపారు. ప్రత్యేకాధికారుల పాలనలోకి గ్రామ పంచాయతీలను తేవడానికి వీల్లేదని వాదించారు. వాదనల తర్వాత స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది.

ప్రతివాదులైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్, జనగాం, నిర్మల్, కరీంనగర్ జిల్లాల కలెక్టర్లతోపాటు పంచాయతీ కార్యదర్శులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది.

కాళేశ్వరంపై సర్కారుకు 'కాగ్' నివేదిక

- త్వరలో ఉభయసభల ముందుకు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టుపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ప్రాజెక్టు పనితీరుకు సంబంధించిన ఆడిట్ రిపోర్టును సర్కారుకు అందజేసినట్టు అకౌంటెంట్ జనరల్ తెలిపారు. వచ్చే శాసనసభతోపాటు మండలి సమావేశాల్లో ఈ కాగ్ నివేదిక ప్రవేశపెట్టనున్నారు. దీనిపై శాసనసభ్యులు ప్రశ్నోత్తరాల్లో ప్రశ్నించే అవకాశం లేకపోలేదు. భారీగా ఖర్చుపెట్టిన ఈ ప్రాజెక్టుపై ప్రభుత్వమే చర్చ పెట్టనుందనే సమాచారం. కాళేశ్వరం ప్రణాళిక, పనులు, అంచనా వ్యయం, అనుమతులు, ఆర్థిక వనరుల సమీకరణపై కాగ్ ఆడిట్ నిర్వహించిన సంగతి తెలిసిందే. పనుల పురోగతి, భూసేకరణ, సహాయ-పునరావాసం, డిజైన్ల ఖరారు, ఒప్పందాలు, ప్రణాళిక అంచనాల తయారీ, వృథా ఖర్చు, టెండరింగ్ విధానం, బిల్లుల చెల్లింపులపైనా ఆడిట్ చేపట్టారు. ప్రాజెక్టులపై కాగ్ లేవనెత్తిన అభ్యంతరాలు, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వివరణలతో కూడిన పూర్తి వివరాలను రిపోర్టులో కాగ్ పొందుపరిచింది. రానున్న ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాల్లో ఈ నివేదిక ఉభయసభల ముందుకు రానుంది . ఈ మేరకు బుధవారం ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో(పీఐబీ), హైదరాబాద్ శాఖ 'ఎక్స్'లో షేర్ చేసింది.

సీపీ సంచలన నిర్ణయం

- పంజాగుట్ట పోలీస్ సిబ్బంది బదిలీ
- గోపాలపురం సీఐ, ఎస్ఐ సస్పెన్షన్

నవతెలంగాణ- సిటీబ్యూరో

హైదరాబాద్ నగర చరిత్రలో ఎన్నడులేని విధంగా సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. కొద్ది రోజుల కిందట పంజాగుట్ట పరిధిలో జరిగిన బోధన్ మాజీ ఎమ్మెల్యే తనయుడి రోడ్డు ప్రమాదం వ్యవహారంలో పంజాగుట్ట ఎస్‌హెచ్‌వోతోపాటు పలువురిపై వేటు పడిన విషయం తెలిసింది. తాజాగా పంజాగుట్ట పోలీస్ స్టేషన్ సిబ్బందిని మొత్తాన్నీ బదిలీ చేశారు. స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్ఐల నుంచి హోంగార్డుల వరకు అందర్నీ ఒకేసారి 85 మందిని బదిలీ చేస్తూ బుధవారం సీపీ ఆదాశాలివ్వడం సంచలనం రేపింది. వారిని సిటీ ఆర్మ్‌డ్ రిజర్వు ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో కొత్తగా 82 మంది సిబ్బందిని నియమించారు. నగర పరిధిలోని వివిధ పోలీస్‌స్టేషన్లకు చెందిన సిబ్బందిని పంజాగుట్టకు బదిలీ చేశారు. ఇదిలా ఉండగా, గోపాలపురంలో స్థిరాస్తి వ్యాపారి హత్య కేసులో సరిగా విచారణ జరపలేదన్న కారణంగా సీఐ మురళీధర్, ఎస్ఐ దీక్షిత్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ సీపీ ఆదేశాలు జారీ చేశారు. సీపీ తీసుకుంటున్న కీలక నిర్ణయాలతో నగర కమిషనరేట్‌లో పోలీసులు మరింత అలర్ట్ అయ్యారు. విధుల్లో నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

సీపీ దూకుడు నిర్ణయాలు

సీపీగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి శ్రీనివాస్‌రెడ్డి దూకుడుగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. విధుల్లో అలసత్వం వహించిన సిబ్బందిపై వేటు వేస్తూ పోలీస్ శాఖలో మార్పులు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పనితీరును సమీక్షిస్తున్నారు. బషీర్‌బాగ్‌లోని పాత పోలీస్ కమిషనరేట్‌లో వారానికి రెండుసార్లు నగరవాసులను, ఫిర్యాదుదారులు, బాధితులను కలుస్తున్న సీపీ.. అర్జీలపై వెంటనే స్పందిస్తున్నారు. గత నెలలో అదనపు డిస్ట్రిక్ మెజిస్ట్రేట్ హోదాలో సీసీసీలోని కమిషనరేట్‌లో రౌడ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. బంజారాహిల్స్, కాలాపత్తర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వేర్వేరు కేసుల్లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మరికొన్ని కేసుల్లో తీర్పునిచ్చారు.



గాంధీ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బుధవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత పుష్పగుచ్ఛం అందజేసి, పూల మాలలు శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.

నవతెలంగాణ-బడంగ్‌పేట్

'పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలకు ఓటు రిజిస్ట్రేషన్ చేయించుకోండి'

నవతెలంగాణ - ధూల్ పేట్

త్వరలో జరగనున్న వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలకు ఈ మూడు జిల్లాలలోని డిగ్రీ కాలేజీ అధ్యాపకులు తమ పేర్లను ఫ్రెష్ గా నమోదు చేసుకోవాలని టీజీసీజీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కే. భాస్కర్ సూచించారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో తమ ఓటు వినియోగించుకోవాలన్నారు. సమర్థవంతమైన నాయకులను ఎన్నుకునేందుకు ఓటు ఆయుధమన్నారు. అందుకే ఓటును అర్హులైన ప్రతి ఒక్కరూ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. ఆన్లైన్‌లో అప్లై చేసుకుంటే లేట్ అవుతుందని, కొన్నిసార్లు పేర్లు మిస్ అవుతున్నాయన్నారు. ఇప్పటికైనా ఫిజికల్‌గా అప్లై చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం : ఎమ్మెల్యే



నవతెలంగాణ-బడంగ్‌పేట్

సీఎంఆర్ఎఫ్ పేదలకు ఓ వరం అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ పరిధిలోని శ్రీరాం కాలనీలో నివాసముంటున్న డి.సంగ్రామ్‌కు సీఎం సహాయ నిధి నుండి రూ.1లక్ష 50వేలు మంజూరు అయింది. ఈ మేరకు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి బుధవారం ఆ చెక్కును బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ పేదల సంక్షేమం కోసం అమలు చేసిన సీఎం సహాయ నిధి పథకం ఎంతో మంది పేదలకు మేలు చేస్తుందని హర్షం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించొద్దు



- జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేష్

నవతెలంగాణ- నాగోల్

ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, కార్యదర్శి సి.రమేష్ హెచ్చరించారు. రోడ్డు భద్రత మహోత్సవాల సందర్భంగా బుధవారం నాగోలులోని డ్రైవింగ్ ట్రాక్‌లో భారీ వాహనాల డ్రైవర్లకు, ఆయా పాఠశాలల, కళాశాలల బస్సుల డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి, హెల్మెట్ లేకుండా వాహనాన్ని నడపకూడదని సూచించారు. ప్రధానంగా స్కూల్ బస్సుల డ్రైవర్లు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు గమనిస్తూ.. పిల్లల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఆర్టీవో సురేష్ రెడ్డి మాట్లాడుతూ అధిక వేగంతో వాహనాలను నడపకూడదన్నారు. అనంతరం రిటైర్డ్ ఆర్టీవో జైపాల్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి.. డ్రైవర్లకు రోడ్డు భద్రతలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా డాక్టర్ స్టాన్లీ జోన్స్, వారి బృందం సదస్సుకు హాజరైన డ్రైవర్లకు ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఎస్ శ్రీనివాస్, జి.ఆర్ రాజు, కే.రవీందర్ రెడ్డి సీతల్ చౌహన్, సి.స్వప్న, రఘుకుమార్, మానస, అనిత, సత్యనారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ప్రమాదం



నవతెలంగాణ-హయత్ నగర్

ఆర్టీసీ డ్రైవర్ అప్రమత్తతతో భారీ ప్రమాదం తప్పిందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళ్లితే..బుధవారం దిల్‌సుఖ్ నగర్ డిపోకు చెందిన బస్సు నెం.TS07Z 4106 దిల్ సుఖ్ నగర్ నుండి చౌటుప్పల్ కు వెళ్లి, తిరిగి చౌటుప్పల్ నుండి దిల్ సుఖ్ నగర్ కు వెళుతుంది. హయత్ నగర్‌కు సమీపంలోని భాగ్యలత వద్ద విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్న ప్రదేశంలో రోడ్ రద్దీగా ఉన్న సమయంలో బస్సు కింద ఏదో రాయి తగిలిన శబ్దం రావటంతో డ్రైవర్ ధర్మయ్య వెంటనే అప్రమత్తతమై బ్రేకు వేవడానికి ప్రయత్నం చేయగా..అది పడడంలేదని గమనించి, వెంటనే హ్యాండ్ బ్రేకు వేసి చాకచక్యంగా బస్సును రోడ్‌కు ఎడమ వైపునకు తీసుకొనే క్రమంలో...ముందున్న వాహనాలకు వెనుకనుండి తగలడంతో ఒక కారు, ఒక ఆటో, మూడు ద్విచక్ర వాహనాలకు కొద్దిపాటి నష్టం జరిగింది. డ్రైవర్ చాకచక్యం వలన పెద్దగా నష్టం కలుగలేదు. పాదచారులకు కూడా స్వల్పమైన దెబ్బలు తగిలాయి. బ్రేకు పడకపోవటానికి కారణం రోడ్ రిపేర్లు జరుగుతున్న ప్రదేశంలోని రాళ్లు ఏవైనా ఎగిరి బ్రేకు పైపునను తాకి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రమాద ప్రదేశాన్ని రీజినల్ మేనేజర్ వరప్రసాద్, డిప్యూటీ రీజినల్ మేనేజర్లు జగన్, సుచరిత, డిపో మేనేజర్ హరి లు సందర్శించారు.

పదోన్నతి పొందిన అసోసియేట్ ప్రొఫెసర్లకు సన్మానం



నవతెలంగాణ-హయత్ నగర్

ప్రభుత్వ డిగ్రీ కళాశాల హయత్ నగర్‌లో అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి పొందిన వారిని బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.జోత్స్నప్రభ మాట్లాడుతూ జంతుశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ బి. శ్రీనివాస్ రెడ్డి, చరిత్ర అధ్యాపకులు డాక్టర్ ఎన్. మల్లేశం, వాణిజ్య శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఈ. శంకర్, గ్రంథపాలకులు అమరేందర్ రెడ్డిలను సన్మానించినట్లు తెలిపారు. ఎందరో విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దిన అధ్యాపకులు.. విద్యాసంబంధమైన పరీక్షలు, సెమినార్లు, పరిశోధనా పత్రాలను సమర్పించి, కష్టపడి సాధించి వృత్తిపరమైన విజయాలతో పదోన్నతి పొందడం వారి ప్రతిభకు నిదర్శనమని కొనియాడారు.

జీవితంలో మరిన్ని విజయాలు సాధించాలని, కళాశాలకు మరిన్ని సేవలను అందించాలి ఆకాంక్షించారు. డాక్టర్ సుబ్రహ్మణ్యం వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ సమావేశంలో డాక్టర్ కె.సురేష్, డాక్టర్ ఇంతియాజుద్దీన్ ఫారుఖీ, హృదయ రాజు, రాకేష్ భవాని, డాక్టర్ ధనరాజ్, డాక్టర్ రవీందర్, డాక్టర్ కిరీటం, డాక్టర్ గీతా నాయక్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెరటి కోళ్ల పెంపకంపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-హయత్ నగర్

పెరటి కోళ్ల పెంపకంపై హయత్ నగర్‌లోని కృషి విజ్ఞాన కేంద్రంలో క్రీడా కృషి విజ్ఞాన కేంద్రం సహకారం సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం సుగుణ మాల రైతు ఉత్పత్తి దారుల సంఘంతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా క్రీడా డైరెక్టర్ వినోద్ కుమార్ సింగ్ మాట్లాడుతూ వెనుక బడిన కులాలకు ఆర్థిక స్వలాంబన కోసం, అధిక ఆదాయం కోసం, పెరటి కోళ్ల పెంపకం వలన కలిగే ఆర్థిక ప్రయోజనాలను వివరించినట్లు తెలిపారు. ఎంపిక చేసిన రైతు కుటుంబాలకు కోడి పిల్లలు, దాణా, ఇతర ఉపకరణాలు అందజేసినట్టు తెలిపారు. అనంతరం కోడి పిల్లల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పెంచే విధానంపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్, కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త రమణ, విజయ్ కుమార్, రామకృష్ణ, శ్రీకృష్ణ, సంఘం డైరెక్టర్ లింగం, మల్లా రెడ్డి, అంజయ్య, నర్సింహ, మహిళా రైతులు పాల్గొన్నారు.



'దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేద్దాం'



నవతెలంగాణ - ఎల్బీనగర్

ఫిబ్రవరి 16న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఎల్బీనగర్ చౌరస్తాలో ఎల్బీనగర్ సర్కిల్ కన్వీనర్ అలేటి ఎల్లయ్య అధ్యక్షతన బుధవారం కార్మికులతో సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం చంద్రమోహన్ మాట్లాడుతూ కార్మికులు, వ్యవసాయ కూలీలు, రైతుల సమస్యలు పరిష్కారం తోపాటు సామాన్య ప్రజలపై పడుతున్న పన్నులు, అధిక ధరలను నియంత్రించాలని కోరారు. లేబర్ అడ్డా కార్మికులకు లేబర్ బోర్డు ద్వారా ఎలాంటి షరతులు లేకుండా లేబర్ ఇన్సూరెన్స్ కార్డు ఉచితంగా ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదేండ్లు పూర్తైనా ఎలాంటి సమస్యలను పరిష్కరించలేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ లేబర్ అడ్డా అధ్యక్షులు లాట్ల లక్ష్మణ్, నరసింహ, రాజు, చెన్నయ్య, బాలరాజు, సాలమ్మ, అలివేలు, లక్ష్మమ్మ లక్ష్మి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - చైతన్యపురి

సరూర్‌నగర్ సర్కిల్ ప్రాంతంలో సరూర్‌నగర్ లేబర్ అడ్డా భవన నిర్మాణ కార్మిక యూనియన్, కొత్తపేట ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ రవాణా రోడ్డు ఆటో ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మె వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఆటో ట్రాన్స్‌పోర్టు యూనియన్ అధ్యక్షులు కే రాములు, సరూర్ నగర్ సర్కిల్ సీఐటీయూ కన్వీనర్ మల్లెపాక వీరయ్య, సరూర్ నగర్ సర్కిల్ సీపీఎం పార్టీ కార్యదర్శి సిహెచ్ వెంకన్నలు మాట్లాడుతూ..బీజేపీ అవలంబిస్తున్న కార్పొరేట్, మతతత్వ విధానాలను ధిక్కరిస్తూ, ప్రతిఘటనకు పూనుకోవాలని కోరారు. ఫిబ్రవరి 16న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో కార్మిక, ఉద్యోగ, రైతు -వ్యవసాయ కార్మిక సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆటో ట్రాలీ డ్రైవర్స్, భవన నిర్మాణ కార్మిక యూనియన్ సీఐటీయూ సరూర్నగర్ లేబర్ అడ్డా అధ్యక్షులు సి నవీన్, వెంకన్న, శోభన్ బాబు, రంగారావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ - ధూల్‌పేట్ / సంతోష నగర్



కుల మతాల పేరుతో ప్రజలను ప్రలోభపెడుతూ బీజేపీ అధికారంలోకి రావడానికి కుట్రలు పన్నుతోందని సీఐటీయూ చాంద్రాయణగుట్ట జోన్ కార్యదర్శి ఎస్ కిషన్ మండిపడ్డారు. జోన్ కమిటీ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ఫిబ్రవరి 16న మోడీ విధానాలకు వ్యతిరేకంగా జరిగే దేశవ్యాప్త కార్మిక సమ్మె గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని బండ్లగూడ ఎమ్మార్వోకు బుధవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేండ్ల నుంచి మోడీ అధికారంలో బీజేపీ ప్రభుత్వం కార్మికుల, రైతుల, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ.. కార్పొరేట్, పెట్టుబడి దారి వర్గానికి లాభం చేకూరేలా చర్యలు తీసుకుంటున్నారని ఆరోపించారు. మతోన్మాద చర్యలకు పాల్పడుతూ, మతం పేరుతో రాజకీయలబ్ధి పొందుతుందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా మతాన్ని ఉపయోగించి అధికారంలోకి రావాలని అనేక విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు వీటిని గమనించి మోడీని గద్దెదించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జోన్ కమిటీ సభ్యులు ఏ కృష్ణ నాయక్, ఎండి గౌస్, హనీఫ్, వీరన్న, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - ధూల్ పేట్

రైతుల, కార్మికుల, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె



దించాలని సీఐటీయూ గోషామహల్ జోన్ కన్వీనర్ కె.జంగయ్య అన్నారు. ఫిబ్రవరి 16 న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ ముక్తార్ గంజ్ మహరాజ్ గంజ్ దాల్ మార్కెట్ సీఐటీయూ హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియూ హమాలీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.చెన్నయ్య, ఆర్. సాయిలు, కోశాధికారి జి. నర్సింహ, ఉపాధ్యక్షులు పి. కుర్మయ్య, కమిటీ సభ్యులు పి. బాల్ రాజు, సంతోష్, అశోక్, సిద్దులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరంలో కార్పొరేటర్ కళ్లెం



నవతెలంగాణ-హయత్ నగర్

హయత్ నగర్ డివిజన్‌లోని పద్మావతి కాలనీలో పల్లవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పల్లవి ఫౌండేషన్ స్వచ్ఛంద సేవ సంస్థకు అభినందనలు తెలియజేశారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎర్రవెలి సత్యనారాయణ, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో చేరువ కావాలి



చిలుక ఉపేందర్ రెడ్డి

నవతెలంగాణ - చైతన్యపురి

ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలకు చేరువ కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లో నూతన సర్కిల్ ఇనిస్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లుకు బుధవారం పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చిలుక ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో రాజీపడకుండా ఉండాలన్నారు. కాలనీలలో గస్తీని పెంచి, నిఘా వ్యవస్థను పటిష్టంగా ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిటెక్టివ్ ఇనిస్పెక్టర్ నాగరాజు, సురేష్, శ్రీనివాస్, వంగాల శ్రీకాంత్ రెడ్డి, ఇస్మాయిల్, మాచర్ల వరుణ్, కాళిదాసు, విప్లవ్ తదితరులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించి.. అభివృద్ధికి సహకరించండి



మున్సిపల్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్

నవతెలంగాణ-తుర్కయంజాల్

తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు ఇంటి పనులు, వ్యాపార లైసెన్సులను సకాలంలో చెల్లించి, అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ సిహెచ్ శ్రీకాంత్ కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులలో క్షేత్ర పర్యటన చేసి, పన్నులు వసూలవుతున్న తీరును బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్నులు చెల్లించడం ద్వారా మౌలిక వసతులు కల్పించడం సాధ్యపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇనిస్పెక్టర్లు, సానిటరీ ఇనిస్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపులు సంఘటితం కావాలి



- ఎంపీ వద్ది రాజు రవి చంద్ర

నవతెలంగాణ - చైతన్యపురి

మున్నూరు కాపులందరూ సంఘటితమై ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఎదగాలని ఎంపీ వద్ది రాజు రవి చంద్ర అన్నారు. మున్నూరు కాపు సంక్షేమ సంఘం దిల్‌సుఖ్‌నగర్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం బుధవారం ఏడుపాయల వనదుర్గ భవాని సన్నిధిలో చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీ వద్ది రాజు రవి చంద్ర హాజరై మాట్లాడారు. గౌరవ అధ్యక్షులుగా తోట రాజు పటేల్, అధ్యక్షులు ఆనంతుల నవీన్ పటేల్, ప్రధాన కార్యదర్శి చక్రం నాగరాజు, కోశాధికారి అక్కెనపల్లి వేణు గోపాల్, ఉపాధ్యక్షులు సత్యనారాయణ, కార్యదర్శి పుటం విజయందర్, కార్యనిర్వహన కార్యదర్శి మామిడి అశోక్, చిరంజీవి వెంకటేశ్వర్లు, సురేష్, ఎన్నం శ్రీనివాస్, బీరం శ్రీధర్, విజయ లక్ష్మి, లక్ష్మణ్, అనికేత్ తదితరులు ప్రమాణ స్వీకారం చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో త్రివేది, ఎక్క రమేష్, ఆనంతుల శ్రీనివాస్ పటేల్, ఆవుల రామ రావు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

'ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'



నవతెలంగాణ - ధూల్ పేట్

ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ చార్మినార్, బహదూర్‌పురా జోన్ ఆటో యూనియన్ అధ్యక్షులు మహమ్మద్ షాకిర్ అన్నారు. జోన్ నాయకులు బాబర్ ఖాన్, షేక్ యాకూబ్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ఈ కమిటీలో చార్మినార్, బహదూర్‌పురా జోన్ ఆటో యూనియన్ నూతన కమిటిని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులుగా మహమ్మద్ షాకిర్, ఉపాధ్యక్షులుగా మహమ్మద్ గౌస్ హుస్సేన్, మహమ్మద్ సిరాజ్, మహమ్మద్ ఇమ్రాన్ ఖాన్, కార్యదర్శిగా మహమ్మద్ హాజీ, సహాయ కార్యదర్శిగా సయ్యద్ గౌస్(చోటు) మహమ్మద్ షఫీ, సయ్యద్ జావిద్, మహమ్మద్ రహీం ట్రెజరర్ గా మొహమ్మద్ అహ్మద్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మహమ్మద్ గౌస్, మీర్ హామీద్ అలీ, సయ్యద్ బాషాలు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీకి జోన్ కన్వీనర్ అబ్దుల్ సత్తార్ శుభాకాంక్షలు తెలియజేశారు.

బల్దియా మీ సేవలను మర్చిపోదు..

పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ఘనంగా సన్మానం

నవతెలంగాణ-సిటీబ్యూరో



వివిధ హోదాల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన పలువురు జీహెచ్ఎంసీ ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో అడిషనల్ కమిషనర్ సరోజ, లేబర్ సెక్షన్ పర్సనల్ ఆఫీసర్ విజయ భాస్కర్ రెడ్డి, జాయింట్ కమిషనర్ జయంత్ రిటైర్మెంట్ అయిన 10 మంది సిబ్బందిని ఘనంగా సన్మానించారు. పదవీ విరమణ పొందినంత మాత్రాన జీవితంలో కృంగిపోవద్దని, శేషజీవితాన్ని కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని సూచించారు. మీ సేవలను బల్దియా ఎన్నటికీ మర్చిపోదన్నారు. పదవీ విరమణ పొందిన వారిలో చార్మినార్ సర్కిల్‌లో కామాటిగా పనిచేసిన సి.హెచ్.క్రిష్ణ, శంకర్, సోమయ్య, కామాటన్ గా పనిచేసిన అండాలు, ప్రధాన కార్యాలయంలో మజ్దూర్ గా పనిచేసిన బలరాం, ఖైరతాబాద్ సర్కిల్ లో శానిటరి జవాన్ పి.మురళి క్రిష్ణ, కామాటి గా పనిచేసిన జై కుమార్, కామాటన్‌గా పనిచేసిన వెంకటమ్మ, శేరిలింగంపల్లి సర్కిల్ లో స్వీపర్ గా పనిచేసిన ఎన్.బాల్ రాజ్, పి.హెచ్ వర్కర్ గా పనిచేసిన కె.లక్ష్మిలు ఉన్నారు.

కార్పెంటర్స్ అసోసియేషన్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-కాప్రా

కాప్రా కార్పెంటర్స్ అసోసియేషన్ 2024 ఏడాది క్యాలెండర్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పెంటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పోలోజు రాజుచారి, ప్రధాన కార్యదర్శి నరసి ంహ మూర్తి, కోశాధికారి సద్గురు చారి, అసోసియేషన్ వ్యవస్థాపకులు గజ్వేల్ వెంకటేష్ చారి, గౌరవా ధ్యక్షులు భార్గవ చారి నరసింహ చారి, సలహాదారుడు గగన్ కుమార్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తిరిగి ఇంటికి వచ్చిన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌లు బుధవారం పరామర్శించారు. -నవతెలంగాణ-కాప్రా

వీఎస్టీ కాలనీలో మురుగునీటి సమస్య పరిష్కారానికి రూ.10 లక్షలు మంజూరు



నవతెలంగాణ-కాప్రా

వీఎస్టీ కాలనీలో మురుగునీటి సమస్య పరిష్కారానికి రూ.10 లక్షలు మంజూరు చేసినట్టు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. వీఎస్టీ కాలనీలోని సత్యామెస్ వీధిలో భూగర్భ డ్రయినేజీ కోసం గతంలో వేసిన పైప్‌లైన్ చిన్న పైపులతో ఉండడంతో పెరిగిన జనాభాతో ఈ వీధిలో ఎప్పుడూ డ్రయినేజీ మురుగునీరు రోడ్లపై పొంగిపొర్లుతున్నది. ఈ సమస్యను పరిష్కరించడానికి రూ.10 లక్షల వ్యయంతో పాత పైప్‌లైన్ స్థానంలో కొత్త పైప్‌లైన్ ఏర్పాటు పనులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం సతీష్, మేనేజర్ సందీప్, బీఆర్ఎస్ కార్యకర్తలు, వీఎస్టీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

శాలివాహన సంఘం అధ్యక్షుడిగా పెద్దపల్లి శ్రీను



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ పరిధి లోని చిన్న చర్లపల్లి గాంధీనగ ర్ కాలనీకి చెందిన పెద్దపల్లి శ్రీను చర్లపల్లి శాలివాహన సంఘం అధ్యక్షుడిగా ఎన్నికై య్యారు. బుధవారం ఆయన స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘం అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు ఉన్నారు.

సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ను సన్మానించిన పత్తికుమార్



నవతెలంగాణ-కాప్రా

కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌ను కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షులు, కాప్రా డివిజన్ కాంగ్రెస్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ పత్తి కుమార్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలబొకే అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాప్రా డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగశేషు, సింగం కిరణ్, రామలింగం, నర్సింహ, విజయేందర్ పటేల్, నవీన్, తదితరులున్నారు.

మాజీ కర్పూర్ ఠాగూర్‌కు భారతరత్న ప్రకటించడం హర్షనీయం



- నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాలకృష్ణ
- చర్లపల్లిలో నాయీ బ్రాహ్మణ సేవా సంఘం సమావేశం

నవతెలంగాణ-కాప్రా

బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూర ఠాగూర్‌కు భారతరత్న ఇవ్వడం హర్షనీయమని నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాచమల్ల బాలకృష్ణ అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని కుషాయిగూడ, చర్లపల్లి డివిజన్‌లో నిర్వహించిన నాయీ బ్రాహ్మణ సేవా సంఘం సభ్యుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..భారతమాత ముద్దుబిడ్డ కర్పూర్ ఠాగూర్‌కు భారతరత్న ఇవ్వడం హర్షనీయమన్నారు. కర్పూర్‌కు భారతరత్న ఇవ్వడంతో నాయీ బ్రాహ్మణులు నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు తెలిపారు. జనగణన చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థ ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలల్లోని అన్ని ఎంబీసీ వర్గాలను అధ్యయనం చేసి నాడు 1978లో కర్పూర్ ఠాగూర్ ఎంబీసీల పక్షాన నిలబడి అమలు చేసిన విధానాన్ని రాష్ట్రంలో అమలు చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 50 ఏండ్లు దాటిన వారికి వృద్ధాప్య పింఛన్, వృత్తి చేసుకుంటూ మరణించిన వారికి రూ.5లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కులవృత్తిదారులకు కార్పొరేషన్ పరిధిలో కమర్షియల్ భవనం నిర్మించి ఉచితంగా ఇస్తామని చెప్పిన హామీని అమలు చేయాలన్నారు. నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్ కార్పొరేషన్‌గా మార్చి, పాలక మండలిని నియమించి రూ.500 కోట్లు విడుదల చేయాలన్నారు. కల్యాణకట్టలో పనిచేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ చర్లపల్లి డివిజన్ అధ్యక్షులు మద్దికుంట్ల వినోద్ నాయీ, ప్రధాన కార్యదర్శి శివకుమార్, కోశాధికారి టి రాజు, రాష్ట్ర సహాయ కార్యదర్శి రాచమల్ల జగన్, తదితరులు హాజరయ్యారు.



ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన మాజీ మంత్రి షబ్బీర్ అలీని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. -నవతెలంగాణ,కాప్రా



మీర్‌పేట్ హౌసింగ్ బోర్డు కాలనీ డివిజన్ పరిధిలోని హెచ్‌బీ కాలనీ ఫేజ్-1 కాలనీలో చేపట్టబోయే సీసీ రోడ్డు నిర్మాణానికి ముందు చేపట్టిన ప్రారంభ పనులను పరిశీలించిన స్థానిక కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్. -నవతెలంగాణ, కాప్రా

అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి

- పార్లమెంట్ అభివృద్ధి (ఎంపీ ల్యాడ్స్) నిధులను మార్చి నెలాఖరుకు వినియోగించాలి
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లా వ్యాప్తంగా అన్ని అభివృద్ధి పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని, ఎక్కడా పనులు పెండింగ్‌లో ఉండకుండా చూడాలని, ఈ విషయంలో ఆయా శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో పనులు చేపట్టాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా ప్రణాళిక అధికారి (సీపీవో) ఎం.మోహన్‌రావుతో కలిసి నియోజకవర్గ అభివృద్ధి నిధులు (కాన్స్టిట్యూయెన్సీ డెవలప్‌మెంట్ ఫండ్స్ (సీడీఎఫ్) పార్లమెంట్ ప్రాంత అభివృద్ధి నిధులు (మెంబెర్ అఫ్ పార్లమెంట్ లోకల్ ఏరియా డెవలప్‌మెంట్ అండ్ ఎంపీ ల్యాడ్స్) క్రుషియల్ బ్యాలెన్స్ ఫండ్ (సీబీఎఫ్), ప్రత్యేక అభివృద్ధి నిధులు (స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ అండ్ ఎస్డీఎఫ్)కు జిల్లాలోని రహదారులు, భవనాలు (ఆర్అండ్‌బీ) పంచాయతీరాజ్, అటవీ శాఖ (డీఎఫ్వో), జిల్లా అభివృద్ధి నిధులు, డీడబ్ల్యువో, డీఆర్డీఏ, ఇరిగేషన్, జీహెచ్ఎంసీ, వాటర్‌వర్క్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, పోలీసు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అధికారులందరూ సమన్వయంతో పని చేస్తేనే అనుకున్న లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయడానికి ఆస్కారముంటుందన్నారు. ఎంపీ ల్యాండ్స్ మార్చి 31వ తేదీ వరకు పూర్తి చేయాలని, ఈ విషయంలో ఏ మాత్రం అశ్రద్ధ వహించరాదని సూచించారు. జిల్లాలోని ఆయా నియోజకవర్గాల అభివృద్ధి నిధులతో పాటు ప్రత్యేక అభివృద్ధి నిధులు (ఎస్డీఎఫ్) వర్క్స్ పనులు ఫిబ్రవరి చివరి వరకు పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అంతకు ముందు అధికారులతో అభివృద్ధి పనులపై నియోజకవర్గాల వారీగా పనుల పురోగతిని ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ఎన్ని పనులు పూర్తి అయ్యాయి..? ఇంకా ఎన్ని పనులు ఏఏ స్థాయిలో పెండింగ్ దశల ఉన్నాయి..? పూర్తిగా క్యాన్సల్ అయినవి ఎన్ని..? అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో పనులు చేయని కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఈ పనులను వేరే వారికి ఆ అప్పగిస్తామని, దీన్ని దృష్టిలో పెట్టుకుని పెండింగ్ పనులను కాంట్రాక్టర్లు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు ప్రజలు, అభివృద్ధి పనుల కోసం కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకునే దిశగా అధికారులు కృషి చేయాని తెలిపారు. మరో 15 రోజుల తర్వాత సమావేశం నిర్వహిస్తామని, ఆ సమయం వరకు అభివృద్ధి పనులు పూర్తయ్యేలా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేసే అవకాశం దొరకడం అదృష్టం

- మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

నవతెలంగాణ-కీసర

ప్రజలకు సేవ చేసే అవకాశం దొరకడం ఎంతో అదృష్టమని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. బుధవారం గోధుమకుంట గ్రామ సర్పంచ్ ఆకిటి మహేందర్‌రెడ్డి పదవీకాలం ముగియడంతో ఎమ్మెల్యే మల్లారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చామకూర భద్రారెడ్డిలు ఆకిటి మహేందర్‌రెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గోధుమకుంట గ్రామ అభివృద్ధి కోసం కృషి చేసిన సర్పంచ్ మహేందర్‌రెడ్డితో పాలకవర్గం సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జలాల్ పురం సుధాకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ సోమని ఆంజనేయులు, గ్రామ శాఖ అధ్యక్షులు చీర కృష్ణ, వార్డు సభ్యులు పుట్ట బాలరాజు గౌడ్, చీర రజిత, మహేష్ కురుమ, తాండూరి సంధ్యదశరథ గౌడ్, నాచారం పద్మయాదగిరి గౌడ్, స్వరూప పెంటయ్య, జంగం శివ యాదవ్ పాల్గొన్నారు.



మేయర్ జక్కా వెంకట్‌రెడ్డికి ఘన సన్మానం



నవతెలంగాణ-బోడుప్పల్

పీర్జాదిగూడ మేయర్‌గా నాలుగేండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డిని 1వ డివిజన్ కమలానగర్ అధ్యక్షులు శ్యామలనరసింహ, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కాలనీవాసులు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ..పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నగరాన్ని శాంతి, ప్రగతి, శ్రేయస్సు పథంలోకి తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తానన్నారు. నగర ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి వివిధ మౌలిక సదుపాయాలను కల్పిస్తూ ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. నాలుగేండ్ల క్రితం నిర్దేశించిన లక్ష్యాలలో గణనీయమైన పురోగతి సాధించామని తెలిపారు. భవిషత్‌లో మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏనుగు మనోరంజన్ రెడ్డి, నిర్మల, ప్రభు, చిరంజీవిరావు, ఆంజనేయులు, రమేష్, అమర్నాథ్, గోవర్ధన్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

డబ్బులు వచ్చినప్పుడే బిల్లులు చెల్లిస్తాం

- లేదంటే జీహెచ్ఎంసీ కార్యాలయం ముందు ధర్నాలు చేసుకోండి
- ప్రజాపాలన ఆపరేటర్ బాధితులపై ఉప్పల్ ఉప కమిషనర్ ఆగ్రహం



నవతెలంగాణ-ఉప్పల్

డబ్బులు వచ్చినప్పుడే బిల్లులు చెల్లిస్తాం, మీకు దిక్కున్న చోట చెప్పుకోండి, జీహెచ్ఎంసీ కార్యాలయంలో ధర్నాలు చేసుకోండి అంటూ ప్రజాపాలన దరఖాస్తుల ఆపరేటర్ల బాధితులపై ఉప్పల్ ఉప కమిషనర్ శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాపాలన దరఖాస్తులు నమోదు చేసిన సిబ్బందికి బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతుందని బిల్లులు వెంటనే చెల్లించాలని కోరుతూ ఉప్పల్ ఉప కమిషనర్‌ను బుధవారం ఆపరేటర్లు కోరారు. దీంతో ఉప కమిషనర్ శ్రీనివాస్ అమర్యాదగా మాట్లాడుతూ బిల్లుల చెల్లింపులలో ఇంకా టైం పడుతుందని దాటవేశారు. ఎప్పుడు చెల్లిస్తారో చెప్పాలని బాధితులు అడిగారు. డబ్బులు వస్తేనే బిల్లులు ఇస్తాం ఏం చేసుకుంటారో చేసుకోండి అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. దీంతో బాధితులు వరుణ్, చందు, సంకీర్తన, విజయలక్ష్మి, సంధ్యారాణిలు మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారం రోజులుగా బిల్లులు చెల్లింపు విషయంలో కార్యాలయం చుట్టూ తిరిగినా సరైన సమాధానం చెప్పడం లేదన్నారు. సుమారు 130 బాధితులకు రూ.6 లక్షలు ఇవ్వాల్సి ఉందన్నారు. వెంటనే తమకు బిల్లులు చెల్లించి న్యాయం చేయాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేద్దాం

నవతెలంగాణ-శామీర్‌పేట

ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని మేడ్చల్ ఎమ్మెల్యే చామకుర మల్లారెడ్డి బీఆర్ఎస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో మేడ్చల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ గెలిచినందుకు కృతజ్ఞతగా బుధవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ చౌరస్తా సీఎంఆర్ కన్వెన్షన్ హాల్లో ఉమ్మడి కీసర మండలం దమ్మాయిగూడ, నాగారం నాయకులతో మల్లారెడ్డి విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సభకు ఇన్‌చార్జిగా మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ.. తనను ఎంపీగా, రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించినందుకు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో మంత్రి అయ్యానని పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ పార్టీ కార్యకర్తలందరిని కాపాడుకుంటానని భరో సా ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రైతుబంధు, దళితబంధు, బీసీబంధు మైనార్టీ బంధు వంటి పథకాల న్నీ బంద్ చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు మీటింగ్‌లపై మీటింగ్‌లు పెట్టుకుంటూ ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కనపెట్టి కాలయాపన చేస్తున్నారని మండి పడ్డారు. కీసర, దమ్మాయిగూడ, నాగారం మున్సిపాలిటీ ల్లో ఎంతో అభివృద్ధి చేశానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి, యువనాయకులు భద్రారెడ్డి, మున్సిపాలిటీ ఛైర్పర్సన్‌లు ప్రణీత శ్రీకాంత్ గౌడ్, చంద్ర రెడ్డి, జెడ్పీ వైస్ ఛైర్మెన్ వెంకటేష్, ఎంపీటీసీలు కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, కీసర మండలం సర్పంచులు, వార్డు సభ్యులు, మండల పార్టీ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షులు శ్రీధర్, తిరుపతి రెడ్డి, కీసర మండలం దమ్మాయిగూడ, నాగారం మున్సిపాలిటీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గ్రామస్తుల సహకారంతో సాయిబాబా ఆలయాన్ని నిర్మిస్తాం

- వ్యవస్థాపకులు వెంకటరమణారెడ్డి



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని పూడూరు గ్రామంలో నిర్మిస్తున్న సాయిబాబా ఆలయాన్ని గ్రామస్తుల అందరి సహకారంతో నిర్మించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు గొల్లంపల్లి వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గ్రామంలో తమ తండ్రి మాజీ సర్పంచ్ గొల్లంపల్లి భాస్కర్‌రెడ్డి 1994లో పరుపుల బండమీద చిన్న సాయిబాబా ఆలయాన్ని నిర్మించినట్లు చెప్పారు. కాగా అదే ఆలయాన్ని నేడు గ్రామస్తులు, దాతల అందరి సహకారంతో పునర్నిర్మాణ పనులు చేపట్టినట్లుగా వెల్లడించారు. ఈ ఆలయ పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి రూ.5లక్షల విరాళం ఇచ్చిన విషయం తెలిసినదే. గ్రామస్తులందరూ స్వచ్ఛందంగా సహాయ సహకారాలు, విరాళలు అందించాలని కోరారు.

సెకండరీ గ్రేడ్ టీచర్స్ రౌండ్ టేబుల్ సమావేశం



నవతెలంగాణ-శామీర్‌పేట

తూంకుంట మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని సెకండరీ గ్రేడ్ టీచర్స్ వారి సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీఏ ఏరియర్స్, పీఆర్సీ ఏరియర్స్, అన్ని రకాల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని, పీఆర్సీలో ఎస్ఏ, ఎస్జీటీల వేతనం స్కేలు వ్యత్యాసం తగ్గించాలని చర్చించారు. ఎఫ్ఎల్ఎన్ తొలిమెట్టు రద్దు, ఎస్ ఎస్జీటీల వేతన బిల్లులు, సెలవుల మంజూరు ఎంఈవో లేదా కాంప్లెక్స్ హెచ్‌ఎంలలో ఎవరికో ఒకరికి బాధ్యత అప్పగించాలని, పాఠశాలల్లో స్కావెంజర్స్‌ను నియమించాలని ట్రాన్స్ఫర్స్, ప్రమోషన్స్ వెంటనే చేపట్టి, ప్రతి తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడిని, పాఠశాలకు ఒక పీఎస్ హెచ్‌ఎం ఇవ్వాలని, సీపీఎస్ రద్దు, ఎస్జీటీలకు ఓటుహక్కు కల్పించాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ఎం. రవీంద్ర చారి, సంజీవ, సత్యం, రాజు, హరి శంకర్, వివిధ సంఘాల మండల బాధ్యులు తిరుమలేష్, మహేష్‌కుమార్, మైఖేల్‌రెడ్డి, రాజుకుమా ర్, రమేష్, కరుణశ్రీ, కల్పన శైలజ, పుష్పలత, పాల్గొన్నారు.

నాగిశెట్టిపల్లి సర్పంచ్, వార్డు సభ్యులకు సన్మానం



నవతెలంగాణ-శామీర్‌పేట

గ్రామపంచాయతీ సర్పంచుల పదవీకాలం జనవరి 31 బుధవారంతో ముగిసింది. చివరి రోజు ఉమ్మడి శామీర్‌పేట మండల వ్యాప్తంగా ఆయా గ్రామ పంచాయతీ పాలకవర్గాలకు పలువురు వీడ్కోలు పలికారు. కాగా మూడుచింతలపల్లి మండలంలోని నాగిశెట్టిపల్లి గ్రామ పంచాయతీ పాలకవర్గానికి ఐదేండ్లు పూర్తయిన సందర్భంగా సర్పంచ్ మొగుళ్ల కృపాకర్ రెడ్డిని, ఇతర పాలకవర్గాన్ని, స్థానిక ఎంపీటీసీ, మండల ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు గొనె హనుమంతరెడ్డి ఘనంగా శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎ స్ వైస్ ఛైర్మెన్ రామిడి మధుకర్‌రెడ్డి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు జగన్‌గూడ సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, పంచాయత్ సెక్రటరీ సుచరిత, తదితరులు పాల్గొన్నారు.

గృహ కార్మికులకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి

- గృహ కార్మికుల స్టేట్ కోఆర్డినేటర్ లూర్దు



నవతెలంగాణ-ఉప్పల్

గృహ కార్మికుల కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని గృహ కార్మికుల తెలంగాణ స్టేట్, ఆంధ్రప్రదేశ్ కో ఆర్డినేటర్ లూర్దు అన్నారు. గృహ కార్మికుల యూనియన్ తెలంగాణ స్టేట్ రాష్ట్ర స్థాయిలో జనరల్ బాడీ మీటింగ్ బుధవారం నిర్వహించారు. ఈ మీటింగుకు ఏడు జిల్లాల ఎక్స్‌క్యుటివ్ లీడర్లు హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా మౌంట్ ఫోర్ట్ సోషల్ ఇన్స్యూట్ డైరెక్టర్ బ్రదర్ వర్గీస్, గృహ కార్మికుల యూనియన్ తెలంగాణ స్టేట్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ కోఆర్డినేటర్ సిస్టర్ లూర్దు, సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దీపక్ జాన్ పాల్గొన్నారు. గృహ కార్మికులకు వారానికి ఒక రోజు సెలవు, ప్రత్యేక చట్టం తీసుకురావడానికి పనిచేస్తామని యూనియన్ నాయకులు ప్రతిజ్ఞ చేశారు. మీటింగ్ అనంతరం రాష్ట్ర స్థాయి ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలిగా మంజుల, రాష్ట్ర కార్యదర్శిగా దేవరకొండ శోభ, కోశాధికారిగా మాధురి ఎన్నికయ్యారు.

గ్రామాభివృద్ధికి సహకరించిన మల్లారెడ్డికి ధన్యవాదాలు : మంగ్య



నవతెలంగాణ-మేడ్చల్

మండల పరిధిలోని రాజబొల్లారం తండా గ్రామాభివృద్ధికి అన్ని విధాల సహకరించిన ఎమ్మెల్యే మల్లారెడ్డికి సర్పంచ్ మంగ్య నాయక్ ధన్యవాదాలు తెలిపారు. బుధవారం సర్పంచ్ మాంగ్య నాయక్ వార్డు సభ్యులతో కలిసి అంతర్గత డ్రయినేజీ, సీసీ రోడ్లను ప్రారంభించారు. నేటితో పదవీకాలం ముగుస్తున్న సందర్భంగా వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి సర్పంచ్ మంగ్యా నాయక్ వార్డు సభ్యులందరినీ శాలువాతో సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. మల్లారెడ్డి గ్రామాభివృద్ధికి అన్ని రకాలుగా సహకరించారని తెలిపారు. సుమారు ఒకకోటి 50లక్షల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేశా మన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నరేష్, ఎంపీట ీసీ అంకిత, వార్డు సభ్యులు దీపక్, ప్రమీళ, పాండు, విజ యు, రీతా, సక్రు పంచాయతీ కార్యదర్శి ఎలిజిబెత్ ఉన్నారు.

నవతెలంగాణ 9
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
గురువారం ఫిబ్రవరి 01, 2024 www.navatelangana.com

'ఫిబ్రవరి 16న కార్మిక సమ్మె గ్రామీణ భారత్ బంద్'


సిఐటియూ అంబర్ పేట జోన్ కన్వీనర్ జి.రాములు



నవతెలంగాణ-అంబర్ పేట

ఫిబ్రవరి 16న దేశవ్యాప్త కార్మిక సమ్మె గ్రామీణ భారత బంద్‌ను జయప్రదం చేయాలని సిఐటియూ అంబర్‌పేట జోన్ కన్వీనర్ జి.రాములు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం సర్కిల్-16 అంబర్ పేట్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ మారుతి దివాకర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా జి.రాములు మాట్లాడుతూ మున్సిపల్ స్వీపర్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్, మతతత్వ విధానాలను ధిక్కరిస్తూ ప్రతిఘటనకు పూనుకోవాలని, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై ఈ కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్ ను నిర్వహిస్తున్నామన్నారు.

నేడు 'మూడు దారులు' పుస్తక పరిచయ సభ



నవతెలంగాణ-సిటీబ్యూరో

సీనియర్ పాత్రికేయులు దేవులపల్లి అమర్ రచించిన 'మూడు దారులు' పుస్తక పరిచయ సభ గురువారం(నేడు) సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జే.చలమేశ్వర్ హాజరుకానున్నారు. సీనియర్ పాత్రికేయులు బీఎస్ రామకృష్ణ ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించనున్నారు. సీనియర్ పాత్రికేయులు కల్లూరి భాస్కరం పుస్తక పరిచయం చేయనున్నారు. సభాధ్యక్షులుగా హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి ఆర్.రవికాంత్ రెడ్డి వ్యవహరించనున్నారు.

'సామాజిక సేవా సంస్థలను ప్రభుత్వాలు ప్రోత్సహించాలి'

- సామాజిక సంస్థల జాతీయ ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు చాగంటి నరేష్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

అన్ని రకాల సామాజిక సేవ కార్యక్రమాలు చేస్తున్న సంస్థలను ప్రోత్సహించి, సమాజ అభివృద్ధికి తోడ్పడే విధంగా సహకరించాలని సామాజిక సంస్థల జాతీయ ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు చాగంటి నరేష్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం హిమాయత్ నగర్‌లోని ఎస్.సత్యనారాయణరెడ్డి భవన్‌లో 'సామాజిక సంస్థల ఆత్మీయ సమ్మేళనం' నిర్వహించారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో సామాజిక సంస్థల జాతీయ ఐక్యవేదికను ఏర్పాటు చేసుకుని, వివిధ రాష్ట్రాల నుంచి అనేక సామాజిక సంస్థలు హాజరై తమ తమ అభిప్రాయాలు, ఎదుర్కొంటున్న సమస్యలపై సభను నిర్వహించారు. ఈ సందర్భంగా చాగంటి నరేష్ మాట్లాడుతూ సామాజిక సంస్థలకు కేంద్ర, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ఇన్‌స్టిట్యూషన్ డెవలప్‌మెంట్ అండ్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను కేటాయించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో భాగంగా అవేర్ నెస్ కోసం కేటాయించిన నిధులను మరింత పెంచి వాటిని సామాజిక సంస్థలకు కేటాయించాలని, తెలంగాణ రాష్ట్రంలో త్వరలో ప్రవేశపెట్టబోయే 2024-25 బడ్జెట్‌లో సామాజిక సంస్థల కార్యక్రమాలకు బడ్జెట్ కేటాయించి, బడ్జెట్ అలోకేషన్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక సభ్యులు మాలతీలత, సిహెచ్.ఉమాదేవి, రాజేష్ కుమార్, మల్లేశ్వరరావు, నజీర్ పాషా, లీగల్ అడ్వైజర్ అరవింద్, రాజారెడ్డి, సినీ డైరెక్టర్ ఆదిత్య, క్యాట్ కో-చైర్మన్ శంకర్ లాల్, సింధు తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌వర్క్స్ ఉద్యోగుల సంఘం నుంచి ఇద్దరిని తొలగింపు

- వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.రాంబాబు యాదవ్



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

యూనియన్, కార్మిక వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న యూనియన్ అసోసియేట్ అధ్యక్షుడు రాజిరెడ్డి, జాంగీర్లను సస్పెండ్ చేస్తున్నట్టు తెలంగాణ వాటర్ వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు యాదవ్ తెలియజేశారు. బుధవారం గోషామహల్‌లోని యూనియన్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాంబాబు యాదవ్ మాట్లాడుతూ గత కొంత కాలంగా తమ సొంత ప్రయోజనాల కోసం యూనియన్ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న రాజిరెడ్డి, జంగీర్‌లనుసస్పెండ్ చేస్తున్నట్టు తెలిపారు. వాటర్ వర్క్స్ యూనియన్ ఆధ్వర్యంలో హెల్పర్ కార్మికులు, ప్రమోషన్లు తదితర అనేక కార్మిక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. కార్మికులంతా గందరగోళానికి గురికావద్దని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జనరల్ సెక్రెటరీ బి.జైరాజ్, చీఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ పి.నారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ అక్తర్ అలీ, లక్ష్మినారాయణ, మేడ్చల్ శ్రీనివాస్,ఎల్లమయ్య, జంగయ్య, కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రొ. కోదండరాంపైన కోర్టులో వేసిన పిటిషన్‌ను వెంటనే విత్ డ్రా చేసుకోవాలి

- తెలంగాణ జన సమితి నగర అధ్యక్షులు నరసయ్య



నవతెలంగాణ-ముషీరాబాద్

ప్రొ. కోదండరాంపైన కోర్టులో వేసిన పిటిషన్‌ను వెంటనే వేసినవారు విత్ డ్రా చేసుకోవాలని తెలంగాణ జన సమితి నగర అధ్యక్షులు నరసయ్య డిమాండ్ చేశారు. కోదండరాం ఎమ్మెల్సీగా నియమించడానికి అడ్డుకున్నందుకు నిరసనగా తెలంగాణ జన సమితి పార్టీ ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్ రోడ్‌లో కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం నరసయ్య మాట్లాడుతూ కోదండరాంపై కేసీఆర్ కుట్రలు కొత్తేమికాదని గత తొమ్మిది సంవత్సరాలుగా అనేక రకాల దాడులకు పాల్పడ్డాడని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి ముషీరాబాద్ కన్వీనర్ మెరుగు శ్రీనివాస్ యాదవ్ , నగర ప్రధాన కార్యదర్శి బట్టల రామచందర్, బీసీ సెల్ అధ్యక్షుడు ఎస్ జస్వంత్ కుమార్ , ముషీరాబాద్ నియోజకవర్గం నాయకులు మధు, ఖైరాల్ రెడ్డి, పులిపాటి సుధాకర్ ,అజయ్ గౌడ్, వెంకటయ్య ,కూనూరి సుధాకర్ ,పవన్ ,సురేష్, రహుల్, మాణిక్యం సాయి భాష తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బండారం యాదగిరి గౌడ్



నవతెలంగాణ-ముషీరాబాద్

కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకుడు బండారం యాదగిరి గౌడ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా యాదగిరిగౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనను సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ కుమార్ యాదవ్, సికింద్రాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు అనిల్ కుమార్ యాదవ్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు. సికింద్రాబాద్ జిల్లా పరిధిలో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. వచ్చే పార్లమెంట్ సికింద్రాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు పని చేస్తామన్నారు.



నూతనంగా ప్రభుత్వ నర్సింగ్ అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతులమీదుగా నియామక పత్రాలను అందజేశారు. ఈసందర్భంగా తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఎస్. రాబర్ట్ బ్రూస్, సెక్రటరీ జె. అశోక్ , తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసిస్ట్ అధ్యక్షుడు బత్తిని సుదర్శన్ గౌడ్ నర్సింగ్ అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నియామక పత్రాలు అందజేసిన సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేకాభినందనలు తెలియజేశారు. వారి వెంట తదితరులున్నారు.

నవతెలంగాణ-సుల్తాన్ బజార్

ముషీరాబాద్ మెట్రో స్టేషన్ వద్ద అగ్ని ప్రమాదం

- సకాలంలో మంటలార్పిన అగ్నిమాపక సిబ్బంది



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ మెట్రో స్టేషన్ వద్ద అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మెట్రో స్టేషన్ వద్ద గల విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దట్టమైన పొగలు, మంటలు రావడంతో ప్రజలు భయంతో పరుగులు తీశారు. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పారు. త్రుటిలో పెను ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఇందిరాపార్క్ చౌరస్తాలో..

ఇందిరాపార్కు చౌరస్తాలోని భవనంలోని మూడవ అంతస్తులోని గదుల్లో అగ్నిప్రమాదం సంభవించింది. మూడవ అంతస్తులో నివసిస్తున్న వారు ఆ సమయంలో లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

సమస్యలుంటే నేరుగా నా దృష్టికి తీసుకురావాలి



- ఎమ్మెల్యే ముఠా గోపాల్

నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గంలోని ప్రజలు సమస్యలుంటే నేరుగా నా దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. నియోజకవర్గంలోని రాం నగర్ డివిజన్ బాకారం కొత్తెన్ కుక్ హోటల్ ఎదురుగా ఎనిమిది లక్షల వ్యయంతో డ్రైనేజ్ పైప్ లైన్, మేదర్ బస్తీలో రూ.8 లక్షలతో డ్రైనేజ్ పైప్ లైన్ పనులను స్థానిక కార్పొరేటర్ రవి చారితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. ప్రతి సమస్య దశలవారీగా పరిష్కరిస్తూ ఆదర్శవం తమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. రోడ్డు డ్రైనేజ్ పైప్ లైన్, మంచినీటి పైప్ లైన్ పనులు చక చక జరుగుతున్నాయని త్వరలోనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తెస్తామన్నారు. ప్రజలు ఏమైనా సమస్యలుంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సత్వరమే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు ముఠా జై సింహా, శంకర్ ముదిరాజ్ స్థానిక కార్యదర్శి దామోదర్ రెడ్డి, ముదిగొండ మురళి, ఎర్రం శేఖర్, కేశవపురం అరుణ్, డేవిడ్ రాజ్, నర్సింగరావు, కళ్యాణ్, గోరఖ్యాదవ్, సాయి చాణిక్య రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, నితిన్, మోసిన్, జావిద్ ఖాన్, సదర్ సాబ్, జావిద్ భాయ్, ఖదీర్, అజీజ్, గుండప్ప, మహేష్, నర్సింలు, శ్రీనివాస్, వాటర్ వర్క్స్ డీజీఎం మోహన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

రోజుకో తీరులో రెచ్చిపోతున్న సైబర్ నేరస్తులు

- వేలాది మందిని మోసం చేసి కోట్లు కొల్లగొడుతున్న దుండగులు
- అన్ని పోలీస్‌స్టేషన్లలో సైబర్ కేసులు నమోదు చేస్తున్న పోలీసులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

సైబర్ నేరస్తులు రోజుకో తీరులో రెచ్చిపో తున్నారు. కంపెనీలో పెట్టుబడులు పెడితే లక్షలు లాభాలొస్తాయని కొందరు వలవేస్తుంటే, మరికొందరు గిఫ్ట్‌లు వచ్చాయని మోసాలకు పాల్పడుతున్నారు. ఇంకొందరు మీకొచ్చిన గిఫ్ట్‌లో చట్టవిరుద్ధమైన వస్తువులున్నాయని, ఆర్‌బీఐ, కస్టమ్స్ నుంచి క్లియరెన్స్ సర్టిఫికెట్ తీసుకో వాలంటూ అందినకాడికి దండుకుంటున్నారు. 2022లో నగర కమిషనరేట్‌లో నేరాలు కాస్త తగ్గినా 2023లో సైబర్ నేరాలు పెరిగాయి. అంతకంతకూ సైబర్ నేరాలు పెరగడం, వందల సంఖ్యలో బాధితులుండడంతో నగరంలోని అన్ని పోలీస్ స్టేషన్లలో సైతం సైబర్ నేరాలపై కేసులు నమోదు చేస్తున్నారు. అయినా సైబర్ నేరాలు తగ్గడం లేదు. 2023లో సైబర్‌క్రైమ్ 2249 కేసులు నమోదు కాగా ఈ ఏడాది ఒకే నెలలో వందకు పైగా కేసులు నమోదయ్యాయి.

చైన్ సిస్టమ్‌గా పది వేల మంది.. రూ.500 కోట్లు ఇన్వెస్ట్

ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో సైబర్ నేరస్తులు మోసాలకు పాల్పడుతున్నారు. తాజాగా పనుక్ కంపెనీ పేరిట వెబ్‌సైట్ నిర్వహించారు. కంపెనీలో పెట్టుబడి పెడితే లక్షకు రూ.4 లక్షలు ఇస్తామంటూ ప్రకటనలిచ్చారు. స్కీంలో కొత్త వారిని చేర్పితే రూ. 500 నుంచి 1000 రూపాయల కమిషన్ ఆశ చూపించారు. అయితే కొద్ది రోజుల నుంచి కంపెనీ వెబ్ సైట్ పని చేయకపోవడంతో అనుమానం వచ్చిన బాధితులు పలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చైన్ సిస్టమ్‌గా పది వేల మంది నుంచి దాదాపు రూ.500 కోట్లు ఇన్వెస్ట్ చేయించారని కొందరు బాధితులు సైబర్ క్రైమ్ పోలీసుల దృష్టికి తీసుకొచ్చారు. విచారణ ప్రారంభించిన పోలీసులు సైబర్ నేరస్తులు దాదాపు 1000 మంది చొప్పున 10 వాట్సప్ గ్రూపులను నిర్వహించినట్టు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేస్తు న్నారు.

ఇల్లీగల్ మెటీరియల్ ఉందని రూ.8.74లక్షలు స్వాహా

కావాడిగూడకు చెందిన ఓ వ్యక్తిని సైబర్ నేరస్తులు టార్గెట్ చేశారు. కస్టమ్స్ డిపార్ట్‌మెంట్ నుంచి మాట్లాడుతున్నామని వాట్సాప్, టెలిగ్రామ్ నుంచి ఫోన్ చేశారు. మీకు పార్సిల్ వచ్చిందని, అందులో చట్టవిరుద్ధమైన వస్తువులున్నాయని చెప్పారు. వాటిని తీసుకోవాలంటే ఆర్‌బీఐ వెరిఫికేషన్ సర్టిఫికెట్ ఉండాలని, లేకపోతే కేసులు నమోదవుతాయని భయపెట్టారు. ఆందోళనకు గురైన బాధితుడు వారు చెప్పిన విధంగా వివిధ బ్యాంక్ అకౌంట్లకు రూ.8,74,998లను పలు దఫాలు డిపాజిట్ చేశాడు. అయినా నిందితులు అంతటితో ఆగకుండా డబ్బులు డిమాండ్ చేస్తుండడంతో బాధితుడు సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు నిందితులు ఇతరుల పేర్లతోఉన్న బ్యాంక్ అకౌంట్లను ఉపయోగించారని, అందులోనే డిపాజిట్లు చేయించారని గుర్తించారు. నిందితులు ఒక అకౌంట్ నుంచి రూ.2.85కోట్లు సేకరించినట్టు పోలీసులు గుర్తించారు. సైబర్ నేరస్తులకు బ్యాంక్ అకౌంట్లు సరఫరా చేసిన జావిద్ నవాబ్ యాకూబ్ ఖాన్ అనే నిందితున్ని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు.

పార్ట్‌టైమ్ జాబ్ పేరుతో రూ.21లక్షలు వసూలు

పద్మారావునగర్‌లో నివాసముంటున్న ఓ యువకునికి వాట్సాప్‌లో పార్ట్‌టైమ్ జాబ్ ఉందని సమాచారం వచ్చింది. సమాచారం చూసిన బాధితుడు వారిని వాట్సాప్‌లో సంప్రదించాడు. ఇంట్లో కూర్చొనే ప్రపంచ వ్యాప్తంగాఉన్న హోటల్స్‌కు ఆన్‌లైన్‌లో రివ్యూలు ఇవ్వాలని, వాటి పాపులార్టీని పెంచాలని నమ్మించారు. ఉద్యోగం కోసం కొంత డబ్బులను డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. అది నిజమని నమ్మిన బాధితుడు వారు చెప్పిన విధంగా వివిధ బ్యాంకుల్లో రూ.21.07లక్షలు ట్రాన్స్‌ఫర్ చేశాడు. తీరా మోసపోయినట్టు గుర్తించిన బాధితుడు సైబర్‌క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ కేసులో ఇద్దరు నేరస్తులున్నట్టు గుర్తించిన పోలీసులు వారిపై 25 కేసులున్నాయని విచారణలో తేల్చారు. సైబర్ నేరస్తులకు కమీషన్లపై బ్యాంక్ అకౌంట్లు అందించిన శృతి మమూర్ బఫ్నా అనే యువతిని అరెస్టు చేశారు.

దేశవ్యాప్తంగా 105 కేసులు నమోదు

సైబర్ నేరస్తులపై దేశవ్యాప్తంగా 105 కేసులు నమోదు కాగా, తెలంగాణలో 14కేసులు నమోదైనట్టు జాయింట్ సీపీ రంగనాథ్ తెలిపారు. ఎవరైన కస్టమ్స్ అధికారినంటూ ఫోన్ చేస్తే నమ్మొద్దని నగర వాసులకు సూచించారు. ఏ అధికారికూడా ఫోన్‌లో ఆర్థిక లావాదేవీల విషయం మాట్లాడరని గుర్తుంచుకోవాలన్నారు. మన అప్రమత్తంగా ఉంటేనే సైబర్ నేరస్తుల ఆగడాలను అరికట్టవచ్చున్నారు.

'మోదీ సర్కార్ హఠావో..దేశ్ బచావో ఎన్నికల ఎజెండాతో పోటీ చేస్తాం'

- రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో దళిత బహుజన పార్టీ పోటీ
- దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్డమూరి కృష్ణ స్వరూప్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

మోడీ సర్కార్ హఠావో...దేశ్ బచావో ఎన్నికల ఎజెండాతో పార్లమెంట్ ఎన్నికల్లో దళిత బహుజన పార్టీ పోటీ చేస్తున్నట్టు దళిత బహుజన పార్టీ (డిబిపి) జాతీయ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్డమూరి కృష్ణ స్వరూప్ తెలిపారు.ఈ మేరకు బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ ఎంపీ అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ హయాంలో భారత రాజ్యాంగాన్ని కాలరాస్తూ మెజార్టీ ప్రజలను బానిసలుగా మార్చారని ఆరోపించారు. దేశ సంపద, ప్రజల ఆస్తులను అంబానీ, ఆదానీ, మార్వాడీ కార్పొరేట్ దోపిడీ వర్గాలకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రతత్వం, సోషల్ జస్టిస్, అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని పక్కన పెట్టి మనుస్మృతి, బ్రాహ్మణ రాజ్యాంగాన్ని బీజేపీ సర్కార్ అమలు చేస్తుందని విమర్శించారు. రాజ్యాంగాన్ని రక్షించుకుందాం దేశాన్ని కాపాడుకుందామన్నారు. పార్లమెంట్ ఎన్నికలను ఈవీఎం మిషన్లతో కాకుండా బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికల నిర్వహణకు ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా వందకు పైగా ఎంపీ స్థానాలకు తమ పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తున్నారని ఆయన తెలిపారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా షేక్ బాబు, సికింద్రాబాద్, భువనగిరి జీవన్.రావు, బి.సందీప్ కుమార్, మహబూబాబాద్ ఎం.రవీం దర్ నాయక్, చేవెళ్ల డాక్టర్ వి.ఎల్.రాజు, మల్కాజ్ గిరి నుండి వడ్డే శ్రీనివాస్ రావులు పోటీ చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.రెండో జాబితా ఫిబ్రవరి నెల 11న విడుదల చేస్తామని తెలిపారు.ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరం పరిక్షిత్, దళిత బహుజన స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఇటికాల గణేష్, పార్టీ గ్రేటర్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్పరి సుబ్బారావు, పార్టీ నాయకులు సిహెచ్.కరుణాకర్, పెండ్యాల సుచందర్‌రావు, విద్యార్థి నాయకులు అజయ్, వినోద్, రవీందర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొటెస్ట్ మార్చ్‌ను విజయవంతం చేయండి

- పీడీఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు మహేష్, ఉపాధ్యక్షులు గడ్డం శ్యామ్



నవతెలంగాణ-ముషీరాబాద్

నూతన జాతీయ విద్యా విధానం 2020ని రద్దు చేయాలని ఫిబ్రవరి 3న ఢిల్లీలో జరిగే ప్రొటెస్ట్ మార్చ్‌ని విజయవంతం చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యు) రాష్ట్ర అధ్యక్షులు మహేష్, ఉపాధ్యక్షులు గడ్డం శ్యామ్ పిలుపునిచ్చారు. బుధవారం విద్యా నగర్ మార్క్స్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నూతన జాతీయవిద్యా విధానం-2020 పేరుతో విద్యను కషాయీకరణ, కార్పొరేటీకరణను ప్రోత్సహిస్తున్నారు. ఆర్టికల్ భావోద్యమ జ్యోతిష్యాలను విద్యార్థుల మెదళ్లలో చొప్పిస్తూ సమాజాన్ని అంధకారం వైపు తీసుకెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే నూతన జాతీయ విద్యా విధానం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యు గ్రేటర్ హైదరాబాద్ ప్రధానకార్యదర్శి కంచనపల్లి శ్రీను, విద్యానగర్ అధ్యక్ష, కార్యదర్శులు గౌతం, ఆసిఫ్ జిల్లా నాయకులు గణేష్, శ్రీకాంత్, మహేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

'సంచార జాతులకు బడ్జెట్‌లో రూ.1,000 కోట్లు కేటాయించాలి'

- తెలంగాణ సంచార జాతుల సమితి అధ్యక్షులు నిమ్మల వీరన్న



నవతెలంగాణ-హిమాయత్ నగర్

వచ్చే బడ్జెట్ అసెంబ్లీ సమావేశాల్లో సంచార జాతుల సంక్షేమ భివృద్ధికి బడ్జెట్‌లో రూ.1,000 కోట్లు కేటాయించి ఆదుకోవాలని తెలంగాణ సంచార జాతుల సమితి వ్యవస్థాపక అధ్యక్షులు నిమ్మ ల వీరన్న బుధవారం ఒక ప్రకటనలో రాష్ట్ర సీఎం ఎ.రేవంత్ రెడ్డిని కోరారు. స్వాతంత్ర్యం వచ్చి 75 గడుస్తున్న సంచార జాతులకు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో ఎంతో వెనుకబడి దుర్భర దారిద్ర్య జీవితాన్ని గడుపు తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కామారెడ్డిలో జరిగిన బీసీ డిక్లరేషన్‌లో ప్రకటించిన విధంగా కుల గణన చేపట్టి 10 శాతం రిజర్వేషన్లు స్థానిక సంస్థల్లో కేటాయించాలని, ఎంబీసీ కులాల అభివృద్ధికి ప్రత్యేకంగా ఒక మంత్రిని నియమించాలని, బీసీలకు ప్రభుత్వ సహకారిస్తున్న మాదిరిగానే సామాజిక, ఆర్థిక రంగాల్లో తమ జాతులకు న్యాయం చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరిచిన ఆరు గ్యారంటీలలో చేయూత పథకాన్ని సంచార జాతులకు వర్తింపజేయాలని, తమ జాతి బిడ్డల రక్షణకు నెలకు రూ.12 వేల గౌరవ వేతనం ఇచ్చి ఆదుకోవాలని ఆయన సీఎం ఎ.రేవంత్ రెడ్డిని కోరారు.

'జాతీయ విద్యా విధానం-2020'పై ముగిసిన సదస్సు



ప్రిన్సిపాల్ డా. సీతా పోల్, ప్రొఫెసర్ ఎ.డి. దివాన్, ప్రొఫెసర్ ఎస్. శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-అంబర్‌పేట

తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల షాద్ నగర్ ఆధ్వర్యంలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ సహకారంతో 'జాతీయ విద్యా విధానం -2020' అనే అంశంపై ఉస్మానియా యూనివర్సిటీలోని ఐసీఎస్ఎస్ఆర్‌లో నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు బుధవారం ముగిసింది. సదస్సులో ఓయూ కామర్స్ విభాగం ప్రొఫెసర్ పాట్రిక్ అందరిని ఉద్దేశించి విద్యార్థులను ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దడంలో గురుతరమైన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పరిశోధకులు పరిశోధనా పత్రాలను సమర్పించారు. విద్యార్థులు తమ పోస్టర్లను ప్రదర్శించారు. పేపర్ ప్రెజెంటేషన్ చేసిన వారిలో ప్రథమ, ద్వితీయ స్థాయిలో ఎంపికైన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్,

అక్రమ నిర్మాణం కూల్చివేత

- హైకోర్టు ఆదేశాల మేరకు కూల్చివేసిన టౌన్ ప్లానింగ్ అధికారులు



నవతెలంగాణ- మెహిదీపట్నం

మాసబ్ ట్యాంక్ న్యూ సైన్స్ కాలేజ్ సమీపంలో అక్రమంగా నిర్మించిన భవనంలోని మూడు, నాలుగో అంతస్తులను జీహెచ్ఎంసీ 12వ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు బుధవారం కూల్చి వేశారు. న్యూ సైన్స్ కాలేజ్ సమీపంలోని 10-1-44 నంబర్ గల భవనం అక్రమంగా నిర్మించడంతో వాటిని హైకోర్టు ఆదేశాల మేరకు కూల్చి వేసినట్టు టౌన్ ప్లానింగ్ ఏసీపీ కృష్ణమూర్తి, సెక్షన్ ఆఫీసర్ నర్సింగరావులు తెలియజేశారు. అనుమతి లేని నిర్మాణాలను ఎట్టి పరిస్థితిలో ఉపేక్షించ కుండా కూల్చివేస్తామని అందువలన భవన నిర్మాణానికి కావాల్సిన అనుమ తులను మున్సిపల్ కార్యాలయం నుండి తీసుకున్న తర్వాతే నిర్మాణాలు చేపట్టాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది మోహన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
గురువారం | ఫిబ్రవరి 01, 2024 | www.navatelangana.com

కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా కమిటీ కార్యదర్శిగా ఠాకూర్ హేమంత్ సింగ్



నవతెలంగాణ-బేగంపేట్

కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా కమిటీ కార్యదర్శిగా రాంగోపాల్‌పేట్ డివిజన్‌కు చెందిన ఠాకూర్ హేమంత్ సింగ్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షులు ఎం అనిల్ కుమార్ యాదవ్ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఠాకూర్ హేమంత్ సింగ్ మాట్లాడుతూ రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపితం చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు లబ్దిదారులకు చేరేందుకు తన వంతు కషి చేస్తానని తెలిపారు. తనపై ఎంతో నమ్మకం ఉంచి పదవిని అప్పగించిన పార్టీ పెద్దలకు,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు అనిల్ కుమార్ యాదవ్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



తెల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేస్తున్న ప్రజా యుద్ధనౌక గద్దర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఓయూ విద్యార్థి సంఘాలు, విద్యార్థులు భారీగా బయలుదేరి వెళ్లారు. నవతెలంగాణ-ఓయూ



ఓయూలో కేసీఆర్ దిష్టిబొమ్మ దగ్ధం

నవతెలంగాణ-ఓయూ

ఓయూలో ఆర్ట్స్ కాలేజ్ ఎదురుగా బుధవారం విద్యార్థి జన సమితి రాష్ట్ర అధ్యక్షులు మాసంపల్లి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో మాజీ సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. సకల జనుల సేనాని ప్రో.కోదండరాంకు ఎమ్మెల్సీ రాకుండా అడ్డుకోవడానికి కేసీఆర్ చేస్తున్న మొండివైఖరికి నిరసనగా కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేసినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి జన సమితి రాష్ట్ర కార్యదర్శి రవి నాయక్, ఓయూ అధ్యక్షులు రమేష్ యాదవ్, రాష్ట్ర నాయకులు డప్పు గోపి, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు టీఎస్‌యూ ఓయూ ప్రెసిడెంట్ శ్రీకాంత్ యాదవ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ వీర బోయిన లింగయ్య, అభినవ్, వీరబోయిన ముక్తేష్ తదితరులు పాల్గొన్నారు.



'గద్దర్ స్మారక అవార్డు ప్రకటించాలి'

నవతెలంగాణ-ఓయూ

తెలంగాణ విద్యార్థి ఉద్యమకారులు సునీల్ శెట్టి ఆధ్వర్యంలో. బుధవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట గద్దర్ జయంతి ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రొ. కొండ నాగేశ్వరరావు, ప్రొ. సవిన్ హాజరయ్యారు. విద్యార్థి నాయకులు సునీల్ శెట్టి, డాక్టర్ మేడి రమణ, డాక్టర్ అందె కష్ణ, దర్శనం జాన్, వలిగొండ నరసింహ, రవీందర్ నాయక్, మోడం రవి, నాగేశ్వరరావు, సుమంత్,ఉదయ్, భీమ్రావు నాయక్, వేణుగోపాల్, అంబేద్కర్, ఆంజనేయులు ముదిరాజ్, తలారి శ్రీనివాస్, విద్యార్థి నాయకులు పాల్గొని నివాళులు అర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ అన్న స్మారక అవార్డు ప్రకటించాలని, ప్రభుత్వాన్ని కోరారు. గద్దర్ స్మృతి వనం,ట్యాంక్ బండ్ మీద గద్దర్ విగ్రహం, గద్దర్ జీవితం చరిత్రను తెలంగాణ పాఠ్యాంశంలో చేర్చాలని కోరారు.



'భువనగిరి నుంచి అవకాశం ఇవ్వండి'

నవతెలంగాణ-ఓయూ

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి లోకసభ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు కాంగ్రెస్ తరపున అవకాశం ఇవ్వాలని గాంధీ భవన్‌లో బుధవారం టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పున్నా కైలాష్ నేత అప్లికేషన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలకష్ణ నేత, రాంబాబు నాయుడు, నాగార్జున, శ్రీకాంత్ పాల్గొన్నారు.



పరిశోధక విద్యార్థుల థీసిస్ సబ్మిషన్ గడువు పొడిగించాలి

నవతెలంగాణ-ఓయూ

ఓయూలో పరిశోధన చేస్తున్న 2017 బ్యాచ్ స్కాలర్స్ థీసిస్ సబ్మిషన్‌కు కనీసం మూడు నెలల గడువు పొడిగించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఓయూ కమిటీ ఆధ్వర్యంలో స్టూడెంట్స్, స్కాలర్స్ ఓయూ వీసీ ఛాంబర్ ఎదుట (ప్రొటెస్ట్) బుధవారం ధర్నా నిర్వహిం చారు. ఈ సందర్భంగా పి.డి.ఎస్.యూ జాతీయ నేత ఎస్.నాగేశ్వర రావు, పి.డి.ఎస్.యూ ఓయూ అధ్యక్షులు ఎస్.సుమంత్ లు మాట్లాడుతూ ఓయూ వీసీ నిర్ణయాల వలన విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్లు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు అన్నారు. ప్రి సబ్మిషన్ సెమినార్ పూర్తి అయిన తరువాత సబ్మిషన్ కోసం 3 నెలలు సమయం ఇవ్వాలని యు.జి.సి నిబంధనలు ఉంటే ఓయూ మాత్రం కేవలం 10 రోజులు మాత్రమే ఇచ్చి స్కాలర్స్‌కు తీవ్ర మానసిక వేదనకు గురిచేస్తున్నదన్నారు. ప్రి సబ్మిషన్ సందర్భంగా వచ్చిన సజెషన్స్ పై వర్క్ చేయడానికి, యాంటి ప్లాగరిజం చెక్ చేసుకోవడానికి, ప్లాగరిజం రిపోర్ట్ మీద వర్క్ చేయడానికి సమయం సరిపోక పోవడం, థీసిస్ సబ్మిషన్ గడువు ఇవ్వడంతో స్కాలర్స్ తీవ్ర భయాందోళనకు గురవుతున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఓయూలో మాత్రమే రీసెర్చ్‌కు డెడ్ లైన్ పెట్టడం యాంటి ఏకడమిక్ చర్యలలో భాగమే అని అన్నారు. సాఫ్ట్ బైండింగ్ చేసుకొని వచ్చిన స్కాలర్స్ థీసిస్ కూడా కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆఫీసులో తీసుకో వడం లేదంటే యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ అధికారులు ఎంత అమానవీయంగా ఉన్నారో తేటతెల్లం అవుతున్నదని అన్నారు. ఇదిలా ఉండగా ఓఎస్డీ ప్రొ. రెడ్యా నాయక్ నిరసన వద్దకు వచ్చి మాట్లాడగా కాస్త వాగ్వాదం చోటుచేసుకుంది. సాఫ్ట్ బైండింగ్ చేసుకున్న వారి థీసిస్ బుధవారం కూడా తీసుకుంటామని హామీ ఇచ్చారు. యూనివర్సిటీ వి.సి తో పొడిగింపు గురించి చర్చించి నిర్ణయం చెబుతామని ఓఎస్డీచ స్టూడెంట్ డీన్ హామీ ఇచ్చారు. తక్షణమే వీసీ ఈ అంశం పై సానుకూల నిర్ణయ తీసుకోవాలని ,లేనియెడల ఆందోళనలు తీవ్రతరం చేస్తా మని విద్యార్థుల హెచ్చరించారు. పి.డి.ఎస్.యూ ఓయూ నేతలు ప్రశాంత్,సతీష్, క్రాంతి ,పర్వేజ్ కమల్,సుమన్, దిలీప్, అనిల్, దీపిక, వర్షిత,నందిని, సౌజన్య, రవళి, నవీన్, రోషిని, వెన్నెల పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య బీమా కరువు.. ?

నవతెలంగాణ-ఓయూ

ఓయూలో గత కొన్ని సంవత్సరాలుగా ఆరోగ్య బీమా లేక పోవడంతో ఎదైనా ప్రమాదం జరిగితే గత్యంతరం లేక పోవడంతో ప్రభుత్వ ఆస్పత్రిని ఆశ్రయిస్తున్నట్టు విద్యార్థులు చెబుతున్నారు. ఆరోగ్య బీమా తో పాటుగా ఏదైనా ప్రమాదాలు జరిగితే యాక్సిడెంట్ బీమా విద్యార్థులకు వర్తించేలా చొరవ చూపాలని విద్యార్థులు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

టిప్పర్ లారీ ఓనర్లు, కార్మికుల సమస్యలు తీర్చండి

- బంజారాహిల్స్ టిప్పర్ లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు, కార్మికులు
- మినీ టిప్పర్ లారీ డ్రైవర్ల ఆందోళన



నవతెలంగాణ-బంజారా హిల్స్

పగటి వేళల్లో నగరంలో టిప్పర్ లారీలు తిరగొద్దని పోలీసులు పెట్టిన నిబంధనను ఎత్తివేయాలని గతంలో మాదిరిగానే అనుమతి ఇవ్వాలంటూ బంజారాహిల్స్ టిప్పర్ లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు, కార్మికులు డిమాండ్ చేశారు. గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా చేపట్టిన మినీ టిప్పర్ లారీ ఓనర్ల నిరసన కార్యక్రమంలో భాగంగా బుధవారం జూబ్లీహిల్స్‌లోని దేవరకొండ నగర్ బీఎస్‌ఆర్ హిల్స్ వద్ద మినీ టిప్పర్ లారీ డ్రైవర్లు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గతంలో నిర్మాణ వ్యర్థాలు,భవన నిర్మాణ వ్యర్థాలు తరలించేందుకు నగరంలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అనుమతించేవారని, అదేవిధంగా రాత్రి మొత్తం అనుమతించేవారని తెలిపారు. కానీ ఇప్పుడు మినీ టిప్పర్ లారీలు పగటి వేళ అసలు నగరంలోనే తిరగొద్దంటూ అధికారులు నిబంధనలు విధించడం సరికాదన్నారు.

మినీ టిప్పర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ సాబేర్ మాట్లాడుతూ మినీ టిప్పర్లను నమ్ముకొని వందలాది కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని తెలిపారు. ఒక్క జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిలింనగర్ ప్రాంతాల్లోనే సుమారు 500లకుపైగా మినీ టిప్పర్ లారీలు ఉంటాయని వాటిపై ఆధారపడి బతికే కుటుంబాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. రాత్రి వేళల్లో నిర్మాణ వ్యర్థాలు తరలించాలంటే లేబర్ దొరకరని,ఎక్కువ ఖర్చు అవుతుందని ఈ నిబంధనను అధికారులు సవరించాలని వారు కోరారు.

రెండు రోజుల్లో తగు నిర్ణయం తీసుకోవా లని లేదంటే నిరవధిక సమ్మె చేస్తామని ప్రకటిం చారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గిరి,నసీరుద్దీన్, నరేష్, వైస్ ప్రెసిడెంట్ మురళి తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో విద్యార్థి ఆత్మహత్య

నవతెలంగాణ-ఓయూ



ఎర్ర నవీన్ (ఫైల్ ఫోటో)

ఓయూ కామర్స్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకెళ్తే.. జగిత్యాల జిల్లా కోరుట్ల కు చెందిన ఎర్ర. నవీన్ (23) ఓయూలోని మంజీర వసతి గృహంలోని తను ఉండే రూమ్ నెంబర్ 14 లో సోమవారం రాత్రి కలుపు మందు తాగాడు. సహ విద్యార్థులు గమనించి నవీన్‌ను గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం ఉదయం మృతి చెందాడు. కామర్స్ ప్రిన్సిపాల్ ప్రొ.శ్రీరాములు, హెడ్ ప్రొ.చిన్నప్ప, చీఫ్ వార్డెన్ డా.శ్రీనివాస్ గాంధీ ఆస్పత్రి లో విద్యార్థి మృతదేహానికి నివాళులు అర్పించారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం నవీన్ కుటుంబ సభ్యులకు వారు రూ. 30 వేల ఆర్థిక సహాయం అందజేశారు. నవీన్ మృతదేహాన్ని సహ విద్యార్థులుచూసి బోరున విలపించారు. అనంతరం మృతదేహాన్ని నవీన్ స్వగ్రామానికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

నేడు సంతాప సభ

నేడు ఓయూ కామర్స్ కాలేజ్ లో నవీన్ సంతాప సభ ఏర్పాటు చేసిన్నట్లు ప్రిన్సిపాల్ ప్రొ.శ్రీరాములు పేర్కొన్నారు. ఇటు విద్యార్థులు, అటు ప్రొపెసర్స్ అంత కొంత నవీన్ కుటుంబానికి ఆర్థిక సహాయం చేయాలని ప్రయత్నాలు చేస్తున్నారు.

బిల్లులు సకాలంలో ఇచ్చేలా కృషి

- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



నవతెలంగాణ-బంజారా హిల్స్...

గతంలో మాదిరిగా కాకుండా పనులు పూర్తయిన కొన్ని మాసాలలోనే కాంట్రాక్టర్లకు బిల్లులు సకాలంలో ఇచ్చేలా కృషి చేస్తానని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి హామీ ఇచ్చారు. బుధ వారం బంజారాహిల్స్ డివిజన్‌లోని ఉదయ్ నగర్, సింగాడి కుంటలో మంచినీటి మురుగు నీటి సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుని రూ. 12 లక్షల నిధులతో పైప్ లైన్ పనులకు మేయర్ శంకుస్థాపన చేశారు. వాటర్ వర్క్స్ డీజీ ఎం.శ్రీనివాస్, మేనేజర్ రాంబాబు, ఇతర అధికారులు, సిబ్బంది, స్థానికులు పాల్గన్నారు.

ప్రజల సౌకర్యార్థం అత్యాధునిక కమ్యూనిటీ హాల్

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

పేద, మధ్య తరగతి ప్రజల సౌకర్యార్థమే ఎస్‌ఆర్‌నగర్‌లో అత్యాధునిక కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టినట్టు మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. బుధవారం ఆయన ఎస్‌ఆర్ నగర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను పరిశీలించారు. డబుల్ సెల్లార్, జీ ప్లస్ వన్ విధానంలో సుమారు రూ. 11.92 కోట్ల వ్యయంతో పనులు చేపట్టినట్టు వివరించారు. కానీ పెరిగిన ధరల దష్ట్యా రూ. 12.96 కోట్లు ఇప్పటి వరకు ఖర్చు చేసినట్టు చెప్పారు. డబుల్ సెల్లార్ పార్కింగ్ కోసం, గ్రౌండ్ ఫ్లోర్‌లో ఫంక్షన్ హాల్, ఫస్ట్ ఫ్లోర్ లో డైనింగ్ హాల్ ఉండే విధంగా డిజైన్ చేసి నిర్మించినట్టు చెప్పారు. కరోనా కారణంగా నిర్మాణ పనులలో జాప్యం జరిగిందని తెలిపారు. నిధుల కొరత కారణంగా నిర్మాణ పనులు నిలిపివేయాల్సి వచ్చిందని అధికారులు ఆయనకు తెలిపారు. ఇంకా ఎలక్ట్రికల్, శానిటేషన్, పెయింటింగ్ తదితర పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని వారు తెలిపారు. అదనపు నిధులు మంజూరైతేనే పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు సాధ్యమైతుందని చెప్పారు. భవన నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు అవసరమైన అదనపు నిధులు మంజూరుకు కృషి చేస్తానని , త్వరలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోనికి తీసుకురావాలని ఎమ్మెల్యే తెలిపారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ డీఈ రాధాకష్ణ, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, ఈఈ ఇందిర, వాటర్ వర్క్స్ జీఎం హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న కుంభాభిషేకం పూజలలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ బుధవారం పాల్గొన్నారు. ప్రతీ 12 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే కుంభాభిషేకం సందర్భంగా నాలుగు రోజుల నుంచి శత చండీయాగం, హెూమాలు నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యేకు ఆలయ పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వేదమంత్రాలతో పండితులు ఆయనకు ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, ఆలయ చైర్మెన్ సాయిబాబా గౌడ్, ఈఓ నాగరాజు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు హన్మంతరావు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఆఫీసర్లకు, వాలంటీర్లకు ప్రశంసలు



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 4 జాతీయ శిబిరాలైనవంటి జాతీయ సాహస, శిబిరం, జాతీయ యువజన శిబిరం 2 జాతీయ సమైక్యత శిబిరాలకు వెళ్లిన ప్రోగ్రాం ఆఫీసర్లను, వాలంటీర్లను ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ప్రొ. సవీన్ సౌధ బుధవారం ఓయూ కార్యక్రమంలో ప్రత్యేకంగా అభినందించారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రి శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జాతీయ యువ శిబిరానికి డా. జగదీశ్వర్ ఆధ్వర్యంలో 10 మంది వాలంటీర్లు మధురై తమిళనాడులోని కామరాజు విశ్వవిద్యాలయంలో జరిగిన జాతీయ సమైక్యత శిబిరంలో డా. బి శోభారాణి ఆధ్వర్యంలో 10 మంది వాలంటీర్లు ఎంఎల్‌ఆర్ఐటీ యూనివర్సిటీలో జరిగిన జాతీయ సమైక్యత శిబిరంలో డాక్టర్ జాహేదా ఆధ్వర్యంలో 6 వాలంటీర్లు, మహారాష్ట్ర నాసిక్ లో జరిగిన జాతీయ యువజన ఉత్సవంలో డా. చినబాబు ఆధ్వర్యంలో నలుగురు వాలంటీర్లు పాల్గొని ఉస్మానియా విశ్వవిద్యాలయాల కీర్తి ప్రతిష్టలను ఎగువ వేయడం తోపాటు వివిధ అంశాల్లో ఓయూ వాలంటీర్లు ముందున్నారని ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రొ.సవీన్ సౌదా, వీసీ ప్రొ. రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ. లక్ష్మీనారాయణ విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ. 26,000 ఇవ్వాలి

- సీఐటీయూ నాయకుల డిమాండ్



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

ఎర్రగడ్డ ప్రభుత్వ మానసిక వైద్యశాలలో పనిచేయు కాంట్రాక్టు కార్మికులందరికీ కనీస వేతనం నెలకు రూ. 26,000 ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూశిఐ ఆధ్వర్యంలో హాస్పటల్ యూనియన్ నాయకులు రాపర్తి అశోక్ బుధవారం హాస్పటల్ ఆర్.ఎం.ఓ మనోహర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 16న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. హాస్పటల్‌లో పనిచేయు కాంట్రాక్ట్ కార్మికులందర్నీ పర్మినెంట్ పర్మినెంట్ చేసి పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా అమలుచేసి పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకించి బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించుదాం అని అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశంలో ఉన్నటువంటి అన్ని రంగాల కార్మికులు ఐక్యంగా చేసేటువంటి సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

అడ్డాల వద్ద మూత్రశాలలు ఏర్పాటు చేయాలి

- సీఐటీయూ సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి టి.మహేందర్, సీఐటీయూ జూబ్లీహిల్స్ జోన్ కన్వీనర్ రాపర్తి అశోక్
- వారసిగూడ, మోతీనగర్ అడ్డాల వద్ద నిరసన

నవతెలంగాణ-ఓయూ

వారసిగూడ లేబర్ అడ్డా దగ్గర మూత్రశాలలు ఏర్పాటు చేయాలని, మంచినీళ్లు, సౌకర్యం కల్పించాలని సీఐటీయూ సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి. టి.మహేందర్ కోరారు. ఫిబ్రవరి 16 దేశ వ్యాప్త సమ్మె ను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం వారసి గూడ లేబర్ అడ్డా దగ్గర ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి టి.మహేందర్ మాట్లాడుతూ. వారసిగుడ అడ్డా మీద దాదాపు 800 మంది కార్మికులు ఉంటారని వారికి ఎలాంటి సౌకర్యం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. కార్మికులకు పనులు లేక రోడ్డు మీద ఎండలో సాయంత్రం వరకు నిరీక్షణ చేస్తున్నారన్నారు. పట్టణ ఉపాధి హామీ కల్పించి వారికి సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలని డిమాండ్



చేశారు. అడ్డా వద్ద షెడ్డు ఏర్పాటు చేసి మంచినీళ్ల సౌకర్యం కల్పించాలని, ఐదు రూపాయల భోజనం ఏర్పాటు చేసి ఆ సంఘటిత రంగ కార్మికులను ఆదుకోవాలని కోరారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు ఇన్సూరెన్స్ కార్డులు వేలు ముద్రలని మీ సేవ చుట్టూ తిప్పించుకుని వివోసీ కార్డులో తీసుకోకుండా కుట్ర పన్నుతున్నారన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికులందరూ కలిసి పోరాడాలన్నారు. ఆధార్ కార్డు ఆధారంగానే కార్డులు రెన్యువల్ చేసి కొత్త కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 16న జరిగే సమ్మెలో భాగంగా పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ వారసిగూడ అధ్యక్షులు కష్ణ, పర్శరాములు, రాంబాబు,సోమేశ్, శ్రీను మహమూద్, మల్లేష్ , నరసింహ, వెంకటమ్మ,, పాల్గొన్నారు.



మోతీ నగర్ లేబర్ అడ్డా వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన

జూబ్లీహిల్స్ : మోతి నగర్ అడ్డా వద్ద ఐదు రూపాయల భోజనం కేంద్రం ఏర్పాటు చేసి మంచినీళ్లు, బాత్రూముల సౌకర్యం కల్పించాలని సీఐటీయూ నాయకులు కార్మికులతో కలిసి బుధవారం నిరసన తెలిపారు. ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కార్మికులను కోరారు. దేశవ్యాప్త సెక్టోరియల్ సమ్మెలో భాగంగా మోతి నగర్ అడ్డా వద్ద సమావేశం జరిగింది. సీఐటీయూ జూబ్లీహిల్స్ జోన్ కన్వీనర్ రాపర్తి అశోక్ మాట్లాడుతూ మోతి నగర్ అడ్డా వద్ద కనీస సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి పట్టణ ఉపాధి హామీ కల్పించి సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాల్సిందిగా డిమాండ్ చేశారు. అడ్డావద్ద షెడ్డు ఏర్పాటు చేసి మంచినీళ్ల సౌకర్యం కల్పించి, ఐదు రూపాయల భోజనం ఏర్పాటు చేయాలని కోరారు ఫిబ్రవరి 16న జరిగే సమ్మెలో భాగంగా మోతినగర్ నుంచి బోరబండ వరకు పెద్ద ఎత్తున ర్యాలీతో చేస్తామన్నారు. కార్యక్రమంలో మోతినగర్ అడ్డా కార్యదర్శి బాలు, సోమేశ్, శ్రీను మహమూద్, అన్వేష్, ఏఆర్ నరసింహ, చిట్టి ,సోనీ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు క్రీడలు అవసరం : ఓయూ వీసీ



నవతెలంగాణ-ఓయూ

గణతంత్ర దినోత్సవ సందర్భంగా జనవరి 22-25 వరకు మూడు బోధనేతర ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉద్యోగులకు క్రీడలు నిర్వహించిన విషయం తెలిసిందే. క్రీడలలో భాగంగా వివిధ క్రీడల్లో గెలుపొందిన విజేతలకు సెనేట్ హాల్లో బహుమతులు ఓయూ వీసీ,రిజిస్ట్రార్ ల చేతుల మీదుగా బుధవారం అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథి ప్రొ. రవీందర్ యాదవ్, రిజిస్ట్రార్ ప్రొ.పి. లక్ష్మీనారాయణ, యూజీసీ డీన్ ప్రొ. గడ్డం మల్లేషం హాజరై విజేతలకు, రన్నర్స్ కు బహుమతుల ప్రదానం చేశారు. అధ్యక్షుడు టుప్పియా, ఎన్.జి.ఓస్ అధ్యక్షత జ్ఞానేశ్వర్ అధ్యక్షతన వహించారు.

వీసీ మాట్లాడుతూ. ఉద్యోగులకు క్రీడల పోటీల వలన మానసిక, శారీరక ఒత్తిడిని తగ్గించి ఐక్యతను పెంపొందుతుందన్నారు. భవిష్యత్తులో క్రీడలకు సంబంధించిన పూర్తి సహకారాన్ని అందిస్తామని చెప్పారు. టి.శివశంకర్, కె.యస్.నాగరాజా రావు, అధ్యక్షులు, ఎ.రవి, యస్.విజయ్ కుమార్, అక్బర్ బేగ్, ప్రధాన కార్యదర్శులు, కె.భీమయ్య, జి.శంకరయ్య, అశోక్ కుమార్, జలీల్, రాజేశ్వర్ రావు, భూమా రావు, శంకర్ నాయక్, యూసుఫ్ పాల్గొన్నారు.

విద్యను పది మందికి పంచాలి

- ఐఎస్ఓ ఇన్స్టిట్యూషన్స్ చైర్మెన్, రిటైర్డ్ అడిషనల్ కమిషనర్ టీఎన్ వెంకటస్వామి.
- ఘనంగా ఐఎస్ఓ వార్షికోత్సవం



నవతెలంగాణ-ఓయూ

వచ్చిన విద్యను పది మందికి పంచినప్పుడే దానికి సార్థకత ఉంటుందని ఐఎస్ఓ ఇన్స్టిట్యూషన్స్ చైర్మెన్ రిటైర్డ్ అడిషనల్ కమిషనర్ టీఎన్ వెంకటస్వామి అన్నారు. సమాజాభివృద్ధి ఒక విద్యతోనే సాధ్యమవుతుందని, నేడు ప్రపంచంలోనే భారతదేశంలో ఒక ప్రత్యేకమైన గుర్తింపు వచ్చిందని తెలిపారు.పేరు ప్రఖ్యాతలు హెూదా విద్య వల్లనే వస్తాయని పేర్కొన్నారు. నేటి సమాజంలో విద్య చాలా అవసరమని, పిల్లలకు ఆస్తులు ఇవ్వలేకపోయినా విద్యను మాత్రం అందించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఐఎస్ఓ ఇన్స్టిట్యూషన్స్ డిగ్రీ కళాశాల యాన్యువల్ డే వేడుకలు బుధవారం తార్నాకలోని మర్రి చెన్నారెడ్డి ఫంక్షన్ హాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళాశాల డైరెక్టర్ వినోద వెంకటస్వామి తో కలిసి టీఎన్ వెంకటస్వామి హాజరయ్యారు. ఇటీవల నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఈ సందర్భంగా బహుమతులు, మెడల్స్ అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. నేటి పరిస్థితుల్లో సబ్జెక్టు వైస్‌గా అనేక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉందని విద్యార్థులు ఆ పరిజ్ఞానాన్ని అందుపుచ్చుకోవాలన్నారు. ఫ్యాకల్టీ కూడా విద్యార్థులకు బోధన చెప్పే విషయంలో కొత్త కొత్త మార్గాలను అన్వేషించాలని సూచించారు. విద్యార్థులకు హత్తుకునే విధంగా విద్య ను విడమర్చి వివరించి చెప్పాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చదువులోనే కాదు ఆటపాటల్లో కూడా తక్కువ కాదని వారి వారి నైపుణ్యతను బయటకు తీసి చూపించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు విద్యార్థులు చేసిన స్కిట్లు ఎంతో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ రమాదేవి, డీన్ మనోహర్, ప్రిన్సిపల్స్ రాజశ్రీ, ప్రదీప, దివ్య తోపాటు అధ్యాపకులు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



టీఎస్‌ఈఈ ఐఎన్‌టీయూసీ-327లో ఉద్యోగుల చేరిక



నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎస్‌ఈఈ-327 ఐఎన్‌టీయూసీ రాష్ట్ర యూనియన్ సెక్రటరీ జనరల్ ఈ. శ్రీధర్, సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభాకర్, స్టేట్ మీడియా సెక్రటరీ కె. శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం టీఎస్‌ఈఈ ఐఎన్‌టీయూసీ-327లోటీఆర్‌వీకేఎస్ పలువురు నిజామాబాద్ జిల్లా ట్రాన్స్‌కో విద్యుత్ ఉద్యోగులు చేరారు. 327 యూనియన్ చేసే కార్యక్రమాలకు ఆకర్షితులై సభ్యత్వం తీసుకున్నారు. వీరిలో లైన్ ఇన్‌స్పెక్టర్లు టి.శ్రీనివాస్, జి. శంకర్, జూనియర్ లైన్‌మెన్లు ఎండి ముస్తాక్, జి.మురళి, ఆర్టిజన్ గ్రేడ్ వన్ ఏ.రాజేష్ ఉన్నారు.

ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య వారధిగా పత్రికలు



హనుమంతు ముదిరాజ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

నవతెలంగాణ తెలుగు దినపత్రిక నూతన క్యాలెండర్, డైరీని వికారాబాద్ జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శి, టీఎస్‌ఆర్టీసీ-టీజేఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్, రాష్ట్ర చీఫ్ వైస్ ప్రెసిడెంట్ డీవీకే రావు, పలువురు ముఖ్య నాయకులతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. అనంతరం హనుమంతు ముదిరాజ్ మాట్లాడుతూ పత్రికలు ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నాయని, ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య వారధిగా పత్రికలు వ్యవహరిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజాసమస్యలను వెలికితీసి ప్రజలకు న్యాయం జరిగే వరకు నవతెలంగాణ దినపత్రిక నిరంతరం పనిచేయడం అభినందనీయమని ఆయన తెలిపారు

గ్రేటర్ హైదరాబాద్‌లో

ట్రాఫిక్ కష్టాలు తీరేనా..!

- ముఖ్యమంత్రి ఆదేశాలు...
- అధికారుల అధ్యయనం



నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్ హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు చెప్పనక్కర్లేదు. నగరంలో కొన్ని సందర్భాలల్లో ఒక కిలోమీటర్ వెళ్లాలన్నా గంటల తరబడి రహదారులపై వేచి చూడా ల్సిన పరిస్థితులున్నాయి. కొన్ని ప్రాంతాలల్లో కిలోమీర్ పొడువునా ట్రాఫిక్ జామ్‌లతో వాహన దారు లు నానా ఇబ్బందులకు గురవుతుంటారు. గ్రేటర్‌లో సబ్ వే, అండర్ పాస్, సర్ఫేస్ వేలను, ఫ్లైఓవర్లను నిర్మించినా ట్రాఫిక్ సమస్యలను అధికమించలేకపోతున్నారు. ఇది లా వుండగా ట్రాఫిక్ నియంత్రించేందుకు సరిపడిన ట్రాఫిక్ సిబ్బంది లేకపోవ డంతో మరో సమస్యగా మారింది. గతంలో పోలీస్ అధికారులు సమీక్షలు, సమావేశాలు నిర్వహించి, ట్రాఫిక్ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లిన సందర్భాలున్నాయి. కానీ ఆశించినంత మేరకు ఫలితాలను రాబట్టలేకపోయారు. తాజాగా గ్రేటర్ హైదరాబాద్ ట్రాఫిక్‌పై బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో సీఎం సమీక్షించడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. హైద రాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పోలీస్ అధికా రులు, మున్సిపల్ జోనల్ కమిషనర్లు సమన్వయంతో ట్రాఫిక్ నియంత్ర ణపై దృష్టి సారించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణపై పోలీస్ విభాగం అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని, తగినంత మంది హెూం గార్డుల నియామకాలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించడంతో ట్రాఫిక్ నియంత్రణపై అధ్యయనం చేసేందుకు అధికారులు దృష్టి సారించారు. వివిధ విభాగాల్లో పని చేస్తున్న హెూంగార్డులను వెంటనే ట్రాఫిక్ విభాగానికి తిరిగి రప్పించేందుకు ఆరా తీస్తున్నారు.

దోమలగూడ గగన్‌మహల్‌లో వృద్ధురాలు దారుణ హత్య



నవతెలంగాణ-ముషీరాబాద్

వృద్ధురాలు దారుణ హత్యకు గురైన ఘటన దోమలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది . దోమలగూడ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ముషీరాబాద్ నియోజకవర్గంలోని దోమల గూడ గగన్ మహల్ రాధామాధవ్ నివాస్‌లో స్నేహల తా దేవి (61)తన భర్త మహేష్ కుమార్, కుమారుడు పవన్ కుమార్, ఇద్దరు కుమార్తెలతో కలిసి నివాసం ఉంటున్నారు. భర్త మహేష్ కుమార్ గోషామహల్‌లో ప్లైవుడ్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఇటీవలే రెండు నెలల క్రితం బీహార్ కు చెందిన మహేష్ అనే వ్యక్తిని కేర్ టేకర్‌గా విధుల్లోకి తీసుకున్నారు. ఇంటి యజమాని మహేష్ కుమార్ తన కుమారుడు పవన్ కుమార్‌తో కలిసి గోషామహల్‌లోని తన ప్లేవుడ్ షాప్ కి వెళ్లగా ఇదే అదునుగా భావించిన మహేష్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో వృద్ధురాలు అయినటువంటి స్నేహలతాదేవి కాళ్లు చేతులు కట్టేసి నోట్లో బట్టలు కుక్కి ఇంట్లోని నగదు బంగారు ఆభరణాలతో పరారైనట్టు పోలీసులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు స్నేహలత దేవిని హుటాహుటిన హైదర్‌గూడలోని అపోలో ఆస్పత్రి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్టు డాక్టర్లు ధ్రువీకరించారు. పోలీ సులు ఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

చిరు పెట్టుబడిదారులకు న్యాయం చేయండి : బాధితులు

నవతెలంగాణ-బంజారాహిల్స్...

సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో బుధవారం రిటైల్ ఇన్వెస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడారు..40 ఏండ్ల క్రితం స్థాపించిన యుపీసీఎల్ సంస్థలో సుమారు రెండు లక్షల మంది వరకు పెట్టుబడులు పెట్టారని చెప్పారు. 2020 అనంతరం సదరు సంస్థను ఇతరులు కొనుగోలు చేయగా చట్టబద్ధంగా పెట్టుబడుల స్వీకరణ ఆపివేయాల్సి ఉండగా నిబంధనలకు విరుద్ధంగా స్వీకరించారని ఆరోపించారు. దీంతో లక్షలాదిమంది తీవ్రంగా నష్టపోయారని ఈ విషయమై తాము ప్రధాని కార్యాలయంతో పాటు జాతీయస్థాయి దర్యాప్తు సంస్థలైన సెబి,సి.బి.ఐ, మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ ఎఫైర్స్, ట్రిబ్యునల్ వంటి సంస్థలకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. 300 మంది సభ్యులు కలిగిన తమ అసోసియేషన్ ఏండ్ల తరబడి తమకు న్యాయం చేయాలని పోరాటం చేస్తున్నా ప్రయోజనం లేకుండా పోతున్నదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

స్టాఫ్ నర్సుల ఉద్యోగాలు పొందిన ఎస్సీ కార్పొరేషన్ విద్యార్థులు..

- హర్షం వ్యక్తం చేసిన హైదరాబాద్ జిల్లా కలెక్టర్
- ఎస్సీ కార్పొరేషన్ అధికారులకు అభినందనలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

అర్హులైన దళిత యువతకు ఎస్సీ కార్పొరేషన్ హైదరాబాద్ జిల్లా ద్వారా వివిధ రంగాల్లో అందిస్తున్న నైపుణ్య శిక్షణ సత్ఫలితాలిస్తున్నాయి. తాజాగా ఎంపికైనా స్టాఫ్ నర్సుల్లో 80 మంది నర్సింగ్ విద్యార్థులు ఎస్సీ కార్పొరేషన్ హైదరాబాద్ జిల్లా ద్వారా శిక్షణ పొందినవారే కావడం విశేషం. తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగ దళిత యువతి, యువకులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా నర్సింగ్ విభాగంలో(405) మంది విద్యార్థులకు శిక్షణ ఇప్పించగా..(80)మంది ప్రభుత్వ ఉద్యోగానికి అర్హత సాధించారు. అందుకు సంబంధించిన నియామకపత్రాలను బుధవారం ఎల్బీస్టేడియంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వర్ రావు సమక్షంలో అందజేశారు. అలాగే శిక్షణ పొందిన మిగతా(266) మంది విద్యార్థులకు కాంట్రాక్ట్ పద్ధతిన గ్రామీణ ప్రాంతాలలో పల్లె దవాఖానాలలో, పట్టణ ప్రాంతాలలో బస్తీ దవాఖానాలలో, మరి కొందరు ప్రయివేట్ ఆస్పత్రుల్లో పనిచేస్తున్నారని, సుమారు 25 మంది విద్యార్థులు విదేశాలలో ఉపాధి పొందుతున్నారని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఎస్సీ కార్పొరేషన్ అధికారులను అభినందించారు.

మేడిపల్లి పోలీస్ స్టేషన్ ఎదుట

మహిళా కానిస్టేబుల్ ఆందోళన

- తన భర్తను అన్యాయంగా రిమాండ్‌కు తరలించడానికి కుట్ర చేస్తున్నారని ఎస్సై పై ఆరోపణ

నవతెలంగాణ-బోడుప్పల్

మేడిపల్లి ఎస్సై నకిలీ ఎమ్మెల్సీ సృష్టించి తన భర్తను అన్యాయంగా రిమాండు కు తరలించాలని కుట్రలు చేస్తున్నారని మహిళా కానిస్టేబుల్ నాగమణి తీవ్ర ఆరోపణలు చేశారు. బుధవారం ఆమె మేడిపల్లి పోలీస్ స్టేషన్ ముందు ఆందోళన చేశారు. కొందరు వ్యక్తులు తప్పుడు పత్రాలతో తమ ఇంటిని కబ్జా చేసి దౌర్జన్యం చేస్తున్నారంటూ మేడిపల్లి పోలీసులను ఆశ్రయించామని, క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేయవలసిన ఎస్సై కబ్జాదారులకు సహకరిస్తున్నాడని ఆరోపించారు.

కానిస్టేబుల్ మాట్లాడుతూ గత సంవత్సరం జూన్‌లో బోడుప్పల్ లోని తమ ఇంటిని కొందరు తప్పుడు ధ్రువపత్రాలతో ఇంటిని కబ్జా చేయడానికి రాగా వారిపై మేడిపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా విషయాన్ని క్షేత్రస్థాయిలో ఎస్ఐ శివకుమార్ దర్యాప్తు చేయకుండా అవతలి వారి వద్ద నుంచి డబ్బులు తీసుకొని వారికి వత్తాసు పలకాడని ఆరోపించారు. ఈ మేరకు మానవ హక్కుల కమిషన్,సీపీకి ఫిర్యాదు చేశామన్నారు. దాంతో కక్ష పెచ్చుకున్న ఎస్సై తమ కుటుంబ కలహాలను అసరా చేసుకుని తన అమ్మతో కేసు పెట్టించి నకిలీ ఎమ్మెల్సీ సృష్టించి తన భర్తను అన్యాయంగా రిమాండు కు తరలించారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో పోలీస్ స్టేషన్ పరిధిలో గొడవలు జరిగి కొట్టుకున్న కూడా రిమాండ్‌కు తరలించకుండా స్టేషన్ బెయిలు తో వదిలిపెట్టే చట్టాలు ఉండంగా తన భర్తను అన్యాయంగా రిమాండ్‌కు తరలిం చారన్నారు. ఒక మహిళా కానిస్టేబుల్‌కే ఇలా జరిగితె సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. కనీసం దర్యాప్తు చేయకుండా కేసులు నమోదు చేస్తున్నారంటూ కన్నీరు పెట్టుకున్నారు. ఎస్సై శివకుమార్ మొదటి నుంచి వివాదాస్పదని....అతనికి సంబంధించిన ఆడియోలు ఉన్నాయని, భూముల విషయంలో సెటిల్మెంట్ల విషయంలో డీల్ చేయడంలో ఆరితేరాడని...ఎస్సై వ్యవహారంపై రాచకొండ సీపీ విచారణ జరిపి న్యాయం చేయాలని మహిళా కానిస్టేబుల్ కోరారు.

అత్త పై దాడి కేసులో అల్లుడు రిమాండ్ : మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ గోవింద్ రెడ్డి

కర్రతో దాడి చేయడం వల్ల చిటికెన వేలు విరిగిపోవడంతో ఆదిలక్ష్మి తన కూతురు కానిస్టేబులైన నాగమణి, అల్లుడు వరుణ్ పై మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు 13/24,సెక్షన్ 326,504 కింద కేసు నమోదు చేసి అల్లుడిని రిమాండ్ కు తరలించినట్టు మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ గోవింద్ రెడ్డి తెలిపారు. గతంలో వీరిపై పలు సెక్షన్‌ల కింద కేసులు నమోదయ్యాయన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి అదృశ్యం..



నవతెలంగాణ - ధూల్ పేట్

అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘ టన మంగళ్ హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రవి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ్‌హాట్ టక్కర్ వాడి, లోయర్ ధూల్‌పేట్ శ్రీనులాల్, అతని కజిన్ సోదరుడు ఆటో డ్రైవర్ ప్రేమ్ సింగ్ అలియాస్ గణష్ ఆటో నడుపుతూ కుటుంబంతో నివసిస్తున్నాడు. సోదరుడు టి. ప్రేమ్ సింగ్ అతని భార్యతో గొడవల కారణంగా గత సంవత్సరం నుండి ఆటో నడుపుతూ శివమందిర్ ఆటో స్టాండ్‌లో నివసిస్తున్నాడు. అయినా అతను క్రమం తప్పకుండా వారికి ఫోన్ చేసి, వారంలో ఓ సారైన్ వారి ఇంటికి వచ్చేవాడు. బజారులో కలిస్తే అతని యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటారు. 15వ తేదీన సంక్రాంతి పండుగ రోజున దాదాపు గంట సేపు మధ్యాహ్న సమయంలో వారి ఇంటికి వచ్చి అరగంట సేపు ఉండి వెళ్లిపోయాడు. ఆ తర్వాత బయట రెండు, మూడు సార్లు ఆయన్ను కలుసుకుని వారి బాగోగుల గురించి చర్చిం చారు.

కాని గత వారం నుండి అతని సోదరుడి నుండి ఫోన్ కాల్ లేకపోవడంతో, కలువకపోవడంతో శివ మందిర్ ఆటో స్టాండ్‌కి వెళ్లి ఏమి జరిగిందో ఆరా తీయగా, వారిని విచారించగా అతని సోదరుడు ఆటోలో రావడం లేదని తెలిసింది. గత వారం నుంచి సాధ్యమైన అన్ని ప్రదేశాలలో, బంధువుల ఇండ్లలో వెతికినా ఫలితం లేకపోవడంతో స్థానిక పోలీసులకు అన్న శ్రీనులాల్ పిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తప్పిపోయిన ఆటో డ్రైవర్ ప్రేమ్ సింగ్ అలియాస్ గణేష్ ఆచూకీ తెలిస్తే సమాచారం అందించాలని కోరారు.

విద్యార్థులకు డ్రామా, మోనో యాక్షన్ కాంపిటీషన్



నవతెలంగాణ-సిటీబ్యూరో

నేషనల్ గ్రీన్ కోర్స్(ఎన్‌జీసీ) తెలంగాణ ఆధ్వర్యంలో హైదరాబాద్ జిల్లా విద్యా శాఖ సమన్వయంతో ప్రయివేట్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు డ్రామా, మోనో యాక్షన్ కాంపిటీషన్ నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ ధికారిణి ఆదేశాల మేరకు ఈనెల 29న అమీర్‌పేట్ మండలంలోని సిస్టర్ నివేదిత స్కూల్‌లో జిల్లా సైన్స్ అధికారి సి.ధర్మేందర్ రావ్, టీఎస్ ఎన్‌జీసీ స్టేట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ టి. రాధికా నిర్వహించారు. ఈ కాంపిటీషన్ నిర్వహణకు సిస్టర్ నివేదిత స్కూల్ ప్రిన్సిపాల్ లలిత కుమారి సహకరిం చారు. జిల్లాలోని మొత్తం 25 స్కూల్ నుంచి విద్యార్థులు గైడ్ టీచర్ ప్రోత్సాహంతో డ్రామా, మోనో యాక్షన్ కాంపి టీషన్‌లో పాల్గొన్నారు. విజేతలకు జిల్లా సైన్స్ అధికారి సి.ధర్మేందర్ రావ్, టీఎస్ ఎన్‌జీసీ స్టేట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రాధిక, సిస్టర్ నివేదిత డైరెక్టర్ హరి హర ప్రసాద్, న్యాయ నిర్ణేతల చేతులమీదుగా సర్టిఫికెట్, నగదు అందించారు.

డ్రామా అంశం : సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలు, వాటికీ ప్రత్యమ్నాయ మార్గాలు

మొదటి స్థానం : భారతీయ విద్యా భవన్ అంబర్‌పేట్ మండలం విద్యార్థులు నిలిచారు.

రెండోవ స్థానం : జ్ఞానన్న భారతి మోడల్ స్కూల్ బండ్లగూడ మండలం విద్యార్థులు నిలిచారు.

మూడో స్థానం : ప్రభుత్వ ఉన్నత పాఠశాల అజాంపురా విద్యార్థులు నిలిచారు.

మోనో యాక్షన్ కాంపిటీషన్

మొదటి స్థానం : లిటిల్ ఫ్లవర్ టెంపుల్ ఆల్వాల్ స్కూల్ విద్యార్థి ఎం. గణేష్

రెండో స్థానం : నృపతుంగ హై స్కూల్ విద్యార్థి సిదేశ్

మూడో స్థానం : ప్రభుత్వ ఉన్నత పాఠశాల మలక్ పేట్ విద్యార్థి అపర్ణ నిలిచారు.



సీఎం చేతుల మీదుగా టీసీఆర్పీఏ నూతన డైరీ ఆవిష్కరణ

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ క్లస్టర్ రిసోర్స్ పర్సన్ అసోసియేషన్-2024 సంవత్సర డైరీని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీసీఆర్పీఏ రాష్ట్ర అధ్యక్షులు గంగుల కృష్ణారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరందాసు సంతోష్ కుమార్‌లు సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు సమస్యలు పరిష్కరించాలని కోరారు. గతంలో సమగ్రశిక్షా కాంట్రాక్టు ఉద్యోగుల ఆధ్వర్యంలో జరిగిన నెలరోజుల సమ్మెకు మద్దతు తెలిపిన విషయాన్ని సైతం సీఎంకు గుర్తు చేశారు. దీనికి ముఖ్యమంత్రి స్పందిస్తూ సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలపై పూర్తి అవగాహన ఉందని, తమ ప్రభుత్వం తప్పక సమస్యలను పరిష్కరిస్తుందని హామీనిచ్చారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీసీఆర్పీఏ రాష్ట్ర నాయకులు పాడ్య నాగేశ్వర్ రావు, కొత్తకాపు శ్రీనివాస్ రెడ్డి, బానోతు సేవ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమస్త తెలుగు దినపత్రిక
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్ - మల్కాజిగిరి
గురువారం | ఫిబ్రవరి 01, 2024 | www.navatelangana.com

ప్రజా పాలనకు నిదర్శనం కాంగ్రెస్ పాలన



- కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వి.జగదీశ్వర్ గౌడ్

నవతెలంగాణ-శేరిలింగంపల్లి

[illegible] ఎన్నికల ప్రచారంలో [illegible] నిత్యం ప్రజలలో ఉంటూ వాటి పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. అలాగే ప్రజలకు అన్ని పథకాలు అందేలా కార్యకర్తలను ముందుండి నడపాలని ముఖ్యమంత్రి సూచించారని తెలిపారు.

ట్రాఫిక్ పై అవగాహన ర్యాలీ



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ అధ్వర్యంలో ట్రాఫిక్ ఏసీపీ, కూకట్‌పల్లి ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓ, ఎస్ఐ రమేష్ సమక్షంలో విశ్వ విశ్వాని, సంఘమిత్ర కళాశాలలకు చెందిన 100 మంది విద్యార్థులతో ట్రాఫిక్ పై అవగాహనా ర్యాలీ కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీసులు నిర్వహించారు. ఈ సందర్భంగా 100 మంది విద్యార్థులతో కూకట్‌పల్లి ఐడిఎల్ చెరువు నుంచి కూకట్‌పల్లి పరిధిలో 2కే వాక్ కార్యక్రమం ద్వారా ప్రజలకు ట్రాఫిక్ పై అవగాహన ర్యాలీ చేపట్టడం జరిగింది.

నాలా పనులు వేగవంతం చేయాలి



- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

రాబోయే వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకొని నాలా ప్రక్షాళన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం కూకట్‌పల్లిలోని రంగదాముని చెరువును అయన జీహెచ్ఎంసీ, ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూకట్‌పల్లి రంగదాముని చెరువు నుంచి ప్రవహించే వర్షపు నీరు, డ్రయినేజీ నీరు స్వాన్ లేక్ మీదుగా కూకట్‌పల్లి నాలాలో కలిసే మార్గంలో నాలా సరిగా లేకపోవడంతో భారీ వర్షాలు కురిసిన సమయంలో గత రెండు సంవత్సరాలుగా స్వాన్ లేక్ అపార్ట్‌మెంట్‌లోని, వర్షం నీరు చేరి దాదాపు 200 కార్ల వరకు మునిగిపోయాయన్నారు. ఈ నాల నుంచి వచ్చే వర్షపు నీరు వలన కూకట్‌పల్లి డిపో వద్ద నీరు నిలిచి పోవడంతో బస్సుల రాకపోకలకు ఇబ్బందులు కలిగే విషయం గత రెండు సంవత్సరాలుగా చూస్తూనే ఉన్నామన్నారు. రంగదాముని చెరువు నుంచి కూకట్‌పల్లి డిపో వరకు ఇరిగేషన్ అధికారులు, ఎమ్మార్వో జీహెచ్ఎంసీ అధికారులు సమన్వయం చేసుకొని మార్కింగ్ ఏర్పాటు చేయాలన్నారు. వీలైనంత త్వరగా పనులు ప్రారంభించి, రాబోయే వర్షాకాలంలో నాలా పనులను పూర్తిచేయాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో స్వామి, టౌన్ ప్లానింగ్ సిపి ఉమాదేవి, ఏసిపి మల్లీశ్వర్, ఇరిగేషన్ ఈఈ నారాయణ, మాజీ కార్పొరేటర్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాధనం వృధా.. ప్రజల వ్యధా..

- పబ్లిక్ టాయిలెట్స్‌కు రక్షణ కరువు
- నిరూపయోగంగా మూత్రశాలలు
- పట్టించుకోని అధికారులు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం గ్రేటర్ నగరంలోని పలు పట్టణ ప్రాంతాలలో పబ్లిక్ టాయిలెట్స్‌కు రూపకల్పన చేసి కోట్లాది రూపాయలు వెచ్చించి సౌకర్యాలు కల్పించింది. అవి కాస్త ప్రస్తుతం రక్షణ కరువైపోయి దేనికి పనికి రాకుండా అలంకారప్రాయంగా కనిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే... కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలోని ప్రధాన కూడళ్ళలో బస్ స్టాప్‌ల వద్ద పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేశారు. జీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్యం, సిబ్బంది నిర్వహణ పుణ్యమా అంటూ పూర్తిగా శిథిలావస్థలోకి చేరుకున్నాయి. దీంతో కుక్కలకు, పందులకు, మందుబాబులకు ఆవాసాలుగా మారి పోయాయి. ప్రజలకు ప్రయాణికులకు సౌకర్యంగా ఉండాల్సిన మూత్రశాలలు స్క్రాప్ డబ్బా లాగా మారిపోయాయి. దీంతో ప్రయివేట్ సులబ్ కాంప్లెక్స్‌ను ఆశ్రయిస్తున్నారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ ప్రజలకు అవసరంలేని వాటిపట్ల ఆసక్తి చూపుతున్నారని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని గిరినగర్ బస్ స్టాప్‌లో చింతల్ బస్టాప్, కుత్బుల్లాపూర్ చౌరస్తా వద్ద షీ టాయిలెట్స్ (మూత్రశాలలు) నిర్వహణ కరువైపోయి దేనికి పనికి రాకుండా నిరుపయోగంగా మారిపోయాయి. అదే కాకుండా పెరుగుతున్న రద్దీ దృష్ట్యా రోడ్లకు ఇరువైపులా పబ్లిక్ టాయిలెట్స్ బాక్స్‌లు ఉండడంతో ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందని కొన్ని సందర్భాల్లో రోడ్డు ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయని వాహనదారులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఐడీపీఎల్ నుంచి జగద్గిరిగుట్ట ఆస్బెస్టాస్ కమాన్ వరకు రోడ్ల కిరువైపులా తోపుడు బండ్లు, చిరు వ్యాపారాలు చేసుకునే వారు ఆక్రమించడం తో రోడ్డు కాస్త కుంచించుకుపోయిందన్నారు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పారిశ్రామిక వాడ ప్రాంత కావడంతో పాటు అత్యధికంగా జనసాంద్రత గల ప్రాంతాలు ఉండడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో రోడ్డు రద్దీగా ఉంటుందని తెలిపారు. దీంతోపాటు భారీ వాహనాలు సంచరిస్తుంటాయని ఏ ప్రమాదం ఎప్పుడు సంభవిస్తుందోనని పలువురు నవ తెలంగాణతో వాపోయారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి ప్రజలకు ఉపయోగపడే విధంగా పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణ కొనసాగించా లని రోడ్లకు ఇరువైపులా ఆక్రమణకు గురైన వాటిని తొలగించాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

ఈ విషయమై సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులకు నవతెలంగాణ వివరణ కోరగా పబ్లిక్ టాయిలెట్స్‌ల సమస్యను, ఆక్రమితకు గురైన వాటిపై ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గద్దరన్న లేడనే నిజం నమ్మలేకపోతున్నాం



- కార్పొరేటర్ కొలుకుల జగన్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

దేశంలోని అన్ని వర్గాల ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న ప్రజా యుద్ధనౌక గద్దర న్న లేడనే నిజాన్ని ఇప్పటికి నమ్మలేకపోతున్నామని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ విచారం వ్యక్తం చేశారు. బుధవారం గద్దర్ జయంతి పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని జగద్గిరిగుట్ట చివరి బస్ స్టాప్‌లో సీపీఐ నేతలతో పాటు, పలువురు అభిమానులు, జర్నలిస్టులు నాయకులతో కలిసి ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం గద్దరన్న ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేసి తన గొంతుకతో ఎంతో మంది ప్రజలను చైతన్యవంతులను చేసిన మహనీయుడని కొనియాడారు. సీపీఐ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కార్యదర్శి ఈ.ఉమామహేష్ మాట్లాడుతూ గద్దరన్న గళం ఎప్పటికి కండ్ల ముందరే మెదులుతుంటాయని తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ టియూడబ్ల్యూజే (ఐజేయూ) అధ్యక్షులు కోటగడ్డ శ్రీనివాస్ మాట్లాడుతూ.. సమాజంలో ప్రజలు ఎక్కడ అణచివేయబడుతున్నారో అక్కడ గద్దరన్న ప్రశ్నించే తత్వం పుట్టుకొస్తుందన్నారు. తెలంగాణ ప్రజలు ఆయన అడుగుజాడల్లో నడిచినప్పుడే ఆయనకు నిజమైన నివాళులు అర్పించిన వారమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీసీ విభాగం అధ్యక్షులు పేర్తి విటల్ ముదిరాజ్, జర్నలిస్ట్ సంఘం నాయకులు ఓయూ గణేష్, నరేష్, బీఆర్ఎస్ నేతలు దోపతి సంపత్ రెడ్డి, గుజ్జుల పాపిరెడ్డి, భోగ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ కో-ఆపరేట్ హ్యాండ్లూమ్స్ టెక్స్టైల్స్ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావును బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి కలిసాడు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, గణేష్, ప్రభాకర్, రవీందర్, బుచ్చిరెడ్డి, జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-దుండిగల్

వాహన దారులపై ఫైనాన్స్ ఆగడాలు



- వాహన సిజింగ్ వ్యక్తులు ఫైనాన్స్ లేని వాహన దారుడి పై దౌర్జన్యం
- పుట్టగొడుగుల్లా వెలుస్తున్న వాహన ఫైనాన్స్ వ్యాపార సంస్థలు

నవతెలంగాణ-కూకట్‌పల్లి/జగద్గిరిగుట్ట

జగద్గిరిగుట్ట ప్రాంతంలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ద్విచక్ర వాహన ఫైనాన్స్ వ్యాపార సంస్థలు, వాహనాల సీజింగ్ పేరుతో ఫైనాన్స్ లేని వాహన దారుల పై దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నారని బాధితుడు తెలిపాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం జగద్గిరిగుట్టకు చెందిన వ్యక్తి ద్విచక్ర వాహనం ఎలాంటి ఫైనాన్స్ లేకుండా నగదు చెల్లించి, హొండా షైన్ వాహనం కొనుగోలు చేసి, దాదాపు సంవత్సరం కావస్తుంది. అయితే ఆ ద్విచక్ర వాహనం నెంబర్ ప్లేట్ ఓ ప్రమాదంలో విరిగిపోవడంతో నంబర్ ప్లేట్ లేకుండా తన వాహనంపై ప్రయాణిస్తుండగా ఇద్దరు వాహన సీజింగ్ వ్యక్తులు ఆ వాహనదారున్ని వెంబడించారు. వాహనంను అడ్డుపడటమే కాకుండా వాహనదారుడు తన వాహనాన్ని రోడ్డు నుంచి పక్కకు తీసుకుంటుండగా సిజింగ్‌కు వచ్చిన వ్యక్తి వాహనదారిడి నీ చేత్తోలతో తొసేస్తూ, దురుసుగా ప్రవర్తిస్తు ఘర్షణకు దిగాడు. అంతే కాకుండా నీ వెహికల్ చెక్ చేయాలంటూ దౌర్జన్యం చేశాడు. తీరా తనిఖీ చేసి ఫైనాన్స్ ఏమి లేదంటూ ఫైనాన్స్ ఉందనుకుని వాహనం ఆపి, తనిఖీ చేసానంటు తాపీగా చెప్పాడు. అయితే సీజింగ్ వచ్చిన వ్యక్తులను తమ గుర్తింపు కార్డులు చూపెట్టమంటే లేవు అని చెపుతూ వెళ్లిపోయే ప్రయత్నం చేయడంతో పాటు, రోడ్డు పై వాహనాలు ఆపి, తనిఖీ చేయడమే తమ పనంటు ఘాటుగా చెప్పినట్టు తెలిసింది. నడి రోడ్డుపై సిజింగ్ పేరుతో వాహనదారులను ఆపి ఇబ్బందులకు గురి చేస్తున్న ఇలాంటి సిజింగ్ వ్యాపారుల పై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు బాధితులు కోరుకుంటున్నారు. స్థానిక పోలీసులు ఇలాంటి వాహన ఫైనాన్స్ సంస్థల ఆగడాలు అరికట్టాలని వాహన దారులు కోరుతున్నారు.

నిమ్స్ వైద్యురాలికి ఉత్తమ అవార్డు



- కుష్టు నియంత్రణలో ప్రత్యేక చొరవ

నవతెలంగాణ-సిటీబ్యూరో

కుష్టు వ్యాధి నివారణ కోసం పంజాగుట్ట నిమ్స్ హాస్పిటల్ డెర్మటాలజీ వైద్యురాలు ఆసియా బేగం ప్రత్యేక కృషి చేశారు. హాస్పిటల్‌కు వచ్చే రోగులకు అవగాహన కల్పించడంతోపాటు నివారణ కోసం అనుసరించాల్సిన పద్ధతులను వివరించారు. అమె సేవలను గుర్తించిన వైద్యారోగ్య శాఖ ఉత్తమ అవార్డుకు ఎంపిక చేసింది. యాంటీ లెప్రసీ డే సందర్భంగా నగరంలో నిర్వహించిన సమావేశంలో హైదరాబాద్ జిల్లా అదనపు డీఎంఅండ్‌హెచ్‌వో నిర్మల ప్రభావతి చేతుల మీదుగా ఉత్తమ అవార్డును ఆమె అందుకున్నారు. నిమ్స్ వైద్యురాలికి ఈ అవార్డు రావడంతో నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప ఆమెను అభినందించారు.

పదవీ బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర రావు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

జేఎన్టీయూహెచ్ యూనివర్సిటీ పరిశోధన విభాగాధిపతిగా ప్రొఫెసర్ సౌరకాయల వెంకటేశ్వర రావు బుధవారం నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జేఎన్టీయూహెచ్ జేఏసీ నేతలు, విద్యార్థులు కలిసి పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జేఎన్టీయూహెచ్ చైర్మెన్ బొట్ల బిక్షపతి మాట్లాడుతూ పరిశోధన విద్యార్థులకు పరిశోధన పట్ల అవగాహన పరుస్తూ సమాజంలోని పలు సమస్యలపై స్పందించి, శాస్త్ర సాంకేతిక నూతన పరిశోధనలను అందించేందుకు తమవంతు కృషి చేయాలని కోరారు. పరిశోధన విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ యూనివర్సిటీలో పరిశోధన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా పలు సౌకర్యాలు యూనివర్సిటీ తరపున సమకూర్చి తన వంతు బాధ్యతను నిర్వహిసానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మంద రంజిత్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ బల్గర్ సందీప్, సెక్రటరీ ప్రణయ్, తేజ, కిరణ్ చంద్రమౌళి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు



- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-బాలానగర్

ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ పరిధిలో విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలిపారు. బుధవారం కూకట్‌పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే, ఓల్డ్ బోయిన్ పల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్‌తో కలిసి డివిజన్ పరిధిలోని లక్ష్మీనర్సింహ కాలనీ, మైత్రీ వన్ కాలనీలను వారు పరిశీలించారు. ఇందులో భాగంగా ప్రధానంగా ప్రజల నుంచి వచ్చిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్ళగా వారి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని పర్యటనలో తెలిపారు. పర్యటలో ప్రధానంగా విద్యుత్ పోల్ రోడ్డుపై ఉందని, అలాగే అధిక లోడ్ పడటంతో ట్రాన్స్ ఫార్మర్ పవర్ లోడును తట్టుకోలేక, విద్యుత్ సరఫరాకు నిరంతరం అంతరాయం ఏర్పడుతుందని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి విద్యుత్ సమస్యలు తలెత్తకుండా సత్వరం సమస్యను పరిష్కారించా లని సూచించారు. దీనికి స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు తక్షణం చర్యలు చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ ముద్దం నర్సింహ యాదవ్, నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

బాలానగర్ సీఐగా పి.నవీన్ కుమార్



నవతెలంగాణ-బాలానగర్

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని బాలానగర్ సీఐగా పి.నవీన్ కుమార్ బుధవారం నూతనంగా భాద్యతలు చేపట్టారు. ఇక్కడ బాలానగర్‌లో పని చేస్తున్న కె. భాస్కర్‌ను సీటీసీకి బదిలీపై వెళ్లారు. బాలానగర్ జోన్ ఎన్నికల విభాగంలో పనిచేస్తున్న పి.నవీన్ కుమార్ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న కె.భాస్కరును సైబరాబాద్ సీటీసీకి బదిలీ చేశారు. కొత్త సీఐ బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సంక్షేమ సంఘాల సభ్యులు ఎమ్మెల్యేను కలిసి వివిధ శుభకార్యాలకు ఆహ్వానించారు. నూతన పనులపై వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన పనులను కూడా త్వరిత గతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు.

సూరారం129 డివిజన్ శివాలయ నగర్‌లో శేఖర్ మహారాజ్ పర్యవేక్షణలో గోపాల్ నాయక్ అధ్వర్యంలో నిర్వహించిన జగదాంబ దేవి వార్షికోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి దయ ఉంటే అన్నీ ఉన్నట్లేనని, అమ్మవారి కృపతో అందరూ సుఖసంతోషాలతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్, పూజారి దుర్గా మహారాజ్, భూపాల్ నాయక్, ఛత్రు నాయక్, లక్ష్మణ్ నాయక్, సీరాలాల్ తదితరులు పాల్గొన్నారు.

దుండిగల్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ దూలపల్లి పరిధిలోని వారాహి హెయిర్ అండ్ బ్యూటీ సెలూన్‌ను బుధవారం హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ప్రారంభించారు. కొంపల్లి మున్సిపాలిటీ పరిధి దూలపల్లిలో మనోజ్ కుమార్ వారి మిత్ర బృందం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతీ, యువకులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బీసీ బంధు పథకం ద్వారా ఈ షాపును ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమైన విషయమని తెలిపారు. నిరుద్యోగ యువతీ, యువకులు ఉద్యోగం వైపు తమ కాళ్లపై తాము నిలబడేందుకు స్వయం ఉపాధిని ఎంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ సన్న శ్రీశైలం యాదవ్, గంగయ్య నాయక్, కౌన్సిలర్లు డప్పు కిరణ్, శివకుమార్ గౌడ్, దూలపల్లి పాక్స్ డైరెక్టర్ బుర్గుబావి సత్యనారాయణ, మాజీ డైరెక్టర్ నవీన్ గుప్త, దూలపల్లి మాజీ సర్పంచ్ చింతల దేవేందర్ యాదవ్, సుధాకర్, మహేష్, అభిషేక్ పాల్గొన్నారు.





జాతీయ రహదారి 44 - రాష్ట్ర రహదారి లను కలుపుతూ కొంపల్లి చౌరస్తా నుంచి బహదూర్‌పల్లి వరకు చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులను బుధవారం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ పరిశీలించారు.
నవతెలంగాణ-దుండిగల్



పేద విద్యార్థులకు విద్యానందిస్తూ, భోజనం పెట్టడం అభినందనీయం



- దొడ్ల రామకృష్ణ గౌడ్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

చదువుకునే విద్యార్థులకు విద్యనందిస్తూ, భోజనం పెట్టడం అభినందించదగ్గ విషయం అని దొడ్ల రామకృష్ణ గౌడ్ అన్నారు. ఆల్విన్ కాలని డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్‌లో బేతల్ గాస్పల్ చర్చ్ ఆధ్వర్యంలో, రిపబ్లిక్ డే సందర్భంగా, పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందిస్తూ బేతల్ గాస్పల్ చర్చ్ పాస్టర్ గోపి నిర్వహించిన కార్యక్రమానికి, ముఖ్య అతిథిగా యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ హాజరయ్యారు. వారి చేతుల మీదుగా విజేతలైన పిల్లలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా యువనేత మాట్లాడుతూ... బేతల్ గాస్పల్ చర్చ్ పాస్టర్ గోపి, గతం నుంచి ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని, చదువుకునే పిల్లలకు ఉచితంగా ట్యూషన్స్ చెప్తూ, భోజనం పెట్టడం అభినందించే విషయం అని అన్నారు. పిల్లలకు ఉచితంగా విద్య అందిస్తూ వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తున్న పాస్టర్ గోపికి కృతజ్ఞతలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో డివిజన్ క్రిస్టియన్ కమిటీ అధ్యక్షులు యం. రాజు, వాసుదేవరావు, రాజన్న, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిబిరాన్ని సందర్శించిన కార్పొరేటర్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రంగారెడ్డి జిల్లా బ్రాంచ్ సౌజన్యంతో, ఆల్విన్ కాలని డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని, తారకరామ్ నగర్‌లో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరానికి, ముఖ్య అతిథిగా డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరయ్యారు. వైద్య శిబిరాన్ని సందర్శించి స్వయంగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. బి.పి, షుగర్ వంటి అన్ని జనరల్ పరీక్షలుర, మందులు కూడా ఉచితంగా అందిస్తున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ప్రజలందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వైద్య నిపుణులు అందిస్తున్న సలహాలు పాటిస్తూ, ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో సమ్మద్, జగదీష్, ఖాజా, పోశెట్టిగౌడ్, కటికరవి, రమేష్ సాగర్, సంపత్, రెడ్ క్రాస్ సొసైటీ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్

ఆల్విన్ కాలని డివిజన్ పరిధిలోని విజయ నగర్ కాలనీ హైటెన్షన్ లైన్ రోడ్డులో గతంలో ఎనభై లక్షల రూపాయల నిధులు మంజూరైనాయి. ఇప్పుడు నిర్మాణ పనులు జరుగుతున్న సీసీ రోడ్డును డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీ పడకుండా సీసీ రోడ్డు నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. రోడ్డును ప్రణాళికగా లెవెలింగ్ చేసి వర్షపు నీరు నిలిచిపోవడం వంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో నిర్మాణ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్వరూపా, రఘుపతి, పోశెట్టిగౌడ్, వర్క్ ఇన్ స్పెక్టర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విటమిన్ సి పుష్కలంగా ఉండే ఉసిరికాయలు విరివిగా దొరికే కాలమిది. ఉసిరిని తింటే శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఎన్నో పోషక విలువలు ఉన్న ఉసిరితో రకరకాల వంటలు చేసుకోవచ్చు. వాటిలో కొన్ని ఈరోజు తెలుసుకుందాం...

ఉసిరితో కమ్మగా...





అన్నం...

కావాల్సిన పదార్థాలు : ఉసిరికాయలు - ఏడు, కొబ్బరి తురుము - అరకప్పు, పచ్చిమిర్చి - నాలుగైదు, ఉప్పు - తగినంత, నూనె - చెంచా, శనగపప్పు, మినప్పప్పు, ఆవాలు, జీలకర్ర - అరచెంచా చొప్పున, పల్లీలు - అర గుప్పెడు, ఎండుమిర్చి - మూడు, ఇంగువ - కొద్దిగా, కరివేపాకు - నాలుగు రెబ్బలు, పసుపు - పావు చెంచా, అన్నం - రెండున్నర కప్పులు.

తయారు చేసే విధానం : ఉసిరి కాయల్ని కడిగి గింజలు తీసేసి చిన్న చిన్న ముక్కల్లా తరగాలి. కొబ్బరి తురుము, పచ్చిమిర్చి తీసుకుని మిక్సీలో మెత్తగా గ్రైండ్ చేసు కోవాలి. ఇప్పుడు బాణలిలో నూనె వేడి చేసి ఆవాలు, శనగపప్పు, మినప్పప్పు, జీలకర్ర, ఎండుమిర్చి, పల్లీలు, ఇంగువ వేయించాలి. అందుల కరివేపాకు వేయాలి. అవి చిటపటలాడాక ముందుగా చేసి పెట్టుకున్న ఉసిరి ముక్కలు, కొబ్బరి మిశ్రమాన్ని చేర్చాలి. పచ్చి వాసన పోయాక తగినంత ఉప్పు వేసి అన్నం కలిపితే సరిపోతుంది.



మురబ్బా

కావాల్సిన పదార్థాలు : పెద్ద ఉసిరి కాయలు - కేజీ, చెక్కెర - ఒకటింపావు కేజీ

తయారు చేసే విధానం: ఫోర్కుతో కాయలని గుచ్చి, మునిగేదాకా నీళ్లు పోసి కొద్దిసేపు ఉంచాలి. తర్వాత కాయలని కడగాలి. మళ్లీ వాటిని మరిగే నీళ్లలో పోసి రెండు నిమిషాలు ఉడకనిచ్చి దించేయాలి. పాకానికి చెక్కెరను ఒక గిన్నెలో వేసి, అందులో గ్లాసు నీళ్లు పోసి మరిగించాలి. మధ్యస్తంగా ఉండే పాకం వచ్చాక, ఉడికించిన ఉసిరికాయల్ని పాకంలో వెయ్యాలి. వీటిని ఒక రోజు అలాగే ఉంచాలి. తర్వాత కాయల్ని తీసి పొడిగా ఉన్న సీసాలోకి తీసుకుని మూత పెట్టాలి. ఇది మూడు నెలలు నిల్వ ఉంటుంది.



పొడి

కావాల్సిన పదార్థాలు : ఉసిరికాయలు - పది, జీలకర్ర - నాలుగు చెంచాలు, మిరియాలు - చెంచా, శొంఠి - చిన్నముక్క, ఇంగువ - పావు చెంచా, ఉప్పు - తగినంత.

తయారు చేసే విధానం : ముందుగా ఉసిరికాయల్ని కడిగి తడిలేకుండా తుడవాలి. తర్వాత ముక్కలుగా కోసి గింజలు తీసి ఎండలో పెట్టాలి. బాగా ఎండాక ఉసిరికాయ ముక్కలకు జీలకర్ర, ఇంగువ, శొంఠి, మిరియాలు, ఉప్పు చేర్చి మిక్సీలో మెత్తగా పొడి చేయాలి. ఇది ఎన్ని రోజులైనా నిల్వ ఉంటుంది.



ఆవకాయ

కావాల్సిన పదార్థాలు : ఉసిరికాయలు - కేజీ, ఉప్పు - అరకప్పు, పసుపు - ఒక చెంచా, నువ్వుల నూనె - ముప్పావు కప్పు, కారప్పొడి - అరకప్పు, ఇంగువ - ఒక చెంచా, మెంతిపొడి - పావు కప్పు, నిమ్మకాయలు- నాలుగు, ఆవాలు- అర టీస్పూను.

తయారు చేసే విధానం : ఉసిరికాయలను నీళ్లతో కడిగి ఆరబెట్టాలి. పెద్ద పాన్ తీసుకుని అందులో నువ్వుల నూనె వేడిచేయాలి. నూనె వేడెక్కిన తర్వాత ఆవాలు, ఇంగువ వేయాలి. ఆవాలు చిటపటలాడడం మొదలవ్వగానే ఆ నూనెలో ఉసిరికాయలు వేసి మెత్తబడే వరకూ మూతపెట్టి సన్నని మంటపై ఉడికించాలి. ఉసిరి కాయలు మెత్తబడిన తర్వాత స్టవ్ మీద నుంచి దించి చల్లారనివ్వాలి. చల్లారిన ఉసిరికాయల్లో ఉప్పు, కారం, పసుపు, మెంతిపొడి వేయాలి. అందులో నిమ్మరసం పిండి మొత్తం మిశ్రమాన్ని బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని మూడు రోజులు అలాగే జాడీలో ఊరనివ్వాలి. ఇలా చేస్తే కారాన్ని , ఉప్పును ఉసిరికాయలు బాగా పీల్చుకుంటాయి. అప్పుడు పచ్చడి చాలా రుచిగా ఉంటుంది. దీనిని గాజు సీసాలో పెట్టి గట్టిగా మూతపెట్టుకోవాలి. మూడు నాలుగు నెలలు ఇది నిల్వ ఉంటుంది. దీనికి నీరు తగలకుండా ఉంటే మూడు నుంచి నాలుగు నెలల పాటు బాగుంటుంది.

పులుసు కూర



కావాల్సిన పదార్థాలు : ఉసిరికాయలు - 4 లేదా 6, ఉల్లిగడ్డ ముక్కలు - అర కప్పు, టమాటా ముక్కలు - అర కప్పు, పసుపు - పావు చెంచా, ఉప్పు - అర చెంచా, పచ్చిమిర్చి - రెండు, కారం - చెంచా, ధనియా పొడి - చెంచా, జీలకర్ర పొడి - చెంచా, నూనె - 3 లేదా 4 చెంచాలు,

పోపు కోసం : జీలకర్ర - పావు చెంచా, ఆవాలు - పావు చెంచా, ఎండుమిర్చి - ఒకటి, కరివేపాకు - ఒక రెబ్బ

తయారు చేసే విధానం : ముందుగా ఉసిరికాయల్ని కడిగి తుడిచి పెట్టుకోవాలి. స్టవ్ ఆన్ చేసి కడాయిలో రెండు చెంచాల నూనె పోసి ఉసిరికాయల్ని వేసి దోరగా వేయించుకోవాలి. అవి కొద్దిగా పగులుతాయి. వాటిని వేరే గిన్నెలోకి తీసుకుని మిగతా రెండు చెంచాలు నూనె వేసి పోపు దినుసులు వెయ్యాలి. అవి వేగుతుండగా ఉల్లిగడ్డ, పచ్చిమిర్చి ముక్కలు వేసి అన్నీ చక్కని రంగు వచ్చే వరకు వేయించుకోవాలి. తర్వాత టమాటా ముక్కలు కలిపి వేయిస్తూ పసుపు, కారం వేసి గరిటతో టమాటా ముక్కలు మెత్తగా నొక్కుతూ.. ఒక ముద్ద కూరలా అయ్యేలా ఉడికించుకోవాలి. తినే రుచిని బట్టి నీరు కలిపి చక్కని గ్రేవీలా చేసుకోవచ్చు. ఇప్పుడు ఉసిరికాయల్ని ఉడికే ఆ పులుసుకూర మిశ్రమంలో వేసి ధనియాల పొడి, జీలకర్ర పొడి జోడించి మూత పెట్టి దగ్గర పడేదాకా ఉడికించుకుని స్టవ్ ఆఫ్ చేసుకోవాలి. ఈ కూర వేడి వేడి అన్నం, నెయ్యితో తింటే చాలా రుచిగా ఉంటుంది. అలాగే చపాతి, రోటీల్లోనూ చాలా రుచిగా ఉంటుంది.

పిల్లలకు జామపండు తినిపించొచ్చా...!

జామకాయ వివిధ రకాల ఖనిజాలు, విటమిన్లతో సులభంగా లభించే పండు. దీని ప్రత్యేకమైన రుచి పెద్దల నుండి పిల్లల వరకు అందరికీ నచ్చుతుంది. కానీ చాలా మందికి చిన్నపిల్లలు జామకాయ పెట్టొచ్చో లేదో అని సంశయిస్తుంటారు. అయితే ఆరు నెలలు దాటిన పిల్లలకు ఘనాహారంలో భాగంగా అందించే తాజా పండ్లలో జామకాయలను ఇవ్వొచ్చు. అయితే ఈ జామకాయ వల్ల కలిగే లాభాలు, పిల్లలకు దీనిని ఏ విధంగా అందించాలో తెలుసుకుందాం.

- పిల్లలలో రోగనిరోధక పనితీరు, పెరుగుదల, కణాల పునరుత్పత్తిలో విటమిన్ సి పాత్ర చాలా ముఖ్యం. ఒక జామకాయలో నారింజ పండు కంటే నాలుగు రెట్లు ఎక్కువ విటమిన్ సి ఉంటుంది.
- నాడీ వ్యవస్థ అభివృద్ధికి సహాయపడుతుంది ఈ పండులోని ఫోలిక్ ఆమ్లం పిల్లలలో మెదడు, వెన్నెముక సంబంధిత జనన లోపాలను నివారించడంలో సహాయపడుతుంది.
- జామపండులో విటమిన్ ఎ పుష్కలంగా ఉంటుంది. విటమిన్ ఎ కంటి చూపు మెరుగుగా ఉండేందుకు దోహదం చేస్తుంది.
- జామకాయలో ఉండే యాంటీ ఆక్సిడెంట్ గుణాలు క్యాన్సర్ ప్రమాదాన్ని నిరోధిస్తాయి. ఇది అల్జీమర్స్, పార్కిన్సన్ వ్యాధులు, హైప్రాక్సియా వంటి రుగ్మతల నుండి కాపాడుతుంది.



- జామకాయలోని విత్తనాలలో లినోలెయిక్, ఫినోలిక్ వంటి కొవ్వు ఆమ్లాలు పుష్కలంగా ఉన్నాయి. పిల్లల మెదడు, ఇతర కణజాల వ్యవస్థల అభివృద్ధిలో అవి ముఖ్యమైన భాగాలు.
- జామకాయలో అధిక ఫైబర్ కంటెంట్ పిల్లలలో జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. మలబద్ధకం, పేగు మంటను నివారిస్తుంది.
- కాల్షియం, ఇతర పోషకాలు జామకాయలో నిండి ఉంటాయి. ఇది పిల్లలలో ఎముకలు, మృదులాస్థి అభివృద్ధికి సహాయపడుతుంది.

పిల్లలకు ఎలా అందించాలి?

- పిల్లలకు జామకాయను అందించేపుడు వారి వయసును దృష్టిలో పెట్టుకుని తక్కువ మోతాదు నుంచి ప్రారంభించాలి.
- జామకాయను కాసేపు వేడినీటిలో వేస్తే పై చర్మం సులువుగా తొలగించవచ్చు. తర్వాత చెంచాతో పండులోని గుజ్జును విత్తనాలు లేకుండా తీసుకోవాలి. ఈ గుజ్జును కొద్దికొద్దిగా చెంచాతో తినిపిస్తూ ఉండాలి. అయితే తినిపించేపుడు పిల్లలు సులువుగా తినగలుగుతున్నారా లేక ఏదైనా ఇబ్బంది పడుతున్నారా అని గమనించుకోని ఇవ్వాలి. మింగేందుకు అసౌకర్యంగా ఫీల్ అవుతుంటే పెట్టడం ఆపేయాలి.
- అయితే ఇందులోని ఆమ్లత్వం పిల్లలలో డైపర్ సోరియాసిస్‌కు కారణమవుతుంటుంది. అందువల్ల వారానికి రెండుసార్లు మాత్రమే ఇవ్వాలి. పండు పెట్టిన తర్వాత శరీరంలో మార్పులు కన్పిస్తే వెంటనే ఆరోగ్య నిపుణులను సంప్రదించాలి.

ఇట్ల చేద్దాం

గచ్చకాయ కాల్చిన మసి, పటిక, పోక చెక్క మసి - మూడింటిని కలిపి చిగుళ్ళకి రుద్దితే చిగుళ్ళ వాపు, చీము, నెత్తురు కారటం, నోటి దుర్వాసన తగ్గుతాయి.



జ్ఞానవాపి మసీదులో పూజలు చేసుకోవచ్చు

(మొదటిపేజీ తరువాయి)

చారిత్రక విజయమని, కేసులో కీలక మలుపు అని హిందువుల పక్షాన వాదిస్తున్న విష్ణు శంకర్ జైన్ చెప్పారు. కోర్టు తీర్పు ప్రతిని జిల్లా మెజిస్ట్రేట్‌కు పంపామని అన్నారు. పూజలు ఎలా నిర్వహించాలనే విషయంపై కాశీ విశ్వనాథ దేవాలయ ట్రస్ట్ నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. న్యాయ పోరాటంలో త్వరలోనే తుది విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఇకపై జ్ఞానవాపి ప్రాంగణంలోకి ఎవరైనా ప్రవేశించవచ్చునని అన్నారు. అక్కడ గతంలో పూజలు నిలిపివేయడానికి కారణమేమీ లేదని మరో న్యాయవాది మదన్ మోహన్ చెప్పారు. ఒకవేళ ఎవరైనా ఈ తీర్పును వ్యతిరేకిస్తే సమాధానం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కాగా జిల్లా కోర్టు ఆదేశాలను అలహాబాద్ హైకోర్టులో సవాలు చేస్తామని అంజుమన్ ఇతెజమియా మసీదు కమిటీ స్పష్టం చేసింది.

ఆలయాల ముందు ఆ బోర్డులు పెట్టండి : మద్రాస్ హైకోర్ట్

ఏ మతస్తులైనా వచ్చి పోయేందుకు హిందూ ఆలయాలేమీ పిక్నిక్ స్పాట్లు కావంటూ మద్రాస్ హైకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. హిందూయేతరులను ఆలయం ముందు ఉండే ధ్వజస్తంభం వరకే అనుమతించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు హిందూ ఆలయాల్లోకి ఇతర మతస్తుల ప్రవేశాన్ని నిషేధించాలంటూ దాఖలైన పిటిషన్ విచారణలో భాగంగా ఈ వ్యాఖ్యలు చేసింది. ఇదే విషయాన్ని తెలియజేసేలా ఆలయాల ముందు బోర్డులు ఏర్పాటుచేయాలని ఎండోమెంట్ శాఖ అధికారులను ఆదేశించింది. తమిళనాడులోని అర్లుమిగు పళని ధండాయుధపాణి స్వామి ఆలయంలోకి కేవలం హిందువులకు మాత్రమే ప్రవేశం కల్పించాలని, ఇతర మతస్తులు ఆలయంలోకి వెళ్లకుండా చర్యలు తీసుకునేలా ఆదేశాలివ్వాలని కోరుతూ డి.సెంథిల్ కుమార్ అనే వ్యక్తి కోర్టును ఆశ్రయించారు. రాష్ట్రంలోని ఇతర మురుగన్ ఆలయాలకు కూడా హిందువులను మాత్రమే అనుమతించాలని ఆయన కోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్ ను మద్రాస్ హైకోర్టులోని మధురై బెంచ్ విచారించింది. జస్టిస్ ఎస్.శ్రీమతి నేతృత్వంలోని బెంచ్.. పిటిషన్ దారుడి వాదనతో ఏకీభవిస్తూ ఆలయాల్లోకి హిందువులను మాత్రమే అనుమతించాలని స్పష్టం చేసింది. ఇతర మతస్తులను ఆలయంలోని ధ్వజస్తంభం వరకు అనుమతించవచ్చని సూచించింది. ఈ మేరకు రాష్ట్రంలోని ఆలయాల్లో ఏర్పాట్లు చేయాలని, ప్రతీ ఆలయం ముందు బోర్డును ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి సూచించింది. 'హిందూ మతవిశ్వాసాలపై నమ్మకంలేని ఇతర మతస్తులను ఆలయంలోకి అనుమతించ వద్దు.. ఒకవేళ హిందూ మతవిశ్వాసాలపై నమ్మకంతో, భక్తుల నమ్మకాలను గౌరవిస్తూ ఆలయ దర్శనం కోరే ఇతర మతస్తులను ఆమేరకు హామీపత్రం తీసుకుని అనుమతించ వచ్చు. అయితే, ఆలయ సంప్రదాయాలను గౌరవిస్తూ, వాటికి అనుగుణంగా దర్శనానికి వచ్చినపుడే లోపలికి అనుమతించాలి' అంటూ జస్టిస్ ఎస్ శ్రీమతి ప్రభుత్వానికి సూచించింది.

రేవంత్ చెప్పేది కొండంత... చేసేది గోరంత

- **వాస్తవాలు ఆ నర్సులకు తెలుసు : మాజీ మంత్రి హరీశ్ రావు**

నర్సింగ్ ఆఫీసర్ల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చిందెవరో, చర్యలు తీసుకుంది ఎవరో అనేది నూతనంగా నియమితులైన స్టాఫ్ నర్సులకు తెలుసునని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి తీరు చెప్పేది కొండంత, చేసేది గోరంత అన్నట్టుందని ఎద్దేవా చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నర్సుల నియామక పత్రాల అందజేత పేరుతో కాంగ్రెస్ పార్టీనే నియామకాలు చేసినట్టు డబ్బా కొట్టుకున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలోనే వాటి భర్తీ ప్రక్రియ జరిగిందనీ, మరో 40 వేల పోస్టుల భర్తీ ప్రక్రియ వివిధ దశల్లో ఉందని చెప్పారు. మరోవైపు ఫిబ్రవరి ఒకటిన గ్రూప్ వన్ నోటిఫికేషన్ ఇస్తామని హామీ ఇచ్చిన రేవంత్ ఆ విషయాన్ని ప్రస్తావించకుండా నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము యదార్థం చెబితే, అవి శాపనార్థాలు అన్నారే తప్ప నోటిఫికేషన్ల గురించి చెప్పలేదని విమర్శించారు. రూ. 2 లక్షల రుణమాఫీ, రైతు బంధు పెంపు, రూ. 500 లకు సిలిండర్, 4000 నెలవారీ పింఛన్, మహాలక్ష్మి ద్వారా రూ. 2500 ఆర్థిక సాయం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, నిరుద్యోగ భృతి వంటి అమలు కానీ హామీల లిస్ట్‌లో జాబ్ క్యాలెండర్ కూడా చేరిందని తెలిపారు. 2004 నుంచి 2014 వరకు తెలంగాణ ప్రాంతంలో కాంగ్రెస్ 10 వేల ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేస్తే, తొమ్మిదిన్నరేండ్లలో తమ ప్రభుత్వం లక్షా 65 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని చెప్పారు.

రాహుల్ కారుపై రాళ్ల దాడి

కొల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రయాణిస్తున్న కారుపై బుధవారం రాళ్ల దాడి జరిగింది. భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా మల్దా జిల్లాలోని హరిశ్చంద్రపూర్ ప్రాంతంలో రాహుల్ పర్యటిస్తుండగా కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఆయన కారుపై రాళ్లు రువ్వారు. ఈ దాడిలో కారు వెనుక అద్దం పగిలిపోయిందని, అయితే రాహుల్‌కు ఎలాంటి గాయాలు కాలేదని రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు అధిర్ రంజన్ చౌదరి తెలిపారు. దాడి జరిగిన కొద్ది సేపటి తర్వాత రాహుల్ కారు నుండి కిందికి దిగి జరిగిన నష్టాన్ని పరిశీలించారు.

ఇలాంటి దాడులు ఆమోదయోగ్యం కావని అధిర్ అన్నారు. ఈ విధమైన చర్యలకు రాహుల్ భయపడబోరని చెప్పారు. రాళ్ల దాడికి తృణమూల్ కాంగ్రెస్సే కారణమని ఆరోపించారు. 'కారు వెనుక నుండి రాళ్లు రువ్వి ఉండవచ్చు. ఇంత జరుగుతున్నా భద్రతా సిబ్బంది పట్టించుకోలేదు. ఇది స్వల్ప సంఘటనే. అయినప్పటికీ రాహుల్‌కు ఏమైనా జరిగితే పరిస్థితి ఏమిటి? ఆయనకు తగినంత భద్రత కల్పించలేదు. ఈ దాడి ఎవరు చేయించారో మీకు అర్థమైందా? కాంగ్రెస్ ఎవరినీ అణగదొక్కదు. ఆయన్ని అడుగడుగునా ఇబ్బంది పెడుతున్నారు' అని అధీర్ విమర్శించారు. అయితే రాహుల్ వాహనంపై దాడి జరిగింది బెంగాల్‌లో కాదని, బీహార్‌లోని కతిహార్‌లో అని రాష్ట్ర ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ వివరణ ఇచ్చారు. బీహార్‌లో యాత్ర ముగించుకున్న రాహుల్ బెంగాల్‌లో తిరిగి ప్రవేశించారు. అంతకుముందు ఆయన బీహార్‌లోని కతిహార్ జిల్లాలో రోడ్‌షో నిర్వహించారు.

రాహుల్‌ను చూసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో రోడ్డుకు ఇరువైపులా నిలబడ్డారు. మమతా బెనర్జీ కూడా బుధవారం నాడే మాల్డా జిల్లాలోని ఇంగ్లీష్ బజార్ నుండి 'జోనోసంజోగ్' యాత్రను చేపట్టారు. అనంతరం జరిగిన బహిరంగసభలో ప్రసంగించారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో ఎలాంటి పొత్తు ఉండబోదని మమత స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

వాస్తవికతతో సంబంధంలేని ప్రసంగం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రపతి ప్రసంగం దేశంలోని సామాజిక వాస్తవికతతో సంబంధం లేకుండా సాగిందని సీపీఐ(ఎం) పార్లమెంటరీ పార్టీ నేత ఎలమారం కరీం అన్నారు. పార్లమెంట్ ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడారు. అంకెలతో నిండిన ప్రసంగం తప్ప మరొకటి కాదని విమర్శించారు. ప్రభుత్వ విధాన ప్రకటనలో మన దేశం నేడు ఎక్కడుంది? భవిష్యత్తు కోసం విధానాలను ఎలా రూపొందించాలో ప్రభుత్వం వివరిస్తుంది. కానీ రాష్ట్రపతి ప్రసంగంలో అలాంటిదేమీ లేదు. అయోధ్యలోని రామమందిరాన్ని ప్రభుత్వ శ్రేష్ఠతకు ఉదాహరణగా పేర్కొన్న ఈ ప్రసంగం, ఈ దేశ ప్రజాస్వామ్య, లౌకిక స్వభావానికి విరుద్ధం కాదా? ప్రభుత్వ విజయాలను ప్రస్తావించిన రాష్ట్రపతి, అయోధ్య రామమందిరంతో ప్రజల శతాబ్దాల కోరిక నేడు నెరవేరిందని పేర్కొనడం దారుణంగా ఉందన్నారు. ఈ వ్యాఖ్య బీజేపీ పాలనలో దేశం ఏ విధంగా ముందుకు సాగుతుందో స్పష్టంగా తెలియచేస్తోందని విమర్శించారు. పౌరసత్వ సవరణ చట్టం, రాజ్యాంగంలోని 370వ అధికరణం తొలగింపు, పార్లమెంట్ కార్యక్రమాలను తుంగలో తొక్కడంతోపాటు మోడీ ప్రభుత్వం సాధించిన విజయాలను జాబితా చేసిన రాష్ట్రపతి, ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయడమే ఈ ప్రభుత్వ ప్రధాన లక్షణమని గట్టిగా ప్రకటించినట్లుందని అన్నారు. దేశంలోని మైనారిటీ, వెనుకబడిన వర్గాలకు చెందిన పేదలు, ప్రజలు అనుభవించే ఏ ఇబ్బందులూ, కష్టాలూ రాష్ట్రపతి ప్రసంగంలోలేవన్నారు. పేదలు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలకు, ప్రభుత్వ విధానాల రూపకల్పనకు సంబంధం లేదని రాష్ట్రపతి ప్రసంగాన్ని బట్టి స్పష్టమవుతోందన్నారు. ముప్పై రెండు పేజీల విధాన ప్రకటన ప్రసంగంలో కార్మికుడు అనే ఒక్క మాట కూడా లేదని విమర్శించారు.

ప్రభుత్వ రంగ పరిశ్రమలను, దేశ సంపదను అమ్మేసే విధానాన్ని అనుసరిస్తున్న కేంద్ర ప్రభుత్వం దేశాన్ని ఎలా ప్రగతిపథంలో నడిపిస్తుందని ప్రశ్నించారు. అన్ని రంగాల్లోనూ అత్యంత ప్రమాదకరమైన చర్యలు తీసుకుంటున్న మోడీ ప్రభుత్వం దేశాన్ని, ప్రజలను మళ్లీ మళ్లీ కష్టాల్లోకి నెట్టేస్తోందని విమర్శించారు. నేడు దేశం ఎదుర్కొంటున్న సవాళ్లు, ప్రధాన సమస్యల గురించి ప్రస్తావించని రాష్ట్రపతి ప్రసంగం చాలా నిరాశపరిచిందని అన్నారు. సామాన్యుల కష్టాలు తీర్చేందుకు ఎలాంటి ప్రణాళికలు రూపొందించని కేంద్ర ప్రభుత్వం ప్రజలను దోచుకుని కార్పొరేట్ల జేబులు నింపే ప్రయత్నం చేస్తోందన్నారు. దీనికి తోడు ప్రభుత్వం నేరుగా అమలు చేస్తున్న తీవ్ర విభజన విధానం దేశాన్ని చీకటి యుగానికి నడిపిస్తోందనీ, ఈ పరిస్థితిలో కూడా ప్రభుత్వాన్ని మెచ్చుకుంటూ రాష్ట్రపతి ప్రసంగం చేయాల్సి రావడం అతిపెద్ద విడ్డూరమని విమర్శించారు.

నాలుగు స్తంభాలపైనే దేశాభివృద్ధి

(మొదటిపేజీ తరువాయి)

సృష్టించిందనీ, ఆదిత్య ఎల్-1 మిషన్‌ను విజయవంతంగా ప్రయోగించిందని అన్నారు. మేకిన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ లాంటి స్కీమ్‌లు ఇండియాను మరింత బలోపేతం చేశాయన్నారు. అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా దేశం చాలా వేగంగా ఎదిగిందన్నారు.

ఇటీవల ప్రపంచం రెండు భారీ యుద్ధాలను, కరోనా మహమ్మారిని చూసిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా సంక్షోభ పరిస్థితి ఉన్నా.. సంక్షోభ సమయంలో తమ ప్రభుత్వం ద్రవ్యోల్బణాన్ని నియంత్రణలో ఉంచేందుకు పటిష్ఠ చర్యలు తీసుకున్నదని వివరించారు. మధ్య తరగతి, సాధారణ ప్రజలపై ప్రభావం పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్టు ముర్ము వివరించారు.

'మన చిన్నతనం నుంచీ 'గరీబీ హఠావో' నినాదాన్ని వింటున్నాం. కానీ, జీవితంలో తొలిసారి పేదరికం తగ్గుదలను చూస్తున్నాం. 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. పేదరిక నిర్మూలనే ప్రధాన లక్ష్యంగా దేశం ముందుకెళ్తోంది" అన్నారు. "దేశంలో 5జీ నెట్‌వర్క్ వేగంగా విస్తరిస్తున్నది. కొత్త క్రిమినల్ చట్టాలను తీసుకొచ్చాం. రక్షణ, అంతరిక్ష రంగంలో కొత్త ఆవిష్కరణలు జరిగాయి. యూపీ, తమిళనాడులో రక్షణ కారిడార్లు ఏర్పాటయ్యాయి. రక్షణ రంగ ఉత్పత్తులు దేశంలో తయారవడం గర్వకారణం. రక్షణ రంగం కోసం రూ.1 లక్ష కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నాం" అని చెప్పారు.

రైతులకు పెట్టుబడి భారం తగ్గించి, లాభాలను అందించడమే తమ లక్ష్యమని, కిసాన్ సమ్మాన్‌తో 10 కోట్ల మంది రైతులకు పెట్టుబడి సాయం అందిస్తున్నామని తెలిపారు. ఉజ్వల కనెక్షన్లు పది కోట్లు దాటాయన్నారు. ఆవాస్ యోజన పథకం కింద సామాన్యులకు నీడ కల్పిస్తున్నామనీ, 4.10కోట్ల మందికి పక్కా ఇండ్లు నిర్మించామని చెప్పారు. పదేండ్లలో వేల ఆదివాసీ గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించామన్నారు. రూ. 7 లక్షల ఆదాయం వరకు పన్ను లేకుండా చేశామని, సామాన్యులకు భారం పడకుండా పన్ను సంస్కరణలు తీసుకొచ్చామని తెలిపారు. మహిళా సాధికారత కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నదనీ, 2 కోట్ల మంది మహిళలు స్వయం సమృద్ధి సాధించారని అన్నారు. ట్రాన్స్ జెండర్లకు సమాజంలో గౌరవస్థానం కల్పించామని పేర్కొన్నారు.

జమ్ముకాశ్మీర్‌లో 370 ఆర్టికల్‌ను రద్దు చేయడం చరిత్రే అన్నారు. ఎన్నో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న అనేక పనులను పదేండ్లలో జాతీయ ప్రయోజనాల కోసం పూర్తి చేశామన్నారు. జీ20 సదస్సును విజయవంతంగా నిర్వహించి, ప్రపంచ దేశాల్లో ఇండియా గుర్తింపును బలోపేతం చేశామన్నారు. కొత్తగా నిర్మించిన పార్లమెంట్ భవనంలో ప్రభుత్వ పథకాలపై అర్థవంతమైన చర్చ జరుగుతుందని ఆశిస్తున్నట్టు రాష్ట్రపతి ముర్ము తెలిపారు.

నేడు మధ్యంతర బడ్జెట్

నేడు (గురువారం) కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మధ్యంతర బడ్జెట్ (ఓటు ఆన్ అకౌంట్) ప్రవేశపెట్టనున్నారు. ఉదయం 11 గంటలకు ఆమె లోక్‌సభలో బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. అనంతరం రాజ్యసభలో బడ్జెట్‌ను టేబుల్ చేస్తారు.

నేడు అసెంబ్లీకి కేసీఆర్..

(మొదటిపేజీ తరువాయి)

అకౌంట్ బడ్జెట్ సమావేశాలు దగ్గర పడుతుండటం, ఫిబ్రవరి 27న రాజ్యసభ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఓటేయాల్సి రావటంతో ఈలోపే ప్రమాణ స్వీకారం చేయాలని భావించిన కేసీఆర్, గురువారాన్ని మంచి రోజుగా నిర్ణయించుకున్నారు. ఆ మేరకు ప్రమాణ స్వీకారం చేయనున్న ఆయన... అనంతరం శాసనసభ లాబీల్లో ప్రధాన ప్రతిపక్ష నేత హోదాలో తనకు కేటాయించిన ఛాంబర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. పూర్తి స్థాయిలో తనంతట తాను నడిచేందుకు మాజీ సీఎంకు మరికొంత సమయం పడుతుందనీ, అందువల్ల కేసీఆర్ అసెంబ్లీకి వీల్ చైర్‌లోనే వస్తారని ఆయా వర్గాలు వివరించాయి.

ఏడాదిలోగా 2 లక్షల ఉద్యోగాల భర్తీ

(మొదటిపేజీ తరువాయి)

పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజామాబాద్ ఎంపీగా కల్వకుంట్ల కవిత ఓడిపోతే బాధపడిన కేసీఆర్, ఆమెకు ఎమ్మెల్సీ పదవిని ఇచ్చారని గుర్తుచేశారు. అదే తీరుగా రాష్ట్ర ప్రజల పట్ల వ్యవహరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రతిపక్ష నాయకునిగా నూతనంగా నియమితులైన నర్సింగ్ ఆఫీసర్లను ఆశీర్వదించాలనీ, లేకపోతే ఆ హోదాకు కూడా కేసీఆర్ సరిపోడని ఎద్దేవా చేశారు. నూతనంగా నియమితులైన నర్సులను చూసి ఫాంహౌజ్‌లో ఉన్న వారు కుళ్లుకున్నా సరే... ప్రజలను సంతోషపెట్టేందుకు తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే బీఆర్ఎస్ నేత హరీశ్ రావు శాపనార్థాలు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లి శాపనార్థాలకు ఉట్టి తెగిపడదని ఎద్దేవా చేశారు. అవాకులు, చెవాకులు పేలడం మాని, పేదోళ్ల కండ్లల్లో ఆనందం చూడాలని సూచించారు. స్టాఫ్ నర్సులకు ఉద్యోగాలు ఇవ్వాల్సిన అవసరమే లేదన్నట్టు మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శిస్తున్నారని చెప్పారు. అందువల్ల కేసీఆర్ ముందు తన అల్లునికి బుద్ధి చెబితే మంచిదని సూచించారు. ఆరోగ్య తెలంగాణలో నర్సుల పాత్ర కీలకమని ఆయన అభినందనలు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సార్థకత వచ్చిన రోజుగా బుధవారం నిలిచిందని తెలిపారు. నిరుద్యోగుల కలల సాకారంలో ఇది తొలి అడుగని చెప్పారు. రాష్ట్ర అవసరాలు, అప్పులు, ఛిద్రమైన ఆర్థిక వ్యవస్థ నడుమ దాదాపు రూ.500 కోట్ల భారం పడుతున్నా సరే, నర్సుల పోస్టుల భర్తీకి తమ సర్కారు ముందుకొచ్చిందని చెప్పారు. వైద్యారోగ్యశాఖలో ఖాళీగా ఉన్న మరో 5 వేల పోస్టుల భర్తీకి ప్రభుత్వం కసరత్తు చేస్తున్నదని తెలిపారు. ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలనీ, ఆప్రజల కలలు నెరవేర్చడం కోసం సమిష్టిగా ప్రయత్నిస్తామని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రభుత్వం ఇచ్చిన ప్రతీ మాట నిలెబట్టుకుంటుందని హామినిచ్చారు.వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ ప్రజలకు విద్య, వైద్యం, సంక్షేమం ముఖ్యమనీ, ఆ దిశగా తమ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని తెలిపారు. జన్మించిన తర్వాత మరణించే వరకు ప్రజలకు సేవలందించేది నర్సులని కొనియాడారు. ప్రతీ ఏడాది రాష్ట్రంలో 20 వేల మంది నర్సింగ్ విద్యను అభ్యసిస్తున్నారని చెప్పారు. పేపర్ లీకులు, కోర్టు కేసుల్లేకుండా, రోస్టర్ విధానాన్ని పాటించి నర్సింగ్ ఆఫీసర్ల పోస్టులను భర్తీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి శాంతికుమారి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, శాసనసభ్యులు మందుల శామ్యూల్, నాగరాజు, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, వేణుగోపాల్, వైద్యారోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టీనా చొంగ్తూ, ఆర్.వీ.కర్ణన్, ఇతర ఉన్నతాధికారులు నూతనంగా నియమితులైన నర్సింగ్ ఆఫీసర్లకు శుభాకాంక్షలు తెలిపారు.

హామీలు అమలు చేయాలి

- **మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్**

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజలకిచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. వరి పంటకు క్వింటాల్‌కు రూ.500తో పాటు రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ఉత్తర భారతదేశంలో పూర్తిగా చచ్చిన కాంగ్రెస్ నేతలు రాష్ట్రంలో ప్రజలను బ్లాక్ మెయిల్ చేసేలా మాట్లాడుతున్నారని విమర్శించారు.



కార్పొరేట్లకు కార్మికుల ప్రయోజనాలు తాకట్టు

(మొదటిపేజీ తరువాయి)
కల్పించడం లేదని విమర్శించారు. మనల్ని రక్షించుకోవడం ద్వారా మనం దేశాన్ని రక్షించాలన్నారు. ఈ తొమ్మిదిన్నరేండ్లలోనే అభివృద్ధి జరిగిందని బీజేపీ నేతలు ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గతేడాది నవంబర్ 26, 27, 28 తేదీల్లో దేశవ్యాప్తంగా కార్మికులు, కర్షకులు ఐక్యంగా నిర్వహించిన 'మహా పడావ్'లో 7 లక్షల మంది కార్మికులు పాల్గొని మోడీ ప్రభుత్వాన్ని హెచ్చరించడం జరిగిందన్నారు. ఇటీవల దేశవ్యాప్తంగా జరిగిన ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల సమ్మె కూడా విజయవంతమైందని తెలిపారు. మతాన్ని రాజకీయాలతో మిళితం చేసి వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ ఓట్లు దండుకొని అధికారంలోకి రావాలని చూస్తున్నదని తెలిపారు. ఇందులో భాగంగానే జనవరి 22న అయోధ్యలో రామాలయం ప్రారంభించి.. తనవల్లే రామాలయ నిర్మాణం సాధ్యమైందని ప్రచారం చేసుకుంటూ సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. నెల రోజులుగా ఇటువంటి ప్రచారంలోనే కేంద్ర ప్రభుత్వం నిమగ్నమై ఉందన్నారు. కేంద్రంలోని బీజేపీ తన మత ఎజెండాతో ముందుకు వెళ్తున్నా, మనం మన ఎజెండాతో ముందుకు సాగుతూనే వున్నామన్నారు. ఇందులో భాగంగానే జనవరి 26న అన్ని రాష్ట్రాల్లో రైతు, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ట్రాక్టర్, ద్విచక్ర వాహన ర్యాలీలను విజయవంతంగా నిర్వహించామన్నారు. అలాగే, బీజేపీని గద్దె దింపేందుకు ఈనెల 16వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే గ్రామీణ భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని కార్మికులను కోరారు.

కార్మిక సంఘాలతో సీఎం రేవంత్ సమావేశం కావాలి

రాష్ట్రంలో వెంటనే కార్మిక సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి కార్మికుల సమస్యల పరిష్కారానికి ఒక విధానాన్ని రూపొందించాలని సీఎం రేవంత్‌ను రాఘవులు డిమాండ్ చేశారు. నెలకో, రెండు నెలలకు ఒకసారి కార్మిక సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి, చర్చల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్మికుల వర్గ పోరాటాలను అణిచివేసినందుకే రెండు నెలల క్రితం బీఆర్ఎస్‌ను ఓడించి సీఎం కేసీఆర్‌ను ప్రజలు గద్దె దింపారన్నారు. 4.50 కోట్ల తెలంగాణ ప్రజల్లో 1.50 కోట్ల మంది కార్మికులున్న విషయాన్ని నాటి సీఎం కేసీఆర్, నాటి మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు గుర్తించలేదన్నారు. ఈ సభలో సీఐటీయూ ఆలిండియా కార్యదర్శి ఏఆర్. సింధు, రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు తదితరులు మాట్లాడారు. పాల్గొన్న వారిలో.. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శులు జె. వెంకటేష్, రాగుల రమేష్, హన్మకొండ జిల్లా ఉపాధ్యక్షులు గాదె ప్రభాకర్‌రెడ్డి, ఎస్. రజిత, బొట్ల చక్రపాణి, ఎం. చుక్కయ్య, సారంపల్లి వాసుదేవరెడ్డి తదితరులు ఉన్నారు.

బీజేపీని ఓడించకపోతే హక్కులుండవు : బీవీ రాఘవులు

వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ఓడించకపోతే దేశంలో హక్కులుండవని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఐటీయూ పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీవీ రాఘవులు హెచ్చరించారు. బీజేపీని ఓడించడమే కర్తవ్యం కావాలన్నారు. దేశంలో మోడీ ప్రధాని అయ్యాక రాజ్యాంగానికి, హక్కులకు ప్రమాదం ఏర్పడిందని తెలిపారు. ప్రశ్నించే కవులు, మేధావులు, ఉద్యమకారులను మోడీ జైల్లో పెట్టించారన్నారు. ప్రొఫెసర్ సాయిబాబా, వరవరరావుల ఆరోగ్యం బాగా లేకపోయినా జైళ్లల్లో వేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని గుర్తుచేశారు. దేశంలో సనాతన ధర్మాన్ని అమలు చేస్తామని బీజేపీ నేతలు చెబుతున్నారని, సనాతన ధర్మమంటే ఆడవాళ్లు ఆశాలుగా, అంగన్‌వాడీలుగా పనిచేయలేరని, ఇంట్లో వంట చేయడం, పిల్లల్ని కనడం వరకే పరిమితం చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మాన్ని రూపుమాపాలని ప్రకటించారని, దీనిపై బీజేపీ నేతలు పెద్ద పెట్టున దుష్ప్రచారం చేశారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ.. గత పార్లమెంటు ఎన్నికల్లో 17 శాతం ఓట్లు, 4 పార్లమెంటు సీట్లు గెలిచిందని, ఈసారి ఆ ఓట్లు, సీట్లు కూడా రాకుండా చూడాలని పిలుపునిచ్చారు.







నంది స్థానంలో గద్దర్ అవార్డులు

- కళాకారులు, సాహిత్యకారులకు వచ్చే ఏడాది నుంచి పురస్కారాలు
- లిక్కర్ పార్టీని ఇంటికి పంపారు..
- నిక్కర్ పార్టీని కూడా ఓడించి గద్దర్ ఆశయాన్ని నిలపాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- రవీంద్రభారతిలో ప్రజా యుద్ధనౌక గద్దర్ జయంతి వేడుకలు



నవతెలంగాణ-కల్చరల్

కళాకారులు, సాహిత్యకారులకు ఇక నుంచి నంది స్థానంలో గద్దర్ పేరిట అవార్డులు ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇటీవల సినీ కళాకారులు తనను కలిసి నంది అవార్డ్స్‌ను పునరుద్ధరించాలని కోరారని.. తాను వారికి నంది కాదు గద్దర్ పేరిట అవార్డ్స్ ఇస్తామని చెప్పానని అన్నారు. అలాగే మెదక్ జిల్లాకు గద్దర్ పేరు, ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహం ఏర్పాటుపై మంత్రి మండలిలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ప్రధాన వేదికపై గద్దర్ ఫౌండేషన్ ప్రారంభం, ప్రజా వాగ్గేయకారుడు గద్దర్ జయంతిని బుధవారం ప్రభుత్వ అధికారిక కార్యక్రమంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. గద్దర్ జయంతి రోజు కళాకారులకు, సాహిత్యకారులకు అవార్డులు ఇస్తామని ప్రకటించారు. ఈ వేదికగా చెబుతున్నా.. ఇదే శాసనం.. ఇదే జీవో అన్నారు. వచ్చే ఏడాది నుంచి గద్దరన్న జయంతి రోజున ఈ పురస్కారాలను ప్రదానం చేస్తామని తెలిపారు. సమాజాన్ని చైతన్యం చేసేందుకు గజ్జె కట్టి గళం విప్పిన గొప్ప వ్యక్తి గద్దరన్న అన్నారు. పొలిటీషియన్ లేదా క్రిమినల్‌ను ఎదుర్కోవటం సులువు కానీ.. క్రిమినల్ పొలిటీషియన్‌ను ఎదిరించి నిలవటం కష్టమని ఆయన చెప్పేవారన్నారు. నిక్కర్ పార్టీనీ, లిక్కర్ పార్టీనీ ఓడిస్తేనే సమ సమాజం అని గద్దర్ అనేవారని, లిక్కర్ పార్టీని ఇంటికి పంపామని.. రాబోయే ఎన్నికల్లో నిక్కర్ పార్టీని ఓడించడానికి ప్రజల సహకారం అవసరం అన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం కూలుతుందని, ఆరు నెలల్లో కేసీఆర్ సీఎం అవుతారంటూ కొందరు కలలు కంటున్నారన్నారు. అలాంటి ఆలోచన చేసిన వారికి తెలంగాణ ప్రజలు ఘోరీ కడతారని హెచ్చరించారు. తమ ప్రభుత్వం ఐదేండ్లు సుస్థిరంగా పాలన అందిస్తుందన్నారు. ప్రతిపక్షం బాధ్యతతో సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు.

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గతంలో తెలుగుదేశం, కాంగ్రెస్ ప్రభుత్వాలు పేదలకు పంచిన భూమిని బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పేరిట తిరిగి భూస్వాములను కట్టబెట్టే ప్రయత్నం చేసిందని విమర్శించారు. ఇందిరమ్మ పాలనలో పేదల భూమి పదిలంగా ఉండేలా ధరణిని మూలకు పెట్టామని చెప్పారు. గద్దర్ ఒక కులం, ప్రాంతానికి చెందిన వారు కారని, ఆయన విశ్వమానవుడని అన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో, మండలంలో గద్దర్ స్ఫూర్తితో కళాకారులు, సాహితీవేత్తలు సమ సమాజం కోసం అకింతం కావటమే ఆయనకు నివాళి అన్నారు.

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు మాట్లాడుతూ.. నేడు ప్రజా ప్రభుత్వం అధికారంలో ఉందని.. అసలైన కష్ట కాలం ముఖ్యమంత్రికి ముందు ఉందన్నారు. ఈ ప్రభుత్వంపై ప్రజలు ఆశలు, ఆకాంక్షలు ఎక్కువగా పెట్టుకున్నారని, కావునా ప్రజారంజక పాలన చేయలని సూచించారు.

సాహితీవేత్త కంచ ఐలయ్య మాట్లాడుతూ.. అసెంబ్లీ ప్రాంగణంలో పూలే విగ్రహ ప్రతిష్టకు సహకరించాలని ఎమ్మెల్సీ కవిత తనను కోరారని చెప్పారు. తనకే వల వేసిన వారు అధికార పార్టీ శాసన సభ్యులకు వల వేసే అవకాశం ఉంది కాబట్టి జాగ్రత్త వహించాలని సూచించారు. సభకు ముందుగా ఫౌండేషన్ స్థాపకుడు సూర్య కిరణ్ స్వాగతం పలుకుతూ గద్దర్ ఆశయాలు కొనసాగించటమే తమ సంస్థ లక్ష్యం అన్నారు. ఈ సందర్భంగా పాటకు జీవ కణం, గద్దర్ తరగని గ్రంథాలను సీఎం ఆవిష్కరించారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మధుయాష్కీ, ప్రజా గాయకుడు జయరాజ్, గద్దర్ కుమార్తె వెన్నెల, సీపీఐ(ఎం) నాయకులు రాములు, సాంస్కృతిక పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, గద్దర్ సతీమణి విమల తదితరులు పాల్గొన్నారు.

దిగజారిన 'పారదర్శక' సూచిక

- 8 స్థానాలు పడిపోయిన భారత్ ర్యాంక్
- కనుమరుగవుతున్న పౌర స్వేచ్ఛ
- ప్రాథమిక హక్కులకు విఘాతం
- ప్రపంచ అవినీతి సూచిక వెల్లడి



న్యూఢిల్లీ : 2022తో పోలిస్తే పారదర్శకత విషయంలో భారత్ సూచిక ఎనిమిది స్థానాలు దిగజారింది. దాని స్కోరు ఒక పాయింట్ పడిపోయింది. 2023వ సంవత్సరానికి సంబంధించిన 'ప్రపంచ అవినీతి అవగాహన సూచిక'ను స్వచ్ఛంద సంస్థ ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ మంగళవారం విడుదల చేసింది. ఈ సూచిక మొత్తం 180 దేశాల్లోని అవినీతిని పరిగణనలోకి తీసుకోగా వాటిలో భారత్‌కు 93వ ర్యాంక్ లభించింది. 2022తో పోలిస్తే ఈ ర్యాంక్ ఎనిమిది స్థానాలు దిగజారింది. 2022లో భారత్ ర్యాంక్ 85. ఇక స్కోరు విషయానికి వస్తే 2022లో 40గా ఉన్న స్కోరు గత సంవత్సరంలో 39కి పడిపోయింది. అత్యంత అవినీతిమయమైన దేశానికి ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ '0' ర్యాంక్ ఇస్తుంది. అవినీతి అసలే లేని దేశానికి 100వ ర్యాంక్ ఇస్తుంది. అంటే 0-100 మధ్య ర్యాంకులు ఉంటాయన్న మాట. భారత్‌తో పాటు మాల్దీవులు, కజక్‌స్థాన్, లెసోథో దేశాలకు 93వ ర్యాంక్ లభించింది. భారత్ స్కోరులో హెచ్చుతగ్గులు ఉన్నాయని, కాబట్టి గణనీయమైన మార్పు వచ్చిందని నిర్ధారణకు రాలేకపోయామని ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ తెలిపింది. అయితే భారత్‌లో పౌర స్వేచ్ఛ కనుమరుగు అవుతోందని, టెలీకమ్యూనికేషన్ బిల్లు ఆమోదంతో ప్రాథమిక హక్కులకు తీవ్ర విఘాతం ఏర్పడిందని వివరించింది. దేశ భద్రతా ప్రయోజనాలను సాకుగా చూపుతూ టెలికం సేవలపై కేంద్ర ప్రభుత్వానికి తాత్కాలికంగా పెత్తనాన్ని కట్టబెట్టేందుకు ఈ బిల్లును ఉద్దేశించారు. 'ఇది ఆసియా పసిఫిక్ ప్రాంతానికి ఎన్నికల ఏడాది. బంగ్లాదేశ్, భారత్, ఇండొనేషియా, పాకిస్తాన్, సోలోమన్ దీవులు, దక్షిణ కొరియా, తైవాన్‌లో ఎన్నికలు జరుగుతున్నాయి. 2023లో అవినీతిని అదుపు చేయడంలో పెద్దగా పురోగతి సాధించలేదు' అని ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ నివేదిక తెలిపింది. డెన్మార్క్ దేశం (స్కోరు 80) వరుసగా ఆరో సంవత్సరం సూచికలో ప్రథమ స్థానం పొందింది.



ఇదొక స్పెషల్ ఫిల్మ్ : విజయ దేవరకొండ

సుహాస్ హీరోగా నటించిన సినిమా 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు'. ఈ చిత్రాన్ని జీఏ2 పిక్చర్స్, దర్శకుడు వెంకటేష్ మహా బ్యానర్ మహాయన మోషన్ పిక్చర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మించాయి. దుశ్యంత్ కటికినేని దర్శకుడు. ఈ సినిమా ఈనెల 2న థియేటర్స్ ద్వారా గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకురానుంది. బుధవారం ఈ సినిమా బిగ్ టికెట్‌ను హీరో విజయ్ దేవరకొండ రిలీజ్ చేశారు. ఆయన మాట్లాడుతూ, 'ఈ చిత్ర బిగ్ టికెట్‌ని లాంచ్ చేయడం చాలా సంతోషంగా ఉంది. ఇలాంటి మంచి సినిమా ప్రమోషన్‌లో భాగమవ్వడం హ్యాపీగా ఉంది. ఈ సినిమా టీజర్ దగ్గర నుంచి ఒక ఇంట్రెస్ట్ క్రియేట్ చేస్తూ వచ్చింది. ఈ మూవీ టీమ్‌లోని ప్రతి ఒక్కరూ నాకు దగ్గర వాళ్లు. ఈ నెల 2న థియేటర్స్‌లోకి ఒక స్పెషల్ మూవీ రాబోతోంది. సినిమా చూశాను. ఫస్ట్ హాఫ్ అద్భుతంగా ఉంది. మ్యూజిక్, ఆర్టిస్టుల పర్‌ఫార్మెన్స్‌లు నెక్ట్ లెవెల్‌లో ఉన్నాయి. సుహాస్ ఎప్పటిలాగా చాలా బాగా నటించాడు. శరణ్య అద్భుతంగా పర్‌ఫార్మ్ చేసింది. ఏ సినిమాకైనా ఫస్ట్ హాఫ్ చూశాక కొంత విరామం తీసుకునే నేను ఈ సినిమాకి కంటిన్యూగా ఫుల్ మూవీ చూశాను. అంత క్యూరియస్‌గా అనిపించింది. మీరు కూడా థియేటర్‌లో ఇదే ఫీల్ అవుతారు' అని అన్నారు.

ఇదిలా ఉంటే, ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుకకు అతిథిగా విచ్చేసిన హీరో అడివి శేష్ మాట్లాడుతూ, 'సుహాస్ నాకు ఛాయ్ బిస్కట్‌లో వీడియోలు చేస్తున్నప్పటి నుంచి తెలుసు. తను గొప్ప స్థాయికి వెళ్తాడని చెప్పగలను. ఇలాంటి టాలెంటెడ్ ఆర్టిస్టులు చాలా అరుదుగా ఉంటారు. ఈ మూవీ ట్రైలర్‌ను పది సార్లు చూశా. అంత బాగా నచ్చింది. శరణ్య, శివానీ, సుహాస్ పోటీపడి నటించారు. ఈనెల 2న మనమంతా ఈ సినిమాతో థియేటర్‌లో బ్యాండ్ మోగించాలి' అని చెప్పారు.

ప్రతి పాత్ర బ్యూటీఫుల్‌గా ఉంటుంది

'అంబాజీపేట మ్యారేజి బ్యాండు' సినిమాతో హీరోయిన్‌గా శివాని నాగరం తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. ఈనెల 2న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్న సందర్భంగా శివాని నాగరం మీడియాతో ముచ్చటించింది. 'ఇలాంటి మంచి మూవీతో టాలీవుడ్‌లోకి అడుగు పెడుతుండటం అదృష్టంగా భావిస్తున్నా. ఈ సినిమాలో అవకాశం నాకు ఆడిషన్ ద్వారానే వచ్చింది. నేను హీరోయిన్ ఫ్రెండ్ రోల్ కోసం ఆడిషన్ అని వెళ్లాను. అయితే ఆడిషన్ తీసుకున్న తర్వాత హీరోయిన్‌గానే తీసుకుంటున్నాం అని చెప్పారు. ఫస్ట్ డే షూట్ చేసే వరకు నేనే హీరోయిన్ అనేది నమ్మలేకపోయాను. ఇందులో నా క్యారెక్టర్ పేరు లక్ష్మి. ఇందులో కొన్ని ఎమోషనల్ సీన్స్ చేయడం ఛాలెంజింగ్‌గా అనిపించింది. రియల్ లైఫ్‌లో నేను కూచిపూడి డ్యాన్సర్‌ని. పిల్లలకు సంగీతం నేర్పిస్తుంటా. అయితే ఈ సినిమాలో పాట పాడటం, డ్యాన్సులు చేయడానికి అవకాశం దొరకలేదు. నెక్ట్ ఫిలింలో ట్రై చేస్తా. సుహాస్ 'కలర్ ఫొటో' మూవీకి నేషనల్ అవార్డ్ దక్కింది. ఆయనతో వర్క్ చేయడం హ్యాపీగా, కంఫర్ట్‌గా ఉంది. డైరెక్టర్ దుశ్యంత్ ఈ కథలో ప్రతి ఒక్కరి క్యారెక్టర్‌కు ఇంపార్టెన్స్ ఇచ్చారు. ఇందులో సుహాస్‌తో పాటు నేను చేసిన లక్ష్మి క్యారెక్టర్‌కు ఇంపార్టెన్స్ ఉంటుంది. అలాగే శరణ్య పాత్ర చాలా బాగుంటుంది. విలన్ క్యారెక్టర్ కూడా కీలకంగా సాగుతుంది. ప్రతి క్యారెక్టర్ బ్యూటీఫుల్‌గా ఉంటుంది. నేను చేసిన లక్ష్మి క్యారెక్టర్‌కు మంచి పేరు వస్తుందని ఆశిస్తున్నా. సినిమా చూశాను. ఫలితంపై చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నా. కచ్చితంగా హిట్ అవుతుంది'.


శివాని నాగరం

నవచిత్రం


శేఖర్ కమ్ముల

ముచ్చటగా 3వ సినిమా

డైరెక్టర్ శేఖర్ కమ్ముల ప్రస్తుతం ధనుష్, నాగార్జునతో మల్టీ స్టారర్ చేస్తున్నారు. శ్రీ నారాయణ్ దాస్ కె నారంగ్ ఆశీస్సులతో శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పి (ఏషియాన్ గ్రూప్ యూనిట్) బ్యానర్ పై సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్‌మోహన్‌రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా ఈ ప్రొడక్షన్ హౌస్ తమ కొత్త చిత్రాన్ని ప్రకటించింది.

నాగ చైతన్య, సాయి పల్లవితో క్లాసిక్ 'లవ్ స్టోరీ', ప్రస్తుతం జరుగుతున్న సినిమా తర్వాత ఈ కొత్త సినిమాని శేఖర్ కమ్ములతో చేయబోతున్నారు. శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పి, అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. సోనాలి నారంగ్ సమర్పిస్తున్నారు. ఈ కొత్త చిత్రం లార్జర్ దెన్ లైఫ్‌గా ఉండబోతోంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి.

యూనిక్ పాయింట్‌తో ధీర

లక్ష్ చదలవాడ నటిస్తున్న తాజా సినిమా 'ధీర'. చదలవాడ బ్రదర్స్ సమర్పణలో శ్రీ తిరుమల తిరుపతి వెంకటేశ్వర బ్యానర్ మీద పద్మావతి చదలవాడ నిర్మించారు. ఈనెల 2న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ క్రమంలో మంగళవారం ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు.

ఈ ఈవెంట్‌లో దిల్ రాజు, గోపీచంద్ మలినేని, త్రినాథరావు నక్కిన బిగ్ టికెట్‌ను లాంచ్ చేశారు.నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ, 'తండ్రిగా నేను లక్ష్‌ను చూసి గర్విస్తుంటాను. మార్చిలో నేను వంద కోట్లతో తీసిన రికార్డ్ బ్రేక్ అనే గ్రాఫిక్స్ చిత్రం రాబోతోంది. అది ప్యాన్ వరల్డ్ సినిమా. సునిల్ కుమార్ రెడ్డి కాంబోలో హిందీలోనూ ఓ సినిమా చేస్తున్నాను. కే.ఎస్.నాగేశ్వరరావు తీసిన 'నా కనురెప్పవు నువ్వేరా' కూడా రెడీగా ఉంది. మా ప్రొడక్షన్స్‌లో ఇప్పుడు పదహారు చిత్రాలు రెడీగా ఉన్నాయి' అని తెలిపారు.'పక్కనోడి గురించి పట్టించుకోకుండా నచ్చింది చేసే పాత్ర నాది. అలాంటి వాడికి ఓ మిషన్ ఇస్తే.. ఆ ప్రయాణంలో ఏర్పడిన సమస్యల్నే ఇందులో చూపించబోతున్నాం' అని లక్ష్ చదలవాడ చెప్పారు. డైరెక్టర్ విక్రాంత్ శ్రీనివాస్ మాట్లాడుతూ, 'ఇందులో హీరో పాత్ర గ్రే షేడ్స్‌లోనే ఉంటుంది. ఇది చాలా యూనిక్ పాయింట్' అని అన్నారు.




రొమాంటిక్ కామెడీ సిరీస్


అభిజీత్

బిగ్ బాస్ ఫేమ్ అభిజీత్ నటించిన వెబ్ సిరీస్ 'మిస్ పర్ఫెక్ట్'. ఈ వెబ్ సిరీస్‌లో లావణ్య త్రిపాఠీ హీరోయిన్‌గా నటించింది. అభిజ్ఞ ఉతలూరు మరో కీ రోల్ చేసింది. ఈ వెబ్ సిరీస్‌ను అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ పై సుప్రియ యార్లగడ్డ నిర్మించారు. విశ్వక్ ఖండేరావ్ దర్శకత్వం వహించారు. ఈనెల 2వ తేదీ నుంచి డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌లో ఈ సిరీస్ స్ట్రీమింగ్‌కు రెడీ అవుతోంది. ఈ సందర్భంగా హీరో అభిజీత్ మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

'ఈ వెబ్ సిరీస్‌లో నేను రోహిత్ అనే క్యారెక్టర్‌లో నటిస్తున్నాను. చాలా లేజీ పర్సన్‌గా కనిపిస్తా. జీవితంలో ఎలాంటి లక్ష్యమంటూ ఉండదు. ఏదో డబ్బు కోసం ఉద్యోగం చేస్తుంటాడు. కానీ అదీ సీరియస్‌గా తీసుకోడు. రోహిత్‌కు ఇష్టమైన విషయం ఒక్కటే వంట చేయడం. అది మాత్రం శ్రద్ధగా చేస్తుంటాడు. నా రియల్ లైఫ్‌లో రోహిత్ లాంటి క్యారెక్టర్స్‌ను చాలామందిని చూశాను. నా ఫ్రెండ్స్ కూడా అలాంటి వాళ్లు ఉన్నారు. ఉద్యోగంలో ఇష్టంతో ఉండలేక...బయటకు వచ్చి బిజినెస్‌తో రిస్క్ చేయలేక ఆ సంఘర్షణలో ఉండిపోతారు. ఎవరైనా ఉద్యోగం కాదని వేరే పనిచేయాలనుకుంటే అది 30-35 ఇయర్స్ లోనే చేయాలి. 40 దాటిన తర్వాత మీరు రిస్క్ చేయాలన్నా చేయలేరు. అప్పుడు ఇంకా బాధ్యతలు పెరిగిపోతాయి. నా రియల్ లైఫ్‌లో రోహిత్‌తో కొంత పోల్చుకుంటా. కానీ యాక్టర్‌గా నా కెరీర్ విషయంలో మాత్రం సీరియస్‌గానే ఉన్నా. ఈ మధ్య పెళ్లి గోల, మోడరన్ లవ్ అనే సిరీస్‌లు చేశాను. ఆ తర్వాత నటించిన వెబ్ సిరీస్ ఇదే. ఇది రొమాంటిక్ కామెడీ సిరీస్. ఒక అపార్ట్‌మెంట్‌లో కొన్ని క్యారెక్టర్స్ మధ్య జరుగుతుంది. క్యారెక్టర్స్ మధ్య నవ్వించే డైలాగ్స్ ఉంటాయి. ప్లెజంట్‌గా ఎంటర్‌టైనింగ్‌గా ఎపిసోడ్స్ వెళ్తుంటాయి'.

చివరి 15 నిమిషాలు మిస్ కావొద్దు


యష్ పూరి


యష్ పూరి హీరోగా నటించిన లేటెస్ట్ మూవీ 'హ్యాపీ ఎండింగ్'. అపూర్వ రావ్ హీరోయిన్. హమ్స్ టెక్ ఫిలింస్, సిల్లీ మాంక్స్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించాయి. యోగేష్ కుమార్, సంజయ్ రెడ్డి, అనిల్ పల్లాల నిర్మాతలు. కౌశిక్ భీమిడి దర్శకుడు. ఈ సినిమా ఈనెల 2న రిలీజ్ కానుంది.

ఈ నేపథ్యంలో బుధవారం హీరో యష్ పూరి మీడియాతో మాట్లాడుతూ, 'మన పురాణాల్లోని శాపాలు అనే కాన్సెప్ట్ తీసుకుని మా డైరెక్టర్ కౌశిక్ ఈ కథను డెవలప్ చేశారు. పురణాల్లో మనం చదివిన శాపాలు ఇవాళ్టి తరం కుర్రాడికి వస్తే అతని జీవితంలో ఎలా మారిపోయింది. ఆ శాపాన్ని ఎదుర్కొనేందుకు ఆ యువకుడు చేసిన ప్రయత్నాలు ఏంటి అనేది ఎంటర్ టైనింగ్‌గా తెరకెక్కించాం. సినిమాలో ఒక్క నిమిషం కూడా సందేశం ఇచ్చినట్లు ఉండదు. అంతా ఫన్, ఎంటర్‌టైన్‌తో ఉంటుంది. నా క్యారెక్టర్ శాపంతో ఇబ్బందులు పడినా..ప్రేక్షకులు మాత్రం నవ్వుకుంటారు. ఈ సినిమాలో ఝాన్సీ, అజయ్ ఘోష్ క్యారెక్టర్స్ కొత్త వేలో కనిపిస్తాయి. అలాగే ఎడిటింగ్, మ్యూజిక్, డీవోపీ వర్క్...ఇలా ప్రతి ఒక్క డిపార్ట్‌మెంట్ ప్రతిభని సినిమాలో చూస్తారు. సినిమా చివరి 15 నిమిషాలు మిస్ కావొద్దు. పాటలు, కామెడీ బాగా వచ్చాయి. ట్రైలర్ బాగుందని చెబుతున్నారు. దీంతో మా సినిమా ఫలితమే గట్టి నమ్మకంతో ఉన్నాం' అని తెలిపారు.

నవ్వించే సుందరం మాస్టర్ కథ

ఆర్ టీ టీం వర్క్స్, గోల్ డెన్ మీడియా పతాకాలపై మాస్ మహారాజా రవితేజ, సుధీర్ కుమార్ కుర్రు నిర్మిస్తున్న చిత్రం 'సుందరం మాస్టర్'. హర్ష చెముడు, దివ్య శ్రీపాద ప్రధాన పాత్రలు పోషించారు. ఒక గ్రామంలో కష్టపడే ఉపాధ్యాయుడి చుట్టూ ఈ కథ తిరుగుతుంది.

మిర్యాల మెట్ట అనే మారుమూల గ్రామంలో ఇంగ్లీషు టీచర్‌గా సుందరం వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అన్ని వయసుల వారు ఇంగ్లీష్ నేర్చుకోవడానికి విద్యార్థులుగా నమోదు చేసుకుంటారు. సుందరం మాస్టర్ వాళ్ళందరికీ భాషని ఎలా బోధిస్తారనే దాన్ని వినోదాత్మక చిత్రంగా రూపొందించారు. బుధవారం ఈ చిత్ర విడుదల తేదీని ప్రకటించారు మేకర్స్. ఈ హిలేరియస్ ఎంటర్‌టైనర్ ఈనెల 23న థియేటర్లలో విడుదల కానుంది. టీజర్‌లో హర్ష చెముడు నవ్వించాడు. కొత్త దర్శకుడు కళ్యాణ్ సంతోష్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని హీరో రవితేజ నిర్మిస్తుండడంతో మంచి బజ్ ఏర్పడింది.


హర్ష చెముడు

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.


ఏజీ (ఆడిట్)గా బాధ్యతలు స్వీకరించిన మాధవి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణా రాష్ట్ర అకౌంటెంట్ జనరల్ (ఆడిట్)గా పి. మాధవి బుధవారం సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. 2001 ఇండియన్ ఆడిట్, అకౌంట్స్ సర్వీస్ బ్యాచ్ కు చెందిన ఆమె ప్రస్తుతం కంప్ట్రోలర్ అండ్ ఆడిట్ జనరల్ (ఏజీ) స్థాయి హోదాలో ఉన్నారు. 2017 నుంచి 2018 ఏప్రిల్ వరకు మహారాష్ట్ర ఏజీగా, 2018 అక్టోబర్ నుంచి 2024 వరకు చెన్నైలోని రీజినల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపల్ డైరెక్టర్‌గా, చెన్నై సెంట్రల్ ఆడిట్ డైరెక్టరుగా పని చేశారు. 2011లో కొలంబో ఎంబసీ ఆడిటర్‌గా, 2012లో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఫైనాన్షియల్ ఆడిటర్‌గా విధులు నిర్వర్తించారు. 2014లో యునిసెఫ్ ఎమర్జెన్సీ ఎబోలా మిషన్‌లో ఆడిటర్‌గా పని చేశారు. కాగా రాష్ట్ర అకౌంటెంట్ జనరల్‌గా భాధ్యతలు స్వీకరించిన సందర్భగా ఆమెను పలువురు అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

ఎడమ కాల్వ ద్వారా నీటి విడుదల

- తాగునీటి అవసరాల కోసమే..



నవతెలంగాణ- నాగార్జునసాగర్

ఖమ్మం జిల్లా ప్రజల దాహార్తిని తీర్చేందుకు నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోని ఎడమకాల్వ ద్వారా ఎన్ఎస్పీ అధికారులు బుధవారం నీటిని విడుదల చేశారు. పాలేరు జలాశయంలో నీటి నిల్వలు డెడ్ స్టోరేజీకి చేరుకోవడంతో ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న విషయం తెలుసుకున్న తెలంగాణ ప్రభుత్వం ఎడమకాల్వ ద్వారా నీటిని విడుదల చేయాలని ఆదేశించింది. దీంతో ప్రాజెక్టు ఉన్నతాధికారులు రోజుకు 1000 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేశారు. 6 రోజులపాటు సుమారు 6 వేల టీఎంసీలు నీటిని ఎడమకాల్వకు విడుదల చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించుకోవాలని, నీటిని పొదుపుగా ఉపయోగించాలని అధికారులు కోరారు.

కడెం ప్రాజెక్టును సందర్శించిన ఎన్డీఆర్ఎఫ్ బృందం

- ప్రకృతి విపత్తులపై ప్రజలకు అవగాహన



నవతెలంగాణ-కడెం

కడెం ప్రాజెక్టును నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందం సభ్యులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కడెం ప్రాజెక్టు గేట్లను ఇన్‌స్పెక్టర్ పింటు నంది పరిశీలించారు. అనంతరం పాండ్వాపూర్ గ్రామంలో ప్రకృతి విపత్తుల కారణంగా జరిగే అనర్థాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. రైతులు పొలాలకు వెళ్లినప్పుడు జరిగే విపత్తుల గురించి, వాటికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. అనంతరం గుండెపోటు వచ్చిన వ్యక్తికి ఎలాంటి వైద్య చికిత్సలు అందించాలని అనే విషయాల గురించి తెలిపారు. అదేవిధంగా వర్షాకాలంలో వచ్చే వరదలు, ఆ సమయంలో తమను తాము ఎలా రక్షించుకోవాలో, ఎదుటివారిని ఎలా రక్షించాలి అనే విషయాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. వారి వెంట తహసీల్దార్ సుజాత, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

'ఇంక్విలాబ్ జిందాబాద్' అన్నందుకు మరోసారి ప్రమాణ స్వీకారం

- రాజ్యసభలో ఆప్ ఎంపీ స్వాతి మలివాల్‌కు ఎదురైన ఘటన

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

'ఇంక్విలాబ్ జిందాబాద్' అన్నందుకు ఒక రాజ్యసభ సభ్యురాలిని రెండోసారి ప్రమాణ స్వీకారం చేయించారు. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేత, డీసీడబ్ల్యూ మాజీ చీఫ్ స్వాతి మలివాల్‌కు ఇలాంటి పరిస్థితి ఎదురైంది. రాజ్యసభ సభ్యురాలిగా ఇటీవల ఎంపికైన స్వాతి మలివాల్ చేత బుధవారం రాజ్యసభలో చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ ప్రమాణ స్వీకారం చేయించారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల తొలిరోజు సందర్భంగా ఆమె ప్రమాణస్వీకారం చేసినప్పటికీ, ఒకసారి కాకుండా రెండు సార్లు ప్రమాణం చేయాల్సి వచ్చింది. ఇందుకుకారణంగా తొలుత ప్రమాణ స్వీకారం అనంతరం చివరిలో ఆమె 'ఇంక్విలాబ్ జిందాబాద్' అంటూ ముగించడమే. దీనిపై బీజేపీ ఎంపీ పీయూష్ గోయల్ అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఆమె చేసిన ప్రమాణస్వీకారాన్ని చైర్మెన్ రద్దుచేశారు. అనంతరం స్వాతి మలివాల్ రెండోసారి ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల జరిగిన ఢిల్లీ రాజ్యసభ ఎన్నికల్లో ఆప్ అభ్యర్థిగా స్వాతి మలివాల్‌ను ఆ పార్టీ నిలబెట్టగా, ఆమె ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

హెచ్-1బీ వీసాల్లో కొత్త రూల్స్

వాషింగ్టన్: హెచ్-1బీ వీసాల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో మోసాలను అరికట్టేందుకు అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. 2025 ఆర్థిక సంవత్సరానికి జారీ చేసే వీసాల ఎంపిక ప్రక్రియకు కొత్త నిబంధనలు ప్రకటించింది. ఇకపై, ఒక లబ్ధిదారు బహుళ దరఖాస్తులు చేసుకున్నా.. ఒకే అప్లికేషన్‌గా పరిగణించనున్నారు. రిజిస్ట్రేషన్ల సంఖ్యతో సంబంధం లేకుండా.. దరఖాస్తుదారులందరికీ సమాన అవకాశాలు కల్పించడం కోసం ఈ 'కేంద్రీకృత-ఎంపిక ప్రక్రియ' నిర్ణయం తీసుకున్నట్లు అమెరికా పౌరసత్వ, వలస సేవల విభాగం వెల్లడించింది. 2025 ఆర్థిక సంవత్సరానికి గానూ మొదలయ్యే వీసాల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఈ నిబంధనలను అమలు చేయనున్నారు. అంతేగాక, ప్రతి లబ్ధిదారు సరైన పాస్‌పోర్టు వివరాలు, ప్రయాణ పత్రాలను తప్పనిసరిగా సమర్పించాలి. తప్పుడు సమాచారం ఇస్తే ఆ పిటిషన్లను తిరస్కరించే లేదా రద్దు చేసే అధికారం యూఎస్‌సీఐఎస్‌కు ఉంటుంది.

మంత్రిని కలిసిన 'గుట్ట' సిబ్బంది

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో పనిచేసే పలువురు ఉద్యోగులు బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను మర్యాదపూర్వకంగా కలిశారు. వీరిలో మినిస్ట్రియల్, అర్చక, నాల్గవ తరగతి ఉద్యోగులు ఉన్నారు. ఈ సందర్భంగా స్వామివారి చిత్రపటం, శేష వస్త్రాలు, ప్రసాదాలను అందచేశారు. దేవస్థానంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, భక్తులు సౌకర్యవంతంగా స్వామివారిని దర్శించుకునేందుకు చేపడుతున్న చర్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు.

బాసర గుడికి రండి

- మంత్రికి ఆలయ సిబ్బంది ఆహ్వానం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

నిర్మల్ జిల్లా బాసరలోని జ్ఞాన సరస్వతి దేవస్థానంలో ఫిబ్రవరి 14న అమ్మవారి జన్మదినోత్సవమైన వసంత పంచమి మహోత్సవానికి రావల్సిందిగా దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను ఆలయ సిబ్బంది ఆహ్వానించారు. బుధవారం ఆలయానికి చెందిన పలువురు అధికారులు, అర్చకులు ఆమెను కలిశారు. వసంత పంచమిని పురస్కరించుకొని సాంప్రదాయబద్ధంగా మంత్రి హోదాలో అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించాలని కోరారు. ఈ సందర్భంగా వసంతి పంచమి మహోత్సవ ఆహ్వాన గోడ పత్రికను ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, అదనపు కమిషనర్ జ్యోతి, వరంగల్ జోన్ ఉప కమిషనర్ శ్రీకాంత్‌రావు, ఆలయ ఈవో విజయ రామారావు, ప్రధాన అర్చకులు సంజీవ్ పూజారి, వేదపండితులు నవీన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు వింటూ.. వినతులు స్వీకరిస్తూ..

బైక్‌పై ఖమ్మం నగరంలో మంత్రి పొంగులేటి పర్యటన

తక్షణ పరిష్కార చర్యల కోసం ఆదేశాలు

- ఆకస్మిక పర్యటనతో అధికారుల ఉరుకులు పరుగులు



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

పాలేరు నియోజకవర్గానికి సంబంధించిన ఖమ్మం నగరంలోని శివారు డివిజన్లలో రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కలియ తిరిగారు. బుధవారం ఉదయం 6.45 గంటల కల్లా ఆకస్మికంగా 1, 59, 60 డివిజన్‌ల పరిధిలోని కైకొండాయిగూడెం, దానవాయిగూడెం, రామన్నపేటలో అడుగిడిన మంత్రిని చూసి స్థానికులు సైతం అవాక్కయ్యారు. ఎలాంటి సమాచారం లేకుండా మంత్రి రావడంతో సమస్యలు చెప్పుకునేందుకు జనం రోడ్ల మీదకు వచ్చారు. కొందరు అప్పటికప్పుడు వినతులు రాసుకొని వచ్చి మరీ పొంగులేటికి ఇచ్చారు. రోడ్లు, డంపింగ్‌యార్డులు, పారిశుధ్య, తాగునీరు, మున్నేరు ముంపు తదితర స్థానిక సమస్యలన్నింటినీ ప్రజలు ఏకరువు పెట్టారు. మంత్రి రావడంతో అధికారులు ఉరుకులు పరుగులు పెడుతూ వచ్చారు. అందుబాటులో ఉన్న అధికారులకు సమస్యలపై అప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేశారు. అపరిష్కృతంగా ఉన్న ఆయా సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సరైన వివరణ ఇవ్వకుండా.. నిర్లక్ష్యం వహించే అధికారుల తీరును జనం మంత్రి ముందు ఉంచారు. ప్రభుత్వ అధికారుల ద్వారా ఎదురవుతున్న సమస్యలను కూడా జనం వివరించారు. తక్షణ చర్యలకు మంత్రి ఆదేశాలు ఇచ్చారు. దీర్ఘకాలిక సమస్యగా ఉన్న డంపింగ్‌యార్డును దానవాయిగూడెం సమీపంలోని ఎన్నెస్పీ బ్రిడ్జి మీదుగా పరిశీలించారు. సీసీ రోడ్లు కూడా లేకపోవడంతో ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజలు వివరించారు. రామన్నపేట శ్మశానవాటిక అన్యాక్రాంతం అవుతున్న దృష్ట్యా దాని చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రామన్నపేట కాలనీలో మున్నేరు ముంపు ఆర్‌సీసీ వాల్ నిర్మాణంతో నిర్వాసితులుగా మారేవారికి ప్రత్యామ్నాయ స్థలాలు చూపించాలన్నారు. రామన్నపేట చెరువు నుంచి వచ్చే వరద కాలువ నీరు ఇండ్లలోకి రాకుండా చూడాలని తెలిపారు. దీనిపై నీటిపారుదల శాఖ అధికారులకు సూచనలు చేద్దామని చూసినా.. వారు అందుబాటులో లేకపోవడంతో మంత్రి కొంత అసహనానికి లోనయ్యారు. రామన్నపేట ఊళ్లో వరద కాలువ వచ్చే ప్రాంతాన్ని మంత్రి పరిశీలించారు. మంత్రి వెంట పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, మున్సిపల్ ఈఈ కృష్ణలాల్, ఆర్డీవో గణేశ్, తహసీల్దార్ స్వామి తదితరులు ఉన్నారు.

మేడారంలో సందర్శకుల తాకిడి

- కిటకిటలాడుతున్న వన దేవతల గద్దెలు



నవతెలంగాణ -తాడ్వాయి

ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధిగాంచిన ములుగు జిల్లా మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు సందర్శకులు పెద్దఎత్తున తరలివస్తున్నారు. ఈ మహాజాతర ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు ఉన్నప్పటికీ ఇప్పటి నుండే సందర్శకులు భారీగా వస్తున్నారు. వనదేవతలు దర్శనానికి బుధవారం అధిక సంఖ్యలో తరలిరావడంతో మేడారం కిక్కిరిసింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా సరిహద్దు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ నుంచి కూడా భారీగా తరలివచ్చారు. రోజూ లక్ష మందికిపైగా అమ్మవారిని దర్శించుకుంటున్నట్టు ఆలయ అధికారులు చెబుతున్నారు. కాగా మహాజాతరకు సమయం దగ్గర పడుతుండటంతో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయడంపై దృష్టి సారించారు. పనుల్లో నాణ్యతలో రాజీ పడకుండా సకాలంలో పూర్తి చేస్తామని ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీవో అంకిత్ తెలిపారు.

ఆశావహులకు ఆంక్షలు

- కాంగ్రెస్‌లో ఎంపీ టికెట్ దరఖాస్తులు షురూ

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయాలని ఆసక్తి చూపుతున్న ఆశావహులకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పలు ఆంక్షలు విధించింది. ఎంపీ టికెట్ కోసం దరఖాస్తుల్ని ఆహ్వానించే ప్రక్రియలో భాగంగా పలు షరతులపై డిక్లరేషన్ కూడా కోరింది. పార్టీ విధి విధానాలకు కట్టుబడి ఉండేలా ముందే అభ్యర్థుల చేత సంతకాలతో కూడిన డిక్లరేషన్ కోరడం గమనార్హం. ఇది ఆపార్టీలో చర్చనీయాంశంగా మారింది. పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయాలని బావిస్తున్న ఆశావహుల నుంచి గాంధీభవన్‌లో ప్రత్యేక కౌంటర్ పెట్టి దరఖాస్తుల్ని స్వీకరిస్తున్నారు. ఈ కార్యక్రమం మార్చి 3 వరకు ఉంటుంది.

పార్టీ ఆశయాల్ని పాటిస్తామని సంతకం చేసి ప్రతిజ్ఞ చేయడం, కొన్ని షరతుల్ని అంగీకరించడం, కొన్ని అంశాలకు సంబంధించి వివరాల్ని పేర్కొనడం వంటి ఆంక్షలు పెట్టారని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అంటున్నారు. దరఖాస్తు ఫారంలో ప్రాథమిక వివరాలు, పార్టీలో చేరిన సంవత్సరం, మధ్యలో పార్టీ వీడితే తిరిగి చేరిన రోజు, గడిచిన రెండేండ్ల కాలంలో రాజకీయ పరంగా నిర్వహించిన కార్యక్రమాలు, రాజకీయ నేపథ్యం, గతంలో చేసిన పదవులు, ప్రస్తుతం పార్టీలో ఉన్న పదవి వంటి వివరాల్ని పేర్కొనాల్సి ఉంది. అదే విధంగా దరఖాస్తులో ఆశావహుల ముందు పార్టీ 17 డిక్లరేషన్‌ను పెట్టింది. పార్టీలో తనను అభ్యర్థిగా ప్రకటించని పక్షంలో పార్టీకి వ్యతిరేకంగా నామినేషన్ దాఖలు చేయబోనని డిక్లరేషన్ ఇవ్వాలని కోరింది.

కట్నం తీసుకోనని, ఇవ్వనని, హింసకు తావివ్వకుండా ఉంటానని, స్త్రీల గౌరవాన్ని నిలబెడతానని, పార్టీ ప్రొటోకాల్ పాటిస్తానని, కుల, మత బావాలను ప్రోత్సహించే ఎలాంటి సమావేశాలకు హాజరుకాబోనని డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుంది.

జీవవైవిధ్యానికి ఆలవాలం చిత్తడి నేలలు

- పరిరక్షించుకోకపోతే భవిష్యత్ తరాలకు ప్రమాదకరం : అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జీవవైవిధ్యానికి చిత్తడి నేలలు ఆనవాలమనీ, వాటిని పరిరక్షించుకోకపోతే భవిష్యత్ తరాలు ప్రమాదంలో పడతాయని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హెచ్చరించారు. చిత్తడి నేలల పరిరక్షణకు సమర్థవంతమైన కార్యాచరణను అమలుచేయాల్సిన అత్యవసర పరిస్థితి నెలకొందని నొక్కిచెప్పారు. తెలంగాణలోని చిత్తడి నేలల పరిరక్షణ, వాటి గుర్తింపు తదితర అంశాలకు సంబంధించి బుధవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో స్టేట్ వెట్ ల్యాండ్స్ అథారిటీ చైర్మెన్, మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సహజంగా, కాలువల ప్రవాహంతో, మనుషుల ప్రమేయంతో ఏర్పడిన చిత్తడి నేలలను గుర్తించడంతో పాటు వాటి పరిరక్షకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో ముందుకెళ్లాలనీ, ఒక్కొక్క శాఖ నుంచి నోడల్ అధికారి ఈ వివరాలను చిత్తడి నేలల గుర్తింపు కోసం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీకి అందజేయాలని సూచించారు. తద్వారా ఆ నేలల సంరక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టే అవకాశం కలుగుతుందన్నారు. 'రామ్ సర్ ఒప్పందం'లోని ప్రమాణాలకు అనుగుణంగా భారతదేశంలో 75 సైట్లుండగా, తెలంగాణలో ఒక్క సైట్‌నూ గుర్తించపోవడం విచారించాల్సిన విషయమని చెప్పారు. గత ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపట్టకపోవడం శోచనీయమని విమర్శించారు. 'రామ్ సర్' ప్రమాణాలకు అనుగుణంగా తెలంగాణలో మూడు నాలుగు సైట్లు గుర్తించే అవకాశాలున్నాయని అధికారులు ప్రస్తావించగా.. ఆ దిశగా చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. సమీక్షలో అటవీ, పర్యావరణ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీ ప్రసాద్, రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, పీసీసీఎఫ్ ఆర్ఎం.డోబ్రియాల్, అటవీ, పర్యావరణ శాఖ అడిషనల్ సెక్రటరీ, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మెడికల్ ప్లాంట్ బోర్డ్ సోని బాల దేవి తదితర ఉన్నతాధికారులతో పాటు అటవీ, పర్యావరణం, నీటిపారుదల, పంచాయతీ రాజ్, రెవెన్యూ, ఫిషరీస్, టూరిజం శాఖలకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

చేవెళ్ల 'గులాబీలో' ముసలం

- సిట్టింగ్ ఎంపీపై అసంతృప్తి
- కారు దిగేందుకు సిద్ధమవుతున్న నేతలు
- హస్తం నేతలతో ఎమ్మెల్యేల సంప్రదింపులు
- కాంగ్రెస్ నుంచి ఎంపీ టికెట్ ఆశిస్తున్న 'పట్నం'
- కేటీఆర్ మీటింగ్ చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య దుమ్మా
- వేగంగా మారుతున్న రాజకీయ పరిణామాలు

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్‌లో ముసలం మొదలైంది. సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డిపై పార్టీ క్యాడర్ తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. దాంతో కారు దిగి హస్తం గూటికి చేరేందుకు పార్టీ నేతలు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పెద్దలతో సంప్రదింపులు జరిపినట్టు సమాచారం. మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి దంపతులు సైతం పార్టీ వీడుతున్నట్టు సమాచారం. సోమవారం జరిగిన కేటీఆర్ మీటింగ్‌కు చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య కూడా దుమ్మా కొట్టారు. దాంతో పార్టీలో ఎవరు ఉంటారు.. ఎవరు ఉండరు.. అనే విషయంపై జోరుగా చర్చ జరుగుతోంది.



చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఇందులో నాలుగు చోట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ఉన్నారు. పార్లమెంట్ పరిధిలో అత్యధిక ఓటు బ్యాంక్ ఉన్న శేరిలింగంపల్లి, రాజేందర్‌నగర్, మహేశ్వరం నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ప్రాతినిధ్యం వహించడంతో ఈ సీటు గెలవడం పక్కా అని బీఆర్ఎస్ అధిష్టానం దీమాగా ఉంది. అందులో భాగంగానే సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డికే మళ్లీ టికెట్ ప్రకటించింది. ఇంత వరకు బాగానే ఉన్నా.. ఇక్కడ నుంచే అసలు కథ మొదలైంది. ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణుల వైఖరి బీఆర్ఎస్ అధిష్టానాన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డిని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ కలవడంతో ఆయన పార్టీ మారతారనే వార్తలు వినిపించాయి. అయితే ఎమ్మెల్యే మాత్రం నియోజకవర్గ అభివృద్ధి కోసం మాత్రమే సీఎంను కలిశానని చెప్పుకునే ప్రయత్నం చేశారు. ఇదిలా ఉంటే సోమవారం నిర్వహించిన చేవెళ్ల సన్నాహక సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య దుమ్మా కొట్టారు. సమావేశ నిర్వహణలో సైతం ఆయన అంటిముట్టనట్టు వ్యవహరించారు. పార్టీ నాయకులు మాత్రం ఆయనకు ఆరోగ్యం బాగా లేకపోవడంతోనే సమావేశానికి రాలేదని సభలో కార్యకర్తలకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. ఇదిలా ఉంటే సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి నాన్ లోకల్ అని బీఆర్ఎస్ నాయకులే ప్రచారం చేస్తున్నారు. నాన్ లోకల్ అంశాన్ని తెరపైకి తెచ్చి.. ఎంపీని ఇరకాటంలోకి నెడుతున్నారు.

హస్తం గూటికి పట్నం?

రంగారెడ్డి జిల్లాలో కీలక నేతగా ఉన్న మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధం అవుతున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే కాంగ్రెస్ అధిష్టాన పెద్దలతో సంప్రదింపులు జరిపినట్టు సమాచారం. అయితే పట్నం మహేందర్‌రెడ్డి తన సతీమణి వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతాకు చేవెళ్ల ఎంపీ టికెట్ ఆశిస్తున్నారు. కాంగ్రెస్ నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే పట్నం దంపతులు కాంగ్రెస్‌కు చేరే అవకాశం ఉంది. అలాగే ఇతర ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తోంది. ఓ సభలో కేటీఆర్ మాట్లాడుతూ 'పోయే వాళ్ల పోని.. ఉన్న వాళ్లను కాపాడుకుంటాం. క్యాడర్ నుంచే లీడర్లను తయారు చేసుకుంటాం' అని వ్యాఖ్యానించారు. చేవెళ్లలో చోటుచేసుకుంటున్న పరిణామాల దృష్ట్యా కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేసినట్టు పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నారు. చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా సీఎం రేవంత్, బీఆర్ఎస్ ఇన్‌చార్జిగా కేటీఆర్ ఉండటంతో ఇరువురి మధ్య పోటీ రసవత్తరంగా మారనుంది.

సామాజిక భద్రతా నిధుల్లో కోతలు, వేతన వివాదాలపై

ఫిన్లాండ్‌లో కార్మికుల మూడు రోజుల సమ్మె

హెల్సింకి : ఫిన్లాండ్‌లోని కార్మిక సంఘాలు బుధవారం సమ్మెకు దిగాయి. మూడు రోజుల పాటు సాగే ఈ సమ్మెలో దాదాపు మూడు లక్షలమంది కార్మికులు పాల్గొంటున్నారు. ఫిన్నిష్ కార్మిక సంఘాల కేంద్ర సమాఖ్య, ఫిన్నిష్ వృత్తినిపుణుల సమాఖ్యలు ఈ సమ్మెకు పిలుపిచ్చాయి. ప్రధాని పెట్టెరి ఓర్పో నేతృత్వంలోని మధ్యే మితవాద ప్రభుత్వం ప్రతిపాదించిన సామాజిక భద్రతా నిధుల్లో కోతలు, లేబర్ మార్కెట్‌కు చేస్తున్న ఉపాధి సవరణలతో సమాజంలో తీవ్ర అసమానతలు పెరుగుతాయని కార్మిక సంఘాలు హెచ్చరిస్తున్నాయి. దీనివల్ల సమ్మె చేసేందుకు ఉద్యోగులకు గల హక్కులు నియంత్రించబడతాయి. వేతనాల పెంపులు చేయకుండా నేషనల్ లేబర్ మీడియేటర్‌ను నివారిస్తుంది. దీన్ని కార్మికులు తీవ్రంగా నిరసిస్తున్నారు. వేతనాలను ఎలా నిర్ధారించాలన్న విషయంలో ఇప్పటివరకు నేషనల్ లేబర్ మీడియేటర్ పాత్ర వుండేది. తాజాగా ఓర్పో ప్రభుత్వం తీసుకునే చర్యలతో సమాజంలో అసమానతలు పెరుగుతాయని, కార్మికుల స్థితిగతులు బలహీనపడతాయని, దిగువ ఆదాయ గ్రూపులకు, నిరుద్యోగులకు ముప్పు వాటిల్లుతుందని ఆయా యూనియన్లు విమర్శిస్తున్నాయి.

ఈ సమ్మెతో దేశవ్యాప్తంగా కిండర్‌గార్టెన్, ప్రీ స్కూళ్ళు మూతపడతాయి. వైమానిక రవాణా, పోస్టల్ సేవలకు అంతరాయం కలుగుతుంది. ప్రజా రవాణా మూత పడుతుంది. దేశవ్యాప్తంగా ఫ్యాక్టరీలు, దుకాణాలు, హోటళ్ళు అన్నీ మూతపడతాయి. ఈ సమ్మె కారణంగా దాదాపు 550 విమానాలను రద్దు చేసినట్లు జాతీయ వైమానిక సంస్థ ఫిన్ ఎయిర్ ప్రకటించింది. ప్రధానంగా హెల్సింకి విమానాశ్రయంలో ట్రాఫిక్‌ను బాగా తగ్గించినట్లు తెలిపింది. ప్రభుత్వం ప్రతిపాదించిన కోతలను, మార్పులను తక్షణమే విరమించాలని సెంట్రల్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఫిన్నిష్ ట్రేడ్ యూనియన్స్ (ఎస్ఎకె), ఫిన్నిష్ కాన్ఫెడరేషన్ ఆఫ్ ప్రొఫెషనల్స్ (ఎస్‌టిటికె)లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి.

డిమాండ్ల సాధన కోసం ఫ్రాన్స్ రోడ్లపైకి వేలాదిమంది రైతులు

- అరెస్టులతో అడ్డుకుంటున్న మాక్రాన్ ప్రభుత్వం

పారిస్ : అధిక ఆదాయాల కోసం ఫ్రాన్స్‌వ్యాప్తంగా రైతాంగం పోరు సాగిస్తోంది. ఇందులో భాగంగా ట్రాక్టర్ల కాన్వాయ్‌లు బుధవారం పారిస్, లియాన్, ఇతర వ్యూహాత్మక నగరాలకు, ప్రాంతాలకు చేరుకుంటున్న సమయంలో ఫ్రెంచి పోలీసులు కొంతమంది రైతులను అరెస్టు చేశారు. దాదాపు 10వేల మంది రైతులు బుధవారం ఫ్రాన్స్ రోడ్లపైకి వచ్చారు. విదేశీ పోటీ నుండి రక్షణ కల్పించాలని, అధికార యంత్రాంగం ఆంక్షలను తగ్గించాలని వారు కోరుతున్నారు. పారిస్ నగరంతో పాటూ మూడో అతిపెద్ద నగరమైన లియాన్‌ను కూడా చుట్టుముట్టాలని చూస్తున్నారు. స్థానిక టోకు ఆహార మార్కెట్లను దిగ్బంధించాలని ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు వారిని అక్కడకు రానివ్వకుండా అడ్డుకుంటున్నారు.

అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల పట్ల తీవ్ర అసంతృప్తిగా వున్న రైతులు ప్రధానంగా ఆహార మార్కెట్లను దిగ్బంధించే లక్ష్యంతో వున్నారు. ఈ నేపథ్యంలో ప్రధాన నగరాలు, వ్యూహాత్మక పాయింట్ల వద్దకు ఆందోళనకారులు రాకుండా ప్రభుత్వం అనేక ఆంక్షలను విధించింది. వాటిని అతిక్రమించిన పక్షంలో అరెస్టులు తప్పవని కూడా హెచ్చరించింది. కానీ ప్రభుత్వ హెచ్చరికలను ఏ మాత్రమూ పట్టించుకోని రైతులు, రంగిస్ నగరం దిశగా ట్రాక్టర్ల కాన్వాయ్‌ను ప్రారంభించారు. దీంతో రంగిస్ సమీపంలో పోలీసులు 15మందిని అరెస్టు చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారన్న కారణంతో వారిపై కేసులు నమోదు చేశారు. నగరంలోని ప్రధాన ఫుడ్ మార్కెట్ వద్దకు రైతులు రాకుండా అడ్డగించారు.

మరో అవినీతి కేసులో ఖాన్ దంపతులకు 14ఏళ్ల శిక్ష



కరాచి : అవినీతి కేసులో పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్, ఆయన భార్యకు 14ఏళ్ల జైలు శిక్ష పడిందని ఆయన తరపు న్యాయవాది, జైలు అధికారులు తెలిపారు. ప్రభుత్వ రహస్యాలను లీక్ చేసిన కేసులో ప్రత్యేక కోర్టు ఇమ్రాన్‌కు పదేళ్ల జైలు శిక్ష విధించిన మరుసటి రోజే ఈ తాజా తీర్పు వెలువడింది. గతేడాది అధికారం నుండి వైదొలగిన తర్వాత ఖాన్ ఇప్పటివరకు మూడు కేసుల్లో దోషిగా నిర్ధారించబడి, శిక్షలు ఎదుర్కొంటున్నారు. ప్రధానిగా అధికారంలో వున్న సమయంలో వచ్చిన ప్రభుత్వ బహుమతులను అప్పగించకుండా తన వద్దనే వుంచుకుని, వాటిని విక్రయించిన అవినీతి కేసులో ఖాన్ దంపతులకు ఈ శిక్ష పడింది. అలాగే ప్రభుత్వ పదవులు నిర్వహించకుండా ఖాన్‌ను అనర్హుడిగా కూడా కోర్టు ప్రకటించింది. ఈ కేసులో ఖాన్ మౌలిక మానవ, ప్రాథమిక హక్కులు ఉల్లంఘించబడ్డాయని ఆయన తరపు న్యాయవాది బాబర్ అవాన్ వ్యాఖ్యానించారు. ఖాన్ లీగల్ బృందం వచ్చేవరకు కూడా వేచి వుండకుండా న్యాయమూర్తి చాలా హడావిడిగా శిక్ష విధించారని అన్నారు. పై కోర్టులో ఈ తీర్పును సవాలు చేయనున్నట్లు తెలిపారు.

పసిడికి తగ్గిన గిరాకీ

ముంబయి : ప్రపంచ వ్యాప్తంగా బంగారం గిరాకీ 2023లో ఐదు శాతం తగ్గి 4,448.4 టన్నులకు చేరిందని 'ప్రపంచ స్వర్ణ మండలి' నివేదిక తెలిపింది. ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ల పెట్టుబడుల నుంచి ఉపసంహరణల వల్లే గిరాకీ తగ్గిందని వివరించింది. 2022లో 4,699 టన్నుల బంగారానికి గిరాకీ నమోదైనట్లు గుర్తు చేసింది. అత్యధికంగా ఐరోపాలో పసిడి గిరాకీ 180 టన్నుల మేర తగ్గింది. 2013 తర్వాత ఈ ప్రాంతంలో ఈ స్థాయి క్షీణత ఇదే తొలిసారి. ఈక్విటీ మార్కెట్లు రాణించడం, వడ్డీరేట్ల కోత అంచనాల్లో అనిశ్చితి వల్లే పసిడి ఇటిఎఫ్‌ల నుంచి పెట్టుబడుల ఉపసంహరణ పెద్దయెత్తున నమోదైందని డబ్ల్యూజీసి నివేదిక వివరించింది. కేంద్ర బ్యాంకుల పసిడి కొనుగోళ్ల వార్షిక ప్రాతిపదికన 45 టన్నులు తగ్గి 1,037 టన్నులకు చేరింది. అత్యధికంగా పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా 225 టన్నులు, బ్యాంక్ ఆఫ్ పోలెండ్ 130 టన్నుల బంగారాన్ని తమ నిల్వల్లో చేర్చుకున్నాయని వెల్లడించింది. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఉజ్బెకిస్తాన్, నేషనల్ బ్యాంక్ ఆఫ్ కజకిస్తాన్ అత్యధికంగా విక్రయించాయి.

2010 నుంచి కేంద్ర బ్యాంకులు నికర పసిడి కొనుగోలుదారులుగా నిలుస్తున్నాయి. అప్పటి నుంచి దాదాపు 7,800 టన్నుల బంగారాన్ని కొన్నాయి. దీంట్లో మూడోవంతు నిల్వలను గత రెండేళ్లలోనే సమకూర్చుకున్నాయి. భారతీయ రిజర్వు బ్యాంకు గతేడాది 16.2 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసింది. నాణేలు, బిస్కెట్లకు గిరాకీ మూడు శాతం తగ్గింది. మరోవైపు ప్రపంచ వ్యాప్తంగా ఆభరణాల మార్కెట్‌లో గిరాకీ 17 శాతం పుంజుకోవటం గమనార్హం. భారత్‌లో మాత్రం ఈ విభాగంలో తొమ్మిది శాతం క్షీణత నమోదైంది.

బలూచిస్తాన్‌లో తీవ్రవాదుల దాడుల్లో 15మంది మృతి

కరాచి : పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో భారీగా సాయుధులైన తీవ్రవాదులు మూడు చోట్ల దాడులు జరిపారు. ఈ దాడుల్లో 9మంది తీవ్రవాదులతో సహా 15మంది మరణించారు. వీరిలో నలుగురు లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది, ఇద్దరు సామాన్య పౌరులు వున్నారు. ప్రావిన్స్ రాజధాని క్వెట్టాకు 70కిలోమీటర్ల దూరంలోని మాచ్ పట్టణంలో ఈ దాడులు చోటు చేసుకున్నాయి. జనవరి 29 అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ దాడులు చోటు చేసుకున్నాయని, పలువురు తీవ్రవాదులు, ఆత్మాహుతి బాంబర్లు ఈ దాడుల్లో పాల్గొన్నారని ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఎస్‌పిఆర్) ఒక ప్రకటనలో తెలిపింది. సత్వరమే స్పందించిన లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వారిలో 9మందిని హతమార్చారని, మిగిలినవారిని భద్రతా బలగాలు అదుపులోకి తీసుకున్నారని ఆ ప్రకటన పేర్కొంది. ఈ క్రమంలో నలుగురు భద్రతా సిబ్బందితో పాటూ ఇద్దరు పౌరులు కూడా మృతి చెందినట్లు తెలిపింది. సెంట్రల్ మాచ్ జైల్లోకి చొరబడేందుకు తీవ్రవాదులు ప్రయత్నించిన సమయంలో వారిని అడ్డుకుని మట్టుబెట్టినట్లు ఆ ప్రకటన పేర్కొంది. ఈ దాడులకు తమదే బాధ్యత అని నిషేధిత తీవ్రవాద గ్రూపు బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ (బిఎల్ఎ) మజీద్ గ్రూపు ప్రకటించింది. దాడుల తర్వాత ఇరు పక్షాల మధ్య భీకరమైన పోరు సాగింది. పర్వతాల్లోకి పారిపోవడానికి తీవ్రవాదులు ప్రయత్నించడంతో దాన్ని అడ్డుకుంటూ అనేక గంటల పాటు పోరాటం సాగింది.

కళ్ళకు గంతలు కట్టి, కాళ్ళు చేతులు కట్టేసి....

గాజా స్కూల్లో 30మంది సామూహిక సమాధి

- ధ్వంసమవుతున్న ఆరోగ్య వ్యవస్థ
- పది రోజులుగా అల్ అమల్ ఆస్పత్రిపై దాడులు



గాజా : ఉత్తర గాజాలో సామూహిక సమాధిని కనుగొన్నారు. కళ్ళకు గంతలు కట్టి, చేతులు వెనక్కి కట్టేసి మరీ 30మంది పౌరులను ఇజ్రాయిల్ బలగాలు ఉరి తీసినట్లు పాలస్తీనా అధికారులు తెలిపారు. ఉత్తర గాజాల్లో ఒక స్కూల్ వెనుక భాగంలోఈ మృత దేహాలను పడేసి వుండగా చూసి గుర్తించిన వారితో మీడియా మాట్లాడింది. ఈ ప్రాంతాన్ని శుభ్రం చేస్తుండగా, స్కూల్లో పెద్ద ఎత్తున రాళ్ళకుప్ప కనిపించిందని, వెంటనే అక్కడకు వెళ్ళిచూడగా దాని అడుగున డజన్ల సంఖ్యలో మృత దేహాలు పడి వున్నాయని వారు తెలిపారు. మృతదేహాలను చుట్టి వుంచిన నల్ల ప్లాస్టిక్ బ్యాగ్‌లను తెరవగానే అవన్నీ కుళ్లిపోయి దుర్వాసన వస్తోందన్నారు. పైగా కాళ్ళు, చేతులకు ప్లాస్టిక్ సంకెళ్ళు వేసి, కళ్లకు, తలకి బట్టతో గట్టిగా కట్టేసి వున్నాయని వారు చెప్పారు.

బెయిట్ లాహియాలో జరిగిన ఈ ఘటనను హమస్ తీవ్రంగా ఖండించింది. ఈ దారుణమైన నేరాన్ని వెంటనే డాక్యుమెంట్‌గా భద్రపరచాల్సిందిగా మానవ హక్కుల సంస్థలను హమస్ మీడియా కార్యాలయం కోరింది. అంతర్జాతీయ న్యాయస్థానం ఇచ్చిన రూలింగ్‌ను ఏమాత్రమూ పట్టించుకోకుండా పాలస్తీనియన్లను నిర్మూలించాలనే అంతిమ లక్ష్యంతో ఇజ్రాయిల్ ఈ దాడులకు తెగబడుతోందని విమర్శిస్తూ టెలిగ్రామ్‌లో పోస్టు చేసింది.

అల్ అమల్ ఆస్పత్రి వెనుక భాగంలో 45రోజుల శిశు వు, 75ఏళ్ళ వృద్ధురాలు మృతదేహాలను ఖననం చేస్తున్న వీడియోను పాలస్తీనా రెడ్ క్రీసెంట్ సొసైటీ విడుదల చేసింది. ఆస్పత్రిలో రోజుల తరబడి ఆక్సిజన్ లేకపోవడంతో వారు మరణించారని తెలిపింది. అల్ అమల్ ఆస్పత్రిపై ఇప్పటికి 10 రోజుల నుండి దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో గాజాలో ఆరోగ్య కేంద్రాలను, మొత్తంగా ఆరోగ్య వ్యవస్థను ధ్వంసం చేయడానికే ఇజ్రాయిల్ కంకణం కట్టుకున్నట్లు కనిపిస్తోంది. అల్ షిఫా ఆస్పత్రితో మొదలుపెట్టి ఇండోనేషియా ఆస్పత్రి, నాజర్ ఆస్పత్రి, తాజాగా ఖాన్ యూనిస్‌లోని అల్ అమల్ ఆస్పత్రి వరకు అన్నీ నేలమట్టమవుతున్నాయి. ఇజ్రాయిల్ ట్యాంకులు ఇప్పటికే చుట్టుముట్టి వున్నాయి. పైగా అటాక్ డ్రోన్‌లతో, భారీ మెషిన్ గన్‌లతో కూడా కాల్పులు సాగుతున్నాయి. ఆస్పత్రి కాంపౌండ్‌లో కదులుతున్న ప్రతి వాహనం, వ్యక్తినీ కాల్చేస్తున్నారు.

ఇప్పటికే ఆస్పత్రిలో సేవలు స్తంభించాయి.

గాజాలోని ప్రజలకు సాయమందించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను కాపాడుకోవాల్సి వుందని, సాయమందేలా చూడాల్సి వుందని యురోపియన్ యూనియన్ విదేశాంగ విధాన చీఫ్ పేర్కొన్నారు. ఐక్యరాజ్య సమితి శరణార్ధుల సంస్థ చర్యలపై ఇజ్రాయిల్ బలగాలు ఆరోపణలు చేసినప్పటికీ మనం వాటిని పట్టించుకోరాదని, వాటివల్ల ఈ మానవతా చర్యలు ఆగరాదని కోరారు.

ఇదిలావుండగా, మంగళవారం ఇజ్రాయిల్ బలగాలు ఒక ఆస్పత్రిలో వైద్య సిబ్బంది ముసుగులో వచ్చి ముగ్గురు పాలస్తీనియన్లను చంపడాన్ని ఇజ్రాయిల్ మానవ హక్కుల గ్రూపు తీవ్రంగా ఖండించింది. ఫిజీషియన్స్ ఫర్ హ్యూమన్ రైట్స్ ఈ మేరకు ఒక ప్రకటన జారీ చేసింది. బందీల కుటుంబాల నుండి, అంత ర్జాతీయ సమాజం నుండి తీవ్రంగా ఒత్తిడి వస్తున్నప్పటికీ ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తన మొండిపట్టు వీడడం లేదు. గాజాలో దాడులు కొనసాగిస్తామని ప్రకటన లు చేస్తున్నారు.

పత్తిని సీసీఐ కొనుగోలు చేయాలి

మార్కెటింగ్ శాఖ, సీసీఐ, ప్రయివేటు వ్యాపారుల కుమ్మక్కు

- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి : రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గొల్లపల్లి జయరాజు
- పత్తి మిల్లుల ఎదుట రాస్తారోకో



నవతెలంగాణ-సదాశివపేట

పత్తి కొనుగోలు విషయంలో మార్కెటింగ్ శాఖ, సీసీఐ, ప్రయివేటు వ్యాపారుల కుమ్మక్కై రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, రైతుల వద్ద ఉన్న పత్తిని సీసీఐ కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గొల్లపల్లి జయరాజు డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం ఆత్మకూరు రోడ్‌లోని అన్నపూర్ణ సీసీఐ కొనుగోలు కేంద్రంలో పత్తి కొనుగోలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా, రాస్తారోకో చేశారు. పత్తిని కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకుంటామని వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. ఈ సందర్భంగా గొల్లపల్లి జయరాజు మాట్లాడుతూ.. పత్తిని కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆరోపించారు. ఆరుగాలం కష్టపడుతున్న రైతులకు ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో చలిలో రాత్రిపూట రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీసీఐ కొనకపోవడంతో ప్రయివేటు వ్యాపారులు పెద్ద ఎత్తున దోపిడీ చేస్తున్నారన్నారు. క్వింటాల్ పత్తికి సీసీఐ రూ.7020కి కొనుగోలు చేస్తే ప్రయివేటు వ్యాపారులు రూ.5 వేల నుంచి రూ.6 వేలకు కొంటున్నారని తెలిపారు. ప్రయివేట వ్యక్తులు, సీసీఐ, మార్కెట్ అధికారులు కుమ్మక్కై రైతులకు నష్టం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పత్తి కొనుగోలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు భూషణం, ఏసోబు, ప్రసాద్, రైతులు జగదీష్, భాస్కర్, రవి, బాలమని, రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరాంఘర్‌లో దోపిడీ దొంగల బీభత్సం

సెక్యూరిటీ గార్డును చంపి ఇనుప రాడ్లు ఎత్తుకెళ్లిన దుండగులు



నవతెలంగాణ-రాజేంద్రనగర్

రంగారెడ్డి జిల్లా ఆరాంఘర్‌లో అర్ధరాత్రి దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించారు. సెక్యూరిటీ గార్డును చంపి ఇనుప రాడ్లు ఎత్తుకెళ్లిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరాంఘర్ చౌరస్తాలో మహబూబ్ అనే వ్యక్తి ఇనుప రాడ్ల గోదామును ఏర్పాటు చేశారు. గోదాంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆసిఫ్(25) సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే మంగళవారం రాత్రి గోదాంకు తాళం వేసి మహబూబ్ వెళ్లిపోయాడు. అందులో ఒక గదిలో సెక్యూరిటీ గార్డు మాత్రమే ఉన్నాడు. బుధవారం ఉదయం గోదాంకు వచ్చిన మహబూబ్ తాళాలు పగలగొట్టి ఉండటం, లోపలికి వెళ్లి చూడగా ఆసిఫ్ రక్తం మడుగులో చనిపోయి ఉన్న దృశ్యం కనిపించింది. గోదాంలో ఉన్న సీసీ కెమెరాలు కనిపించలేదు. వెంటనే అతను పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, క్లూస్ టీం సహాయంతో ఆధారాలు సేకరించారు. దుండగులు మొదటగా గుర్తుపట్టకుండా ఉండడానికి సీసీ కెమెరాలు పూర్తిగా ధ్వంసం చేసి వారి వెంట తీసుకెళ్లారు. దొంగతనానికి వచ్చిన దుండగులను సెక్యూరిటీ గార్డు ఆసిఫ్ ఆపడంతో అతడిపై విచక్షణరహితంగా దాడి చేసి కొట్టి చంపి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. యజమాని ఇచ్చిన ఫిర్యాదు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. అదే రహదారిపై ఉన్న సీసీ కెమెరాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

విలీన సమస్యలు పరిష్కరించండి

- రవాణామంత్రికి టీఎస్ఆర్టీసీ ఎన్ఎమ్‌యూ విజ్ఞప్తి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆర్టీసీ ఉద్యోగులు ప్రభుత్వ ఉద్యోగులో, ఆర్టీసీ ఉద్యోగులో అర్థంకాని అయోమయంలో ఉన్నారని టీఎస్ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎమ్‌యూ) పేర్కొన్నది. బుధవారం యూనియన్ అధ్యక్షులు పీ కమాల్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎమ్ నరేందర్, జనరల్ సెక్రటరీ మహ్మద్ మౌలానా బృందం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ నేతృత్వంలో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు విలీన ప్రకటన చేసిందనీ, గవర్నర్ గెజిట్ విడుదల చేశారనీ, కానీ ప్రభుత్వం మారడం వల్ల ఈ ప్రక్రియ ఏ స్థితిలో ఉందో తెలియక ఉద్యోగులు గందరగోళంలో ఉన్నారని వివరించారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఆర్టీసీ కార్మికులు తీవ్రంగా గోస పడ్డారని తెలిపారు. గెజిట్ ప్రకారం అపాయింట్‌మెంట్ తేదీ ప్రకటించి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని కోరారు. దానితో పాటు 12 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రవాణామంత్రికి అందచేశారు.

స్వామినాథన్ సిఫార్సుల మేరకు రైతులకు కనీస మద్దతు ధరను ప్రకటించాలి

ఎస్‌కెఎం డిమాండ్

న్యూఢిల్లీ : గురువారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ఓటాన్ అకౌంట్‌లో అన్ని పంటలకు సిటు ప్లస్ 50శాతంతో కనీస మద్దతు ధరను ప్రకటించి, దిగుబడులను సేకరించాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బీజేపీ అధికారంలోకి వస్తే రైతులకు పై మేరకు కనీస మద్దతు ధరను అమలు చేస్తామని 2014 ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేసింది. పైగా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పేరుతో రైతులను మోసం చేస్తున్నారనీ, దీనికి తక్షణమే సస్తి చెప్పాలని కోరింది. క్వింటాల్‌కు రూ.2183 చొప్పున 2023-24 సంవత్సరానికి ప్రస్తుతమిస్తున్న కనీస మద్దతు ధర ఎటు ప్లస్ ఎఫ్ఎల్ ప్రాతిపదికన రూపొందించిందని తెలిపింది. కానీ స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం చూసినట్లైతే క్వింటాల్‌కు రూ.2866 చెల్లించాల్సి వస్తుందని పేర్కొంది. బడా వ్యాపారస్తులు, పారిశ్రామికవేత్తలు, మధ్య దళారీలు కూడా రైతును తీవ్రంగా దోపిడీ చేస్తున్నారని విమర్శించింది. గురువారం నాటి ఓటాన్ అకౌంట్‌లో మోడీ ప్రభుత్వం పైన పేర్కొన్న మేరకు కనీస మద్దతు ధరను ప్రకటించని పక్షంలో రైతులెవరూ రాబోయే ఎన్నికల్లో బిజెపికి ఓటు వేయరని ఎస్‌కెఎం స్పష్టం చేసింది. రైతు లేకపోతే ఆహారం లేదనే చారిత్రక రైతాంగ పోరాటం నినాదాన్ని మోడీ గుర్తు చేసుకోవాలని కోరింది. ఈ ప్రభుత్వ హయాంలో 736మంది రైతులు అమరులయ్యారని తెలిపింది. 2021 డిసెంబరు 9న ఎస్‌కెఎంకి ఇచ్చిన రాతపూర్వక హామీని గౌరవిస్తూ మోడీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందో లేదో చూడాల్సి వుందని పేర్కొంది.

రైతులకు త్వరితగతిన లబ్ది చేకూర్చేలా చర్యలు తీసుకోవాలి

- ఉన్నతాధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వివిధ పథకాలను సమన్వయం చేసుకుంటూ...రైతులకు త్వరితగతిన లబ్ది చేకూరేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈమేరకు బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో వ్యవసాయ, ఉద్యాన, మార్క్‌ఫెడ్, ఆయిల్ ఫెడ్, సీడ్స్ కార్పొరేషన్, మార్కెటింగ్ శాఖల అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ సమగ్రాభివృద్ధికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. పంటలసాగు, మార్కెటింగ్‌లో రైతులకు ఎదురయ్యే సమస్యల పరిష్కారం దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

పదేండ్లు మీపాలనలో ఫూలే గుర్తుకు రాలేదా?

- అసెంబ్లీలో కాదు...రాజకీయాలు బయట చేసుకోండి
- ఎమ్మెల్సీ కవితకు మంత్రి పొన్నం హెచ్చరిక



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గత పదేండ్లుగా బీఆర్ఎస్ అధికారంలోకి ఉండి కూడా అసెంబ్లీ ఆవరణలో జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఎందుకు ఏర్పాటు చేయలేదని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. రాజకీయాలు అసెంబ్లీ ఆవరణలో కాకుండా బయట చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు సూచించారు. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్ష పదవి, కార్యనిర్వాహక పదవి, ప్రతిపక్ష నేత పదవులను బీసీలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్పుడే బీఆర్ఎస్ చిత్తశుద్దిని ప్రజలు నమ్ముతారని అన్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చాక దేశ వ్యాప్తంగా కులగణన చేస్తామంటూ రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో కూడా కులగణన ప్రస్తావన ఉందన్నారు. రేవంత్ నాయకత్వంలో బీసీ సంక్షేమానికి అవసరమైన నిధుల కేటాయింపు కూడా జరగబోతుందన్నారు. మెస్ చార్జీలు ఎక్కడా ఆగకుండా చూస్తున్నామన్నారు. గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. గత కొద్ది సంవత్సరాలుగా మెస్‌చార్జీలు రాలేదని గుర్తు చేశారు. టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను సంబంధించి భర్తీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. బీసీలకు 100 శాతం న్యాయం జరిగే విధంగా సలహాలు అడుగుతున్నట్టు తెలిపారు.

మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ బీసీల వాటా కోసం తమ ప్రభుత్వం ఎప్పుడూ పని చేస్తుందని తెలిపారు. మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ దేశ సంపద ఎవరి చేతిలో ఉందో తేలాలని కోరారు.

ఉన్నత విద్యామండలి కార్యదర్శి శ్రీనివాసరావు రిలీవ్

- నకిరేకల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ
- ఘనంగా సన్మానించిన లింబాద్రి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉన్నత విద్యామండలి కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు బుధవారం ఆ పదవి నుంచి రిలీవ్ అయ్యారు. నకిరేకల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆయన్ను ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా ఉన్నత విద్యామండలి కార్యాలయంలో శ్రీనివాసరావును చైర్మెన్ ఆర్ లింబాద్రి, వైస్ చైర్మెన్లు వి వెంకటరమణ, ఎస్‌కే మహమూద్ ఘనంగా సన్మానించారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఉన్నత విద్యామండలి తొలి కార్యదర్శిగా ఆయన్ను 2014, జూన్‌లో నియమించిన విషయం తెలిసిందే.

తొమ్మిదిన్నరేండ్లపాటు ఆయన సేవలందించారు. ఆయన చేసిన సేవలను లింబాద్రి కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండలి జాయింట్ సెక్రెటరీ సిఎస్ ప్రకాశ్, ఉద్యోగులు, తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్ఆర్సీ) ఉద్యోగులు పాల్గొని పాల్గొన్నారు.

బీసీ గురుకుల ఉపాధ్యాయ సమస్యలు త్వరలో పరిష్కారం

- మంత్రి పొన్నం ప్రభాకర్
- పీఆర్‌జీటీఏ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో బీసీ గురుకులాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రొగ్రెసివ్ రికగ్నైజ్డ్ గురుకుల టీచర్స్ అసోసియేషన్ (పీఆర్‌జీటీఏ) క్యాలెండర్‌ను ఆయన బుధవారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. బీసీ గురుకులాల పనివేళలను మార్చాలనీ, 317 జీవో ద్వారా తలెత్తిన సమస్యలను పరిష్కరించాలని పీఆర్టీయూటీఎస్ అధ్యక్షులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి మంత్రిని కోరారు. వచ్చే వేసవి సెలవుల్లో పదోన్నతులు కల్పించాలని సూచించారు. బీసీ గురుకుల ఉపాధ్యాయులకు టీఎస్‌జీఎల్ఐ అమలు చేయాలని తెలిపారు. రెండో శనివారం సెలవు ప్రకటించాలని పేర్కొన్నారు. 010 పద్దు ద్వారా వేతనాలను అందించాలని తెలిపారు. ఆయా సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అనంతరం సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశాన్ని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, పత్రిక ఎడిటర్ ఇన్నారెడ్డి, పీఆర్‌జీటీఏ నాయకులు దిలీప్‌రెడ్డి, ఉప్పు అశోక్, ఈ శ్రీనివాసాచారి, ఐ నిర్మలానందం, పి విద్యాసాగర్, ఎం శ్రీనివాస్‌రెడ్డి, విజయచంద్రారెడ్డి, వి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. బీసీ గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని పీఆర్టీయూటీఎస్ ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు ప్రభుత్వాన్ని కోరారు.

బిజినెస్

వేలాది ఉద్యోగులపై పేపాల్ వేటు

- అదే బాటలో ఐరోబాట్



వాషింగ్టన్ : ఆర్థిక మందగమనం, వ్యయ నియంత్రణ చర్యల్లో భాగంగా పలు టెక్ కంపెనీలు ఉద్యోగులను ఇంటికి పంపించడానికి వరుస కడుతున్నాయి. తాజాగా ఫైనాన్సియల్ టెక్నాలజీ దిగ్గజం పేపాల్ ప్రపంచ వ్యాప్తంగా 9 శాతం ఉద్యోగులపై వేటు వేయాలని నిర్ణయించింది. దీంతో సుమారు 2,500 మంది ఉద్యోగాలు రోడ్డున పడనున్నారు. తొలగింపులకు సంబంధించి ఉద్యోగులకు కంపెనీ సిఇఒ అలెక్స్ క్రిస్ ఇ-మెయిల్‌లో సమాచారం ఇచ్చారు. ఉద్యోగాలు కోల్పోతున్న వారికి ఈ వారాంతంలో సమాచారం అందజేస్తామని స్పష్టం చేశారు. కంపెనీలో డూప్లికేషన్ తగ్గించడం, వనరులను సమర్థంగా వినియోగించడం, ఆటోమేషన్ వినియోగంతో సంక్లిష్టతలు తొలగించేందుకు ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందన్నారు. అభివృద్ధికి అవకాశం ఉన్న విభాగాల్లో తమ పెట్టుబడులు కొనసాగిస్తామన్నారు.

ఐరోబోట్‌లో 31% మంది ఇంటికి..

రోబోటిక్ వ్యాక్యుమ్ క్లీనింగ్ సొల్యూషన్స్ అందించే ఐరోబోట్ తన సిబ్బందిలో 31శాతం మందికి ఉద్వాసన పలకనుంది. వృద్ధి, లాభదాయకతను కొనసాగించేందుకు పునర్వ్యవస్థీకరణ ప్రణాళికల్లో భాగంగా కంపెనీలోని దాదాపు 350 మంది ఉద్యోగులపై వేటు వేయనున్నట్లు ప్రకటించింది. ఆయా సిబ్బందికి పరిహార ప్యాకేజ్ వర్తింప చేస్తున్నట్లు పేర్కొంది. ఇటీవల కాలంలో గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, లింక్డిన్, మెటా తదితర దిగ్గజాలు ఒక్కొక్కటిగా ఉద్యోగుల తొలగింపునపై బాంబులు పేల్చుతున్న విషయం తెలిసిందే. అదే బాటలో మరిన్ని సంస్థలు నడుస్తున్నాయి. బడా కంపెనీల బాటలోనే చిన్న, మధ్యస్థాయి సంస్థలు సైతం ఉద్యోగులను వదిలించుకుంటున్నాయి. గతేడాదిగా కొనసాగుతున్న ఉద్వాసనలతో ఈ రంగంలో పని చేస్తున్న టెకీలు తీవ్ర ఆందోళనకు గురైతున్నారు. కాగా.. ఆయా కంపెనీలు భారీ ఆదాయాలు, లాభాలు సాగిస్తున్నప్పటికీ.. మరింత పొదుపు చర్యల్లో భాగంగా సిబ్బందిపై వేటు వేయడం గమనార్హం.

పేటియం పేమెంట్స్ బ్యాంక్‌పై ఆర్‌బీఐ కొరడా

- డిపాజిట్ల సేకరణపై నిషేధం



న్యూఢిల్లీ : పేటియం పేమెంట్ బ్యాంక్‌కు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ఊహించని షాక్ ఇచ్చింది. ఆ సంస్థ సమీకరించే డిపాజిట్లు, రుణ లావాదేవీలపై నిషేధం ప్రకటించింది. రెగ్యులేటరీ నిబంధనలను పాటించకపోవడం, పర్యవేక్షణలో లోపాల నేపథ్యంలో పేటియం పేమెంట్ బ్యాంక్‌పై ఆర్‌బిఐ చర్యలకు ఉపక్రమించింది. ఫిబ్రవరి 29 తర్వాత పేటియం పేమెంట్స్ బ్యాంక్ ఖాతాదారుల ఖాతాల్లో ఎలాంటి డిపాజిట్లు తీసుకోవడానికి అనుమతించబోమని ఆర్‌బిఐ స్పష్టం చేసింది. వాలెట్లతో సహా ఎలాంటి రుణ లావాదేవీలు అనుమతించబడవని తెలిపింది. కాగా.. ఖాతాదారులు మాత్రం ఎలాంటి పరిమితులు లేకుండా తమ డిపాజిట్లను ఉపసంహరించుకోవడానికి, వినియోగించుకోవడానికి వీలు కల్పిస్తున్నట్లు ఆర్‌బిఐ పేర్కొంది.

ఎంజి మోటార్ మరోమారు స్టార్టప్‌లకు మద్దతు

గూర్‌గావ్ : ఎంజి మోటార్ ఇండియా మరోమారు స్టార్టప్‌లకు మద్దతును ఇవ్వడానికి ఎంజి డెవలపర్ ప్రోగ్రాం అండ్ గ్రాంట్ (ఎంజిడిపి) సీజన్ 5.0ను ప్రకటించింది. ఇందుకోసం స్టార్టప్ ఇండియా, మంతన్‌తో కలిసి విద్యుత్ మొబిలిటీలో ఎఐ వినూత్న ఐడియాలు కలిగిన స్టార్టప్‌లకు ఆర్థిక మద్దతును అందించనున్నట్లు పేర్కొంది.

బీఓబీకి రూ.4,579 కోట్ల లాభాలు



హైదరాబాద్ : ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 19 శాతం వృద్ధితో రూ.4,579 కోట్ల నికర లాభాలు సాధించింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 3.08 శాతానికి తగ్గాయి. గతేడాది ఇదే సమయం నాటికి జిఎన్‌పిఎ 4.53 శాతంగా, నికర ఎన్‌పిఎలు 0.99 శాతంగా ఉన్నాయి. కాగా.. 2023 డిసెంబర్ ముగింపు నాటికి బిఒబి నికర ఎన్‌పిఎలు 0.70 శాతానికి తగ్గాయి. నికర వడ్డీ ఆదాయం 2.6 శాతం పెరిగి రూ.11,101 కోట్లకు చేరింది.

శ్రీసిమెంట్ లాభాల్లో రెండు రెట్ల వృద్ధి

శ్రీ సిమెంట్ లిమిటెడ్ 2023 డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో రెండు రెట్ల వృద్ధితో రూ.701.85 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.281.83 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.4,299 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన త్రైమాసికంలో 21.5 శాతం పెరిగి రూ.5,223.18 కోట్లుగా చోటు చేసుకుంది.

సామ్‌సంగ్ నుంచి ఎస్ఎస్‌డి 990 ఇవో



న్యూఢిల్లీ : కంప్యూటర్ల ఇంటర్నల్ సోరేజీ, సామర్థ్యం పెంచడానికి ఎస్ఎస్‌డి 990ఇవోను ఆవిష్కరించినట్లు సామ్‌సంగ్ ఇండియా ప్రకటించింది. గేమింగ్, పని, వీడియో, పోటో ఎడిటింగ్ తదితర రోజువారి కంప్యూటింగ్ అనుభవాలను మెరుగుపర్చడానికి ఇది దోహదం చేయనుందని పేర్కొంది. ఎస్ఎస్‌డి 990 ఇవోతో అధునాతన మెమోరీ సాంకేతికతలను ఉపయోగించుకోవడం, వినియోగదారుల డేటా నిల్వ అవసరాల కోసం బహుముఖ పనితీరును కనబర్చనుందని సామ్‌సంగ్ ఇండియా కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ ఎంటర్‌ప్రైజ్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ పునీత్ సేథి పేర్కొన్నారు.

అమర రాజా ఫలితాలు ఆకర్షణీయం

ప్రముఖ బ్యాటరీ తయారీదారు అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ అంచనాలు మించి లాభాలు ప్రకటించింది. వాహన రంగంలో బ్యాటరీల డిమాండ్ మద్దతు లభించింది. దీంతో 2023-24 డిసెంబర్ 31తో ముగిసిన త్రైమాసికంలో 7.6 శాతం వృద్ధితో రూ.240 కోట్ల నికర లాభాలు సాధించింది. రూ.219 లాభాలు నమోదు చేసే అవకాశాలున్నాయని జిఎస్‌ఇజి అంచనా వేయగా.. అంతకంటే లాభాలు ప్రకటించడం విశేషం. గడిచిన క్యూ3లో కంపెనీ రెవెన్యూ 9 శాతం పెరిగి రూ.2881 కోట్లుగా నమోదయ్యింది.

ఆర్టీసీ కండక్టర్‌పై యువతి దాడి

- కేసు నమోదు..

నవతెలంగాణ- హయత్‌నగర్

హైదరాబాద్ ఆర్టీసీ బస్సులో ఓ యువతి రెచ్చిపోయింది. కండక్టర్‌ను కాలితో తన్నుతూ.. దుర్భాషలాడింది. అందుకు సంబంధించిన వీడియో ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. దాంతో ఆమెపై కేసు నమోదైంది. వివరాల్లోకెళ్తే.. ఈనెల 25న హయత్‌నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో ఓ యువతి ఎల్బీనగర్ నుంచి దిల్‌సుఖ్‌నగర్ వైపు ప్రయాణం చేసింది.

ఈ క్రమంలో కండక్టర్ గంగాధర్ ఆమెను ఆధార్ కార్డ్ చూపాలని కోరాడు. దాంతో కోపోద్రిక్తులైన ఆమె.. కండక్టర్‌ను దుర్భాషలాడింది. అనంతరం అతన్ని కాలితో తన్నింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సీరియస్‌గా తీసుకున్నారు.